

'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 169
మంగళవారం 9-9-2025


అల్‌కరాజ్ 'సిక్సర్'
యూఎస్ ఓపెన్‌లో విజేత. కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సొంతం -14లో


భారత్‌ను ఆపతరమా!
నేటి నుంచి ఆసియాకప్ టి20 టోర్నీ. రేపు యూఏఈతో భారత్ పోరు -14లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


గుర్తింపు కార్డ్‌గా ఆధార్...
బిహార్‌లో ఓటర్ల సవరణ ప్రక్రియలో గుర్తింపు కార్డ్‌గా ఆధార్‌నూ పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పింది.
- వివరాలు 6లో▶


స్వదేశీ మేళాకు పట్టం కట్టండి
విదేశీ వస్తువులపై మోజు తగ్గించుకుని స్వదేశీ వస్తువులకు పట్టం కట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.
- వివరాలు 6లో▶


జెరూసలేంలో కాల్పుల కలకలం
గాజాలో ఇజ్రాయెల్ భీకరదాడులు చేస్తుంటే ప్రతిగా ఇజ్రాయెల్‌లోని జెరూసలేంలో పాలస్తీనియన్లు కాల్పులు జరిపారు.
- వివరాలు 6లో▶


కొత్త మెలికతో వీసా గోస..!
వలసేతర వీసాలకు ఏ దేశం వాళ్లు ఆ దేశంలోనే దరఖాస్తు, ఇంటర్వ్యూలు చేసుకోవాలని అమెరికా చెప్పింది.
- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

జీఎస్‌డీపీ రూ.14.56 లక్షల కోట్లు


తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) నాలుగేళ్ల క్రితం రూ.10 లక్షల కోట్లు నమోదు కాగా, తాజాగా 2024–25 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.14.56 లక్షల కోట్లకు చేరింది.
- వివరాలు 3లో▶

రైతు రుణాలపై ఒత్తిడి చేయొద్దు!



పంటరుణాల రికవరీ కోసం రైతులపై ఒత్తిడి చేయవద్దని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. వారికి సమయం ఇచ్చి చూడాలన్నారు.
- వివరాలు 3లో▶

రాష్ట్రంలో 'ఏఐ' సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్


అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా ఏఐ రంగంలో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ సంకల్పమని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు.
- వివరాలు 16లో▶

15 నుంచి ఎంబీబీఎస్ స్టేట్ కోటా కౌన్సెలింగ్


రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లకు సంబంధించి నెలకొన్న అనిశ్చితికి తెర పడింది. ఈ నెల 15 నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో స్టేట్ కోటా కౌన్సెలింగ్ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- వివరాలు 16లో▶

చుక్క నీరు తేలేదు!

గత పాలకులు పదేళ్లు హైదరాబాద్ ప్రజల దాహార్తిని పట్టించుకోలేదు

గోదావరి జలాలు నెత్తి మీద చల్లుకుని తామే ఏదో చేసినట్టు నమ్మించారు: రేవంత్



- కాంగ్రెస్ హయాంలోనే నగరానికి కృష్ణా, గోదావరి జలాలు
- ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాలు తరలిస్తున్నాం
- తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల కడతామన్న సీఎం
- గోదావరి రెండు, మూడో దశ పథకానికి శంకుస్థాపన
- 16 రిజర్వాయర్లతో పాటు ట్రంపెట్ ఇంటర్ చేంజ్ ప్రారంభం

గండిపేట వద్ద గోదావరి రెండు, మూడో దశ తాగునీటి సరఫరా పథకానికి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, వివేక్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పదేళ్లలో కృష్ణా, గోదావరి నదుల నుంచి చుక్క నీరు కూడా హైదరాబాద్‌కు తరలించలేదు. గత పాలకులు నగర ప్రజల దాహార్తిని పట్టించుకోలేదు. కాంగ్రెస్ తెచ్చిన గోదావరి జలాలను నెత్తి మీద చల్లుకుని తామే ఏదో చేసినట్టు కొందరు నమ్మించారు. నెత్తి మీద నీళ్ల చల్లుకున్నంత మాత్రాన వాళ్ల పాపాలు తొలగిపోవు..' అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. సోమవారం గోదావరి రెండు, మూడో దశ తాగునీటి సరఫరా, మూసీ నది పునరుజ్జీవం పథకాలకు గండిపేట వద్ద ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు.

నిజాం దూరదృష్టి వల్లే నగరానికి తాగునీళ్లు

'శ్రీపాద ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలిస్తున్నాం. కానీ ఆ సంగతి మరిచిపోయి కొందరు మల్లన్నసాగర్ అని మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి సీఎం వైఎస్సార్ చొరవతోనే కృష్ణా, గోదావరి జలాలు హైదరాబాద్‌కు వచ్చాయి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మరోసారి గోదావరి జలాల తరలింపునకు ముందడుగు పడింది. వందేళ్లకు పైగా ఈ నగరానికి తాగు నీరు అందుతోందంటే ఆనాటి నిజాం సర్కార్ దూరదృష్టే కారణం. నగరానికి ప్రతి ఏటా 3 శాతం చొప్పున వలసలు పెరుగుతున్నాయి. జనాభా కోటిన్నర దాటడంతో

మిగతా 3వ పేజీలో ▶

అంచనాలు పెంచి ప్రజాధనం లూటీ

రూ.1,100 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టుకు రూ.7 వేల కోట్లు ఎందుకు?

- జనం సొమ్మును దోచుకునేందుకే గోదావరి జలాల తరలింపు పనులు
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఫైర్
- ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్లు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు గోదావరి జలాలను తరలించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో రూ.1,100 కోట్లతో అంచనాలను రూపొందించగా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం దాన్ని రూ.7,390 కోట్లకు పెంచి ప్రజాధనాన్ని లూటీ చేస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీ రామారావు ఆరోపించారు. రూ.16 వేల కోట్లతో పూర్తయ్యే మూసీ సుందరీకరణ ప్రాజెక్టును రూ.లక్షన్నర కోట్లకు పెంచడాన్ని బీఆర్‌ఎస్ అడ్డుకుందని.. దీంతో రూటు మార్చిన రేవంత్‌రెడ్డి విడతల వారీగా జనం సొమ్మును దోచుకునేందుకే గోదావరి జలాల తరలింపు పనులు మొదలు పెట్టారని ధ్వజమెత్తారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

న్యాయ పోరాటం చేస్తాం..

'సముద్ర మట్టానికి 618 మీటర్ల ఎత్తున ఉన్న కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి జలాలను గ్రావిటీ ద్వారా రావల్‌కోల్ చెరువుకు, అక్కడి నుంచి 540 మీటర్ల ఎత్తున ఉన్న గండిపేటకు తరలించడం ద్వారా మూసీతో అనుసంధానం చేసే వీలుంది. అయినా 560 మీటర్ల ఎత్తులో ఉన్న మల్లన్నసాగర్ నుంచి నీటిని తరలించేలా ప్రతిపాదనలు మార్చి నీటి శుద్ధి కేంద్రాలు, పంప్ హౌస్‌లు ఎవరి లాభం కోసం కడుతున్నారో ప్రభుత్వం చెప్పాలి. కాంట్రాక్టర్లకు దోచిపెట్టి కమీషన్లు దండుకునేందుకే సీఎం ఈ పనులు చేపడుతున్నారా? హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలింపులో అవినీతిపై న్యాయ పోరాటం చేస్తాం..'అని కేటీఆర్ చెప్పారు.

కుర్చీ కాపాడుకునేందుకే..

'కాళేశ్వరం ప్రాజెక్టును విఫల పథకంగా ప్రచారం చేసిన రేవంత్, కాంగ్రెస్ నేతలు ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పాలి. కాళేశ్వరం ప్రాజెక్టు మీద సీబీఐ విచారణకు ఆదేశించిన రేవంత్‌రెడ్డి.. అదే ప్రాజెక్టు ఆధారంగా నిర్మించిన మల్లన్నసాగర్, మూసీ నదుల అనుసంధానం ప్రాజెక్టుకు

మిగతా 3వ పేజీలో ▶

నేపాల్లో యువత ఆందోళనలు హింసాత్మకం

కాల్పుల్లో 20 మంది మృతి

- అవినీతి, సోషల్ మీడియాపై నిషేధాన్ని నిరసిస్తూ దేశమంతటా ఆందోళనలు: పలుచోట్ల కాల్పులు
- నైతిక బాధ్యత వహిస్తూ హోంమంత్రి రమేశ్ రాజీనామా
- మా నిర్ణయంపై వెనక్కి తగ్గం: ప్రధాని కేపీ శర్మ ఓలీ
- ఇది ప్రభుత్వ అవినీతిపై వెల్లువెత్తిన ప్రజాగ్రహం
- సోషల్ మీడియా నిషేధం ఒక్కటే కాదు: స్థానికులు
- ప్రధాని వైఖరిపై నేపాలీ కాంగ్రెస్ మంత్రుల ఆగ్రహం


దిగొచ్చిన ప్రభుత్వం.. నిషేధం ఎత్తివేత


ఖాట్మండులో పార్లమెంట్ బయట ఆందోళనకారులు

కఠ్మాండు: మొబైల్ ఫోన్ వద్దంటే ఇళ్లలోనే గొడవలైపోతున్న ఈ రోజుల్లో... దేశమంతటా సోషల్ మీడియాను నిషేధించి నేపాల్‌లోని కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఇన్‌స్టా, యూట్యూబ్, వాట్సాప్‌తో పాటు రెడిట్, ఫేస్‌బుక్, ఎక్స్, సిగ్నల్, స్నాప్‌చాట్ వంటి 26 ప్రధాన సోషల్ మీడియా యాప్‌లను, సైట్లను నిషేధించటంపై నేపాల్ యువత భగ్గుమంది. కాలేజీ, స్కూలు యూనిఫారాల్లో సోమవారం రోడ్లపైకి వచ్చిన యువత... దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ నిరసనలకు దిగారు. పలుచోట్ల ఘర్షణలు చోటు చేసుకోవటంతో భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో 20 మంది వరకూ మరణించగా 250 మందికి పైగా గాయపడ్డారు. ఈ దారుణానికి నైతిక బాధ్యత వహిస్తూ నేపాల్ హోం మంత్రి రమేశ్ లేఖక్ రాజీనామా చేశారు.

1997–2012 మధ్య పుట్టిన యువత (జనరేషన్- జెడ్) మొబైల్ ఫోన్లు చేతికి వచ్చిన దగ్గర్నుంచి పెద్దగా నియంత్రణలేవీ ఎదుర్కోలేదు. వీరికి చదువుకోవటానికైనా, సంపాదనకైనా, సంభాషించుకోవటానికైనా సోషల్ మీడియాయే ఆధారమైపోయింది. జీవితంలో విడదీయరాని భాగమైపోయింది. అలాంటిది ఒక్కసారిగా టిక్‌టాక్, వైబర్ మినహా అన్ని ప్రధాన సోషల్ మీడియా సైట్లనూ నిషేధించటంతో తట్టుకోలేకపోయారు. ఈ నెల 4న

మిగతా 2వ పేజీలో ▶


సీపీ రాధాకృష్ణన్


జస్టిస్ సుదర్శన్ రెడ్డి

నేడే ఉప రాష్ట్రపతి ఎన్నిక

అన్ని ఏర్పాట్లు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

- ఎన్డీఏ వర్సెస్ ఇండియా కూటమి
- సీపీ రాధాకృష్ణన్, జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మధ్య ముఖాముఖి
- ఓటింగ్‌లో పాల్గొననున్న లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు
- ఉదయం 10 గంటలకు పోలింగ్ షురూ..
- సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు.. తర్వాత వెలువడనున్న ఫలితం
- బలాబలాల పరంగా ఎన్డీఏ అభ్యర్థికి పూర్తి మెజార్టీ
- మాక్ పోలింగ్‌లు, ఎంపీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన పార్టీలు

6 లో

ఉప రాష్ట్రపతి ఎన్నిక.. ఓ ప్రత్యేక ప్రక్రియ

- కేవలం పార్లమెంట్ సభ్యులే ఓటర్లు
- ప్రతి ఎంపీ ఓటు విలువ 'ఒక్కటే'

6 లో



22 మందితో బీజేపీ రాష్ట్ర కార్యవర్గం

ప్రధాన కార్యదర్శులుగా గౌతమ్‌రావు, వీరేందర్‌గౌడ్, వేముల అశోక్

- ఉపాధ్యక్షులుగా బూర నర్సయ్య, కాసం వెంకటేశ్వర్లు, శాంతికుమార్, కొల్లి మాధవి, బండ కార్తీకరెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గం కొలువుదీరింది. 22 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పాటైంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ. నడ్డా ఆదేశాలకు అనుగుణంగా ఈ కమిటీలో పదాధికారులుగా 8 మంది ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, 8 మంది కార్యదర్శులు, ఒక కోశాధికారి, ఒక సంయుక్త కోశాధికారి, ఒక ప్రధాన అధికార ప్రతినిధిని నియమించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

- ప్రధాన కార్యదర్శులుగా డా.ఎస్.గౌతమ్ రావు, టి.వీరేందర్‌గౌడ్, వేముల అశోక్
- ఉపాధ్యక్షులుగా డా.బూర నర్సయ్యగౌడ్, డా.కాసం వెంకటేశ్వర్లు యాదవ్,

మిగతా 12వ పేజీలో ▶

ఇవాంజెలిస్ట్



అంతటా అపరిశుభ్రత, దుర్గంధం



వరద నీటిలో సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం కేజీబీవీ

రాష్ట్రంలో కస్తూర్బా విద్యాలయాలకు వరద కష్టాలు

- చినుకు పడితే రొంప్పు.. గోడల్లోకి చెమ్మ.. దుప్పట్లు, దుస్తులు తడిసి దుర్వాసన
- దోమల స్వైరవిహారం.. అయినా అక్కడే భోజనాలు చేయాల్సిన దుస్థితి.... అనారోగ్య సమస్యలతో విలవిల్లాడుతున్న విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ కస్తూర్బా బాలికల విద్యాలయాలను వరద కష్టాలు వెంటాడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కేజీబీవీ ప్రాంగణాలు బురదమయం కావడంతో పరిసరాలన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయి. వర్షాలకు గదుల గోడల్లోకి చెమ్మ చేరింది. కప్పుకునే దుప్పట్లే కాదు... వేసుకునే దుస్తులు కూడా తడిసిపోయి వాసన వస్తున్నాయి. అపరిశుభ్రత వల్ల దోమలు వ్యాపిస్తుండటం వల్ల విద్యార్థినులు దోమకాట్లతో అస్వస్థతకు గురవుతున్నారు. అధికారులు జోక్యం చేసుకున్నా ఇప్పటికిప్పుడు పరిస్థితి మెరుగవ్వడం కష్టంగా కనిపిస్తోంది.

పరిశుభ్రత లోపించి అనారోగ్యం..

రాష్ట్రంలో 495 కేజీబీవీ పాఠశాలలు ఉండగా 403 కేజీబీవీలను ఇంటర్ వరకూ ఉన్నతీకరించారు. కేజీబీవీల్లో 1,24,153 మంది విద్యార్థులు చదువుతున్నారు. టెన్త్ వరకూ దాదాపు లక్ష మంది విద్యార్థులు ఉన్నారు. సమగ్ర శిక్ష పర్యవేక్షణలో సాగే కేజీబీవీల్లోని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఇటీవల

మిగతా 12వ పేజీలో ▶

రంగంలోకి కేంద్ర దర్యాప్తు సంస్థలు

- వాగ్దేవి ల్యాబ్స్‌లో సీజ్ చేసిన శాంపిల్స్ తీసుకున్న నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో
- మనీలాండరింగ్ కోణంలో ఈడీ వివరాల సేకరణ



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన చర్లపల్లి డ్రగ్స్ కేసు దర్యాప్తు వేగవంతమవుతోంది. వాగ్దేవి ల్యాబ్స్ కెమికల్ ఫ్యాక్టరీలో రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ తయారీ ముడిపదార్థాల కేసును మహారాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ కేసు దర్యాప్తులోకి కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు సైతం రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. మత్తు పదార్థాల కట్టడిలో దేశవ్యాప్తంగా కీలక ఏజెన్సీ అయిన నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) ఇప్పటికే మహారాష్ట్ర పోలీసుల నుంచి ప్రాథమిక వివరాలు సేకరించింది. చర్లపల్లిలోని వాగ్దేవి ల్యాబ్స్ కెమికల్ ఫ్యాక్టరీలోనూ ఎన్‌సీబీ అధికారులు ఆధారాలు సేకరించినట్టు సమాచారం. ఎండీ డ్రగ్స్ పలు రాష్ట్రాలకు సరఫరా అవుతున్నట్టు ప్రాథమిక ఆధారాలు లభించడంతో జాతీయ, అంతర్జాతీయ డ్రగ్ నెట్‌వర్క్‌లు ఇందులో ఉన్నట్టుగా దర్యాప్తు ఏజెన్సీలు భావిస్తు న్నాయి. ఈ నేపథ్యంలోనే ఎన్‌సీబీ అధికారుల దర్యాప్తు సైతం కీలకంగా మారనుంది. కీలక నిందితుడు శ్రీనివాస్ విజయ్ పదేళ్లుగా ఎండీ డ్రగ్ తయారు చేసి అమ్ముతున్నట్టుగా పోలీసులు ఆధారాలు సేకరించారు. విదేశీ ఏజెంట్లు సైతం శ్రీనివాస్ విజయ్‌తో కలిసి పనిచేస్తున్న నేపథ్యంలో పెద్ద మొత్తంలో

మిగతా 5వ పేజీలో ▶

స్మార్ట్‌ఫోన్ ఎంతగా మన దైనందిన జీవితంలో మమేకం అయిందో ప్రత్యేకంగా చెప్పక్కర లేదు. కర్ణుడి కవచ కుండలాల్లా.. అది నిరంతరం మనతో ఉండాల్సిందే. కాలేజీ విద్యార్థులకుతోడు బడి ఈడు పిల్లల్లోనూ ఫోన్ వాడకం విపరీతంగా పెరిగింది. ఈ అలవాటే వారిని క్లాస్ రూముల్లోకి ఫోన్ తీసుకెళ్లేలా చేస్తోంది. తరగతి గదిలోకి ఫోన్ లేకుండా వెళ్లిన విద్యార్థులు విద్యాపరంగా మెరుగ్గా రాణించినట్టు తాజా అధ్యయనంలో తేలింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఫోన్ వద్దు.. చదువే ముద్దు!



17వేల 'ఉన్నత' విద్యార్థులపై భారీ అధ్యయనం
క్లాసులో ఫోను వాడనివాళ్లు చదువులో సూపర్
అనేక దేశాల్లోని బడుల్లో స్మార్ట్‌ఫోన్‌పై నిషేధం
అమెరికాలో 35 రాష్ట్రాల్లో స్కూళ్లలో 'నో ఫోన్'

భారీ అధ్యయనం

పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలోని వార్టన్ స్కూల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆల్ప్ సుంగు తన సహచరులతో కలిసి ఇటీవల భారత్‌లో ఓ వినూత్న అధ్యయనం చేపట్టారు. 10 ఉన్నత విద్యా సంస్థలలో చదువుతున్న 16,955 మంది విద్యార్థులను స్మార్ట్ ఫోన్ ఎలా ప్రభావితం చేసిందన్నదే ఆ అధ్యయన సారాంశం. తరగతి గదిలోకి ఫోన్ తీసుకుపోని విద్యార్థులు చదువుల్లో బాగా రాణించినట్టు ఆ అధ్యయనంలో తేలింది. తక్కువ పనితీరు కనబరుస్తున్న, అలాగే సైన్స్, గణితం కాకుండా ఇతర సబ్జెక్టులను చదువుతున్న మొదటి సంవత్సరం విద్యార్థులు కూడా ఫోన్ వాడకపోవడం వల్ల ఎక్కువ ప్రతిభ చూపినట్టు డాక్టర్ సుంగు తెలిపారు. ఫోన్ నిషేధించడం వల్ల తరగతి గది ఫలితాలు మెరుగుపడతాయనడానికి బలమైన ఆధారాలను నివేదిక అందిస్తుందని నార్త్ కరోలినా విశ్వవిద్యాలయంలో కౌమార నిపుణులు అన్నే మాహెక్స్ చెప్పారు.

20 నిమిషాల సమయం!

యునెస్కో చేపట్టిన '2023 గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ నివేదిక ప్రకారం.. 'కొన్ని సాంకేతిక పరిజ్ఞానాలు కొన్ని సందర్భాల్లో కొంతవరకు మాత్రమే అభ్యాసానికి తోడ్పడతాయి. తరగతి గదిలో స్మార్ట్‌ఫోన్ వల్ల చదువుకు అంతరాయం కలుగుతోంది. 14 దేశాల్లో ప్రీ–ప్రైమరీ నుండి ఉన్నత విద్య వరకు చదువుతున్న విద్యార్థులపై జరిపిన ఓ అధ్యయనంలో.. ఫోన్ చేతిలో ఉంటే విద్యార్థుల దృష్టి నేర్చుకోవడం నుండి మరలుతోందని తేలింది. మొబైల్ ఫోన్‌లో నోటిఫికేషన్స్ వస్తుంటే విద్యార్థులు తమ ఏకాగ్రతను కోల్పోతున్నారట. ఆ తరువాత.. విద్యార్థులు వారు నేర్చుకుంటున్న దానిపై తిరిగి దృష్టి పెట్టడానికి 20 నిమిషాల వరకు సమయం పడుతోందని మరో అధ్యయనంలో తేలింది. బెల్జియం, స్పెయిన్, యూకేలోని బడుల్లో స్మార్ట్‌ఫోన్లపై నిషేధం కారణంగా అభ్యాస సామర్థ్యాలు, ఫలితాలు మెరుగుపడినట్టు వెల్లడైంది'.

'వాంఛనీయం కాదు'

పాఠశాలల్లో స్మార్ట్‌ఫోన్లను పూర్తిగా నిషేధించడం ఆచరణాత్మకం, వాంఛనీయం కాదని స్పష్టం చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఈ ఏడాది మార్చిలో మార్గదర్శకాలను విడుదల చేసింది. విద్యా ప్రయోజనాలు, తలెత్తే నష్టాలను దృష్టిలో పెట్టుకుని నియంత్రణ అవసరాన్ని నొక్కి చెప్పింది. ఈ నేపథ్యంలో.. స్కూల్ సమయంలో విద్యార్థులు స్మార్ట్‌ఫోన్ వాడకంపై స్పష్టమైన విధానాలను రూపొందించాలని ఢిల్లీ విద్యా శాఖ తన పరిధిలోని అన్ని పాఠశాలలను ఏప్రిల్‌లో ఆదేశించింది. విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించాలన్న ఏకైక లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగా కనీసం 40% జాతీయ విద్యా వ్యవస్థలలో తరగతి గదుల్లో సెల్‌ఫోన్లపై నిషేధాలు అమలవుతున్నాయి. మనదేశంలో మాత్రం స్మార్ట్‌ఫోన్ వినియోగానికి సంబంధించి ప్రస్తుతం స్పష్టమైన చట్టం/విధానం లేదు.



అమెరికా
ఫోన్లు నిషేధిస్తున్న రాష్ట్రాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2025 ఆగస్ట్ నాటికి 18 రాష్ట్రాలు ఈ విధానాన్ని అమలు చేస్తుండగా.. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మరో 17 రాష్ట్రాలు వచ్చి చేరాయి.

ఫ్రాన్స్
15 ఏళ్లలోపు విద్యార్థులు బడుల్లో ఫోన్ వాడకూడదు. 2018–2019 విద్యా సంవత్సరం నుండి నిబంధన అమలు.

బ్రెజిల్
ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు స్మార్ట్‌ఫోన్ వాడకూడదని 2025 జనవరిలో జాతీయ చట్టాన్ని అమలులోకి తెచ్చింది. ఉపాధ్యాయుల అనుమతితో విద్యా ప్రయోజనాల కోసం లేదా అత్యవసర పరిస్థితులు ఉంటే ఉపయోగించవచ్చు.

చైనా
ప్రైమరీ, సెకండరీ స్కూల్స్‌లో 2025 మార్చి నుంచి నిషేధం విధించారు. బోధనా కారణాల వల్ల ఫోన్ అవసరమైతే తల్లిదండ్రులు రాతపూర్వకంగా విద్యా మంత్రిత్వ శాఖకు దరఖాస్తు చేయాలి.

తజికిస్తాన్
2009 నుంచి ప్రాథమిక, సెకండరీ, ఉన్నత విద్యా సంస్థలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది మొబైల్ ఫోన్ వాడకూడదు. గీత దాటితే జరిమానా తప్పదు.

ఇటలీ
ప్రైమరీ స్కూల్ విద్యార్థుల మొబైల్ ఫోన్ వాడకంపై నిషేధం ఉంది. 2025 కొత్త విద్యా సంవత్సరం నుండి హైస్కూల్ విద్యార్థులకూ వర్తింపజేశారు.

బంగ్లాదేశ్
దేశవ్యాప్తంగా నిషేధాలు మొదట 2011లో అమలయ్యాయి. 2017లో బలోపేతం చేశారు.

నెదర్లాండ్స్
ప్రాథమిక, సెకండరీ పాఠశాలల్లో మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, టాబ్లెట్ పీసీలపై దేశవ్యాప్తంగా 2024 సెప్టెంబర్ నుండి నిషేధం.

రువాండా
2018 జూన్ నుంచే ప్రాథమిక, సెకండరీ పాఠశాలల్లో మొబైల్ ఫోన్స్ వాడకానికి అడ్డుకట్ట వేసింది.

న్యూజిలాండ్
పాఠశాల సమయంలో సెల్‌ఫోన్ వాడకూడదన్న నిబంధన దేశవ్యాప్తంగా 2024 ఏప్రిల్ నుంచి అమలైంది.

క్లుప్తంగా...

ఈహెచ్‌ఎస్ విధానాలను రూపొందించండి

- సీనియర్ ఐఏఎస్‌లకు సీఎస్ కె.రామకృష్ణారావు సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య పథకం అమలుకు విధివిధానాలు తయారు చేయాలని సీఎస్ కె.రామకృష్ణారావు సీనియర్ ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఈహెచ్‌ఎస్ (ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్) ప్రతిపాదిత విధానాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమీక్షలో పలు సూచనలిచ్చారు. ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగుల కోసం అమలవుతున్న ఆరోగ్య పథకాలు, ఇన్సూరెన్స్ కంపెనీల విధానాలను అధ్యయనం చేయాలన్నారు. సాధ్యమైనంత త్వరగా నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు వేతనం నుంచి కొంత డబ్బును జమ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, నగదు రహిత ఆరోగ్య చికిత్స విధానం ద్వారా ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్‌కేర్ అందించాలని వారు కోరుతున్నారని అధికారులు తెలిపారు. సమావేశంలో హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా సబ్యసాచి ఘోష్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న సబ్యసాచి ఘోష్‌ను గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌గా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి అదనపు బాధ్యతల్లో నియమించింది. ప్రస్తుతం ఈయన గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్నారు.

ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శిగా సీతాలక్ష్మి

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శిగా సీతాలక్ష్మిని పూర్తిస్థాయి అదనపు బాధ్యతల్లో ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం సీతాలక్ష్మి గిరిజన గురుకుల సొసైటీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ అదనపు బాధ్యతలకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం జారీ చేశారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా..

- ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీలతో సీఎం రేవంత్ కీలక భేటీ
- రహస్య ఓటింగ్‌పై వ్యూహరచన.. ప్రత్యేక సూచనలు
- ఇతర పార్టీల ఎంపీల మద్దతు కూడగట్టాలని దిశానిర్దేశం

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: ఉపరాష్ట్రపతి ఎన్నికల వేళ తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలో రాజకీయ వ్యూహాలకు పదునుపెట్టారు. మంగళవారం జరగనున్న ఎన్నికల్లో ఇండియా కూటమి ఉమ్మడి అభ్యర్థి, తెలుగుబిడ్డ జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న ఆయన, రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశమై ఎన్నికల వ్యూహాలపై కీలక చర్చలు జరిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలకు రేవంత్‌రెడ్డి క్షుణ్ణంగా దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా, ఇది రహస్య ఓటింగ్ పద్ధతిలో జరిగే ఎన్నిక కాబట్టి, దీనిని ఇండియా కూటమికి అనుకూలంగా ఎలా మలచుకోవాలనే దానిపై ప్రధానంగా చర్చించారు. మిగతా పార్టీల ఎంపీలతో ఏ విధంగా సమన్వయం చేసుకోవాలి, అంతరాత్మ ప్రబోధం మేరకు ఓటు వేయాలని కోరుతూ ఎవరెవరితో సంప్రదింపులు జరపాలి అనే అంశాలపై సీఎం ఎంపీలకు స్పష్టమైన సూచనలు చేసినట్లు తెలిసింది. రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడిన అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయడం చారిత్రక అవసరమని, ఈ విషయాన్ని ఇతర పార్టీల ఎంపీలకు కూడా నొక్కిచెప్పాలని సూచించారు. తెలుగు వ్యక్తి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ఎంపీలందరూ సమష్టిగా పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు. మంగళవారం జరిగే పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఎంపీలకు స్పష్టం చేశారు.

రెండు రోజులు ఢిల్లీలోనే సీఎం..

రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలను పర్యవేక్షిస్తారు. వీలును బట్టి పలువురు కేంద్ర మంత్రులను కూడా కలుస్తారు. అలాగే రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించేందుకు ప్రధాని మోదీని కూడా కలిసే అవకాశాలున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం అపాయింట్‌మెంట్‌ను అడిగినట్టు తెలిసింది. ప్రధాని అపాయింట్‌మెంట్ లభిస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల గురించి కూడా సీఎం మాట్లాడే అవకాశముందని సమాచారం. మరోవైపు టీపీసీసీ ఆధ్వర్యంలో ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించనున్న బీసీల సమర భేరి సభకు ఏఐసీసీ పెద్దలను రేవంత్ ఆహ్వానించనున్నట్టు తెలుస్తోంది.

రాజకీయ యుద్ధాలకు కోర్టును వాడుకోవద్దు

- సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ రాష్ట్ర శాఖ వేసిన పరువునష్టం కేసును డిస్మిస్ చేస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్య
- రాజకీయ వ్యాఖ్యలను రాజకీయంగానే ఎదుర్కోవాలన్న సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం
- పిటిషన్‌ను కొట్టేసినా వాదించే ప్రయత్నం చేసిన బీజేపీ తరపు న్యాయవాది
- మండిపడ్డ సీజేఐ.. మళ్లీ ఇలాంటి పిటిషన్ వేస్తే రూ. 10 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరిక

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ తెలంగాణ శాఖ దాఖలు చేసిన పరువునష్టం పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె. వినోద్‌చంద్రన్, జస్టిస్ అతుల్ ఎస్. చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం బీజేపీ తరపు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'రాజకీయ యుద్ధాలకు ఈ కోర్టును ఉపయోగించుకోవద్దని పదేపదే చెబుతున్నాం'అంటూ సీజేఐ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంలో జోక్యం చేసుకోదలచుకోలేదని తేల్చిచెప్పారు. రాజ కీయాల్లో ఉన్నప్పుడు విమర్శలు తట్టుకొనే శక్తి ఉండాలని పేర్కొంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. రాజకీయ వ్యాఖ్యలను రాజకీయంగానే ఎదుర్కోవాలని హితవు పలికారు. అయినా రంజిత్ కుమార్ వాదనలు కొనసాగించేందుకు ప్రయత్నించడంతో సీజేఐ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'మేం ఇప్పటికే పిటిషన్‌ను కొట్టేశాం. ఇంకా వాదనలు దేనికి? మళ్లీ ఇలాంటి పిటిషన్‌తో కోర్టుకు వస్తే రూ. 10 లక్షల జరిమానా విధిస్తాం'అంటూ హెచ్చరించారు.

ఇదీ నేపథ్యం..

కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గతేడాది మే 4న కొత్తగూడెంలో జరిగిన సభలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే ఈ వ్యాఖ్యలు తమ పార్టీకి రాజకీయంగా పరువునష్టం కలిగించాయంటూ బీజేపీ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు హైదరాబాద్ ట్రయల్ కోర్టులో పరువునష్టం దావా వేశారు. విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. కేసులో ప్రాథమిక ఆధారాలున్నాయని నిర్ధారించి ఐపీసీ సెక్షన్ 499, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 125 కింద విచారణకు ఆదేశించింది. ట్రయల్ కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ రేవంత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. 'రాజకీయ ప్రసంగాలు తరచుగా అతిశయోక్తులతో నిండి ఉంటాయి. వాటిని పరువునష్టంగా పరిగణించడం సరికాదు'అని వాదించారు. ఈ వాదనతో ఏకీభవించిన హైకోర్టు.. ట్రయల్ కోర్టు ఆదేశాలను రద్దు చేస్తూ రేవంత్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ బీజేపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు.

ఆ రెండు శాఖల్లోనే ఆదాయం పెరిగిందా!

- మిగిలిన శాఖల ఆదాయం పరిస్థితేంటి?
- ఉన్నతాధికారులను ప్రశ్నించిన మంత్రివర్గ ఉపసంఘం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, జూపల్లి

సాక్షి, హైదరాబాద్: 'వాణిజ్య పన్నుల్లో 4.7 శాతం, గనుల శాఖలో 18.6 శాతం మేరకు ఆదాయం పెరుగుదల కనిపిస్తోంది. మరి ఇతర ఆదాయార్జన శాఖల మాటేమిటి? ఎందుకు ఆయా శాఖలు ఆదాయ సమీకరణలో వెనుకబడ్డాయి?'అని ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఉన్నతాధికారులను ప్రశ్నించింది. మిగిలిన శాఖల్లో కూడా ఆదాయం పెరుగుదల కోసం తీసుకోవాల్సిన చర్యలకు ఉపక్రమించాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించుకోవాలని ఆదేశించింది. సోమవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావులు పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో పూడికతీత పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. తద్వారా ప్రాజెక్టుల్లో నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుందని, ఇసుక ద్వారా రాష్ట్రానికి ఆదాయం సమకూరుతుందని అన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఓ ప్రాజెక్టులో పూడికతీతను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. అదే విధంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకం పనులను గిరిజన ఏజెన్సీల ద్వారానే నిర్వహించాలని, వారికి యంత్ర సామగ్రి అందుబాటులో ఉండదు కనుక, ఐటీడీఏల్లోని ఇంజనీరింగ్ విభాగం ద్వారా సమకూర్చాలని సూచించారు. ఔటర్ రింగురోడ్డు లోపలి భాగంలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమల తరలింపునకు మూడు వారాల్లో విధి విధానాలు రూపొందించాలని ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సందీప్‌కుమార్ సుల్తానియా, వికాస్‌రాజ్, లోకేశ్ కుమార్, శ్రీధర్, శశాంక, రాజీవ్‌గాంధీ హనుమంతు, సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ కమిషనర్‌గా శైలజారామయ్యర్

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్ ఆ శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. గత నెలాఖరున కమిషనర్ వెంకట్రావు ఉద్యోగ విరమణ చేయటంతో ఆయన స్థానంలో ప్రభుత్వం మరో అధికారిని నియమించలేదు. తాజాగా శైలజా రామయ్యర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.



చికితను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

చికితకు ఒలింపిక్స్ శిక్షణ ఇస్తాం: సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: మహిళా ఆర్చరీ చాంపియన్ చికిత తనిపర్తి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కెనడాలో జరిగిన 2025 యూత్ వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో దేశం తరపున బంగారు పతకం గెలుచుకున్న తొలి మహిళగా చికిత రికార్డు సృష్టించారు. చైనాలోని షాంఘైలో జరిగిన సీనియర్ వరల్డ్ కప్‌లో ఆమె రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా చికితకు సీఎం అభినందనలు తెలిపారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించేలా ప్రభుత్వం తరఫున పూర్తి శిక్షణ అందించేందుకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణారావు, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, రాజేందర్‌రావు పాల్గొన్నారు.

వంద రోజుల్లో 'మేడారం' పూర్తి చేయాలి

- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వచ్చే సమ్మక్క–సారలమ్మ జాతర నాటికి మేడారం ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం వంద రోజుల్లో ఆలయ అభివృద్ధి పనులు చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సోమవారం ఆయన దేవాదాయ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో బాసర, మేడారం ఆలయాల అభివృద్ధి పనులపై సమీక్షించారు. రాతి కట్టడాలతోనే పనులు పూర్తి చేయాలని, భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. జంపన్న వాగులో నీళ్లు నిలిచి ఉండేలా నిర్ధారిత దూరాల్లో చెక్‌డ్యాంలను నిర్మించాలని తెలిపారు. ఈ వారంలోనే తాను మేడారం వచ్చి క్షేత్రస్థాయిలో అక్కడి ప్రాంతాన్ని పరిశీలిస్తానని సీఎం చెప్పారు. బాసర దేవాలయ విస్తరణ పనుల ప్రణాళికలను పరిశీలించారు. దేవాలయాల సమావేశంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ పాల్గొన్నారు. ఈనెల 15న మేడారం అభివృద్ధి పనులు ప్రారంభించి జనవరి మొదటి వారంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి పొంగులేటి తెలిపారు. సీఎం సమీక్ష అనంతరం మంత్రి సీతక్కతో కలిసి పనులపై సమీక్షించారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికకు బీఆర్‌ఎస్ దూరం

- రైతు వ్యతిరేక ప్రభుత్వాలకు నిరసనగా కీలక నిర్ణయం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే కారణమన్న ఎంపీ సురేశ్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉండాలని బీఆర్‌ఎస్ సంచలన నిర్ణయం తీసుకుంది. రైతుల సమస్యలు, ముఖ్యంగా యూరియా కొరతను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపిస్తూ, నిరసన రూపంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి సోమవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో పార్టీ వైఖరిని స్పష్టం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చించిన మీదటే మంగళవారం జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నిక విషయంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. 'యూరియా సమస్యను పరిష్కరించాలని మేము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పలుమార్లు కోరాం. కానీ, రెండు ప్రభుత్వాలూ రైతుల గోడును పట్టించుకోకుండా పూర్తిగా విఫలమయ్యాయి. ప్రభుత్వాల ఈ రైతు వ్యతిరేక వైఖరికి నిరసన తెలిపేందుకే ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించాం'అని సురేశ్‌రెడ్డి చెప్పారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక బ్యాలెట్‌పై నోటాకు అవకాశం లేనందున, తమ నిరసనను తెలిపేందుకు ఎన్నికకు దూరంగా ఉండటమే సరైన మార్గమని భావించామన్నారు.

అభ్యర్థులను గౌరవిస్తాం...కానీ రైతుల సమస్యే ముఖ్యం

'పోటీలో ఉన్న ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిలను మేము గౌరవిస్తాం. సుదర్శన్‌రెడ్డి మన రాష్ట్రానికి చెందిన వ్యక్తి. అయినా, రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్న ప్రస్తుత తరుణంలో మా నిరసనను బలంగా వినిపించడమే మా కర్తవ్యం'అని సురేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ కార్యకర్తలను వేధిస్తోందని, ఇలాంటి పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకొని పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించే బాధ్యత కేసీఆర్‌కు లేదా?

తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వరా?: ఎంపీ చామల



సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత రాజకీయాల్లో కీలకమైన ఘట్టం ఈ ఉపరాష్ట్రపతి ఎన్నిక అని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటు వేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వరా? అని నిలదీశారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో చామల మీడియాతో మాట్లాడారు. నోటా లేదు కాబట్టి తమ వాటా లేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను చామల ఖండించారు. లోక్‌సభలో బీఆర్‌ఎస్‌కు ప్రాతినిధ్యం లేకుండా తెలంగాణ ప్రజలు తీర్పు చెప్పారని, కనీసం రాజ్యసభలో ఉన్న ఓట్లను అయినా వినియోగించుకోవాలని హితవు పలికారు. 'రూ.11 వేల కోట్లతోనే గండిపేట్‌కి నీళ్లు తీసుకురావాలనుకున్నామని కేసీఆర్ అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కొండపోచమ్మ సాగర్ నుంచి ఎన్ని టీఎంసీల నీరు తేవాలనుకున్నారో ప్రజలకు చెప్పరా? ఇప్పుడు మల్లన్నసాగర్ నుంచి నీరు తీసుకురావడం చాలా కీలకం'అని చామల పేర్కొన్నారు.

నేపాల్లో యువత ఆందోళనలు హింసాత్మకం
కాల్పుల్లో 20 మంది మృతి

▶ మొదటి పేజీ తరువాయి

నిషేధం విధించటంతో... దానికి వ్యతిరేకంగా టిక్‌టాక్‌లో చర్చ మొదలైంది. ఆ చర్చ కేపీ శర్మ ఓలీ ప్రభుత్వ అవినీతివైపు మళ్లింది. ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని, బంధుప్రీతి ఎక్కువైందని, నేతల కొడుకులు, కూతుళ్లు రాజ్యమేలుతున్నారంటూ ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. వాటన్నిటి ఫలితంగా సోమవారం ఉదయం నుంచే రోడ్లపైకి వచ్చిన యువత... 'నిషేధించాల్సింది అవినీతిని... సోషల్ మీడియాను కాదు'అని ప్లకార్డులు చూపిస్తూ ఎక్కడికక్కడ నిరసనలకు దిగారు. పార్లమెంటు వద్ద, మైటీఘర్ మండలం వద్ద భారీగా గుమికూడారు. పరిస్థితి చేయిదాటిపోతోందని భావించిన భద్రతా బలగాలు పలుచోట్ల కాల్పులకు దిగాయి. ఈ కాల్పుల్లో 20 మంది యువత ప్రాణాలు కోల్పోయారు. ఫలితంగా రాజధాని కఠ్మాండు సహా పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు.

మా నిర్ణయం సరైనదే: కేపీ శర్మ ఓలీ

నిరసనల నేపథ్యంలో నేపాల్ కేబినెట్ అత్యవసరంగా సమావేశమైంది. కొందరు యువత బ్లాక్‌మెయిల్ చేస్తే వారికి లొంగేది లేదని, తమ నిర్ణయానికే కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా ప్రధాని కేపీ శర్మ ఓలీ చెప్పారు. మంత్రులంతా దీనికి మద్దతివ్వాలని కోరారాయన. అయితే ప్రభుత్వంలో భాగమైన నేపాలీ కాంగ్రెస్ మంత్రులు తక్షణం నిషేధాన్ని తొలగించాలని కోరారు. ఓలీ మొండి వైఖరికి నిరసనగా కేబినెట్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. కాగా ఈ నిరసనలు సోషల్ మీడియా నిషేధంపై జెన్–జెడ్ చేస్తున్నవి మాత్రమే కాదని, ప్రభుత్వ అవినీతిపై అన్ని వర్గాల్లోనూ వ్యక్తమవుతున్న వ్యతిరేకతకు నిదర్శనమని పలువురు వ్యాఖ్యానించారు. కాల్పుల ఘటనల్ని నేపాల్ జాతీయ మానవహక్కుల సంఘం ఖండించింది. నిరసనకారుల మాట వినాలని, రాజకీయంగా తటస్థ వైఖరి అవసరమని పేర్కొంటూ కఠ్మాండు మేయర్ బాలెన్ షా ఆందోళనకారులకు మద్దతు పలికారు.



ఆందోళనకారులపై వాటర్ క్యానన్లను ప్రయోగిస్తున్న పోలీసులు

దిగొచ్చిన ప్రభుత్వం.. నిషేధం ఎత్తివేత

దేశవ్యాప్తంగా యువత ఉద్యమించడం, ఆందోళనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో నేపాల్ ప్రభుత్వం దిగొచ్చింది. సోషల్ మీడియా సైట్లపై నిషేధం విధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు ప్రకటించింది. కేబినెట్ అత్యవసర సమావేశానంతరం.. ఆ దేశ సమాచార, ప్రసారాల శాఖ మంత్రి పృథ్వీ సుబ్బా గురంగ్ ఈ విషయం ప్రకటించారు. 'జెన్ జీ' డిమాండ్ మేరకు..సోషల్ మీడియా సైట్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత ఏజెన్సీలను ఆదేశించినట్లు ఆయన చెప్పారు. 'జెన్ జీ' బృందం తమ ఆందోళనలు విరమించుకోవాలని కోరారు.

పార్లమెంటు వద్ద హింసాత్మకం

ప్రధానంగా పార్లమెంటు వద్దే హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయగా నిరసనకారులు వాటిని తోసుకుంటూ ముందుకొచ్చారు. వారిని నిలువరించడానికి పోలీసులు బాష్పవాయువు, వాటర్ క్యానన్లు ప్రయోగించారు. ఈ గందరగోళం మధ్యలోనే కొందరు నిరసనకారులు పార్లమెంటు ఆవరణలోకి ప్రవేశించారు. పార్లమెంటు గేట్లను ధ్వంసం చేశారు. ఈ దశలో పోలీసులు కాల్పులు జరిపారు.

నిషేధం ఎందుకంటే...

సోషల్ మీడియా సంస్థలు ఆగస్టు 28లోగా తమ దేశంలో రిజిస్టరు చేసుకోవాలని ప్రభుత్వం నోటీసులిచ్చింది. ఈ డెడ్‌లైన్ ముగిసినా ప్రధాన సోషల్ మీడియా సంస్థలేవీ రిజిస్టర్ చేసుకోలేదు. దీంతో నిషేధం విధిస్తున్నట్లుగా ఈ నెల 4న ప్రభుత్వం ప్రకటించింది.

క్లుప్తంగా...

గురుకులాలపై హరీశ్‌రావు రాజకీయాలు

సాంఘిక సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్నన్ని రోజులూ పేదల చదువుల కోసం ఒక్క పథకాన్ని కూడా తీసుకురాలేని బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో గురుకులాల నిర్వహణ గురించి రాజకీయాలు చేయడం దారుణమని సాంఘిక, గిరిజన, మైనార్టీ, వికలాంగ సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డారు. పదేళ్ల పాటు గురుకులాలను పట్టించుకోకుండా గాలికి వదిలేసిన ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి హరీశ్‌రావు పేద దళిత, బీసీ విద్యార్థులతో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి కమీషన్లు దండుకున్న కేసీఆర్.. కనీసం గురుకులాలకు పదేళ్లలో పక్కా భవనాలు నిర్మించలేదని, పేదల చదువు గురించి ఆలోచించలేదని విమర్శించారు. విలాసవంతమైన ప్రగతిభవన్, కలెక్టరేట్లు, ఎమ్మెల్యేల కార్యాలయాలు కట్టి పిల్లల హాస్టళ్లు కట్టలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల మెస్‌చార్జీలు ఇచ్చామని, సిబ్బంది వేతనాలు నెలనెలా చెల్లిస్తున్నామని మంత్రి అడ్లూరి చెప్పారు. రాష్ట్రంలోని ఏ సంక్షేమ హాస్టల్‌కైనా వెళ్లి పరిశీలించేందుకు హరీశ్‌రావు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

కేటీఆర్‌కు ఈర్ష్య, ద్వేషం, కళ్ల మంట

అందుకే సీఎం రేవంత్‌పై ఆయన అవాకులు చెవాకులు: ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్ అంటే ఈర్ష్య, ద్వేషం, కళ్లమంటతోనే మాజీ మంత్రి కేటీఆర్ ఆయనపై అవాకులు చెవాకులు పేలుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. గతంలో రేవంత్ విసిరిన వైట్ చాలెంజ్‌కు రాకుండా పారిపోయిన కేటీఆర్, ఇప్పుడు హైదరాబాద్‌లో దొరికిన డ్రగ్స్ విషయంలో రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. సోమవారం సీఎల్పీ మీడియా సెంటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేటీఆర్‌తో పాటు ఆ పార్టీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మతితప్పి మాట్లాడుతున్నారని అన్నారు. డ్రగ్స్‌ను కేసీఆర్ నియంత్రించలేకపోతున్నారని గతంలో మాట్లాడిన ప్రవీణ్‌కుమార్.. ఇప్పుడు తెలంగాణ పోలీసుల మనోధైర్యం దెబ్బతినేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఈగల్ టీంతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతోందని చెప్పారు. రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు చేయడం ఆకాశంపై ఉమ్మి వేయడమేనన్నారు. కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం కామధేనువులా ఉపయోగించుకుందని, లిక్కర్ మరకలు కూడా ఆ కుటుంబానికి ఉన్నాయని అన్నారు. 'కవిత ఆరోపణలతోనే బీఆర్‌ఎస్ మూడు, నాలుగు ముక్కలైంది. ఆ పార్టీ పని ఎప్పుడో అయిపోయింది'అని ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు.

ఆదాయార్జన విభాగాల్లో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని అందిస్తున్న విభాగాలకు బదిలీల నిషేధం నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఇందులో కమర్షియల్ ట్యాక్స్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ విభాగాల్లో సాధారణ బదిలీల నిషేధం నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈమేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

చుక్క నీరు తేలేదు!



సోమవారం గండిపేట వద్ద ఏర్పాటు చేసిన సభకు హాజరైన ప్రజలు. (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

అందుకు తగ్గట్టుగా భవిష్యత్తు ప్రణాళికలు అవసరం..' అని సీఎం పేర్కొన్నారు.

'తుమ్మిడిహెట్టి'పై మహారాష్ట్రను ఒప్పిస్తాం: 'గోదావరిపై తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల కట్టి ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల రైతులకు సాగునీరు అందిస్తాం. దివంగత వైఎస్సార్ తుమ్మిడిహెట్టి వద్దే దీనిని ప్రారంభించారు. అయితే గత బీఆర్‌ఎస్ పాలకులు కాసుల కక్కుర్తితో తలను తొలగించి చేవెళ్ల, తాండూరు, పరిగికి సాగునీరు అందకుండా చేశారు. త్వరలో ఈ ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర సీఎంను కలిసి చర్చించి ఒప్పిస్తాం..' అని రేవంత్ చెప్పారు.

మూసీ ప్రక్షాళన చేసి తీరతాం..: 'మూసీ మురికికూపంగా మారి విషం చిమ్ముతోంది. ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, భువనగిరి, ఆలేరు ప్రాంతాల్లో నీరు తాగితే పశువులే కాదు, మనుషుల ప్రాణాలు సైతం పోతున్నాయి. పుట్టబోయే బిడ్డలు కూడా అంగవైకల్యంతో పుడుతున్నారు. నల్లగొండ జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు ఎలాగైనా సరే మూసీని పునరుజ్జీవింపజేయాలని స్థానికులు కోరారు. వారికిచ్చిన మాట ప్రకారం మూసీ ప్రక్షాళన చేసి తీరతాం. గోదావరి జలాల తరలింపు ద్వారా జంట నగరాల తాగునీటి సమస్యను పరిష్కరించడమే కాకుండా మూసీ కాలుష్యాన్ని నివారించడం ద్వారా ఆ సమస్య నుంచి నల్లగొండ జిల్లా ప్రజలకు విముక్తి కల్పిస్తాం. ఫ్యాక్టరీల కాలుష్యం మూసీలో కలవకుండా నియంత్రిస్తాం. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు నిర్వాసితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుంది. హైదరాబాద్‌ను సుందర నగరంగా తీర్చిదిద్దుతాం..' అని సీఎం అన్నారు.

డిసెంబర్ 9న విజన్ డాక్యుమెంట్ విడుదల: 'వందేళ్లకు సరిపడా ప్రణాళికతో డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసి తెలంగాణ సమాజానికి అంకితం ఇవ్వబోతున్నాం. గేట్ వే ఆఫ్ హైదరాబాద్ ప్రాజెక్టు కోసం ప్రణాళికలు సిద్ధం చేశాం. రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌ను అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. మహానగరాన్ని అభివృద్ధి చేయడంలో ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలి. ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో కలిసిరావాలి..' అని సీఎం పిలుపునిచ్చారు.



నియో పోలిస్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ ప్రారంభం

కోకాపేట వద్ద నియో పోలిస్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్‌ను సోమవారం సీఎం ప్రారంభించారు. అదేవిధంగా గండిపేట వద్ద హైదరాబాద్ జలమండలి ఆధ్వర్యంలో నిర్మించిన 16 రిజర్వాయర్లను కూడా ప్రారంభించారు. అనంతరం ప్రాజెక్టు ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్ వెంకటస్వామి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

రైతు రుణాలపై ఒత్తిడి చేయొద్దు!



బ్యాంకర్లు రైతుల పట్ల మానవీయ కోణంలో ఆలోచించాలి

తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: పంటరుణాల రికవరీ కోసం రైతులపై ఒత్తిడి చేయవద్దని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. రైతుల రుణాల విషయంలో మానవీయతను చాటుకోవాలని, వారికి సమయం ఇచ్చి చూడాలని అన్నారు. అదేవిధంగా రైతులకు వేగంగా పంట రుణాలు ఇవ్వాలని ఆయన కోరారు. సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన బ్యాంకర్లకు పలు సూచనలు చేశారు. తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని, కర్ణాటక, హరియాణా రాష్ట్రాలను అధిగమించి, ఐదేళ్ల తర్వాత తొలిసారి అగ్రస్థానాన్ని సాధించిందని పేర్కొన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగంలో స్థిరమైన వృద్ధితో తెలంగాణ భారతదేశంలో అత్యంత చురుకైన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తోందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో బ్యాంకులు ప్రాధాన్యరంగ రుణాల విభాగంలో మంచి ఫలితాలు సాధించటంపై భట్టి హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావించి, రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణ మాఫీ చేశామని వివరించారు. అదేవిధంగా రైతు భరోసా, కొన్ని పంటలకు బోనస్, ప్రధాన-మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ వంటివి అమలవుతున్నాయన్నారు.

మహిళలకు మరింత రుణ సాయం చేయాలి

పంట ఉత్పత్తి, ముఖ్యంగా వరి ఉత్పత్తి పెరగడంతో ఎఫ్‌సీఐకి ధాన్యం సరఫరా చేసే ప్రధాన రాష్ట్రాలలో ఒకటిగా తెలంగాణ ఎదుగుతోందని భట్టి వివరించారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు సాధికారత కల్పించేందుకు, ఆదాయ సృష్టి చేసే కార్యకలాపాలకు బ్యాంకులు మరింత రుణ సహాయం అందించాలన్నారు. వ్యాపారానికి అనుకూలమైన విధానాలు, ప్రభుత్వ చొరవ వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి, పరిశ్రమల వృద్ధి, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని భట్టి వ్యాఖ్యానించారు. హామ్ ప్రాజెక్టుల్లో బ్యాంకులు చురుకుగా పాల్గొనాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను దృష్టిలో పెట్టుకొని రైతులకు సకాలంలో రుణాలు అందించాలని కోరారు. కాగా, తొలిఏడాది నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఖర్చు చేస్తుందని, ఇందిరమ్మ లబ్ధిదారులకు కూడా రుణాలు ఇవ్వాలని ఆయన బ్యాంకర్లను కోరారు. అలాగే స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్ధి పొందాలని ఆశిస్తున్న యువకుల పట్ల బ్యాంకర్లు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలన్నారు.

ఆదిలాబాద్ సీసీఐని పునరుద్ధరించండి

కేంద్రానికి మంత్రి శ్రీధర్‌బాబు వినతి

సీసీఐ అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం

సాక్షి, హైదరాబాద్/ఆదిలాబాద్: నష్టాల బారినపడి మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆదిలాబాద్ ప్లాంటును పునరుద్ధరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పరిశ్రమను పునరుద్ధరించి తిరిగి నడిపించాలని కోరుతూ ఇప్పటికే పలు సందర్భాల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని రాష్ట్ర ప్రభుత్వం కోరిన విషయాన్ని గుర్తు చేశారు. సోమవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీసీఐ సీఎండీ సంజయ్ బంగా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో పునరుద్ధరణ ప్రతిపాదనలపై శ్రీధర్‌బాబు చర్చించారు. ప్లాంటును ఆధునిక యంత్రాలతో పునరుద్ధరించడానికి రూ. 2 వేల కోట్లు అవసరమవుతాయని సీఎండీ చెబుతున్నారని, పునరుద్ధరణ ద్వారా మూడు వేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలోని ఈ భారీ పరిశ్రమను పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వమే పునరుద్ధరించాలని కోరారు. కేంద్రం ప్రతిపాదిస్తున్నట్టుగా ప్లాంటు ప్రైవేటీకరణను (డిజిన్వెస్ట్‌మెంట్) తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రెండు వేల ఎకరాల్లో నాణ్యతతో కూడిన సున్నపురాయి గనులు ఉన్నందున ప్లాంటు నిర్వహణ అసాధ్యమేమీ కాదని శ్రీధర్‌బాబు చెప్పారు. సమావేశంలో గనులు, భూగర్భ వనరుల శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, గనుల శాఖ డైరెక్టర్ వల్లూరు క్రాంతి, సీసీఐ ప్లాంట్ జీఎం శరద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి కూడా సమావేశానికి హాజరై తమ సూచనలను వెల్లడించారు.

అలయ్‌బలయ్‌కు రండి

పీసీసీ చీఫ్‌కు బండారు దత్తాత్రేయ ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: దసరా పండుగ సందర్భంగా ప్రతియేటా నిర్వహించే అలయ్‌బలయ్ కార్యక్రమానికి హాజరు కావాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. సోమవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పీసీసీ చీఫ్‌ను కలిసిన దత్తాత్రేయ, అక్టోబర్ 3న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే అలయ్‌బలయ్‌కు రావాలని కోరారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ తాను రాసిన 'ప్రజలే నా ఆత్మకథ'పుస్తకాన్ని మహేశ్‌గౌడ్‌కు బహూకరించారు.

అంచనాలు పెంచి ప్రజాధనం లూటీ

▶ మొదటి పేజీ తరువాయి

శంకుస్థాపన చేశారు. అయితే కాళేశ్వరంపై చెప్పిన అబద్ధాలను కప్పి పుచ్చుకునేందుకు మల్లన్నసాగర్‌కు బదులుగా గండిపేట దగ్గర శంకుస్థాపన చేశా రు. కేంద్ర ప్రభుత్వం బ్లాక్ లిస్టు చేసిన కాంట్రాక్టు కంపెనీకి. రేవంత్ తాను నిర్వహిస్తున్న మున్సిపల్ శాఖలో అంతర్భాగమైన హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ బోర్డు నుంచి రూ.7 వేల కోట్ల విలువైన కాంట్రాక్టును ఇచ్చారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వేల కోట్లు దోచుకుని ఢిల్లీకి మూటలు పంపి, వాటాలు పంచి తన సీఎం కుర్చీని కాపాడుకునేందుకే ఇదంతా చేస్తున్నారు..'అని మాజీమంత్రి ఆరోపించారు.

యూరియా కొరతపై స్పందించని బీజేపీ, కాంగ్రెస్

'ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఇద్దరూ మంచి అభ్యర్థులే. అయితే మేము రాష్ట్రంలో ప్రధాన సమస్యగా ఉన్న యూరియా కొరతపై బీజేపీతో పాటు కాంగ్రెస్ కూడా స్పందించక పోవడంతో ఉప రాష్ట్రపతి ఎన్నికలో పాల్గొనకూడదని నిర్ణయించుకున్నాం. నోటా ఉంటే దానికే వేసేవాళ్లం కానీ, ఆ అవకాశం లేనందున ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నాం.

కవిత విషయంలో అవసరమైన నిర్ణయం తీసుకున్నాం..


ఎమ్మెల్సీ కవిత విషయంలో పార్టీ వేదికపై, అంతర్గతంగా చర్చించి అవసరమైన నిర్ణయం తీసుకున్నాం. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరినట్టు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఓ టీవీ చర్చలో అంగీకరించి అప్రూవర్‌గా మారాడు. నేరాంగీకారం తర్వాత ఇంకా విచారణ ఎందుకు? వేటు వేయాల్సిందే. మహారాష్ట్ర పోలీసులు ఫ్యాక్టరీ కార్మికులుగా అవతారం ఎత్తి తెలంగాణలో రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను పట్టుకుంటే తెలంగాణ పోలీసులు, ఇంటెలిజెన్స్, ఈగల్, హైడ్రాలు ఏం చేస్తున్నాయి? డ్రగ్స్ వ్యవహారంలో సీఎం రేవంత్‌కు ముడుపులు ముట్టినందునే తెలంగాణ పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించారా?..'అని కేటీఆర్ ప్రశ్నించారు. మాజీ మంత్రులు జి.జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సమావేశంలో పాల్గొన్నారు.

మీ వేధింపులు మాపై చేయండి.. రైతాంగంపై కాదు

మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: రాజకీయాలు, కక్షసాధింపులు, వేధింపులు చేయాలనుకుంటే తెలంగాణ ప్రజాప్రతినిధులమైన తమపై చేయాలని, తెలంగాణ రైతాంగంపై కాదని బీసీ సంక్షేమం, రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బీజేపీకి ఓట్లేయలేదని తెలంగాణ రైతాంగం రోడ్లపై నిలబడే పరిస్థితి తీసుకురావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ నేతలు కత్తి వెంకటస్వామి, పున్నా కైలాశ్ నేత, సామా రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో నాలుగు నెలలుగా ఉత్పత్తిని కావాలని నిలిపివేశారన్నారు. తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత రావాలనే కుట్రతో బీఆర్‌ఎస్, బీజేపీలు కలిసి పనిచేస్తున్నాయని పొన్నం ఆరోపించారు.





రూ.14.56 లక్షల కోట్లు

రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణాంకాలను వెల్లడించిన ఆర్‌బీఐ

2024–25 ఆర్థిక సంవత్సరంలో పెరిగిన తెలంగాణ ఆర్థిక పరపతి

2023–24తో పోలిస్తే రూ.1.3 లక్షల కోట్లు పెరిగిన జీఎస్‌డీపీ

రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మూడు రెట్లు పెరిగిన ఎస్‌ఎస్‌డీపీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి ఏటేటా గణనీయంగా పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. నాలుగేళ్ల క్రితం రూ.10 లక్షల కోట్లకు పైగా స్థూల ఉత్పత్తి నమోదు కాగా, తాజాగా 2024–25 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.14.56 లక్షల కోట్లకు చేరింది. అంటే గత నాలుగేళ్లలోనే దాదాపు 50% పెరిగిందన్నమాట. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవల వెలువరించిన హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్ ఆన్ ఇండియన్ ఎకానమీ లో ఈ గణాంకాలను పొందుపరిచింది. ఈ కరదీపిక ప్రకారం 2023–24లో తెలంగాణ స్థూల ఉత్పత్తి రూ.13,22,808 కోట్లు కాగా, ఏడాది కాలంలో 1.3 లక్షల కోట్లు పెరిగి రూ.14,56,837 కోట్లుగా నమోదైంది.

తలసరి ఉత్పత్తి రూ.3 లక్షల పైమాటే: ఆర్‌బీఐ వెల్లడించిన గణాంకాల ప్రకారం తెలంగాణ తలసరి స్థూల ఉత్పత్తి రూ.3.79 లక్షలకు చేరింది. 2024–25లో రూ.3,79,751గా తలసరి స్థూల ఉత్పత్తి నమోదైందని, ఇది 2023–24తో పోలిస్తే రూ.33 వేలు పెరిగిందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. తెలంగాణ ఏర్పాటైన ఏడాది 2014–15లో తలసరి స్థూల ఉత్పత్తి రూ.1,24,104 కాగా, ఇప్పుడు మూడు రెట్ల కంటే ఎక్కువ పెరిగింది. పదేళ్ల కాలంలో 2.55 లక్షలు పెరిగింది. ఇక, రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణాంకాలు కూడా ఇదే నిష్పత్తిలో పెరిగాయి. రాష్ట్రం ఏర్పాటైన ఏడాది తెలంగాణ స్థూల ఉత్పత్తి రూ.4,56,280 కోట్లు కాగా, పదేళ్ల తర్వాత ఏకంగా రూ.10 లక్షల కోట్లు పెరిగింది.

➤ ఆర్‌బీఐ వెల్లడించిన ఈ నివేదిక ప్రకారం దక్షిణాది రాష్ట్రాలు స్థూల ఉత్పత్తి నమోదులో పురోగతిని కనబరుస్తున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ (రూ.14,22,998 కోట్లు), కర్ణాటక (రూ. 26,03,948 కోట్లు), తమిళనాడు (రూ. 27,64,755 కోట్లు)లు కూడా దేశంలో అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల సరసన నిలిచాయి.

➤ తెలంగాణ విషయానికి వస్తే వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతోపాటు సేవల రంగం విస్తృతి కారణంగా భారీ స్థాయిలో జీఎస్‌డీపీ నమోదైందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

తెలంగాణ ఏర్పాటైన ఏడాది నుంచి స్థూల ఉత్పత్తి పెరిగిందిలా

సంవత్సరం	రాష్ట్ర స్థూల ఉత్పత్తి (కోట్లలో)	తలసరి స్థూల ఉత్పత్తి (రూ.లల్లో)
2014-15	4,56,280	1,24,104
2015-16	5,22,994	1,40,840
2016-17	5,97,812	1,59,395
2017-18	6,79,427	1,79,358
2018-19	7,78,391	2,09,848
2019-20	8,48,736	2,31,326
2020-21	8,63,908	2,25,734
2021-22	10,17,251	2,69,000
2022-23	11,93,419	3,14,066
2023-24	13,22,808	3,46,457
2024-25	14,56,837	3,79,751





సమయం పట్ల గౌరవం, సమయ స్పృహ లేని వ్యక్తి... ఏమీ సాధించలేరు. జీవితం మనిషి హక్కు. కాలక్షేపంతో దానిని వృథా చేయటం అంటే ఆ హక్కును కాలదన్నుకోవటమే!

– వర్గీస్ కురియన్, క్షీర విప్లవ పితామహుడు

సాక్షి

మంగళవారం, 9 సెప్టెంబర్ 2025

థాయ్‌లాండ్‌కు కొత్త ఏలిక

పేరుకు ప్రజాస్వామ్యమైనా రాచరిక వ్యవస్థ, దాని విధేయ సైన్యం, రాజ్యాంగ న్యాయస్థానం థాయ్‌లాండ్ రాజకీయాలను తెర వెనకుండి శాసించటం విడనాడలేదు. పర్యవసానంగా రెండేళ్ల వ్యవధిలో మూడో ప్రధాని రంగప్రవేశం చేశారు. ఇటీవల న్యాయస్థానం ఆదేశంతో పదవి నుంచి వైదొలగిన పేటోన్‌టాన్ షినవత్రా స్థానంలో బీజేటీ పార్టీ అధినేత అనుతిన్ చార్న్‌విరకుల్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆ మధ్య థాయ్‌లాండ్–కంబోడియాల సైన్యాల మధ్య నాలుగు రోజులపాటు కొనసాగిన ఘర్షణలు థాయ్‌లాండ్‌లో రాజకీయ దుమారం రేపాయి. ఆ ఘర్షణల్లో ఇరువైపులా 30 మంది మరణించారు. సరిహద్దులపై తలెత్తిన ఈ యుద్ధాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒత్తిళ్లకు లొంగి ఇరు దేశాలూ విరమించాయి. ఆ వెంటనే థాయ్ జాతీయవాదులు ఆగ్రహోదగ్రులయ్యారు. షినవత్రా తప్పుకోవాలంటూ ఉద్యమం నడిచింది. ఈలోగానే కంబోడియా మాజీ అధినేత హున్‌సేన్‌తో ఆమె ఫోన్ సంభాషణ లీక్ కావటంతో అంతా తలకిందులైంది. ఈ సంభాషణలో తమ దేశ సైనిక జనరల్‌ను ఆమె తప్పుబట్టడం, వివాదం పరిష్కారానికి చొరవ తీసుకోవాలని హున్‌సేన్‌ను కోరటం నేరంగా పరిగణించి ఆమె వైదొలగాలంటూ కోర్టు ఆదేశించింది.

ప్రధానిగా ఉంటూ, ప్రత్యర్థి దేశానికి చెందిన నాయకుడితో సంభాషించటం, సైనిక జనరల్‌ను కించపరచటం తప్పే అయినా న్యాయస్థానానికి ఏమంత గొప్ప చరిత్ర లేదు. రాచరిక వ్యవస్థకు అనుకూలమైన తీర్పులిస్తూ ఎన్నికైన ప్రభుత్వాలను ఏదో సాకుతో తొలగించి అస్థిరపర్చటం దానికి అలవాటు. అంతేకాదు... రాచరిక అనుకూల నేతలు హత్యలు చేసినా, అవినీతికి పాల్పడినా నిర్దోషులుగా తీర్పునివ్వటం రివాజు. 1932లోనే రాచరిక వ్యవస్థ అంతరించినా అదంతా నామమాత్రం. వ్యవస్థలన్నీ దాని చెప్పుచేతల్లోనే ఉంటాయి. సైనిక కుట్రల ద్వారా లేదా న్యాయస్థానం ద్వారా ప్రభుత్వాలను కూలదోయటం పరిపాటైంది. ఎన్నికైన ఏ ప్రభుత్వమూ పూర్తికాలం అధికారంలో లేదు. ఇందుకు షినవత్రా తండ్రి తక్సిన్ షినవత్రా ఒక్కరే మినహాయింపు. 2001లో అధికారంలోకొచ్చిన తక్సిన్‌ను పదవీకాలం చివర 2006లో సైనిక కుట్ర ద్వారా తొలగించారు. గత ఇరవయ్యేళ్లలో షినవత్రా కుటుంబం రెండు సైనిక కుట్రలనూ, మూడు కోర్టు తీర్పులనూ చవిచూసి మూడు ప్రభుత్వాలను కోల్పోయింది. ఈ రెండు దశాబ్దాల కాలంలో అయిదుగురు ప్రధానులు మారారు. తక్సిన్ ఆధ్వర్యంలోని థాయ్ రక్ థాయ్ పార్టీని 2007లో అయిదేళ్లపాటు నిషేధించారు . అటుతర్వాత ఫ్యు థాయ్ పేరిట మరో పార్టీ స్థాపించారు. ఆయన కుమార్తె పేటోన్‌టాన్ పది నెలలపాటు కూటమి ప్రభుత్వాన్ని నడిపారు.

పార్టీలనూ, అధినేతలనూ నిషేధించటం షినవత్రాతో ఆగిపోలేదు. 2020లో ఫ్యూచర్ ఫార్వర్డ్ పార్టీని, 2023లో మూవ్ ఫార్వర్డ్ పార్టీని ఇదేవిధంగా నిషేధించి ఆ పార్టీ నాయకులు ఎన్నికల్లో పోటీ చేయరాదంటూ ఆంక్షలు విధించారు. ఒకరిద్దరు సీనియర్ నేతలపై దశాబ్దంపాటు ఏ పదవీ చేపట్టరాదని తీర్పులిచ్చారు. నిరుపేదల సంక్షేమాన్ని పట్టించుకుని, వారి జీవితాలను మెరుగుపర్చటానికి ప్రయత్నిస్తే రాచరిక వ్యవస్థకు కడుపుమంట. తక్సిన్ షినవత్రానైనా, ఇతర అధినేతలనైనా కేవలం ఆ కారణంతోనే ముప్పుతిప్పలు పెట్టారు. 2006లో పదవి నుంచి తప్పించాక తక్సిన్ ప్రవాసానికి వెళ్లి పదిహేడేళ్ల తర్వాత 2023లో స్వదేశానికొచ్చారు. అటుపై అవినీతి, ఇతర నేరాల్లో ఆయన్ను అరెస్టు చేయగా అనారోగ్య కారణం చూపి ఆసుపత్రిలో ఉన్నారు. ఆయన జైలుశిక్ష సక్రమంగా అనుభవించారా లేదా అన్న అంశంపై ఇప్పుడు తీర్పు రాబోతోంది.

సైనిక జనరళ్ల నియామకాల్లో ప్రభుత్వ ప్రమేయాన్ని పెంచే ప్రతిపాదనను పేటోన్ టాన్ ప్రభుత్వం పరిశీలించింది. సైన్యం ఒత్తిళ్లతో దాన్ని విరమించుకున్నా ఆమెపై పగబట్టారు. అందుకే ఫోన్లపై నిఘాపెట్టి సాగనంపారు. దేశంలో అస్థిరత అలుముకోవటంతో విదేశీ మదుపుదార్లు 2,300 కోట్ల డాలర్ల మేర వెనక్కు తీసుకున్నారు. అసలే అంతంతమాత్రంగా ఉన్న థాయ్ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి మరింత దిగజారింది. ఇలాంటి స్థితిలో కొత్త ప్రధాని అనుతిన్ దేశాన్ని గట్టెక్కించగలరా... అసలు సైన్యం సక్రమంగా పాలించనిస్తుందా అన్నది వేచిచూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.విదియ రా.8.37 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** ఉత్తరాభద్ర రా.9.09 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ఉ.7.25 నుండి 8.57 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.46 నుండి 11.33 వరకు, **అమృత ఘడియలు:** సా.4.30 నుండి 6.01 వరకు.

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

వరం



అవును, వరద బాధితులకు నేను రూ. 5 కోట్ల సామగ్రి అందిస్తున్నాను. అది డొనేషన్ కాదు. నాకు చేతనైనది చేయటానికి దేవుడు నాకు ఇచ్చిన వరం. ఎవరికైనా డొనేషన్ ఇవ్వటానికి నేనెవరిని? డొనేషన్ అనే మాట నాకు ఇష్టం ఉండదు.

– అక్షయ్ కుమార్, బాలీవుడ్ నటుడు

దయ



ఇతరులు ఆశించే దానికి విరుద్ధంగా వెళ్లడం అంటే మీరు మీలా ఉండటానికి ధైర్యం కలిగి ఉండటం! ఇక, సరిగా ఉండటమా లేక దయగా ఉండటమా అనే సంశయ సందర్భం వచ్చినప్పుడు మీరు దయగా ఉండటాన్నే ఎంచుకోండి.

– జూలియా రాబర్ట్స్, నటి

బిజీ



వెనక్కి తిరిగి చూసుకోవడం నాకు ఇష్టం ఉండదు. వెంటనే, జరగవలసిన పనిలో పడిపోతాను. ఒలికిపోయిన పాలను చూస్తూ కూర్చుని ఏడ్చేరకం కాదు నేను. ఆ దగ్గర్లో ఆవు ఉన్న వాళ్లను వెతికే పనిలో చాలా బిజీ అయిపోతాను.

– గోర్డాన్ రామ్సే, ప్రసిద్ధ బ్రిటిష్ చెఫ్

అన్నీ తెలిస్తేనే...



ఒక దర్శకుడికి అన్నీ తెలియాలి. అతడు వ్యభిచార గృహంలో ఉండాలి– అది సులువు! కానీ అతడు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కూడా గడపాలి– ఇది కొంచెం కష్టం. అతడికి డ్యూక్ ఆఫ్ ఎడింబరో ఎలా ప్రవర్తిస్తాడో తెలియాలి; ఒక కార్మికుడు, గ్యాంగ్‌స్టర్ ఎలా ప్రవర్తిస్తాడో కూడా తెలియాలి.

– ఫ్రిట్జ్ లాంగ్, సినిమా దర్శకుడు

చిన్న పోరాటాలు



మనలో చాలామందికి ఈ ప్రపంచం కఠిన ప్రదేశం. కొద్దిమంది మనుషులు మరింత శక్తిమంతులు అవుతుండటం సహించలేనిది. ఏ రంగంలోనైనా ఏకస్వామ్యాలు, ధనస్వామ్యాలు మహాచెడ్డవి. అందుకే చిన్నవి, స్వతంత్రమైన వాటి కోసం పోరాడటం చాలా ముఖ్యం. అందులోకి చిన్న ప్రచురణకర్తలు, పుస్తకాల దుకాణాలు, బ్రాండ్ లేని దుస్తులు, ఆహారం లాంటివన్నీ వస్తాయి.

– అన్నే జైదీ, రచయిత్రి

మూర్ఖత్వం



ఇండియన్ – అమెరికన్స్ పట్ల ఇంత జాతి వివక్షను నేను ఎప్పుడూ చూడలేదు. ఇది మామూలుగానే చెడ్డది. పైగా రిపబ్లికన్ పార్టీకి సైతం రాజకీయంగానూ మూర్ఖమైనది.

– మ్యాక్స్ అబ్రహామ్స్, ప్రొఫెసర్

గెలుపు బాటలో ఓటమి పాఠం

విశ్వ గురు

అమెరికన్ మిడిల్ – డిస్టెన్స్ రన్నర్ ఎమ్మా జేన్ కోబర్న్ 3,000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో ప్రపంచ ఛాంపియన్. ఒలింపిక్ కాంస్య పతక విజేత. 10 పర్యాయాలు అమెరికా జాతీయ ఛాంపియన్. ఈ ఏడాది మే 8న కొలరాడో విశ్వవిద్యాలయ 2025 బ్యాచ్ పట్టభద్రులను ఉద్దేశించి కోబర్న్ చేసిన ప్రసంగ సంక్షిప్త పాఠం:



శుభోదయం. 2025 బ్యాచ్ వాళ్ళకు అభినందనలు. నేటితో ఒక అధ్యాయం ముగిసినట్లు కాదు. ఒక పరుగు పందెం పరిసమాప్తమైంది. మరోటి మొదలవుతోంది. అంతే! మీరు విజయ రేఖ దాటేశారు. మిగిలినవాటిని ఎదు ర్కొనేందుకు మరో రేఖ ముందు ఉన్నారు.

ఈ విశ్వవిద్యాలయమే నన్ను తీర్చిదిద్దింది. క్యాంపస్‌లో చేతులు కలిపిన అమ్మ, నాన్నలకి నేను ఇక్కడే బౌల్డర్‌లో పుట్టాను. అథ్లెట్‌గా, మనిషిగా వృద్ధిలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తూ తరచుగా ఆలోచించే సంగతులను మీతో పంచుకుంటాను.

'వెలితి'పై బెంగ వద్దు!

నేను దాన్ని 'వెలితి'గా పిలుస్తా. మీరు ఇపుడు ఉన్న స్థానానికీ, మీరు చేరుకోవాలనుకుంటున్న స్థానానికీ మధ్యనున్న ఖాళీ. ఏ స్థితిలో ఉన్నారో, ఏ స్థితికి చేరుకోవాలనుకుంటున్నారో దానిమధ్యనున్న వ్యత్యాసం. అది ఒక లోపం కాదు. వెనుకబడ్డారనడానికి సంకేతమూ కాదు. అది మీకంటూ జీవితం పట్ల ఒక దార్శనికత ఉందనడానికి రుజువు. మరింత ఉన్నత స్థితికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నారు కనుకనే ఆ వెలితి ఏర్పడింది. ఆ వెలితిని భరించడం ఒక్కోసారి ఇబ్బందికరంగా, బాధగా కూడా అనిపించవచ్చు. కానీ, సత్యాన్ని గ్రహించండి. ఒత్తిడి, అసౌకర్యం, అపరిచితం ఉన్నచోటనే వృద్ధి సాధ్యమవుతుంది.

మీరు గమనించలేదేమో కానీ, ఒక 'వెలితి'ని మీరు ఇప్పటికే భర్తీ చేసేశారు. చూస్తూ చూస్తూ ఉండగానే పట్టభద్రులై పోయారు.

ఒక్కసారి కాలేజీలో అడుగు పెట్టిన మొదటి రోజును గుర్తు తెచ్చుకోండి. ఆత్మవిశ్వాసం, ఆనందాతిరేకాలతోనే క్యాంపస్‌లో కాలిడి ఉండవచ్చు. ఆడిటోరియం కోసం వెతుకుతూ దారి తప్పి ఉండవచ్చు. బెంగతో అమ్మకు రెండు మూడుసార్లు ఫోన్ చేసి ఉండవచ్చు. బుర్ర నిండా ప్రశ్నలే! స్నేహితుల్ని పోగేసుకోవడం ఎలాగో నంటూ ఆలోచన. ఉదయం 8 గంటలకే మొదలయ్యే పాఠాలు వినడంపై తర్జన భర్జన. పరీక్షల్లో జవాబులు రాయడం, ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవడం తెలియదు. వంటగదిలో పనులు చక్కబెట్టడం ఇప్పటికీ మీలో కొందరికి తెలియకపోవచ్చు.

"మీరు ఇపుడు ఉన్న స్థానానికీ, మీరు చేరుకోవాలనుకుంటున్న స్థానానికీ మధ్యనున్న ఖాళీయే వెలితి. అది ఒక లోపం కాదు. వెనుకబడ్డారనడానికి సంకేతమూ కాదు. అది మీకంటూ జీవితం పట్ల ఒక దార్శనికత ఉందనడానికి రుజువు. మరింత ఉన్నత స్థితికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నారు కనుకనే ఆ వెలితి ఏర్పడింది! సత్యాన్ని గ్రహించండి. వెలితి ఉన్నచోటనే వృద్ధి సాధ్యం!!"

కానీ, గత కొద్ది ఏళ్ళుగా కొద్ది కొద్దిగా కొత్త నైపుణ్యాలను, కొత్త అలవాట్లను సంతరించుకుంటూ వచ్చారు. మీకు మీరే కొత్త వ్యక్తిగా రూపాంతరం చెందారు. సమయాన్ని వెచ్చించడంపై ఒక అవగాహనకు వచ్చారు లేదా మీకు మీరు నచ్చజెప్పుకునే విధంగా కాలాన్ని వెచ్చిస్తున్నారు. అవసరమైతే ఇతరుల సహాయాన్ని ఎలా పొందాలో నేర్చుకున్నారు. వెలితిని భర్తీ చేసుకోవాల్సిన విధానం ఇదే అనుకుంటా! ఒక్క రాత్రిలో కాదు. ఒక్కసారిగా కాదు. కానీ, స్థిరంగా అడుగులు పడాలి. క్యాంపస్ లోకి మొదటి రోజు బెరుకుగా అడుగులేస్తూ వచ్చిన వ్యక్తి... నేడు నిబ్బరంగా కూర్చున్న వ్యక్తి ఒక్కరే! కానీ, మార్పు యథాలాపంగా రాలేదు. సంతరించుకుంటే వచ్చింది. అది మీరిక్కడ నిశ్శబ్దంగా, ఆర్భాటాలు లేకుండా, శ్రద్ధ పెట్టి చదువుకోవడం వల్ల వచ్చిన మార్పు!

రెండు నియమాలు

కానీ, ఇక్కడ నుంచి బయట ప్రపంచంలోకి అడుగుపెట్టిన తర్వాత పరిస్థితి ఏమిటి? కాలేజీలోలాగా గురువులు లేకపోయినా స్వయంగా నిలబడగలగాలి. మీ తప్పటడుగులను మీరే సరిదిద్దుకోవాలి. 'వెలితి'ని భర్తీ చేసుకోవడంలో రెండు నియమాలు నాకు సహాయపడ్డాయి. అవి మీకూ తప్పకుండా ఉపకరిస్తాయి.

1. ప్రజ్ఞ అవసరం లేనివాటిని మొదట సాధించండి!

త్వరగా నిద్ర లేవడానికి, సమయ పాలనకు, దయతో మెలగేందుకు, ప్రతిస్పందనలను ఆలకించేందుకు, స్థిర బుద్ధితో వ్యవహరించడానికి ప్రజ్ఞా పాటవాలు అవసరం లేదు. అవి ఎవరో కానుకగా ఇచ్చేవి కావు. మనం అలవరచుకుంటే వచ్చేవి.

నేను అత్యంత అదృష్టవంతురాలినో లేదా శక్తి సామర్థ్యాలు ఉన్నదాన్నో కావడం వల్ల పరుగు పందాల్లో గెలవలేదు. చిన్న అడుగులే అయినా స్థిరంగా వేస్తూ వచ్చాను. పరుగెత్తాల్సిన దూరాన్ని తగ్గించుకోలేదు. ఆకర్షణగా లేనివాటిని వదిలేయలేదు. ఎదుటివారు చెప్పింది విన్నాను. శ్రమకోర్చి తర్ఫీదు పొందాను. క్రమశిక్షణను పెంపొందించుకున్నాను. కేవలం శక్తితోనే కాకుండా, ఆ రకమైన క్రమశిక్షణ వల్లనే 2016లో ఒలింపిక్ పతకాన్ని, 2017లో ప్రపంచ ఛాంపియన్‌షిప్ స్వర్ణాన్ని గెలుచుకున్నాను.

2. చెయ్యగలిగింది చేయండి– మీ చేతిలో లేనివాటిని వదిలేయండి.

క్రీడల్లో ఎవరన్నా నన్ను వంచిస్తే, లేదా నాకన్నా మెరుగైన సామర్థ్యాన్ని కనబరిస్తే, లేదా పోటీ రోజు వర్షం పడితే నేను చేయగలిగింది ఏమీ లేదు. కానీ, నా స్పందనను నియంత్రించుకోగలను. జీవితంలో మార్పునకు లోనయ్యే అంశాలే ఎక్కువగా ఉంటాయి. కానీ, వాటిని తట్టుకోవడంలో సన్నద్ధత మన చేతిలో ఉంటుంది. మన నియంత్రణలో ఉన్నవాటిపై దృష్టి కేంద్రీకరిస్తే, మనం బలంగా తయారవుతాం. మన చేతిలో లేనివాటినే తలచుకుంటూ కూర్చుంటే, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు అయిపోతాం.

కొన్నింటిలో విఫలం కావచ్చు. విజేతగా నిలుస్తామనుకున్న చోట ఓడిపోనూ వచ్చు. దానికి డీలా పడనక్కర లేదు. టోక్యో ఒలింపిక్స్‌లో నేను విఫలమయ్యా. పరుగుపందెంలో ఆఖరి అంచెలో పడిపోయా. అనర్హురాలినయ్యా. దేని కోసం నేను ఏళ్ళ తరబడి శిక్షణ పొందానో, ఏవి నా ఒలింపిక్స్ అని చాటాలనుకున్నానో అందులో విఫలమయ్యా. బహిరంగ వైఫల్యం. నిరాశ చెందా. కానీ, శ్రమించి పెంచుకున్న సామర్థ్యం వల్ల, ఓటమిని దిగమింగుకున్నా. తదుపరి వేసవిలో నా పదవ అమెరికా జాతీయ ఛాంపియన్‌షిప్ సాధించా. ఒకే పోటీలో పదిసార్లు విజేతగా నిలిచిన రన్నర్ నేను ఒక్కదాన్నే!

ఉద్యోగంలో, ప్రేమలో, జీవితంలో ఎవరైనా విఫలం కావచ్చు. కనుక, తిరిగి పోరాడగల సామర్థ్యాన్ని ఇప్పటి నుంచే పెంచుకోండి. **వైఫల్యం లేకపోవడం విజయం కాదు. ఓటమి నుంచి ముందుకు సాగగల సత్తాయే విజయం.**

మీ జీవితానికి మీరే జవాబుదారీ. ఉన్న స్థితికీ, చేరుకోవాలనుకుంటున్న స్థితికీ మధ్య వెలితిని భర్తీ చేయాల్సింది మీరే! భయం ముప్పిరిగొన్నా, సందేహం వెనక్కి లాగుతున్నా ధైర్యంగా, క్రమశిక్షణతో చిన్న అడుగులైనా ముందుకు వేస్తూనే ఉండండి.

కరెంట్ ఇంటెలిజెన్స్

భారత్‌లో అమెరికా కొత్త రాయబారి ఎవరు?



1



4 8 10

1. ఇటీవల భారత వైమానిక దళం నుంచి వైదొలగిన మిగ్ (ఎంఐజి) 21 యుద్ధ విమానాలను ఏ దేశం అభివృద్ధి చేసింది?
2. ఫుట్‌బాల్‌లో ప్రతిష్ఠాత్మకమైన డ్యూరాండ్ కప్ 2025ను ఏ టీమ్ గెలుపొందింది?
3. భారత హరిత విప్లవ పిత ఎం.ఎస్. స్వామినాథన్ జీవిత కథ (బయోగ్రఫీ) 'ఎం.ఎస్. స్వామినాథన్: హూ ఫెడ్ ఇండియా' గ్రంథ రచయిత ఎవరు?
4. ఐరోపా దేశం లిథువేనియా కొత్త ప్రధాన మంత్రిగా ఎవరి నియామకానికి ఇటీవల ఆ దేశ పార్లమెంటు ఆమోదం తెలిపింది?
5. 'సూపర్ గరుడ షీల్డ్ 2025' వార్షిక సైనిక విన్యాసాలను ఏయే దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి?
6. వీధి కుక్కల (శునకాల)పై ఇటీవల చర్చ జరుగుతోంది. అయితే 'ఇంటర్నేషనల్ డాగ్ డే'ను ఎప్పుడు నిర్వహిస్తున్నారు?
7. 2025 కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్‌ను సాధించి నేరుగా 'గ్లాస్గో 2026' కామన్ వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించిన భారతీయ క్రీడాకారిణి?
8. భారత్‌లో అమెరికా కొత్త రాయబారి (యూఎస్ అంబాసిడర్)గా ఎవరిని డోనాల్డ్ ట్రంప్ నియమించారు?
9. ఇటీవల భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లా అడుగుపెట్టిన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐ.ఎస్.ఎస్.) ఏర్పాటులో ఏ ఐదు దేశాల భాగస్వామ్యం ఉంది?
10. 'బ్రిక్స్' దేశాల కూటమి ఏర్పాటు చేసిన 'ద న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఎన్.డి.బి.)కి ఇటీవల వైస్‌ప్రెసిడెంట్‌గా, చీఫ్ రిస్క్ ఆఫీసర్‌గా నియమితుడైన భారతీయుడు?
11. భారతదేశం నేతృత్వంలో 2023లో ప్రారంభించిన 'ది ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్'లో ఇటీవల (ఆగస్టు 2025) అధికారికంగా చేరిన దేశం?
12. హైస్కూల్ విద్యార్థుల కోసం నిర్వహించే 'అంతర్జాతీయ ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్' 2025లో రెండో స్థానంలో నిలిచిన భారత్‌కు ఎన్ని పతకాలు లభించాయి?
13. భారత్ తన మొదటి 'స్పేస్ డే'ను ఎప్పుడు జరుపుకొంది?
14. చంద్రయాన్-3 మిషన్ విజయవంతమై చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండ్ అయిన రోజు?
15. అంతరిక్షంలో వాతావరణాన్ని కచ్చితంగా అంచనా వేసేందుకు, అవగాహన చేసుకునేందుకు ఐబీఎం కంపెనీతో కృత్రిమ మేధ నమూనా 'సూర్య ఏఐ'ని ఇటీవల అభివృద్ధి చేసిన సంస్థ ఏది?

జవాబులు :

1. సోవియట్ యూనియన్ (రష్యా)
2. నార్త్‌ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ
3. ప్రియంబదా జయకుమార్
4. ఇంగా రుగినియన్ (సోషల్ డెమోక్రాట్)
5. ఇండోనేషియా, అమెరికా
6. ఆగస్టు 26
7. మీరాబాయి చాను
8. సెర్గియో గోర్
9. అమెరికా, జపాన్, కెనడా, ఈయూ, రష్యా
10. రాజీవ్ రంజన్ (ఈయన భారత మానిటరీ పాలసీ కమిటీ (ఎం.పి.సి.) మాజీ సభ్యుడు.
11. నేపాల్
12. నాలుగు స్వర్ణాలు, ఒక రజతం.
13. 2024 ఆగస్టు 23
14. 2023 ఆగస్టు 23
15. నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్)

కూర్పు: 'భవిత' డెస్క్

ఉద్యమాల ప్రతిధ్వని

ఇన్ బాక్స్

కాళోజీ తెలంగాణ ప్రజల ఉద్యమాల ప్రతిధ్వనిగా పేరుగాంచారు. నిజాం దమననీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా ఆయన తన కలం పట్టారు. 1992లో భారతదేశ రెండవ అత్యున్నత పౌర పురస్కారం 'పద్మవిభూషణ్' పొందారు. ఆయన పుట్టినరోజు సెప్టెంబరు 9ని తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ భాషా దినోత్సవం'గా ప్రకటించి గౌరవించింది.

కాళోజీ 1914లో ఇప్పటి కర్ణాటకలోని బీజాపూర్ జిల్లా రట్టిహళ్లి గ్రామంలో జన్మించారు. తల్లి రమాబాయమ్మ, కన్నడిగుల ఆడపడుచు. తండ్రి కాళోజీ రంగారావు మహారాష్ట్రీయుడు. బీజాపూర్ నుంచి వరంగల్ జిల్లాకు తరలివచ్చిన ఆయన కుటుంబం 'మడికొండ'లో స్థిర పడింది. కాళోజీకి తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషలు తెలుసు. రాజకీయ వ్యంగ్య కవిత్వం రాయడంలో దిట్ట. 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించిన 'ప్రజాకవి' ఆయన.




కాళోజీ నారాయణరావు

న్యాయశాస్త్రం అభ్యసించిన కాళోజీ 1930 నుంచే గ్రంథాలయోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 25 ఏళ్ల వయసులో జైలుశిక్ష అనుభవించారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పి.వి. నరసింహారావు వంటి వారితో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. తెలంగాణలో అక్షరజ్యోతిని వ్యాపింపజేయాలన్న తపనతో 'ఆంధ్ర సారస్వత పరిషత్తు'ను స్థాపించిన ప్రముఖుల్లో ఆయన ఒకరు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించినందుకు ఆయనకు నగర బహిష్కరణ శిక్ష విధించారు. 1953లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1958లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసన పరిషత్తుకు ఎన్నికయ్యారు. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు'అంటూ 'సామాన్యుడే నా దేవుడు' అని ప్రకటించారు కాళోజీ. 'తొలగి తోవనిచ్చు వాడు ఎవ్వడు... తోసుకుపోవాలి గానీ' అంటూ తెలంగాణ సమాజాన్ని తన రచనల ద్వారా మేల్కొల్పిన గొప్ప కవి. 'పుటక నీది, చావు నీది, బతుకంతా సమాజానిది' అంటూ సమాజం పట్ల బాధ్యతను గుర్తు చేసిన కాళోజీ 2002 నవంబరు 13న తుదిశ్వాస విడిచారు. ఆయన స్ఫూర్తి మనకు దీప్తి!

– సంపత్ గద్దం । కామారెడ్డి జిల్లా
(నేడు కాళోజీ నారాయణరావు జయంతి)

డేటా పాయింట్



పరమ ధర్మం

జ్యోతిర్మయం

చైతన్య రూపి అయిన పరమాత్ముడు అంతటా నిండి ఉన్నాడు. అన్నింటిలోనూ నివసిస్తాడు. పరమాత్మ పువ్వులకు రంగై, సుగంధమై ఉన్నాడు. నీటికి రంగూ, రుచీ లేని తత్వం ఆయనే. నీరు దొరకని ఎడారిలో తీవ్రమైన దాహంతో బాధపడేవాడికి 'కోటిరూపాయలు కావాలా, గుక్కెడు నీళ్లు కావాలా' అంటే నీళ్ళ మాత్రమే కోరతాడు. భగవంతుడిని అదే దాహంతో కొలవాలి. సూర్యుడిలో వెలుగు, చందమామలో చల్లదనం ఆయనే. సముద్రం చెలియలికట్ట దాటకుండా చేస్తున్న శక్తి ఏది? చరాచర ప్రకృతి ఎంత సుందరం! మరి ఆ సృష్టికర్తను ఎంతగా తలంచాలి! కానీ మనిషి ధనం, సమాజంలో గౌరవ మర్యాదల కోసం పాకులాటలో పడి అవి పొందిన తరువాత అవి ఇచ్చిన వాడిని గుర్తుంచుకోక గర్విష్ఠియై ప్రవర్తిస్తాడు.

మనిషిగా పుట్టినవాడు మరణించక తప్పదు. మరి జీవితంలో చెయాల్సిన కార్యమేమిటి? పగలంతా పనులతోనూ, సంపాదనతోనూ గడిచిపోతుంది. రేయంతా నిద్ర, మైథునాలతో గడచిపోతుంది. శరీరం, పుత్ర, కళత్ర తదితరాలు ఆత్మకు చెందిన పరివారం. ఇది వాస్తవంలో లేదు. వాటి ఉచ్చులో పడి అవి కళ్ళముందే రూపు మాసిపోవడం కూడా తెలుసుకోలేకున్నాడు మానవుడు. సర్వాత్మ స్వరూపుడైన భగవానుడొక్కడే మనం వినతగిన, తలవతగిన, తెలుసుకోతగిన విషయం. మానవజన్మ లభించిందే పరతత్వ అన్వేషణ అనే ప్రయోజనం కోసం!

చెట్లుచేమలు జీవిస్తున్నాయి. మనలాగే మన చుట్టూ తిరిగే పశువులు పక్షులు తింటున్నాయి, బతుకుతున్నాయి. మరి మన గొప్ప ఏమిటి? మనిషి అనిపించుకోవాలంటే 'సవై పుంసాం పరోధర్మో – యతో భక్త రథోక్షజే... పరమాత్మ విషయం అయిన భక్తి ఒక్కటే అనుసరించవలసిన పరమధర్మం'.

– డా॥ గాది శ్రీనివాస్

క్లుప్తంగా...

ప్రజావాణిలో పురుగు మందు డబ్బాతో రైతు ఆందోళన

- భూ సమస్య పరిష్కరించాలని నిరసన



రైతు నుంచి పురుగు మందు డబ్బాను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కరీంనగర్ అర్బన్: భూ సమస్య పరిష్కారంలో యంత్రాంగ వైఖరిని నిరసిస్తూ ఓ రైతు పురుగుల మందు డబ్బాతో ఆందోళన వ్యక్తం చేయడం కరీంనగర్‌లో కలకలం రేపింది. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో గంగాధర మండలం సర్వారెడ్డిపల్లికి చెందిన రాజమల్లు పురుగుల మందు డబ్బాతో వచ్చాడు. పోలీసులు గమనించి డబ్బాను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో తనకున్న భూమిలో కొందరు దౌర్జన్యం చేస్తున్నారని, సమస్యను ఎవరికి చెప్పినా పరిష్కరించడం లేదని వాపోయాడు. పదేళ్లుగా తిరుగుతున్నా ఫలితం లేదని కన్నీటి పర్యంతమయ్యాడు.

కలెక్టర్ చాంబర్‌లోకి చొచ్చుకెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు

- వితంతువు, దివ్యాంగులు, వృద్ధుల పింఛన్లు పెంచాలని డిమాండ్



కలెక్టర్ చాంబర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు, పింఛన్‌దారుల ఆందోళన

మంచిర్యాల అగ్రికల్చర్: వితంతువు, దివ్యాంగులు, వృద్ధుల పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు, పింఛన్‌దారులు సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ చాంబర్‌లోకి చొచ్చుకెళ్లారు. కలెక్టరేట్ ఎదుట ఆందోళన అనంతరం ఫ్లెక్సీతో చాంబర్‌లోకి వెళ్లారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ సమయంలో కలెక్టర్ లేకపోవడంతో కలెక్టర్ రావాలంటూ ఆందోళనకు దిగారు. అక్కడే బైఠాయించే ప్రయత్నం చేయగా.. కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్ కలుగజేసుకుని చాంబర్‌లో ఆందోళన చేయొద్దని, బయట చేసుకోవాలని సూచించారు. పింఛన్లు పెంచాలని, పూర్తి కండరాల క్షీణత కలిగిన వారికి రూ.15 వేలు చెల్లించాలని, నూతన పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన అనంతరం ఏవోకు వినతిపత్రం అందజేసి వెనుదిరిగారు.

చాంబర్‌లోకి చొచ్చుకెళ్లిన వారిపై కేసు

చాంబర్‌లోకి చొరబడి, కలెక్టర్ సీసీ బొద్దు రాయలింగు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చెన్నూరి సమ్మయ్య, జిలకర శంకర్, జీడీ సారంగం, లింగంపల్లి శ్రీనివాస్, మంతెన మల్లేశ్, గద్దాల బానయ్యతోపాటు మరికొందరు వినతిపత్రం సమర్పించేందుకు కలెక్టర్ చాంబర్ వద్దకు వెళ్లారన్నారు. కలెక్టర్ లేరని తర్వాత రావాలని సీసీ చెప్పగా అందరూ కలిసి ఆయనతో వాగ్వాదానికి దిగి దౌర్జన్యంగా నెట్టేసి చాంబర్‌లోకి అక్రమంగా ప్రవేశించారని తెలిపారు. రాయలింగు ఫిర్యాదు మేరకు సమ్మయ్య, శంకర్, సారంగం, శ్రీనివాస్, మల్లేశ్, బానయ్యలతోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

సత్వరమే తుమ్మిడిహెట్టికి డీపీఆర్

- వార్ధాకు బదులు తుమ్మిడిహెట్టి బరాజ్‌పై కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంటాం
- పాలన రెండేళ్లు పూర్తయ్యే నాటికి ప్రాజెక్టుల పనుల్లో ఫలితాలు కనిపించాలి
- నీటిపారుదల శాఖపై సమీక్షలో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి సత్వరమే సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును గత ప్రభుత్వం రీఇంజనీరింగ్ పేరుతో కాళేశ్వరం, వార్ధా ప్రాజెక్టులుగా విభజించగా, వార్ధా ప్రాజెక్టును పక్కన పెట్టి తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మించాలనే అంశంపై త్వరలో రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. నీటిపారుదల శాఖపై సోమవారం ఆయన జలసౌధలో ఉన్నతస్థాయిలో సమీక్షించారు.

డిసెంబర్‌లోగా ఫలితాలు కనిపించాలి

నిర్మాణంలోని సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగిరం చేయాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. డిసెంబర్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకునే నాటికి గుర్తించదగిన ఫలితాలను ప్రజలకు అందించాలని స్పష్టం చేశారు.

- సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులతోపాటు టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ (టీఏసీ) క్లియరెన్స్‌కు ఈ నెల 23న కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) నిర్వహించనున్న సమావేశానికి సర్వం సిద్ధం కావాలని సూచించారు. సమ్మక్కసాగర్‌తో ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పడనున్న ముంపుపై ఇప్పటికే అధ్యయన నివేదిక అందిన నేపథ్యంలో ఆ రాష్ట్రం నుంచి సత్వరమే ఎన్‌ఓసీ సాధించాలని సూచించారు.
- సీతమ్మసాగర్, మోడికుంటవాగు ప్రాజెక్టులతోపాటు చనాకా–కొరాటా, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుల డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలకు ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) కింద కేంద్ర నిధులకు దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్‌లను వారం రోజుల్లోగా సీడబ్ల్యూసీ నుంచి పొందాలని ఆదేశించారు.



- ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీ అంశంపై కృష్ణా ట్రిబ్యునల్–2 ఎదుట ఈ నెల 23–25 తేదీల్లో రాష్ట్రం తరఫున వినిపించనున్న తుది వాదనలకు తాను స్వయంగా హాజరవుతానని, సమయం లభిస్తే సీఎం రేవంత్ సైతం హాజరవుతారని తెలిపారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్‌తో మరోసారి సమావేశమై చర్చిస్తామన్నారు.

డిజైన్ల తయారీ బాధ్యత సీడీఓదే...

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ సిఫారసులను కచ్చితంగా అనుసరిస్తూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణకు డిజైన్లను రూపొందించే బాధ్యత శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ)దేనని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. విఫలమైన బరాజ్‌లలోని లోపాలను సరిదిద్ది పునరుద్ధరించేందుకు అవసరమైన డిజైన్లు రూపొందించే నైపుణ్యం తమకు లేదని సీడీఓ చీఫ్ ఇంజనీర్ నిస్సహాయత వ్యక్తం చేయడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. డిజైన్ల తయారీకి ఐఐటీ రూర్కీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలను నియమించుకోవాలని ఆదేశించారు.

10న ఛత్తీస్‌గఢ్‌కు మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 10న ఛత్తీస్‌గఢ్ రాజధాని న్యూ రాయ్‌పూర్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన సీఎం విష్ణుదేవ్ సాయితో సమావేశం అవుతారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకి అనుమతుల విషయంలో ఈ నెల 23న కేంద్ర జలసంఘం కీలక సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ఆలోగా ప్రాజెక్టుకి ఎన్‌వోసీ జారీ చేయాలని ఛత్తీస్‌గఢ్ సీఎంకు ఉత్తమ్ విజ్ఞప్తి చేయనున్నారు.

కొడంగల్ తొలి ప్రాధాన్యం

కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతలను తొలి ప్రాధాన్యంగా తీసుకొని భూసేకరణను పూర్తి చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. పాలమూరు–రంగారెడ్డి, జూరాల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్‌ను అత్యంత ప్రాధాన్యత ప్రాజెక్టులుగా పరిగణించి సత్వరం పూర్తి చేయాలన్నారు. వీటితో పాటు డిండి, ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టుల మిగులు భూసేకరణను సత్వరం పూర్తి చేయాలన్నారు. జూరాల ప్రాజెక్టుపై ప్రత్యామ్నాయ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.

పూడిక తొలగింపుతో ఏటా రూ.500 కోట్లు

మిడ్‌మానేరు, కడెం ప్రాజెక్టుల్లో పూడిక తొలగింపునకు చర్యలు ప్రారంభించడం ద్వారా పూడిక తొలగింపుపై జాతీయ పాలసీని అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి ఉత్తమ్ అన్నారు. జూరాల, సాగర్, శ్రీరాంసాగర్, హుస్సేన్‌సాగర్, ఇతర ప్రాజెక్టుల్లో సైతం పూడిక తొలగింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పూడిక తొలగింపుతో ప్రభుత్వానికి ఏటా రూ.500 కోట్ల అదనపు ఆదాయం రానుందని, అన్ని జలాశయాల్లో చేపడితే రూ.3,000–4,000 కోట్లకు ఆదాయం పెరుగుతుందన్నారు.

- ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకాల పునరుద్ధరణలో భాగంగా హెలికాప్టర్లతో నిర్వహించతలపెట్టిన ఏరియల్ మాగ్నటిక్ సర్వేకు డీజీసీఏ నుంచి సత్వరంగా అనుమతులు తీసుకొని సర్వేను చేపట్టాలని మంత్రి ఆదేశించారు.
- మూడు దశాబ్దాల తర్వాత శాఖలోని ఇంజనీర్లకు ఇటీవల పదోన్నతులు కల్పించిన నేపథ్యంలో ఈ నెల 14న సాయంత్రం 5 గంటలకు జలసౌధలో నిర్వహించనున్న కృతజ్ఞత సభకు ఏర్పాట్లు చేయాలన్నారు.

రంగంలోకి కేంద్ర దర్యాప్తు సంస్థలు

▶ మొదటి పేజీ తరువాయి

డబ్బు లావాదేవీలు జరిగే అవకాశముంది. ఇందులో కొంత హవాలా రూపంలో కూడా నగదు మార్పిడి జరిగే అవకాశం ఉన్నందున మనీలాండరింగ్ కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సైతం ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది.

నిందితులను కస్టడీకి తీసుకుంటేనే....

డ్రగ్స్ తయారీ, చేరవేతలో శ్రీనివాస్‌విజయ్ వోలేటి, తానాజీ పండరీనాథ్ పట్వారీ ఎంతో పక్కాగా వ్యవహరించేవారిని పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ కోసం ముంబై నుంచి తరచూ ఫజల్, ముస్తాఫా చర్లపల్లికి వచ్చేవారని తెలిసింది. ఇందుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలను మహారాష్ట్ర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే పట్టుబడిన 13 మంది నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఈనెల 15 వరకు జ్యుడీషియల్ రిమాండ్ ఉంది. కేసు దర్యాప్తులో భాగంగా మహారాష్ట్ర పోలీసులు నిందితులను కస్టడీకి తీసుకోనున్నారు. వారిని విచారిస్తే మరికొన్ని కొత్తకోణాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

ముంబైలో తెలంగాణ 'ఈగల్' ఆపరేషన్!

ముంబైలో తెలంగాణ ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) పోలీసులు ఇటీవల సెర్చ్ ఆపరేషన్ చేపట్టినట్టు తెలిసింది. రాష్ట్రంలో ఇటీవల పట్టుబడిన నైజీరియన్ డ్రగ్స్ సప్లయర్ల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా డ్రగ్స్ అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బును ముంబై మీదుగా నైజీరియా సహా విదేశాలకు తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే డబ్బు తరలిస్తున్న 24 మందిని అరెస్ట్ చేసినట్టు తెలిసింది. ఇందులో పూణే సహా నైజీరియన్లు ఎక్కువగా నివాసం ఉండే ప్రాంతాల్లో సోదాలు చేసినట్టు సమాచారం. అయితే ముంబైలో చేపట్టిన సెర్చ్ ఆపరేషన్‌ను ఈగల్ అధికారులు ధ్రువీకరించలేదు.

'వాగ్దేవి'తో మాకు సంబంధం లేదు..

- అది ఫార్మా కంపెనీ కాదు.. డ్రగ్స్ లైసెన్స్ హోల్డర్ కాదు
- మెఫిడ్రోన్ అనేది మెడిసిన్ కాదు
- ఈ కేసు పోలీస్, ఎన్‌సీబీ, డీఆర్‌ఐ పరిధిలోకి వస్తుంది
- వివరణ ఇచ్చిన డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్

సాక్షి, హైదరాబాద్: నగర శివారులోని చర్లపల్లిలో ఒక రసాయన కర్మాగారంలో ఈ నెల 5న మహారాష్ట్ర క్రైం బ్రాంచ్ పోలీసులు చేసిన మెరుపుదాడిలో ఏకంగా రూ.12వేల కోట్ల విలువ చేసే ఎండీ (మెఫిడ్రోన్) డ్రగ్ తయారీ ముడిసరుకు పట్టుకున్న వాగ్దేవి ల్యాబొరేటరీస్ అంశం తమ పరిధిలోకి రాదని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) తేల్చి చెప్పింది. ఇతర రాష్ట్ర పోలీసులు తెలంగాణలోకి వచ్చి భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుకోవడంతో స్థానిక పోలీసులు, ఇతర దర్యాప్తు సంస్థలతోపాటు డ్రగ్ తయారీ అంశాలను పరిశీలించాల్సిన డీసీఏపైనా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో డీసీఏ జాయింట్ డైరెక్టర్ రమధాన్ సోమవారం కీలక ప్రకటన విడుదల చేశారు. మెఫిడ్రోన్ స్వాధీనంపై మహారాష్ట్ర పోలీసులు ఇటీవల విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్న వాగ్దేవి ల్యాబొరేటరీస్ ఫార్మాస్యూటికల్ కంపెనీ కాదని స్పష్టం చేశారు. డ్రగ్ లైసెన్స్ హోల్డర్ కాదని వెల్లడించారు. మెఫిడ్రోన్ ఔషధం (మెడిసిన్) కాదని, ఈ అంశం తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా నియంత్రించబడదని తెలిపారు. 'ఇది ఎన్‌డీపీఎస్ చట్టం, 1985 కింద అధికారం పొందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల పరిధిలోకి వస్తుంది. చర్యలు తీసుకోవడానికి లేదా దర్యాప్తును ప్రారంభించడానికి డీసీఏకి అధికారం లేదు' అని పేర్కొన్నారు.

మాది కాదంటే మాది కాదు...

రాజధాని పరిసరాల్లో భారీ మొత్తంలో డ్రగ్స్ తయారీ, ముడి పదార్థాలు పట్టుబడటం.. మహారాష్ట్ర పోలీసులు నెల రోజుల పాటు డెకాయి ఆపరేషన్ నిర్వహించి మరీ బట్టబయలు చేసే వరకు స్థానిక పోలీసులు, మత్తుపదార్థాలకు సంబంధించిన ప్రత్యేక దర్యాప్తు విభాగాలు గుర్తించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు సైతం ఈ అంశంపై సీరియస్ అయినట్టు తెలిసింది. ఇంత పెద్దమొత్తంలో డ్రగ్స్ ఇతర రాష్ట్ర పోలీసులకు చిక్కడంతో ఇప్పుడు ఆ తప్పు మాది కాదంటే మాది కాదని చెబుతున్నాయి సదరు ఏజెన్సీలు. కెమికల్ ఫ్యాక్టరీల్లో డ్రగ్స్ తయారీని అడ్డుకునేందుకు సోదాలు చేపట్టే అంశం డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) పరిధిలోకి వస్తుందని మత్తు పదార్థాలపై ప్రత్యేక దర్యాప్తు కోసం ఏర్పాటైన ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఉన్నతాధికారి ఒకరు అనధికారికంగా వివరణ ఇవ్వగా..తాజాగా వాగ్దేవి ల్యాబొరేటరీస్ అంశం తమ పరిధిలోనిది కాదని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) సోమవారం ఒక అధికారిక ప్రకటన ఇవ్వడం గమనార్హం.

చర్లపల్లి డ్రగ్స్‌పై జూపల్లి సీరియస్

ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: చర్లపల్లిలోని వాగ్దేవి ల్యాబ్స్ కెమికల్ ఫ్యాక్టరీలో వెలుగుచూసిన డ్రగ్స్ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆ శాఖ అధికారులపై మండిపడ్డారు. వాగ్దేవి ల్యాబ్స్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి 24 గంటల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఈ అంశంపై సమీక్షించారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న నెట్‌వర్క్ మూలాలు హైదరాబాద్‌లో బయటపడిన నేపథ్యంలో కేసు పూర్వాపరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇంత జరుగుతున్న మన ఎక్సైజ్ శాఖ ఏం చేస్తుందని మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, మాదక ద్రవ్యాల నియంత్రణకు కార్యాచరణ రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ ఖురేషీ, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథం, ఇతర అధికారులు వాగ్దేవి ల్యాబ్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. మంగళవారంలోగా అధికారులు దీనిపై నివేదికఅందజేయనున్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిరణ్, అదనపు కమిషనర్ ఖురేషీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీ వేతనం రూ.800కు పెంచండి

- పార్లమెంటరీ కమిటీ చైర్మన్‌కు నరేగా సంఘర్షణ్ మోర్చా వినతి

సాక్షి, న్యూఢిల్లీ: ఉపాధి హామీ పథకం (నరేగా) నిధులు నిలిపివేస్తూ, కొత్త షరతులు విధిస్తూ కేంద్రం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని నరేగా సంఘర్షణ్ మోర్చా ఆరోపించింది. పథకం పరిరక్షణకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరుతూ సోమవారం ఢిల్లీలో గ్రామీణాభివృద్ధి శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సప్తగిరి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. పథకానికి నిధులు పెంచడంతో పాటు, కూలీల రోజువారీ వేతనాన్ని రూ.800కు పెంచాలని మోర్చా ప్రతినిధులు డిమాండ్ చేశారు. తెలంగాణ వంటి రాష్ట్రాలకు నిధులు నిలిపివేయడంతో జూలై నుంచి పనులు ఆగిపోయాయని, వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

రైతు వేదికల వద్ద యూరియా పంపిణీ: మంత్రి తుమ్మల



మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేటలో యూరియా కోసం సహకారం సంఘం కార్యాలయం ముందు రైతుల లైన్లు



మెదక్ జిల్లా శివ్వంపేటలోని పీఏసీఎస్ వద్ద సోమవారం అర్ధరాత్రి యూరియా కోసం అక్కడే బస చేసిన రైతులు

సాక్షి, హైదరాబాద్/సాక్షినెట్‌వర్క్: రైతు వేదికల వద్ద కూడా రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. కొద్ది రోజులుగా యూరియా పంపిణీలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 500 రైతు వేదికల వద్ద యూరియా అమ్మకాలు జరిపేందుకు వీలుగా రెండు రోజుల వ్యవధిలో 500 ఈపాస్ మెషీన్లు తెప్పించి, సిబ్బందికి శిక్షణ ఇప్పించి యూరియా అమ్మకాలు చేపట్టినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా అవసరం ఉన్న రైతులకు టోకెన్లు జారీ చేసి 500 రైతు వేదికల వద్ద సోమవారం యూరియా పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. యూరియా పంపిణీపై మంత్రి తుమ్మల ఆదేశాలతో వ్యవసాయ శాఖ కార్యాలయంలో అగ్రికల్చర్ డైరెక్టర్ గోపి పర్యవేక్షిస్తున్నారు.

ఇంకా తప్పని కష్టాలు

మహబూబాబాద్ జిల్లా కురవి సొసైటీ వద్ద రైతులు యూరియా కోసం బారులుతీరారు. దంతాలపల్లి మండలంలో గంటల తరబడి రైతులు క్యూలో నిల్చున్నారు.

- వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రంగాపురం, కొత్తూరు, మనుబోతులగడ్డకు చెందిన రైతులు మండల కేంద్రానికి ఆదివారం రాత్రి 1 గంటకు వచ్చి బారులుతీరారు. ఖానాపురంలో ఆయా గ్రామాలకు ఇవ్వడం లేదని, కొత్తూరు, మనుబోతులగడ్డ సొసైటీ గోదాంకు వస్తుందని తెలియడంతో అక్కడకు వెళ్లి లైన్‌లో నిల్చున్నారు. ఈ క్రమంలో క్యూలో నిల్చున్న రైతు లావుడ్య యాకూబ్ ఫిట్స్‌తో కిందపడిపోయాడు.
- హనుమకొండ జిల్లా పరకాల వ్యవసాయ మార్కెట్ ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రోజురోజు యూరియా కష్టాలు ఎక్కువవుతున్నాయి. దేవరకద్రలో టోకెన్ల కోసం తోపులాట జరిగింది. హన్వాడలో తెల్లవారుజాము 3 గంటల నుంచి క్యూలైన్‌లో ఉంటే యూరియా లేదని చెప్పడంతో రైతులు ఆగ్రహంతో ఒక్కసారిగా పోలీసులను తోసుకుంటూ బారికేడ్లను ధ్వంసం చేశారు. అనంతరం చించోలీ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. మహమ్మదాబాద్ మండలం వెంకట్‌రెడ్డిపల్లి గేట్ వద్ద జాతీయ రహదారిపై ఉదయం 6 గంటల నుంచి రెండు గంటల పాటు రైతులు ధర్నా చేశారు.
- వనపర్తి జిల్లాలో ఖిల్లాఘనపురంలో రైతులు వనపర్తి–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.
- నారాయణపేట జిల్లాలోని ధన్వాడ పీఏసీఎస్‌కు రైతులు తెల్లవారుజామునే చేరుకొని చెప్పులు, రాళ్లను క్యూలో పెట్టారు. పీఏసీఎస్ గేటు తెరిచే సమయంలో రైతులందరూ ఒక్కసారిగా లోపలికి చొచ్చుకురావడంతో పోలీసులు కిందపడ్డారు.



గర్భాలయ ద్వారాలను తెరుస్తున్న ఆలయ అర్చకులు

యాదగిరి క్షేత్రంలో సంప్రోక్షణ.. ప్రాయశ్చిత్త హోమం


యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం వేకువ జామున సంప్రోక్షణ చేపట్టి ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు. సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం యాదగిరి ఆలయాన్ని అర్చకులు మూసివేశారు. చంద్ర గ్రహణం ముగిసిన తర్వాత సోమవారం వేకువ జామున 3.30 గంటలకు యాదగిరి క్షేత్రంలోని గర్భాలయ ద్వారాలు, ఉప ఆలయాలు, అనుబంధ ఆలయాలను సంప్రదాయంగా తెరిచారు. అనంతరం యాదగిరి క్షేత్రంతో పాటు ఉప ఆలయాలు, అనుబంధ ఆలయాల్లో పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారం సంప్రోక్షణ జరిపించారు. అనంతరం ఆలయ ముఖమండపంలో ప్రాయశ్చిత్త హోమాన్ని అర్చకులు విశేషంగా నిర్వహించి, తిరుమంజనాలను జరిపారు. ఆ తర్వాత సుప్రభాతం, బిందె తీర్థం, తిరువారాధన, బాల భోగం, నిజాభిషేకం, సహస్ర నామార్చన చేపట్టారు. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణోత్సవం జరిపించారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయంలో భక్తులకు శ్రీస్వామి వారి దర్శనాన్ని కల్పించారు.

నేడే ఉప రాష్ట్రపతి ఎన్నిక

అన్ని ఏర్పాట్లు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

ఎన్డీఏ వర్సెస్ ఇండియా కూటమి

- సీపీ రాధాకృష్ణన్, జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిల మధ్య ముఖాముఖి పోటీ
- ఓటింగ్‌లో పాల్గొననున్న లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు
- ఉదయం 10 గంటలకు పోలింగ్ షురూ..
- 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు.. తర్వాత వెలువడనున్న ఫలితం
- బలాబలాల పరంగా ఎన్డీఏ అభ్యర్థికి పూర్తి మెజార్టీ
- మాక్ పోలింగ్‌లు, ఎంపీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన పార్టీలు


బి.సుదర్శన్‌రెడ్డి


రాధాకృష్ణన్

సాక్షి, న్యూఢిల్లీ: దేశ తదుపరి ఉప రాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు అన్ని ఏర్పాట్లూ చేసింది. ఆరోగ్య కారణాలరీత్యా జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఈ పదవికి మంగళవారం ఎన్నికలు జరగనున్నాయి. పార్లమెంటు భవనంలో పోలింగ్ ప్రక్రియ సాగనుండగా.. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పక్షాల అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్ష ఇండియా కూటమి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మధ్య ముఖాముఖి పోటీ జరగనుంది. అభ్యర్థులిద్దరూ తమకు మద్దతు కోరుతూ ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా ఆయా పార్టీలు సోమవారం వేర్వేరుగా మాక్ పోలింగ్‌ను నిర్వహించాయి.

పోలింగ్ ముగిసిన వెంటనే కౌంటింగ్

ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన ఓటింగ్ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. పార్లమెంట్ హౌస్ వసుధలోని రూమ్ నంబర్ ఎఫ్–101లో పోలింగ్ జరగనుంది. 6 గంటలకు కౌంటింగ్ అనంతరం ఫలితం వెల్లడి కానుంది. ఎలక్టోరల్ కాలేజీలో సభ్యులుగా ఉన్న రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. రాజ్యసభకు ఎన్నికైన 233 మంది సభ్యులు (ప్రస్తుతం ఆరు స్థానాలు ఖాళీగా ఉన్నాయి), రాజ్యసభకు నామినేటెడ్ అయిన 12 మంది, లోక్‌సభ ఎంపీలు 543 మంది (ప్రస్తుతం ఒక స్థానం ఖాళీగా ఉంది) ఎలక్టోరల్ కాలేజీలో సభ్యులుగా ఉన్నారు.

ఎన్డీఏకు సొంతంగా 422 మంది సభ్యుల బలం

ఎలక్టోరల్ కాలేజీలోని బలాబలాల పరంగా చూస్తే ఎన్డీఏకు స్పష్టమైన మెజార్టీ ఉంది. ఎలక్టోరల్ కాలేజీలో ఖాళీలను కూడా పరిగణనలోకి తీసుకుంటే మొత్తం 781 మంది సభ్యులున్నారు. ప్రస్తుతం 542 మంది సభ్యులున్న లోక్‌సభలో ఎన్డీఏ కూటమికి 293 మంది సభ్యుల బలం ఉంది. ఇక 239 మంది సభ్యులున్న రాజ్యసభలో పాలక కూటమికి 129 మంది సభ్యుల మద్దతు ఉంది. విజయానికి అవసరమైన ఓట్లు 391 కాగా, ఎన్డీఏకు సొంతంగానే 422 మంది సభ్యుల బలం ఉంది. ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం తమ 11 మంది సభ్యుల మద్దతు ఎన్డీఏ అభ్యర్థికి ప్రకటించడంతో ఆ సంఖ్య 433కి చేరనుంది. ఇక విపక్ష ఇండియా కూటమికి రెండుసభల్లో కలిపి 311 ఓట్లు ఉండగా, ఈ కూటమికి ఆప్ మద్దతు ప్రకటించింది. దీంతో కూటమి బలం 320 మాత్రమే దాటుతోంది. అయితే రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికలో ఎంపీలు తమ పార్టీల విప్‌ను పాటించాల్సిన అవసరం లేదు.

అన్ని పార్టీల మాక్ పోలింగ్..

పార్టీల బలాబలాలపై ఇరు పక్షాలకు స్పష్టత ఉన్నప్పటికీ ఓట్లు చెల్లుబాటు కాకుండా పోవడంపై ఆందోళన, క్రాస్ ఓటింగ్ భయం రెండు కూటముల్లోనూ కనిపిస్తోంది. 2022 ఎన్నికల్లో 15 ఓట్లు చెల్లకుండా పోవడంతో ఈసారి పార్టీలు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. ఇందులో భాగంగా బీజేపీ తమ ఎంపీల కోసం ఆది, సోమవారాల్లో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించగా, కాంగ్రెస్ పార్టీ పాత పార్లమెంట్ భవనం సెంట్రల్‌హాల్‌లో మాక్ పోలింగ్ ద్వారా తమ ఎంపీలకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విపక్ష ఎంపీలకు విందు ఇచ్చారు. సంవిధాన్ సదన్‌లో జరిగిన సమావేశంలో ఖర్గేతో పాటు సోనియాగాంధీ, శరద్‌పవార్, టీఆర్ బాలు, అఖిలేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సైతం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి నివాసంలో ఎంపీలతో మాక్ పోలింగ్ నిర్వహించింది.

బీఆర్ఎస్, బీజేడీ దూరం

రెండు కూటములకు సమాన దూరాన్ని పాటిస్తూ వస్తున్న బీఆర్ఎస్, బీజేడీలు ప్రస్తుత ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించాయి. ఈ ఎన్నికల్లో తటస్థంగా ఉంటామని ఇప్పటికే ప్రకటించాయి. ప్రస్తుతం రాజ్యసభలో బీఆర్ఎస్‌కు నలుగురు, బీజేడీకి ఏడుగురు సభ్యుల బలం ఉంది.

ఎన్డీఏ ఎంపీలతో మోదీ సమావేశం

మంగళవారం ప్రధాని మోదీ ఎన్డీయే ఎంపీలనుద్దేశించి మాట్లాడారు. అనంతరం..'రాధాకృష్ణన్ అద్భుతమైన ఉప రాష్ట్రపతి అవుతారని ప్రజలు విశ్వసిస్తున్నారు..'అంటూ 'ఎక్స్'లో ఒక పోస్టు చేశారు. కోయంబత్తూరు నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచిన రాధాకృష్ణన్‌ను ఎన్డీఏ మచ్చలేని నేతగా అభివర్ణిస్తోంది. రాజకీయ, పాలనాపరమైన ఆయన విశేష అనుభవం..రాజ్యసభ చైర్మన్‌గా విధులు నిర్వర్తించేందుకు ఉపకరిస్తుందని పేర్కొంటోంది. ఇక విపక్షాల అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి 2011లో సుప్రీంకోర్టులో పదవీ విరమణ పొందారు. నల్లధనం, సల్వాజుడుం తదితర కేసుల్లో కీలక తీర్పులు వెలువరించారు.

ఓ ప్రత్యేక ప్రక్రియ

సాక్షి, న్యూఢిల్లీ: కేవలం పార్లమెంటు సభ్యులు మాత్రమే పాల్గొనే ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రత్యేకమైనది. 'నైష్పత్తిక ప్రాతినిధ్య విధానం'లో 'ఏక బదిలీ ఓటు' పద్ధతి ద్వారా ఉప రాష్ట్రపతి ఎన్నిక జరుగుతుంది. అంటే ప్రతి ఎంపీ బ్యాలెట్ పత్రంపై ఉన్న అభ్యర్థులకు తమ ప్రాధాన్యత క్రమాన్ని కేటాయించాల్సి ఉంటుంది. బ్యాలెట్ పత్రాలపై ఇద్దరు అభ్యర్థుల పేర్లు ఉంటాయి. ఎంపీలు తమకు ఇష్టమైన అభ్యర్థి పేరు పక్కన '1' అని రాయడం ద్వారా తమ మొదటి ప్రాధాన్యతను సూచించాలి. ఈ అంకెను భారతీయ సంఖ్యలలో, రోమన్ సంఖ్యలలో లేదా ఏదైనా భారతీయ భాషలోని సంఖ్యలలో రాయవచ్చు, కానీ అక్షర రూపంలో రాయకూడదు.

సంక్లిష్టమైన లెక్కింపులు ఉండవు

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో రాష్ట్రపతి ఎన్నికల్లా ఓటు విలువలో సంక్లిష్టమైన లెక్కింపులు ఉండవు. ఈ ఎన్నికల్లో పాల్గొనే ప్రతి ఎంపీ ఓటు విలువ 'ఒకటి' (1) గానే పరిగణిస్తారు. గెలవడానికి అభ్యర్థి మొత్తం చెల్లుబాటైన ఓట్లలో 50% కంటే ఎక్కువగా (కోటా) మొదటి ప్రాధాన్యత ఓట్లను సాధించాల్సి ఉంటుంది. ఒకవేళ మొదటి రౌండ్‌లో ఎవరికీ స్పష్టమైన మెజారిటీ రాకపోతే, తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని పోటీ నుంచి తొలగించి, వారి రెండవ ప్రాధాన్యత ఓట్లను మిగతా అభ్యర్థులకు బదిలీ చేస్తారు.

పోటీ ఉంటేనే పోలింగ్

భారత రాజ్యాంగం ప్రకారం, ఉప రాష్ట్రపతి పదవీకాలం ఐదేళ్లు. ప్రస్తుత ఉప రాష్ట్రపతి పదవీకాలం ముగిసేలోపు కొత్తవారిని ఎన్నుకోవడం రాజ్యాంగ బద్ధమైన విధి. ఒకవేళ అధికార, విపక్ష కూటముల మధ్య ఏకాభిప్రాయం కుదిరి, ఒక్కరే అభ్యర్థి బరిలో ఉంటే ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. కానీ ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పుడు విజేతను నిర్ణయించడానికి పోలింగ్ తప్పనిసరి.

రహస్య పద్ధతిలో ఎందుకు?

ఉప రాష్ట్రపతి ఎన్నికను రహస్య బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించడానికి బలమైన రాజ్యాంగ పరమైన కారణాలు ఉన్నాయి. ఎంపీలు ఎలాంటి ఒత్తిడికి, ప్రలోభాలకు, పార్టీ విప్‌లకు లొంగకుండా తమ అంతరాత్మ ప్రబోధం మేరకు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ఇది వీలు కల్పిస్తుంది. రాజకీయాలకు అతీతంగా సభ్యులు తమ ప్రతినిధిని ఎన్నుకోవాలన్నదే రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశం. ఓటు వేసిన తర్వాత బ్యాలెట్ పత్రాన్ని పార్టీ ఏజెంట్లతో సహా ఎవరికీ చూపించడానికి వీల్లేదు.

గుర్తింపు కార్డుగా ఆధార్

- బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ అంశంలో ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం
- 9వ తేదీలోగా ఆదేశాలు అమలుచేయాలని సూచన
- అయితే ఆధార్ అనేది పౌరసత్వానికి రుజువు కాదని వ్యాఖ్య



న్యూఢిల్లీ: బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) అంశంలో ఆధార్ గుర్తింపు కోసం పోరాడుతున్న విపక్ష పార్టీలకు అనుకూలంగా సర్వోన్నత న్యాయస్థానంలో ఉత్తర్వులొచ్చాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తింపు కార్డ్‌గా ఆధార్‌నూ పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం సూచించింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ధృవీకరణ పత్రాల జాబితాలో 12వ గుర్తింపు డాక్యుమెంట్‌గా ఆధార్‌ను పరిగణించాలని ఈసీని న్యాయస్థానం ఆదేశించింది. ''బిహార్ కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ గుర్తింపు విషయంలో ఆధార్‌నూ అనుమతించండి. అయితే ఆ ఆధార్ అనేది పౌరసత్వ గుర్తింపునకు రుజువుగా భావించాలని మేం చెప్పట్లేదు. ఎస్ఐఆర్‌లో ఇకపై ఆధార్‌ను సైతం అంగీకరిస్తున్నట్లు స్పష్టంగా పేర్కొంటూ రాష్ట్ర ఎన్నికల అధికారులకు మీరు అవసరమైన ఆదేశాలను జారీచేయండి. మా ఆదేశాలను సెప్టెంబర్ 9వ తేదీ లోపు అమలుచేయండి''అని ధర్మాసనం ఈసీని ఆదేశించింది. ''అక్రమ వలసదారుల పేర్లు ఓటర్ల జాబితాలో కలపాలని ఎవరూ కోరుకోరు. కేవలం నిజమైన భారతీయ పౌరులను మాత్రమే ఓటు వేసేందుకు అనుమతించాలి. తప్పుడు డాక్యుమెంట్లను సమర్పించిన వారిని గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగించాలి''అని కోర్టు వ్యాఖ్యానించింది. ఓటర్ల ఆధార్ కార్డ్‌ను ఎందుకు ఆమోదించట్లేదో సంజాయిషీ ఇవ్వాలని గతంలో ఆదేశించిన నేపథ్యంలో ఈసీ ఇచ్చిన వివరణను కోర్టు సోమవారం ఆలకించింది. ఈ సందర్భంగా ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదించారు. ''ముసాయిదా జాబితాలోని 7.24 కోట్ల మంది ఓటర్లలో 99.6 శాతం మంది తమ పేర్లు తుది ఓటర్ల జాబితాలో చేర్చాలంటూ సంబంధిత డాక్యుమెంట్లను ఇప్పటికే సమర్పించారు. ఇక 12వ ధృవీకరణ పత్రంగా ఆధార్‌ను అనుమతించాలంటూ పలువురు పిటిషన్లు ఇచ్చారు. అయితే ఇందులో ఆధార్‌ను ఒక రుజువుగా అంగీకరిస్తామని ఈసీ గతంలోనే పేర్కొంది. అయినాసరే ఆధార్‌ను కచ్చితంగా 12వ ధ్రువీకరణ పత్రంగా చేర్చాలని కోరడంలో అర్థం లేదు''అని ఆయన వాదించారు. దీంతో ధర్మాసనం జోక్యంచేసుకుంది. ''ప్రజాప్రతినిధుల చట్టం–1950లోని 23(4) సెక్షన్, ఆధార్ చట్టం–2016లోని నియమ,నిబంధనల ప్రకారమే ఓటరు గుర్తింపు కోసం ఆధార్‌ను పరిగణించవచ్చని నిర్ధారించాం. అయితే ఆధార్ అనేది పౌరసత్వాన్ని రుజువుచేయబోదు''అని ధర్మాసనం స్పష్టంచేసింది.

ఎస్ఐఆర్‌పై తగ్గుతున్న నమ్మకం!

''ఎస్ఐఆర్ క్రతువుపై పిటిషన్‌దారులు, విపక్షాల్లో నమ్మకం తగ్గుతున్నట్లుగా తోస్తోంది. ఈ నమ్మకాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ రంగంలోకి దిగాలి. రాజకీయ పార్టీలు, ఓటర్లకు పారాలీగల్ వలంటీర్లు సాయపడాలి. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, మార్పులు చేర్పులపై చేసే దరఖాస్తుల విషయంలో వలంటీర్లు సాయం అందించాలి''అని కోర్టు ఆదేశించింది. తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 30వ తేదీన ముద్రించనున్నారు.

ఈసీ సిగ్గుపడాలి: కాంగ్రెస్

సుప్రీంకోర్టు ఎన్నిసార్లు ఆదేశించినా ఆధార్‌ను ధృవీకరణ జాబితాలో చేర్చకుండా నిర్లక్ష్యవైఖరిని అవలంభిస్తున్న ఈసీ సిగ్గుపడాలని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి(కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ సోమవారం తన సామాజికమాధ్యమ 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. ''ఓటర్ల నమోదుకోసం ఆధార్‌నూ గుర్తింపు పత్రంగా పరిగణించాలని కోర్టు ఇప్పటికి మూడుసార్లు ఆదేశించింది. అయినా కోర్టు ఆదేశాలను ఈసీ పెడచెవినపెట్టింది. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఈసీ ఈ విషయంలో సిగ్గుపడాలి. విపక్ష రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లనూ ఈసీ గుర్తించట్లేదు. ఇవన్నీ ఈసీ సారథి సొంత నిర్ణయాల్లా కనిపిస్తున్నాయి. ఇలాంటి ప్రజాస్వామ్య వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను, కేంద్ర ఎన్నికల సంఘాన్ని చరిత్ర క్షమించదు''అని ఆయన అన్నారు.

అమెరికా కొత్త మెలికతో
వీసా గోస..!

- వలసేతర వీసాలను స్వదేశం నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచన
- చాంతాడంత షెడ్యూలింగ్ లైన్లతో ఆలస్యంకానున్న వీసాల జారీ
- భారతీయులకు పెరగనున్న నిరీక్షణ కష్టాలు

వాషింగ్టన్: కోవిడ్ సంక్షోభం వేళ త్వరగా వలసేతర వీసాల జారీ ప్రక్రియను ముగించాలనే సదుద్దేశంతో భారతీయులకు కల్పించిన ఒక చక్కటి వెసులుబాటుకు అమెరికా సర్కార్ హఠాత్తుగా మంగళం పాడింది. దీంతో భారతీయ వీసా దరఖాస్తుదారులకు మళ్లీ నిరీక్షణ కష్టాలు పెరగనున్నాయి. భారత్‌లోని వీసా ఇంటర్వ్యూ కేంద్రాల్లో భారీ షెడ్యూలింగ్ జాబితా ఉండటంతో విదేశాలకు వెళ్లి దరఖాస్తు చేసుకునేందుకు కోవిడ్ వేళ అమెరికా అనుమతిచ్చింది. దాంతో భారతీయులు చాలా మంది విదేశాలకు వెళ్లి అక్కడి అమెరికా కాన్సులేట్లు, రాయబార కార్యాలయాల్లో వీసా ఇంటర్వ్యూలను త్వరగా ముగించుకుని వీసాలను సాధించారు. ఇకపై అలా కుదరదని ఏ దేశం వాళ్లు ఆ దేశంలోనే దరఖాస్తు చేసుకోవాలని, అక్కడే ఇంటర్వ్యూలను పూర్తిచేసుకోవాలని అమెరికా విదేశాంగ శాఖ తాజాగా ప్రకటించింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో స్వదేశంలో వీసా అపాయింట్‌మెంట్‌ల షెడ్యూలింగ్ మరింతగా పెరగనుంది. దరఖాస్తుదారులు తమ వంతు వచ్చేదాకా వేచిచూడాల్సిన నిరీక్షణ కాలం ఊహించనంతగా పెరిగిపోనుంది. త్వరగా వీసా పొంది అమెరికాలో వాలిపోదామనుకున్న భారతీయ వలసేతర వీసా దరఖాస్తు దారుల ఆశలు అడియాసలు కానున్నాయి. ''వలసేతర వీసాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇకపై కచ్చితంగా స్వదేశంలో లేదంటే రెసిడెన్సీ హోదా ఎక్కడ ఉందో ఆ ప్రాంతం నుంచే దరఖాస్తు చేసుకోవాలి. విదేశాలకు వెళ్లి దరఖాస్తు చేయడం కుదరదు''అని తాజా నోటిఫికేషన్‌లో అమెరికా విదేశాంగ శాఖ స్పష్టంచేసింది. పర్యాటకం(బీ2), వ్యాపారం(బీ1), విద్యార్థి, తాత్కాలిక ఉద్యోగులుసహా అన్ని వలసేతర వీసా విభాగాల దరఖాస్తుదారులకు తాజా సవరణ వర్తిస్తుందని యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ పేర్కొంది. ''నిబంధనలు మారాయని తెల్సి కూడా విదేశాలకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే అక్కడి నుంచి వీసా అనుమతి రావడం గగనమే. అర్హత సాధించడం చాలా కష్టం. ఒకవేళ దరఖాస్తును స్వీకరించి, పరిశీలించినా నిరీక్షణ కాలం ఎంతనేది చెప్పలేం. విదేశాల నుంచి చేసే దరఖాస్తుకు సంబంధించిన ఫీజు రీఫండ్ చేయడం గానీ స్వదేశంలో దరఖాస్తు చేసినట్లుగా ఆ ఫీజును పరిగణించడంగానీ జరగదు''అని అమెరికా ప్రభుత్వం స్పష్టంచేసింది.

వీసా షాపింగ్ భారతీయులకు కష్టమే

తాత్కాలిక వీసా ఇంటర్వ్యూల తంతును పూర్తిచేసుకోవాలంటే భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లలో కనీసం మూడున్నర నెలలు వేచి ఉండక తప్పని పరిస్థితి ఉందని వీసా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో స్వదేశం నుంచి కాకుండా ఇతర దేశానికి వెళ్లి అక్కడి నుంచి యూఎస్ వీసా కోసం దరఖాస్తు భారతీయుల సంఖ్య ఎక్కువైంది. ఇలా 'వీసా షాపింగ్'చేసే భారతీయులకు ఇప్పుడు సమస్యలు తప్పవు. భారత్‌లో వీసారావాలంటే వారాల తరబడి వెయిట్ చేయక తప్పదు. అంతకాలం నిరీక్షించే ఓపిక లేక థాయ్‌లాండ్, సింగపూర్, జర్మనీ, బ్రెజిల్ వంటి పలు దేశాలకు భారతీయులు పోలోమని వెళ్తున్నారు. అక్కడ త్వరగా వీసా సాధించి లబ్ధిపొందిన ఉదంతాలు కోకొల్లలు. వలసేతర వీసా ఇంటర్వ్యూ కోసం 14 ఏళ్ల లోపు చిన్నారులు మొదలు 79ఏళ్లు పైబడిన వృద్ధులదాకా తప్పనిసరిగా స్వయంగా వచ్చి కాన్సులేట్ ఆఫీసర్ ఎదుట హాజరవ్వాల్సిందే.



జెరూసలెంలో
కాల్పుల కలకలం

ఘటనా ప్రాంతంలో రక్తపు మరకలను తుడుస్తున్న ఇజ్రాయెల్ సహాయక సిబ్బంది

- బస్టాప్‌లోని ప్రయాణికులపై పాలస్తీనియన్ల కాల్పులు
- ఆరుగురి మృతి
- 12 మందికి గాయాలు
- జవాన్లు, పౌరుల ఎదురుకాల్పుల్లో ఇద్దరు సాయుధుల హతం

జెరూసలెం: పాలస్తీనియన్లు ఉండే గాజాలో ఇజ్రాయెల్ బలగాలు భీకరదాడులు చేస్తుంటే అందుకు ప్రతిగా ఇజ్రాయెల్‌లోని జెరూసలెంలో పాలస్తీనియన్లు కాల్పుల మోత మోగించారు. ఇద్దరు సాయుధ పాలస్తీనియన్లు సోమవారం జెరూసలెం శివారు రమోత్ జంక్షన్ వద్ద జరిపిన కాల్పుల ఘటనలో ఆరుగురు సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. 12 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ఉదయం పనివేళల వేళ రద్దీగా ఉన్న బస్టాప్‌లో ఈ కాల్పుల ఉదంతం చోటుచేసుకుందని ఇజ్రాయెల్ అధికారులు చెప్పారు. కాల్పులు జరిపింది తామేనని ఎలాంటి సాయుధ సంస్థ ప్రకటించలేదు. కానీ కాల్పుల ఘటనను కీర్తిస్తూ గాజాలోని సాయుధ హమాస్ సంస్థ తన సామాజిక మాధ్యమ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టింది. ''మా ప్రజల భూభాగాలను అన్యాయంగా అక్రమించుకున్న నేరాలకు శిక్షగా జరిగిన సహజ ఘటన ఇది''అని ఆ పోస్ట్‌లో పేర్కొంది. జెరూసలెంలో ఇటీవలకాలంలో పౌరులను లక్ష్యంగా చేసుకుని తుపాకీ గుళ్ల వర్షం కురిపించిన ఘటన జరగడం ఇదే తొలిసారి. జెరూసలెం ఘటనపై పలు దేశాల అగ్రనేతలు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అమాయక ప్రజలపై అమానుష దాడిగా ఈ ఘటనను అభివర్ణించారు.

వాహనంలో వచ్చి, విచక్షణారహితంగా కాల్చి..

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం జెరూసలెంకు ఉత్తరాన ఉన్న రమోత్ జంక్షన్‌లోని బస్టాప్.. ఆఫీస్ పనివేళలు కావడంతో ఉదయం ఆ ఉద్యోగులు, పనులకు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా ఉంది. అదే సమయానికి ఇద్దరు సాయుధులు వాహనంలో బస్టాప్‌కు వచ్చారు. వెంటనే గన్‌లు తీసి బస్టాప్‌లోని ప్రయాణికులపైకి తుపాకీ గుళ్ల వర్షం కురిపించారు. హఠాత్తుగా వచ్చిపడుతున్న తుపాకీ గుళ్ల ధాటికి జనం ప్రాణభయంతో చెల్లాచెదురుగా పరుగులుతీశారు. తుపాకీ గుళ్లు తగిలి ఆరుగురు అక్కడికక్కడే చనిపోయారు. అక్కడ ఆగి ఉన్న బస్సు ముందు అద్దం తుపాకీ గుళ్ల ధాటికి చిల్లులతో ఛిద్రమైంది. డ్యూటీలోలేని ఒక జవాను, కొందరు పౌరులు తమ వద్ద ఉన్న గన్‌లతో సాయుధులపైకి తెగించి ప్రతిదాడిచేశారు. ఈ ప్రతిదాడిలో సాయుధులు ఇద్దరూ హతమయ్యారు. జనం పరుగులు తీస్తున్న వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ''ఒక్కసారిగా బుల్లెట్ల మోత మొదలైంది. ఏం జరుగుతుందో తెల్సుకునే లోపే జనం అటూఇటూ పరుగులు పెడుతున్నారు. కచ్చితంగా చచ్చిపోతాననుకున్నా. బుల్లెట్‌గాయంతో బయటపడ్డా''అని ప్రత్యక్ష సాక్షి ఈస్టర్ లుగాసీ చెప్పారు. ''ఇది జుడాయిజం, ఇస్లామ్‌కు మధ్య సంఘర్షణ కాదు. హాని చేయాలనుకునే వాళ్లకు, స్వేచ్ఛగా బతకాలనే వాళ్లకు మధ్య యుద్ధం''అని యునైటెడ్ హాజాలా ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ వలంటీర్ డేనియల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. చనిపోయిన ఆరుగురిని యాకోవ్ పింటో(25), ఇజ్రాయెల్ మాజ్నెర్(28), రబ్బీ యూసెఫ్ డేవిడ్(43), మొర్దెచాయ్ మార్క్ స్టెన్సాంగ్(79), లెవీ ఇజాక్ పాష్, సారా మెండెల్సన్(60)లుగా గుర్తించారు. కాల్పుల ఘటనపై ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇజాక్ హెర్జోగ్ స్పందించారు. ''అమాయక చిన్నారులు, పౌరులు, వృద్ధులను పొట్టనబెట్టుకున్నారు. దాడి సూత్రధారులను అంతంచేస్తాం''అని ఆయన ప్రతిజ్ఞచేశారు. ఘటనాస్థలిని తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ స్వయంగా వచ్చి పరిశీలించారు. గాజా, వెస్ట్ బ్యాంక్‌ల నుంచి ఇజ్రాయెల్‌కు ముప్పు అధికమైందని ఆయన వ్యాఖ్యానించారు.

మళ్లీ పడిపోయిన ఫ్రాన్స్ ప్రభుత్వం

మరో ప్రధానిని అన్వేషించనున్న అధ్యక్షుడు మాక్రాన్

పారిస్: ఫ్రాన్స్ ప్రధానమంత్రి ఫ్రానోయిస్ బేరూ(74) ప్రభుత్వం పడిపోయింది. సోమవారం పార్లమెంట్‌లో ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానం 194–364 ఓట్ల భారీ తేడాతో ఓడిపోయింది. దేశాన్ని అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు ప్రభుత్వ వ్యయంలో కోత పెడుతూ తీసుకొచ్చిన ప్రతిపాదనలకు ప్రతిపక్షం మద్దతిస్తుందని ఫ్రానోయిస్ వేసిన అంచనాలు లెక్కతప్పాయి. దీంతోఏడాదిలో నాలుగో ప్రధానిని అన్వేషించే పనుల్లో అధ్యక్షుడు నిమగ్నమయ్యారు. పార్లమెంట్ దిగువ సభలో అధ్యక్షుడు మాక్రాన్ ప్రత్యర్థులదే పైచేయిగా ఉంది. అధ్యక్షుడిగా విదేశాంగ విధానం, యూరోపియన్ వ్యవహారాలు, సైనిక బలగాల కమాండర్‌గా విశేషమైన అధికారాలను కలిగి ఉన్నప్పటికీ మాక్రాన్ విధానాలపై దేశీయంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2024 జూన్‌లో అర్ధంతరంగా పార్లమెంట్‌ను రద్దు చేసి ఎన్నికలకు వెళ్లారు. దీని ద్వారా తన అధికారం బలపడుతుందని ఆశించారు. కానీ, మిశ్రమ ఫలితాలు దక్కాయి. ఏ ఒక్క పార్టీకీ స్పష్టమైన మెజారిటీని ప్రజలు ఇవ్వలేదు. ఫ్రాన్స్ ఆధునిక చరిత్రలోనే ఇలాంటి పరిస్థితి రావడం ఇదే మొదటిసారి. దాని ఫలితంగానే ప్రభుత్వాలు తరచూ మారుతున్నాయి.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. నేలకొరిగిన ఇద్దరు జవాన్లు

టాప్ లష్కరే ఉగ్రవాది సహా ఇద్దరు ముష్కరులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో చోటుచేసుకున్న ఎదురుకాల్పుల ఘటనలో ఇద్దరు జవాన్లు నేలకొరిగారు. లష్కరే తోయిబాకు చెందిన టాప్ ఉగ్రవాది సహా ఇద్దరు ముష్కరులు హతమయ్యారు. గుడార్ అటవీ ప్రాంతంలో ఉగ్రమూకలు సంచరిస్తున్న సమాచారం అందుకున్న బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సమయంలో ఉగ్రవాదుల కదలికలను పసిగట్టిన బలగాలు వారిని లొంగిపోవాల్సిందిగా హెచ్చరించారు. అయితే, ముష్కరులు వారిపైకి కాల్పులకు దిగారు. ఈ సందర్భంగా భీకర ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో ఒక ఉగ్రవాది చనిపోగా ఆర్మీ మేజర్, ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. అనంతరం, కొనసాగిన ఎన్‌కౌంటర్‌లో మరో ఉగ్రవాది జవాన్ల తూటాకు హతమయ్యాడు. గాయపడిన జవాన్లలో సుబేదార్ పెర్భాత్ గౌర్, లాన్స్ నాయక్ నరేందర్ సింధు చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గాయపడిన మేజర్ పరిస్థితి నిలకడగా ఉందని శ్రీనగర్ కేంద్రంగా పనిచేసే చినార్ కార్ప్స్ ఎక్స్‌లో తెలిపింది. హతులైన ఇద్దరు ఉగ్రవాదుల్లో ఒకడు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే రెహ్మాన్ భాయ్ అనే సంకేతనామం కలిగిన లష్కరే టాప్ ఉగ్రవాది అని చెబుతున్నారు. మరో ఉగ్రవాదిని స్థానికుడిగా భావిస్తున్నారు. ఇతడి వివరాలు తెలియాల్సి ఉంది.


ఎన్డీఏ ఎంపీలనుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

స్వదేశీ మేళాకు పట్టం కట్టండి

ట్రంప్ సుంకాల వేళ ఎన్డీఏ ఎంపీలకు మోదీ ఉద్బోధ

- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జాగ్రత్తగా ఓటేయాలని సూచన

న్యూఢిల్లీ: స్నేహితుడు, శత్రువు అనే భేదం లేకుండా అమెరికా ప్రభుత్వం అందరిపై సుంకాలతో బాదేస్తున్న వేళ ప్రధాని మోదీ స్వదేశీరాగం అందుకున్నారు. విదేశీ వస్తువులపై మోజు తగ్గించుకుని స్వదేశీ వస్తువులకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో సోమవారం ఎన్డీఏ కూటమి ఎంపీలతో సమావేశంలో పలు అంశాలపై ప్రధాని మాట్లాడారు. ''దేశవాళీ ఉత్పత్తులకు ఆదరణ పెరిగేలా చూడండి. స్వదేశీ మేళాను ఉద్యమస్థాయికి తీసుకెళ్లండి. విదేశాల అధిక టారిఫ్‌ల వంటి ప్రతికూలతలు, సవాళ్ల సమయంలో భారత్ స్వావలంబన ద్వారా తన శక్తిసామర్థ్యాలను మరింతగా సంతరించుకోవాల్సిన తరుణమిది. మేడిన్ ఇండియా ఉత్పత్తులను ప్రోత్సహించండి. జీఎస్టీ రేట్లు భారీగా తగ్గిన చక్కటి తరుణంలో స్వదేశీ వస్తువుల గొప్పతనాన్ని జనాన్ని తెలిసేలా చేయండి. ముఖ్యంగా నవరాత్రి, దీపావళి వంటి పండుగల సీజన్‌లో మీమీ నియోజకవర్గాల్లో ప్రజలతో, వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటుచేసి తగ్గిన జీఎస్టీ రేట్ల ప్రయోజనాలను వివరించండి''అని మోదీ అన్నారు. మోదీ ప్రసంగ వివరాలను తర్వాత కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు మీడియాకు వివరించారు. అమెరికా 50 శాతం టారిఫ్ భారం మోపిన వేళ మోదీ స్వదేశీ వస్తువుల ప్రాశస్త్యాన్ని ప్రస్తావించడం గమనార్హం.

శక్తివంతమయ్యేవేళ సవాళ్లు సాధారణం

''భారత్ శక్తివంతంగా ఎదిగే క్రమంలో సవాళ్లు ఎదురవడం సాధారణం. అయినాసరే అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించే క్రమంలో ఇలాటి సవాళ్లను ఎదుర్కొంటూ ఆత్మనిర్భర్‌ను సాధించాలి. సొంత నియోజకవర్గాల్లో దేశీయ ఉత్పత్తుల ప్రచారాన్ని మీరే నాయకులుగా ముందుండి నడపాలి. గతంలో భారత్‌లో జపాన్ తయారీ వస్తువుల వినియోగం అధికంగా ఉండేది. అలాంటి భారత్‌లో ఇప్పుడు దేశీయోత్పత్తులను అధికంగా ఉపయోగించగల్గుతున్నామని గర్వపడేలా మనం చేయాలి. మీరు పాల్గొనే ప్రతి కార్యక్రమంలో స్వదేశీ ఉత్పత్తులు కనిపించాలి. ఉపయోగించాలి''అని ఎంపీలకు మోదీ సూచించారు. ''జీఎస్టీ శ్లాబుల తొలగింపు అనేది ప్రజల్లో పెను సంచలనంగా మారింది. ప్రజలతో 'స్వదేశీ మేళాలు', వ్యాపారులతో 'వ్యాపారీ సమ్మేళన్'లు నిర్వహించండి. గాల్లో తుపాను చెలరేగినాసరే మనం వాహన టైరులో మళ్లీ గాలి కొట్టాల్సిందే. అలాగే దేశీయంగా 'స్వదేశీ వాతావరణం'ఉన్నాసరే మన మళ్లీ విడిగా మన వంతు తోడ్పాటు అందించాల్సిందే''అని అన్నారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జాగ్రత్త

''ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేసేటప్పుడు ఎంపీలు జాగ్రత్త వహించండి. తప్పులు దొర్లకుండా ఓటేయండి. పార్లమెంట్ సభ్యులే ఓటింగ్‌లో తప్పులు చేస్తే ప్రజలకు తప్పుడు సందేశం వెళ్తుంది. మన అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ దేశవ్యాప్తంగా అన్ని వర్గాల్లో ఉత్తమ అభ్యర్థిగా పేరుతెచ్చుకున్నారు. ఆయన ఉపరాష్ట్రపతిగా చక్కటి సేవలు అందిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. తన పాలనాదక్షతతో ఆయ ఉపరాష్ట్రపతి పదవికి వన్నె తేగలరని నేనూ విశ్వసిస్తున్నా''అని అన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు ఆమోదం పొందం వెనుక అధికార కూటమి ఎంపీల కృషిదాగి ఉందని మోదీ ప్రశంసించారు.

హిమాచల్, పంజాబ్‌కు నేడు మోదీ

వరద విలయంలో చిక్కుకుని అల్లాడిపోతున్న హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో తాజా పరిస్థితిని సమీక్షించేందుకు ప్రధాని మోదీ మంగళవారం పర్యటించనున్నారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలకూ మోదీ వెళ్లి అక్కడి బాధిత కుటుంబాలను పరామర్శించనున్నారు. హిమాచల్‌లోని కంగ్రాకు మోదీ వెళ్లనున్నారు. అక్కడే ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం ౹ 9 ౹ సెప్టెంబర్ ౹ 2025



రూ.1.92 కోట్ల పాత కరెన్సీ స్వాధీనం

రూ.1.92 కోట్ల విలువైన రద్దయిన రూ.500, రూ.1000 నోట్లను ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను పట్టుకున్నారు. -8లో



మత్తు.. ఎత్తు.. చిత్తు..

నగరంలో మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన కొందరు వాటిని తరలించేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. - సిటీప్లస్‌లో...

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/23.0

నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురవొచ్చు. గరిష్టంగా 31, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

- 75 లక్షల మందికి పైగా ప్రయాణికులు
- హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్–2050 ప్రణాళికలు
- 2030 నుంచి 2050 నాటికి దశలవారీగా విస్తరణ
- 7,257 చ.కి.మీ.పరిధిలో మెట్రో అవసరం
- లీ అసోసియేట్స్ నివేదికలో వెల్లడి



మెట్రో మహా విస్తరణ

మొదటి, రెండు దశలు కాకుండా లీ అసోసియేట్స్ ప్రతిపాదించిన రూట్లు (కి.మీ) ఇవే..

రూటు	కి.మీ
మెట్టుగూడ–మల్కాజిగిరి–ఈసీఐఎల్:	8.0
బోయిన్‌పల్లి–బాలానగర్–హైటెక్‌సిటీ:	14
విప్రో సర్కిల్–గోపన్‌పల్లి–బీహెచ్‌ఈఎల్:	11.2
పటాన్‌చెరు–ఇస్నాపూర్ (ఓఆర్ఆర్):	6.0
హయత్‌నగర్–పెద్దఅంబర్‌పేట్:	15
ఎంజీబీఎస్– అంబర్‌పేట్–ఘట్కేసర్:	35
అమీర్‌పేట్–బాలానగర్–దుండిగల్:	20
హబ్సిగూడ–నాచారం–ఓఆర్ఆర్ ఘట్కేసర్:	17.7
లక్డీకాపూల్–గచ్చిబౌలి–మియాపూర్:	25
నానల్‌నగర్–లంగర్‌హౌస్–మొయినాబాద్:	21
మలక్‌పేట్ మెట్రో–ఐఎస్‌సదన్–ఒవైసీ హాస్పిటల్:	4.5
ఈసీఐఎల్–కీసర:	12.6
ఆరాంఘర్–రేతిబౌలి:	10
ఓఆర్ఆర్ శంషాబాద్–కొత్తూర్–షాద్‌నగర్:	26
నానక్‌రాంగూడ జంక్షన్–నార్సింగ్–శంషాబాద్:	25.4
శంషాబాద్ ఓఆర్ఆర్–తుక్కుగూడ –పెద్దఅంబర్‌పేట్:	40
పెద్దఅంబర్‌పేట్– ఘట్కేసర్ –మేడ్చల్ జంక్షన్:	45
మేడ్చల్ ఓఆర్ఆర్–దుండిగల్ –పటాన్‌చెరు:	30
పటాన్‌చెరు ఓఆర్ఆర్–కోకాపేట్ –నార్సింగ్ ఓఆర్ఆర్:	37.4
బీహెచ్‌ఈఎల్–బాచుపల్లి–కొంపల్లి–దమ్మాయిగూడ:	37.4

2050 నాటికి 31 రూట్లు, 662 కి.మీ.

సాక్షి, సిటీబ్యూరో:

వచ్చే ఇరవై ఐదేళ్లలో మెట్రో మహా విస్తరణకు ముసాయిదా ప్రణాళిక సిద్ధమైంది. విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగర అవసరాలకు అనుగుణంగా 31 కారిడార్లలో 662 కి.మీ. వరకు పొడిగించే అవకాశం ఉంది. మాస్టర్‌ప్లాన్–2050లో భాగంగా హెచ్‌ఎండీఏ కాంప్రహెన్సివ్ మొబిలిటీప్లాన్(సీఎంపీ) కోసం లీ అసోసియేట్స్‌కు ముసాయిదా ప్రణాళిక రూపకల్పన బాధ్యతలను అప్పగించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆ సంస్థ ముసాయిదా నివేదికను రూపొందించింది. త్వరలోనే తుది నివేదికను ప్రభుత్వానికి అందజేయనుంది. ఇప్పుడున్న మూడు కారిడార్‌లు, రెండోదశలో నిర్మించనున్న 8 కారిడార్‌లతో కలిపి 2050 నాటికి 31 కారిడార్‌లలో మెట్రో సదుపాయం అవసరమని పేర్కొంది. మహానగరం శరవేగంగా విస్తరిస్తున్న దృష్ట్యా, మెట్రో విస్తరణ ఎంతో కీలకమని తెలిపింది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 86 లక్షలకుపైగా వాహనాలు ఉన్నాయి. త్వరలో ఈ సంఖ్య కోటికి చేరనుంది. ప్రజారవాణా సదుపాయాలను విస్తరించడం ద్వారా మాత్రమే వ్యక్తిగత వాహనాలను నియంత్రించవచ్చని లీ అసోసియేట్స్ స్పష్టం చేసింది.

దశలవారీగా విస్తరణ...

కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ కోసం 2024వ సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకున్నారు. ప్రస్తుతం నగర జనాభా 1.55 కోట్లు ఉన్నట్లు ఉంటుందని అంచనా. 2050 నాటికి 2.71 కోట్ల నుంచి 3.90 కోట్లకు చేరుకోవచ్చనే అంచనాల మేరకు 7,250 చ.కి.మీ.పరిధిలో మెట్రో విస్తరణకు ఈ సంస్థ ప్రణాళికలను రూపొందించింది. ట్రాఫిక్ సర్వే విశ్లేషణలు, జనాభా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రవాణా సదుపాయాల డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని దశలవారీగా మెట్రో విస్తరించవలసి ఉంటుందని పేర్కొంది.

ఈ మేరకు ప్రస్తుతం 3 కారిడార్‌లలో 69 కి.మీ. వరకు మెట్రో సదుపాయం ఉంది. కొత్తగా ప్రతిపాదించిన రెండోదశ పూర్తయితే మరో 8 కారిడార్లలో మెట్రో అందుబాటులోకి రానుంది. దీంతో సుమారు 200 కి.మీ. వరకు మెట్రో సేవలు విస్తరిస్తాయి. ప్రస్తుతం 5 లక్షల మంది సేవలను వినియోగించుకుంటున్నారు. రెండో దశ పూర్తయితే మరో 10 లక్షల మందికి ఈ సదుపాయం లభించనుంది. 2040 నాటికి మెట్రో మూడోదశలో 340 కి.మీ.లు చేపట్టాలని లీ అసోసియేట్స్ సూచించింది. అప్పటివరకు మరో 15 లక్షల మందికిపైగా కొత్తగా వచ్చి చేరే అవకాశం ఉంది. 2050 నాటికి 662 కి.మీ. పూర్తి చేస్తే 75 లక్షల మందికిపైగా ప్రజలకు మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని ఆ సంస్థ అంచనా వేసింది.

హెచ్‌ఎంఏ డెవలప్‌మెంట్ ప్లాన్...

- హెచ్‌ఎండీఏ పరిధి విస్తరణతో ప్రస్తుతం 11 జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సిద్దిపేట్, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి, నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల్లోని 104 మండలాలు, 1,355 గ్రామాలతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా (హెచ్‌ఎంఏ) ఏర్పడింది.
- జాతీయ పట్టణ రవాణా పాలసీకి అనుగుణంగా భవిష్యత్తులో ప్రజారవాణా సదుపాయాలు, రహదారులు, మెట్రో వంటి ప్రాజెక్టుల విస్తరణ లక్ష్యంగా కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ)ని సిద్ధం చేస్తున్నారు.
- ఈ మేరకు 2050 నాటికి మెట్రోరైలుకు ట్రాఫిక్ డిమాండ్ ఏ స్థాయిలో ఉండనుందనే అంశంపై ఆధారపడి మెట్రో విస్తరణకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు.



కోకాపేటలో చకచకా

ప్రారంభోత్సవాలు.. ఆవిష్కరణ.. వీక్షణలతో సీఎం రేవంత్ రెడ్డి సందడి చేశారు. ముందుగా ఆయన సోమవారం సాయంత్రం 4.30 గంటలకు కోకాపేటలో టోల్‌గేట్‌ను ప్రారంభించారు. 4.55 గంటలకు గండిపేటకు చేరుకుని గోదావరి జలాల తరలింపుపై జలమండలి అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని వీక్షించారు. నగర వ్యాప్తంగా గతంలో నిర్మించిన 12 రిజర్వాయర్‌లను ప్రారంభించారు. అనంతరం గోదావరి జలాల తరలింపు ప్రాజెక్టు పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం సభా వేదిక పైకి వచ్చిన ఆయన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి ప్రజలకు అభివాదం చేశారు. సభ అనంతరం ముఖ్యమంత్రి 5.30 గంటలకు ఢిల్లీ వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు. కొత్తగా ప్రారంభించిన కోకాపేట టోల్‌గేట్ ద్వారా ఔటర్ రోడ్డు మీదుగా వెళ్లారు. – మణికొండ



అన్నదాతల ప్రయోజనాలే ముఖ్యం

- రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: రైతుల ప్రయోజనాల కోసం మార్కెట్ కమిటీలు పనిచేయాలని, రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించేలా కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండ రెడ్డి అన్నారు. సోమవారం బాటసింగారం పండ్ల మార్కెట్‌ను సందర్శించిన ఆయన బత్తాయి రైతులతో ముచ్చటించారు. ఉద్యానవన పంటలకు ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో అన్ని మార్కెట్ కమిటీల పనితీరును కమిషన్ సమీక్షిస్తుందని చెప్పారు. కోహెడలో త్వరలోనే మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కమిషన్‌కు విన్నపం

కొత్తపేట నుంచి పండ్ల మార్కెట్‌ను తాత్కాలిక ప్రాతిపదికన బాటసింగారానికి మార్చినప్పటికీ, వ్యాపారానికి అనువైన వాతావరణం లేదని కమిషన్ ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని, మార్కెట్ యార్డులోని సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు సునీల్‌రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర చారి, సభ్యులు అంజయ్య, మధుసూదన్‌రావు, రఘుపతిరెడ్డి, లక్ష్మి, మచ్చేందర్ రెడ్డి, నర్సింహ, గణేష్ నాయక్, గోవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీంతోపాటు మార్కెట్ ఈఈ ప్రసాద్ రావు, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, ఫ్రూట్ ట్రేడర్స్ అధ్యక్షుడు మహ్మద్ తాజ్, ఉపాధ్యక్షుడు అచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పోలీసులకు క్రికెట్ స్టేడియం!

అంబర్‌పేట లేదా ఆరాంఘర్ చౌరస్తాలో ఏర్పాటుకు యోచన

- నాలుగు ఎకరాల్లో నిర్మించాలని ప్రతిపాదన
- పోలీసులకు ఉచితంగా, ఇతరులకు అద్దెకు..

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సిటీ పోలీసులకు సొంతంగా ఓ క్రికెట్ స్టేడియం అందుబాటులోకి రానుంది. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురావాలని పోలీసు శాఖ భావిస్తోంది. అంబర్‌పేటలోగానీ, ఆరాంఘర్ చౌరస్తాలోగానీ నిర్మించే ఈ స్టేడియాన్ని పోలీసు విభాగం అధికారులు, సిబ్బంది ఉచితంగా, సాధారణ పౌరులు అద్దెకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ స్టేడియం క్రీడావసరాలకు మాత్రమే వినియోగించనున్నారు.

గతంలో స్టేడియం ఉన్నప్పటికీ...


సిటీ పోలీసు విభాగం కొన్ని దశాబ్దాల క్రితం గోషామహల్‌లో శివకుమార్ లాల్ పోలీసు స్టేడియం నిర్మించింది. అయితే ఇందులో అసరమైన వసతులు లేకపోవడంతో పోలీసు శిక్షణలు, డ్రిల్స్‌తోపాటు కొన్ని క్రీడలు, కార్యక్రమాల నిర్వహణకు మాత్రమే వినియోగించేవారు. అయితే అఫ్జల్‌గంజ్‌లో ఉన్న ఉస్మానియా ఆసుపత్రిని ఈ ప్రాంతానికి తరలించాలని ప్రభుత్వం నిర్ణయించి ఆ మేరకు చర్యలు తీసుకుంది. మొత్తం 43 ఎకరాల 37 గుంటలు ఉన్న ఈ స్టేడియం స్థలం నుంచి 31 ఎకరాల 39 గుంటలు ఆసుపత్రికి సేకరించి... 11 ఎకరాల 38 గుంటలు పోలీసు అవసరాలకు కేటాయించింది. ఉస్మానియా ఆస్పత్రి కోసం గోషామహల్ స్టేడియం ప్రాంగణం నుంచి స్థలం తీసుకుంటున్నందున, దీనికి ప్రతిగా ఆరాంఘర్ ప్రాంతంలో 12 ఎకరాలను పోలీసు విభాగానికి కేటాయించింది.

పరిశీలనలో ఆ రెండు ప్రాంతాలు...

గోషామహల్ వద్ద పోలీసు విభాగానికి కేటాయించిన స్థలంలో ట్రాక్‌తోపాటు అశ్వాల కోసం స్టేబుల్స్, పోలీసు జాగిలాల కోసం కెన్నల్స్ నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పోలీసు క్రికెట్ స్టేడియం నిర్మాణానికి రెండు ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. అంబర్‌పేట పోలీసు ట్రైనింగ్ కాలేజీ(పీటీసీ) ప్రాంగణంలో చాలా భాగం ఖాళీగా ఉంది. అయితే అక్కడకు రాకపోకలు సాగించడానికి కొన్ని ఇబ్బందులు ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. గోషామహల్ స్టేడియం స్థలానికి ప్రతిగా ఆరాంఘర్ చౌరస్తాలో ప్రభుత్వం కేటాయించిన 12 ఎకరాల స్థలంలో రాష్ట్రస్థాయి బ్యారెక్స్, ప్లేగ్రౌండ్, డ్రిల్ ఏరియా నిర్మించాలని డీజీపీ కార్యాలయం ఇప్పటికే నిర్ణయించింది. దీంతో ఇందులో నుంచి నాలుగు ఎకరాలను క్రికెట్ స్టేడియం కోసం తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాంతం విమానాశ్రయం, ఇన్నర్ రింగ్‌రోడ్, ఔటర్ రింగ్‌రోడ్ నుంచి రాకపోకలు సాగించడానికి అనువుగా ఉంటుంది.

వినియోగం.. ఆదాయం..

ఈ క్రికెట్ స్టేడియాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సభలు, సమావేశాలు, కార్యక్రమాలు, శుభకార్యాలకు ఇవ్వరు. క్రికెట్ ఆడటానికి, శిక్షణ ఇవ్వడానికి అనువుగా సకల సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ స్టేడియంలో పోలీసు స్పోర్ట్స్ మీట్స్‌తోపాటు పోలీసు అధికారులు, సిబ్బంది వారాంతాలు, ఇతర సమయాల్లో క్రికెట్, ఇతర క్రీడలు ఆడుకోవడానికి ఉచితంగా అందిస్తారు. ఔత్సాహికులైన యువకులు, క్రీడాకారులు ఈ గ్రౌండ్‌ను అద్దెకు తీసుకోవచ్చు. ఇప్పటికే పెట్రోల్ బంకులు తదితరాల ద్వారా పోలీసు వెల్ఫేర్ ఫండ్‌కు ఆదాయం వస్తున్న నేపథ్యంలో ఈ స్టేడియాన్ని క్రీడావసరాలకు అద్దెకు ఇవ్వడం ద్వారానూ ఆదాయం పొందవచ్చని పోలీసు విభాగం యోచిస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి దీని పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



సవ్యమైన జాబితాకు సహకరించండి!

జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై పార్టీల ప్రతినిధుల సమావేశంలో కర్ణన్



సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక ఓటర్ల తుది జాబితాను సవ్యంగా సిద్ధం చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ కోరారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక సంక్షిప్త సవరణకు సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ఈ నెల 2వ తేదీన ప్రచురించామన్నారు. ఆ మేరకు నియోజకవర్గంలోని 139 లొకేషన్లలో 407 పోలింగ్‌స్టేషన్ల పరిధిలో 3 లక్షల 92 వేల 669 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ వివరాలతో కూడిన జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు అందజేసినట్లు చెప్పారు. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ), జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్లలో కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

పోలింగ్ ఏజెంట్లను నియమించాలి

ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ ఏజెంట్ల(బీఎల్ఏ)ను నియమించి, జాబితా సవరణ పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు భాగస్వాములు కావాలని పార్టీల ప్రతినిధులను కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 17 వరకు అవకాశం ఉందని, ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న, అర్హులైన పౌరులు ఆ తేదీలోగా తప్పనిసరిగా ఓటరుగా నమోదయ్యేలా చూడాలని రాజకీయ పార్టీలను కర్ణన్ కోరారు. జాబితాలో సవరణలు, మార్పులు చేర్పులు చేయాలనుకున్నా అదే తేదీ(సెప్టెంబర్ 17)లోపు దరఖాస్తు ఫారాలు సమర్పించాలన్నారు.

ఈ నెల 30న తుది జాబితా

ఇప్పటివరకు ఫారం–6, 6ఎ, 7, 8ల ద్వారా వచ్చిన 2,855 దరఖాస్తులు, అభ్యంతరాల్లో 246 (8.62 శాతం) దరఖాస్తులను పరిష్కరించామని కర్ణన్ తెలిపారు. ఓటర్ల తుది జాబితాను సెప్టెంబర్ 30న ప్రచురించనున్నట్లు చెప్పారు. సమావేశానికి ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈఓ పల్లవి విజయ్‌వంశీ, అదనపు కమిషనర్(ఎలక్షన్స్) మంగతాయారు హాజరయ్యారు. నందేశ్ కుమార్(బహుజన్ సమాజ్ పార్టీ), పి.వెంకటరమణ, పవన్ కుమార్(భారతీయ జనతా పార్టీ), విజయ్ మల్లంగి (ఆమ్ ఆద్మీ పార్టీ), ఎం.శ్రీనివాస రావు (కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా–మార్క్సిస్టు), రాజేశ్ కుమార్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), వై.జయసింహ, కె.మాధవ్ (భారత్ రాష్ట్ర సమితి), కె.జోగేందర్ సింగ్, ప్రశాంత్ యాదవ్ (తెలుగుదేశం పార్టీ), సయ్యద్ ముస్తాక్ (ఎఐఎంఐఎం) తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు హైదరాబాద్ జిల్లాలో జీఐఎస్ ఆధారిత నజరి నక్ష తయారీ కార్యాచరణ ప్రణాళికపై కర్ణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు.

అక్టోబర్ 3న దత్తన్న ‘అలయ్–బలయ్’

ముషీరాబాద్: హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రతి యేటా నిర్వహించే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన అలయ్–బలయ్ కార్యక్రమం అక్టోబర్ 3వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. సోమవారం రాంనగర్‌లోని దత్తాత్రేయ నివాసంలో అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి దత్తాత్రేయ మాట్లాడుతూ 20 ఏళ్ల అలయ్–బలయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ ఉపరాష్ట్రపతులు, మాజీ గవర్నర్‌లు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, సినీ ప్రముఖులు, సామాజిక సేవామూర్తులను ఆహ్వానించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే కళారూపాలతోపాటు తెలంగాణ వంటలు, పిండి వంటలను ఈ దఫా ప్రత్యేకంగా చేస్తున్నట్లు తెలిపారు.

వదల బొమ్మాళీ.. వదల!

రెగ్యులర్ అధికారి బాధ్యతలు చేపట్టినా కదలని ఇన్‌చార్జ్

- అదే చాంబర్‌లో నెలరోజులుగా విధులు
- సాక్షాత్తు ప్రధాన కార్యాలయంలో నిబంధనలు తూచ్
- గతంలో పోస్టింగ్, పదోన్నతుల్లో చేతివాటం ఆరోపణలు
- పట్టని తూనికలు, కొలతల శాఖ రాష్ట్ర కంట్రోలర్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర తూనికలు, కొలత శాఖ లెక్క తప్పింది. తూకాలు, మోసాలపై పర్యవేక్షణమో గానీ, పరిపాలనపరమైన వ్యవహారాల్లో సైతం జవాబుదారీతనం కొరవడింది. సాక్షాత్తు ప్రధాన కార్యాలయంలోని పరిపాలన విభాగంలో రెగ్యులర్ అధికారి బాధ్యతలు చేపట్టినప్పటికీ నెల రోజుల క్రితం వరకు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించిన అధికారి మాత్రం చాంబర్‌ను వదలా.. కదలా.. అంటూ యధావిధిగా ఫైళ్లను పరిశీలిస్తుండటం ఉద్యోగ వర్గాల్లో చర్చనీంశంగా మారింది. ఇటీవల తూనికల, కొలతల శాఖలో పలువురికి పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర కంట్రోలర్ ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా హైదరాబాద్ హెడ్ క్వార్టర్–1 డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్(డీఐ)కి అసిస్టెంట్ కంట్రోలర్(ఏసీ)గా పదోన్నతి కల్పించి ప్రధాన కార్యాలయంలోని పరిపాలన విభాగంలో హెడ్‌క్వార్టర్ అసిస్టెంట్ కంట్రోలర్‌గా రెగ్యులర్ పోస్టింగ్ ఇచ్చారు. జూలై 31న పదోన్నతి పొందిన సదరు అధికారిణి తక్షణమే రిపోర్టు చేసి బాధ్యతలు చేపట్టారు. అప్పటి వరకు హెడ్ క్వార్టర్ అసిస్టెంట్ కంట్రోలర్‌గా విధులు నిర్వహించిన వరంగల్ అసిస్టెంట్ కంట్రోలర్ పూర్తి అదనపు బాధ్యత(ఎఫ్ఏసీ)ల నుంచి తప్పుకోవాల్సి ఉంటుంది. కానీ, రెగ్యులర్ అధికారిణి డ్యూటీలో చేరినప్పటికి 25 రోజులుగా సదరు అధికారి మాత్రం కార్యాలయానికి త్వరగా వచ్చి ప్రధాన సీటుపై కూర్చుంటూ ఫైళ్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఏడాదిపాటు హెడ్ క్వార్టర్ ఏసీగా వ్యవహరించిన సదరు అధికారి సీనియర్ కావడం, మరోవైపు పలువురు ఉద్యోగుల పదోన్నతి ఫైళ్ల వ్యవహారం ఉండటంతో ఆయన అనుభవం తనకు సహకారంగా ఉంటుందని సదరు అధికారిణి కూడా మిన్నుకుండినట్లు సమాచారం. అయితే వారం రోజుల క్రితం పదోన్నతుల ప్రక్రియ పూర్తి కావడంతో రెగ్యులర్ అధికారిణి ఆఫీస్‌కు ఆయన కంటే ముందుగానే వచ్చి ప్రధాన కుర్చీలో కూర్చుంటున్నారు. అయినా సదరు అధికారి మరో సాధారణ కుర్చీలో కూర్చొని ఫైళ్లు పరిశీస్తూ చాంబర్‌ను వదలక పోవడం ఉద్యోగులను విస్మయానికి గురిచేస్తోంది. ఈ వ్యవహారాన్ని రాష్ట్ర కంట్రోలర్ కూడా పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది.



హాజరెట్లెట్టా..?

ప్రధాన కార్యాలయంలో హెడ్ క్వార్టర్ అసిస్టెంట్ కంట్రోలర్ పూర్తి అదనపు బాధ్యతలను నుంచి నుంచి తప్పుకున్నా వరంగల్‌లోని రెగ్యులర్ ఏసీ విధులకు హాజరు కాకుండా హెడ్ క్వార్టర్‌లోనే ఉండిపోవడంతో హాజరు నమోదుపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం రెగ్యులర్ పోస్టింగ్‌లో కాకుండా ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తే, ఆన్ డ్యూటీ హెడ్ ఆఫీస్ (ఓడీహెచ్) అని హాజరు పట్టికలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఎక్కువ రోజులైతే మాత్రం ఆ శాఖాధిపతి అనుమతి తప్పనిసరి. అయితే ఎలాంటి అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయంలోనే తిష్ట వేసి ఫైళ్లు తిరగేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. సదరు అధికారి ఇటీవల జరిగిన ఉద్యోగుల పదోన్నతుల వ్యవహారంలో కూడా చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

అదనపు బాధ్యతల మాటున తప్పిదాలెన్నో..

సదరు అధికారి పలు నిబంధనలు సైతం తుంగలో తొక్కి పదోన్నతులు, కొత్త పోస్టింగ్‌ల్లో పలు జిమ్మిక్కులు చేసినట్లుగా విమర్శలు ఉన్నాయి. పదోన్నతులతో కొత్త స్థానాల్లో చేరినవారు కొద్ది నెలలకే తాము కోరుకున్న చోటుకు బదిలీ చేయడం గమనార్హం. వాస్తవంగా బదిలీలపై నిషేధం కొనసాగుతోంది. అయినా ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 20న పలువురు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి పరిపాలనా సౌలభ్యానికి అనుగుణంగా ఖాళీగా ఉన్న స్థానాల్లో పోస్టింగ్‌లు కేటాయించారు. పదోన్నతుల ద్వారా పోస్టింగ్‌లో చేరి శిక్షణ పూర్తి చేసిన తర్వాత కొందరికి పోస్టింగ్ మార్చి కోరుకున్న స్థానాల్లో బదిలీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

కొన్ని ఇలా....

- పదోన్నతి ద్వారా హైదరాబాద్ సీసీ–1 ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ లభించిన ఉద్యోగికి జనగామకు, హెడ్ క్వార్టర్ హైదరాబాద్–1 సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌గా పోస్టింగ్‌లో చేరిన మరో ఉద్యోగికి రంగారెడ్డి జిల్లా ఆఫీస్‌కు బదిలీ చేశారు.
- మేడ్చల్–మల్కాజిగిరి డీఐ పోస్టు సస్పెన్షన్‌తో ఖాళీ కాగా, ఆ స్థానంలో నల్లగొండ డీఐకి బదిలీపై పోస్టింగ్ ఇచ్చారు. వాస్తవంగా బదిలీలపై నిషేధాజ్ఞలు అమల్లో ఉన్న నేపథ్యంలో ఖాళీగా ఉన్న పోస్టుకు ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించవచ్చు. కానీ, నేరుగా బదిలీ చేయడం విస్మయానికి గురిచేస్తోంది.
- నిబంధనల ప్రకారం నిషేధిత కాలంలో పరిపాలనా సౌలభ్యం కోసం బదిలీలు చేయాలంటే కూడా ప్రభుత్వం ఉన్నత స్థాయి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా ఆమోదం పొందాల్సి ఉంటుంది. కానీ, తూనికలు, కొలతల శాఖ పరిపాలనా విభాగం నిబంధనలను తుంగలోకి తొక్కి సిఫార్సులు చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే నిబంధనలకు వ్యతిరేకంగా బదిలీలు జరగడంతో ట్రెజరీ అండ్ అకౌంట్ విభాగం వారి వేతనాల చెల్లింపు నిలిపివేసినట్లు తెలుస్తోంది.

నిర్మాత అల్లు అరవింద్‌కు షోకాజ్ నోటీసులు



జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లోని అల్లు అరవింద్‌కు చెందిన భవనం..

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం చేపట్టిన ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌కు చెందిన భవనానికి ఎందుకు కూల్చవద్దో చెప్పాలంటూ జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లో సినీ నిర్మాత అల్లు అరవింద్‌కు చెందిన 8-2-293/82/775/ఏ లో 996 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్లాట్ ఉంది. సదరు స్థలంలో అల్లు అరవింద్ నిర్మాతగా గీత ఆర్ట్స్ కార్యాలయం కొనసాగుతోంది. ఈ భవన నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ నుంచి రెండు సెల్లార్లతో పాటు జీ ప్లస్ 4 అనుమతులు పొందారు. అయితే అనుమతులకు విరుద్ధంగా ఒక అంతస్తును అక్రమంగా నిర్మించారు. ఈ విషయాన్ని గుర్తించిన జీహెచ్‌ఎంసీ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేస్తూ ఎందుకు కూల్చవద్దో చెప్పాలంటూ పేర్కొన్నారు. ప్లాన్‌కు విరుద్ధంగా అక్రమ అంతస్తు ఎలా నిర్మిస్తారంటూ ప్రశ్నించారు.

జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ సొసైటీకి జరిమానా

- రెరా రిజిస్ట్రేషన్ లేకుండా ప్రీ లాంచ్ విక్రయాలు
- రూ.18.51 లక్షలు జరిమానా విధించిన టీజీ రెరా
- మంచిరేవుల లో 13.7 ఎకరాల్లో ప్రాజెక్ట్

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా) లో నమోదు చేయకుండా ప్రీ లాంచ్‌లో విక్రయాలు చేసిన జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ సొసైటీకి టీజీ రెరా రూ.18,51,255 జరిమానా విధించింది. తమ ఆదేశాలు పాటించక పోతే సెక్షన్- 63 కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ సొసైటీ మంచిరేవుల లో జూబ్లీహిల్స్ ఫేజ్-4 పేరుతో ప్రాజెక్టును నిర్మిస్తోంది. 13.7 ఎకరాల్లో 1910 యూనిట్లు, 40 అంతస్తుల్లో భారీ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నట్లు బ్రోచర్లు ముద్రించి ప్రచారం చేసుకుంది. హెచ్‌ఎండీఏ నుంచి నిర్మాణ అనుమతులు తీసుకోకుండా, టీజీ రెరాలో రిజిస్ట్రేషన్ చేయకుండా అక్రమంగా విక్రయాలు చేస్తున్నట్లు టీజీ రెరా దృష్టికి వచ్చింది. టీజీ రెరా సుమోటో కేసు నమోదు చేసింది. టీజీ రెరా రిజిస్ట్రేషన్ లేకుండా బ్రోచర్లు ముద్రించి, ప్రకటనలు చేసి ప్లాట్లు విక్రయించింది. సొసైటీలో సభ్యత్వం పొందడానికి తప్పనిసరిగా ఈ ప్రాజెక్ట్‌లో ప్లాట్ కొనాలి అని నిబంధన పెట్టడంతో పాటు 800 మంది కొత్త సభ్యులను చేర్చుతున్నట్లు ప్రకటించింది. ప్రతి దరఖాస్తుదారుడి నుండి రూ.5 లక్షల సొమ్మును అడ్వాన్స్‌గా వసూలు చేశారు. ఒక్కో ఫ్లాట్ ధరను రూ.2 కోట్లుగా నిర్ణయించి, సుమారు రూ.90 కోట్లు వసూలు చేసింది. సొసైటీ కమిటీ సభ్యులు సేకరించిన డబ్బులో కొంత మొత్తాన్ని వ్యక్తిగత ఖాతాలకు మళ్లించారు. ప్రాజెక్ట్ ను సొసైటీ చేపడుతున్నప్పటికీ సెక్షన్ 2(జెడ్ కే) ప్రకారం టీజీ రెరాలో నమోదు తప్పనిసరి అని, రెరా రిజిస్ట్రేషన్ పూర్తయ్యే వరకు ప్రాజెక్ట్ ప్రచారం, అమ్మకం, బుకింగ్ చేయకూడదని ఆదేశించింది. అయితే ఈ ప్రాజెక్ట్‌పై హైకోర్టు స్టే ఆర్డర్ ఇవ్వడం గమనార్హం.

రూ.1.92 కోట్ల ‘పాత కరెన్సీ’ స్వాధీనం

- నలుగురిని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్
- మరికొందరి కోసం కొనసాగుతున్న గాలింపు



సాక్షి, సిటీబ్యూరో: సుదీర్ఘకాలం తర్వాత నగరంలో మరోసారి రద్దయిన రూ.500, రూ.1000 నోట్లు పట్టుబడ్డాయి. 2016లో డీమానిటైజేషన్ తర్వాత దాదాపు రెండున్నరేళ్ల పాటు ఈ కేసులు నమోదైనా... ఆ తర్వాత తగ్గిపోయాయి. తాజాగా సోమవారం రాత్రి నలుగురిని అదుపులోకి తీసుకున్న ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.1.92 కోట్ల పాత కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. వీరిచ్చిన సమాచారంతో సూత్రధారులతో పాటు మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. డీమానిటైజేషన్ సమయంలో ప్రభుత్వం పాత కరెన్సీ మార్పిడికి అవకాశం ఇచ్చింది. బ్యాంకులతో పాటు కొన్ని పోస్టాఫీసుల్లోనూ ఆధార్ సహా ఇతర ఆధారాలు సమర్పించి నగదు మార్పిడి చేసుకోవడానికి, బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే బ్లాక్ కరెన్సీ కలిగిన అనేక మంది అప్పట్లో మార్పిడి, డిపాజిట్ చేసుకునేందుకు ముందుకు రాలేదు. ఇలాంటి వారికోసం పని చేసిన కొన్ని ముఠాలు కమీషన్ ప్రాతిపదికన వీటిని మార్పిడి చేశాయి. మరికొందరు మార్పిడి పేరుతో ఎర వేసి అందినకాడికి దండుకుని ఉడాయించారు. కొందరు నూడో పోలీసులు, ఖాకీలు సైతం ఈ దందాలు నడిపారు. 2016-18 మధ్య ఇలాంటి కేసులు అనేకం నమోదయ్యాయి. అయితే కరోనా ప్రభావంతో అమలులోకి వచ్చిన లాక్‌డౌన్ తర్వాత ఇలాంటి మోసాలు, వ్యవహారాలు, కేసులు దాదాపుగా తగ్గిపోయాయి. అప్పుడప్పుడు మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. ఇలాంటి ఓ ఉదంతమే సోమవారం బయటకు వచ్చింది. కొందరు వ్యక్తులు కమీషన్ తీసుకుని పాత కరెన్సీని మార్చి, కొత్త రూ.500, రూ.200, రూ.100 నోట్లు ఇస్తామంటూ ప్రచారం చేసుకున్నారు. వీరి మాటలు నమ్మిన కొందరు తమ వద్ద ఉన్న నగదును ఇద్దరు వ్యక్తులకు ఇచ్చి పంపారు. దీనిపై సమాచారం అందుకున్న ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం నారాయణగూడ పోలీసుస్టేషన్ పరిధిలో వలపన్నారు. శాంతి థియేటర్ ఎదురుగా ఉన్న కెనరా బ్యాంక్ వద్ద ఇద్దరిని, వీరిచ్చిన సమాచారంతో వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద ఎదురు చూస్తున్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న మూడు బ్యాగులను తనిఖీ చేయగా... అందులో రూ.1.92 కోట్ల పాత కరెన్సీ లభించింది. ఇందులో అత్యధికం రూ.1000 నోట్లే ఉన్నట్లు తెలుస్తోంది. వీరి విచారణ నేపథ్యంలో ఈ కరెన్సీని మార్పిడి కోసం ఇచ్చిన వారు, మారుస్తామంటూ ఒప్పందం చేసుకున్న వారు మరి కొందరు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మియాపూర్‌లోని ఓ ఇంట్లో మరికొందరు అనుమానితులు ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ గుర్తించింది. దీంతో వారితో పాటు ఇతర నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి. అందరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తేనే ఈ కరెన్సీ మూలాలు, మొత్తం ఎంత ఉందనేది తెలుస్తుందని అధికారులు చెబుతున్నారు. దీనిపై మంగళవారం పూర్తి స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. ఈ నలుగురు నిందితులను అధికారులు టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించి వివిధ కోణాల్లో విచారిస్తున్నారు.

సీఎంను దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు

వ్యక్తి అరెస్ట్

హస్తినాపురం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అవమానకరపోస్టులు పెట్టిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి వనస్థలిపురం పోలీసులు తెలిపిన మేరకు.. అబ్దుల్లాపూర్ మండలం ఇంజాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరకాలనీకి చెందిన చెందిన బొక్కమురళీధర్‌రెడ్డి (44) తుర్కయంజాల్ వాట్సాప్ గ్రూపులో అవమానకర పోస్టులు పెట్టాడని వనస్థలిపురం ఇందిరమ్మకాలనీకి చెందిన మేతరి దర్శన్ ఫిర్యాదు చేశారు.ఆ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సర్పంచ్‌లు, ఎమ్మెల్యే అవినీతికి పాల్పడకుండా ఉండలేరు తెలంగాణ అనే హెడ్డింగ్‌తో పాటు సీఎం రేవంత్‌రెడ్డి ఫోటో పెట్టి ఒక పోస్టు పెట్టారని, అదేవిధంగా సిగ్గు సిగ్గు రేవంత్ సిగ్గు సిగ్గు గాంధీలో నీళ్లు లేవటా ఆపరేషన్లు బంద్ బాత్రుంలకు తాళాలు అనే మరో అవమానకరమైన పోస్టు ను పెట్టినట్లు యాదయ్య తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం సోమవారం మురళీధర్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం

ఘట్‌కేసర్: ఓ మహిళను కారు ఢీ కొట్టిన ఘటనలో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌కు చెందిన దాచారం మల్లమ్మ (77) సోమవారం ఉదయం ఇంటి నుంచి బీబీనగర్ నెమురగొములకు బయలుదేరింది. అవుషాపూర్ ఎస్పీఆర్ స్కూల్ వద్ద రోడ్డు దాటుతుండగా.. (టీఎస్08హెచ్‌టీ7813) కారు వేగంగా వచ్చి ఢీకొట్టగా.. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం ముందు వెళ్తున్న బైక్‌ను సైతం ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నిర్లక్ష్యంగా కారు నడిపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


శ్రీను (ఫైల్)

మియాపూర్: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నాగారం గ్రామానికి చెందిన ఓర్స్ శ్రీను(39) కుటుంబంతో సహా నగరానికి వలస వచ్చి పాశమైలారంలో ఉంటూ కంప్రెషర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం మియాపూర్, ప్రశాంత్ నగర్ కాలనీలో భవన నిర్మాణ పనుల్లో పాల్గొనేందుకు వచ్చాడు. అక్కడ ఉన్న బండను కంప్రెషర్‌తో తొలగిస్తుండగా సమీపంలోని బోరు మోటర్ విద్యుత్ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. తోటి కార్మికులు అతడిని సమీపంలోని శ్రీకర ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీనిపై సమాచారం అందడంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. భవన నిర్మాణ దారుడిపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి అక్కడినుంచి పంపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య శాఖకు అవినీతి జబ్బు!

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఇష్టారాజ్యం

- తనిఖీలు, నోటీసుల పేరుతో దందా
- అనుమతుల పేరిట వసూళ్ల పర్వం
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఫైర్‌సేఫ్టీ సహా అనుమతి లేని ఇరుకైన భవనాల్లో ఏర్పాటు చేసిన పలు ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. రోగుల సేవలో తరించాల్సిన కొంత మంది వైద్యాధికారులు ఆస్పత్రుల తనిఖీల పేరుతో అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొత్తగా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు, క్లినిక్‌లకు అనుమతుల జారీ సహా పాత ఆస్పత్రులకు లైసెన్సుల పునరుద్ధరణ పేరుతో ఇలా నోటీసులు జారీ చేసి, అలా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. చిన్న చిన్న సాంకేతిక అంశాలను సాకుగా చూపించి, ఆస్పత్రి, పడకలు, స్కానింగ్ మిషన్లు, లేబోరేటరీల నిష్పత్తిని బట్టి వసూలు చేస్తున్నారు. ఆస్పత్రి నిర్వాహకులు చేసేది లేక వారు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. పెట్టిన పెట్టుబడిని మళ్లీ సంపాదించుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అర్హత, అనుభవం లేకపోయినా గుట్టుగా అవయవమార్పిడి, సంతాన సాఫల్యం వంటి ఖరీదైన చికిత్సలు చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఎప్పటికప్పుడు అధికారుల పనితీరుపై నిఘా పెట్టాల్సిన జిల్లా ఉన్నతాధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లు తయారైంది.

భారీగా ముడుపులు

జిల్లాలో స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ, జనరల్ నర్సింగ్‌హోమ్‌లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు మూడు వేలకుపైగా ఉన్నట్లు అంచనా. వీటిలో 2,500 వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి అను మతులు పొందాయి. మరో 400 వరకు ఎలాంటి అనుమతులు లేని క్లినిక్‌లు ఉన్నట్లు అంచనా. అర్హతలు, అనుమతులు లేకుండా చికిత్స చేస్తున్న ఆస్ప త్రులు, వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వరుస దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. ఆయుర్వేద, యునానీ కోర్సులు చేసిన వారు అల్లో పతి వైద్యులుగా.. ఆర్‌ఎంపీలు ఎంబీబీఎస్ వైద్యు లుగా చలామణి అవుతున్నారు. ప్రాథమిక వైద్య సేవలు అందించాల్సిన చోట ఇన్‌పేషంట్లకు చికిత్స లు అందిస్తున్నారు. అబార్షన్లతో పాటు కుటుంబ నియంత్రణ, సున్తీ వంటి చికిత్సలు చేస్తున్నారు. అధిక రక్తస్రావం సహా ఇతర కారణాలతో ఆయా బాధితులు మృత్యువాతపడుతున్నారు. ఇలాంటి నకిలీ వైద్యులను, ఆస్పత్రులను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు గుర్తించి, కేసులకు సిఫార్సు చేస్తోంది. ఆ బాధ్యతను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు అప్పగిస్తోంది. ఆయా ఆస్పత్రులను తాత్కాలికంగా సీజ్ చేస్తున్నారు. ఆస్పత్రు ల లైసెన్సులు రద్దు చేయక పోగా, కొద్ది రోజులకే వాటిని తిరిగి తెరిపిస్తున్నారు. ఇందుకు ఒక్కో ఆస్ప త్రి నుంచి భారీగా ముడుపులు ముడుతున్నట్లు తెలిసింది. కందుకూరు, షాద్‌నగర్ డివిజన్ల పరిధిలో అక్రమ వసూళ్ల దందా యథేచ్ఛగా జరుగుతున్నట్లు సమాచారం. డిప్యూటేషన్లపై అడ్డదారిలో వచ్చిన ఓ వైద్యురాలు.. గడువు ముగిసిన తర్వాత కూడా ఇక్కడే డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా కొనసాగుతూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

ఒకరి పేరున.. మరొకరు

నిజానికి ఏ వ్యక్తి పేరునైతే ఫార్మసీ, ల్యాబ్‌లకు లైసెన్స్ పొందుతారో ఆ వ్యక్తి విధిగా అందుబాటులో ఉండాలి. కానీ మెజార్టీ కేంద్రాల్లో ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు అందుబాటులో ఉండటం లేదు. కనీస అర్హత లేని వారితో రక్త, మూత్ర వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే అటెండర్లు మందులు ఇచ్చేస్తున్నారు. కీలకమైన స్కానింగ్ సెంటర్లలోనూ ఇదే పరిస్థితి. రేడియాలజిస్టుకు బదులు ఎక్సరే టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులతో పరీక్షలు చేయిస్తున్నారు. కడుపులో ఉన్నది ఆడో మగో ముందే చెబుతూ పరోక్షంగా అబార్షన్లకు కారణమవుతున్నారు. జిల్లాలో 700పైగా స్కానింగ్ సెంటర్లు ఉండగా, వీటిలో మెజార్టీ సెంటర్లలో కనీస అర్హత ఉన్నవారు లేరంటే ఆశ్చర్యపోనవసరం లేదు. మూడు నెలలకోసారి మెడికల్ షాపుల నుంచి అసోసియేషన్ ప్రతినిధులే వసూలు చేసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ముడుపులు ముట్టజెబుతున్నట్లు తెలిసింది.

నేత్రదానం మహాదానం: సజ్జనార్


నేత్రదాన పక్షోత్సవాలను ప్రారంభిస్తున్న సజ్జనార్

గోల్కొండ: నేత్రదానంపట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని టీజీఎస్‌ఆర్‌టీసీ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ వైస్ చైర్మన్ వి.సి.సజ్జనార్ అన్నారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సోమవారం మెహిదీపట్నంలోని సరోజినీదేవి కంటి ఆసుపత్రిలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. సుదీర్ఘకాలంగా నేత్రదానంపై సరోజినీదేవి ఆసుపత్రి వారు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. నేత్రదానం వల్ల మరొకరికి కంటి చూపు ప్రసాదించవచ్చన్నారు. తమ వంతు కృషిగా బస్టాండ్‌లు, బస్‌డిపోల వద్ద నేత్రదాన ఆవశ్యకతపై పోస్టర్‌లు అతికించామని తెలిపారు. కార్యక్రమంలో ఉస్మానియా వైద్యకళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, సిద్దిపేట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంగీత, ఎంపీసీడీ సభ్యురాలు డాక్టర్ కళావతి, సరోజినీదేవి కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని తదితరులు పాల్గొన్నారు.

ఆటో దొంగను పట్టించిన వాట్సాప్ గ్రూప్

గ్రూపులో పెట్టిన గంటన్నరలోనే గుర్తించిన సభ్యుడు..
- దొంగను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగింత..
- బంజారాహిల్స్‌లో ఘటన..


ఆటోతో యజమాని బిపిన్‌రాజ్‌యాదవ్..

బంజారాహిల్స్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఆటో చోరీకి గురికాగా, ఈ వైనాన్ని సదరు ఆటోడ్రైవర్ తమ ప్రాంతానికి చెందిన వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశాడు. దీంతో గ్రూప్ సభ్యులు ఈ విషయాన్ని షేర్ చేయడంతో గంటన్నర వ్యవధిలోనే ఆల్వాల్‌లో దొంగతనానికి గురైన ఈ ఆటో బంజారాహిల్స్‌లో పట్టుబడింది. వివరాల్లోకి వెళితే.. బొల్లారం రిసాలబజార్‌లో నివసించే ఝార్ఖండ్‌కు చెందిన బిపిన్‌రాజ్‌యాదవ్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఆటోను తన ఇంటి ముందు పార్క్ చేశాడు. సోమవారం ఉదయం బయటికి వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి ఆటోను చోరీ చేసి తీసుకు వెళ్తున్నట్లు గుర్తించాడు. ఈ విషయాన్ని ఝార్ఖండ్‌కు చెందిన తమవారందరితో కలిసి ఉన్న ‘ఝార్ఖండ్ ఏక్ తా సమాజ్’ వాట్సాప్ గ్రూపులో చోరీకి గురైన ఆటోతో పాటు సీసీ ఫుటేజీని కూడా పోస్ట్ చేశాడు. ఉదయం 11.30 గంటల ప్రాంతంలో దీపక్‌కుమార్ అనే ఝార్ఖండ్ వాసి మరిన్ని గ్రూపుల్లో దీనిని పోస్ట్ చేశాడు. బొల్లారంలో ఉంటున్న ఝార్ఖండ్‌కు చెందిన కల్లుకుమార్ అనే ఆటోడ్రైవర్ ప్రయాణికులను ఎక్కించుకుని బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లో స్టార్ ఆస్పత్రికి వచ్చాడు. అదే రోడ్డులో బిపిన్ పోగొట్టుకున్న ఆటో పక్కన పార్కింగ్ చేసి కనిపించడంతో పాటు ఓ వ్యక్తి ఆటోకు అంటించిన స్టిక్కర్లను తొలగిస్తూ కనిపించాడు. దీనిని గుర్తించిన కల్లు కుమార్ వీడియో తీసి మళ్లీ వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశాడు. చోరీకి గురైన తన ఆటో ఇదేనంటూ, వెంటనే అక్కడికి వెళ్లాలంటూ వాట్సప్‌లో రిక్వెస్ట్ చేశాడు. దీనిపై స్పందించిన బంజారాహిల్స్‌లో నివసిస్తున్న ఝార్ఖండ్ వాసులు రోడ్డునెంబర్-10లోని ఆటో వద్దకు చేరుకున్నారు. ఆటోపై స్టిక్కర్లు తొలగిస్తున్న వ్యక్తిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆటోతో పాటు దొంగను అదుపులోకి తీసుకున్నారు.

ఆల్వాల్ పోలీసులకు నిందితుడి అప్పగింత..

నిందితుడిని పట్టుకున్న ఝార్ఖండ్ వాసు బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించగా వారు అతడిని ఆల్వాల్ పోలీసులకు అప్పగించారు. విచారణలో దొంగతనం చేసిన యువకుడు జీడిమెట్ల పరిధిలోని రొడామిస్త్రీకాలనీకి చెందిన రోహిత్‌గా గుర్తించారు. సదరు ఆటోను అతను తన స్నేహితుడు రఘురామ్‌కు ఇవ్వగా రఘురామ్ తన బంధువులకు ఎక్కించుకుని బంజారాహిల్స్‌లోని స్టార్ ఆస్పత్రికి వచ్చి ఝార్ఖండ్‌వాసులకు చిక్కాడు. ఇలా ఒక వాట్సాప్ గ్రూప్ గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టించగా, పోలీసులు సైతం ఊపిరిపీల్చుకున్నారు. ఝార్ఖండ్ వాసుల వాట్సాప్ గ్రూప్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

రైలుకిందపడి ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య



హితవర్షిణి గుర్తింపు కార్డు


హితవర్షిణి (ఫైల్)

సికింద్రాబాద్: రైలు కింద పడి బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్‌రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య ఓ యువతి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు లోకోపైలట్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం వద్ద లభించిన గుర్తింపుకార్డు ఆధారంగా మృతురాలిని ఘట్‌కేసర్ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐ అండ్ డీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని దుంపటి హితవర్షిణి(20)గా గుర్తించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన అంజన్న కుమార్తె హిత వర్షిణి ఘట్‌కేసర్‌లోని కాలేజీ హాస్టల్‌లో ఉంటూ ఇంజినీరింగ్ చదువుతోంది. సెలవుల కారణంగా మూడు రోజుల క్రితం ఆర్మూర్‌కు వెళ్లిన ఆమె ఆదివారం మధ్యాహ్నం నిజామాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులో సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్‌కు చేరుకుంది. అక్కడి నుంచి మెట్రో రైలు ఎక్కి ఉప్పల్ స్టేషన్‌లో దిగింది. ఉప్పల్ నుంచి ఆటోలో ఘట్‌కేసర్ చేరుకున్న హితవర్షిణి సమీపంలోని ట్రాక్ వద్దకు వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు దర్యాప్తు పట్టారు.

ప్రేమ వ్యవహారమే కారణమా..? లక్సెట్టి పేటలో యువకుడి ఆత్మహత్య

కాగా హిత వర్షిణి (20) వినయ్ అనే యువకుడిని ప్రేమిస్తున్నట్లు సమాచారం. హితవర్షిణి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలియగానే వినయ్ సోమవారం మధ్యాహ్నం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం


మహేందర్ (ఫైల్)

ఉప్పల్: కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జనగాం జిల్లా, కోటిగల్లు ప్రాంతానికి చెందిన మహేందర్(30), గీతాంజలి దంపతులు నగరానికి వలస వచ్చి బీరప్పగడ్డలో నివాసముంటున్నారు. మహేందర్ రాణిగంజ్‌లో ఆర్వో వాటర్ టెక్నీషియన్‌గా పని చేస్తుండగా అతడి భార్య ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తుంది. గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో మనస్తాపానికి లోనైన మహేందర్ సోమవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్కనీలో నుంచి దూకి వృద్ధుడి ఆత్మహత్య


వీర్రాజు (ఫైల్)

మూసాపేట: తన ఇంటి బాల్కనీలో నుంచి దూకి ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి పెందుర్తి వీర్రాజు (67) భార్యతో కలిసి మూసాపేటలోని మెరీనా స్కైస్‌లో ఫ్లాట్ నెంబర్ 1913లో నివాసం ఉంటున్నాడు. గత కొన్నేళ్లుగా అతను నరాల బలహీనత సమస్యతో బాధపడుతూ ఉన్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినా వ్యాధి నయం కాకపోవడంతో మనస్తాపానికి లోనైన వీర్రాజు సోమవారం ఉదయం తన ఇంటి బాల్కనీ లోనుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం రాలేదని..

యువకుడి ఆత్మహత్య


సంతోష్ (ఫైల్)

ఘట్‌కేసర్: ఉద్యోగం రాలేదని మనస్తాపంతో మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏదులాబాద్ గ్రామం, వంజరివాడకు చెందిన అముద సంతోష్ (25) ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. అతడి ప్రయత్నాలు ఫలించకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికిలోనైన సంతోష్ సోమవారం తెల్లవారుజామున ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని కిందికు దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లవీ కాబ్దేకు అభినందనలు



పల్లవీకాబ్దేను అభినందిస్తున్న అంబేడ్కర్ వర్సిటీ అధికారులు

బంజారాహిల్స్: గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రభుత్వ పరిపాలన శాస్త్రం అధ్యాపకురాలు, యూజీసీ–డెబ్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పల్లవీ కాబ్దేను విశ్వవిద్యాలయ అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం అవార్డు గ్రహీత పల్లవీ కాబ్దే మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపకురాలిగా గుర్తింపు పొందడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ జి.పుష్పాచక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి, అధికారులు శ్రీనివాస్, రాబింద్రనాథ్ సోలమన్, వెంకటరమణ, వడ్డాణం శ్రీనివాస్, చంద్రకళ, పలు విభాగాల డైరెక్టర్లు, డీన్లు, అధ్యాపకులు తదితరులు ఆమెను సన్మానించారు.

నివాళి



బంజారాహిల్స్: ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ మాతృమూర్తి, దివంగత మహానటుడు పద్మశ్రీ అల్లు రామలింగయ్య సతీమణి అల్లు కనకరత్నం దశదినకర్మ సోమవారం జరిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అల్లు అరవింద్, అల్లు అర్జున్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

వెంగళరావునగర్: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నట్లు మధురానగర్ పీఎస్‌కు సమాచారం అందింది. దాంతో ఎస్ఐ శివశంకర్ ముమ్మరంగా పెట్రోలింగ్ జరిపారు. ఆదివారం రాత్రి ఎస్పీఆర్‌హిల్స్‌లోని సంతోష్‌గిరి వద్ద కన్నీరు శివ అనే యువకుడు డీకే విస్కీ బాటిల్స్–37, ఓసీ బాటిల్స్ – 3 కలిగి ఉన్నాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా బ్లాక్‌లో మద్యం విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. దాంతో అతడి వద్ద ఉన్న 50 ఫుల్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

వెంగళరావునగర్: టిప్పర్ ఢీకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఎర్రగడ్డ ఏజీ కాలనీలో నివసించే ఓంప్రకాశ్ ఏజీ కాలనీ క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తుంటాడు. ఈ నెల 4వ తేదీన కళ్యాణ్‌నగర్ చౌరస్తా సమీపంలో టిప్పర్ లారీ అతడిని ఢీకొట్టింది. దాంతో అతడికి గాయాలు కాగా స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం భార్య బబిత అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతున్న అతడు ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య బబిత ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నంబర్ గాయబ్.. పోలీసుల నజర్..

- అర్ధరాత్రి రోడ్లపై చక్కర్లు కొడుతున్న పోకిరీలు
- నంబర్ లేని వాహనాలపై పోలీసులు సీరియస్
- స్పెషల్ డ్రైవ్‌లో పెద్దఎత్తున వాహనాలు సీజ్

బంజారాహిల్స్: అర్ధరాత్రి.. నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై రయ్యిరయ్యిమంటూ యువకులు దూసుకెళ్తున్నారు.. కొంతమంది పోకిరీలు వాట్సాప్ చాటింగ్‌లో ముందస్తు ప్లానింగ్ చేసుకుంటూ పెద్దపెద్ద శబ్దాలు చేసుకుంటూ వాహనాలపై చక్కర్లు కొడుతున్నారు. వారి కారణంగా పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ వ్యవహారాన్ని వెస్ట్‌జోన్ పోలీసులు సీరియస్‌గా తీసుకుంటున్నారు. నంబర్ ప్లేట్ లేకుండా అర్ధరాత్రి రోడ్లపై దూసుకెళ్తున్న వారిని కట్టడి చేసేందుకు లా అండ్ ఆర్డర్ పోలీసులు అర్ధరాత్రి వేళలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. రాత్రి 11నుంచి అర్ధరాత్రి 2గంటల వరకు 3గంటల పాటు ప్రతి ఠాణా పరిధిలో ఒక్కో ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని వాహనాల తనిఖీలు చేపడుతూ నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను పట్టుకుంటున్నారు. వెంటనే సదరు బైక్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలిస్తున్నారు. వాహనం నడుపుతున్న వ్యక్తి వివరాలు తీసుకుంటున్నారు. ఇలా వెస్ట్‌జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాసబ్‌ట్యాంక్, ఫిలింనగర్, మధురానగర్, బోరబండ, ఎస్సార్‌నగర్, పంజగుట్ట తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో వేర్వేరు చోట్ల సంబంధిత ఠాణాల పోలీసులు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఒక్కో ఠాణా పరిధిలో ప్రతిరోజూ 2–6 వాహనాలు పట్టుబడుతుండగా, నంబర్ ప్లేట్ లేని ఈ బైక్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు.





పట్టుకున్న బైక్‌కు నెంబర్‌ప్లేట్ బిగించి యజమానికి అప్పగిస్తున్న బంజారాహిల్స్ పోలీసులు

- వెస్ట్‌జోన్ పరిధిలోని 8 ఠాణాల పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ 14వ తేదీ నుంచి నంబర్ ప్లేట్ లేకుండా అర్ధరాత్రి తిరుగుతున్న ద్విచక్ర వాహనాలను పట్టుకునే తనిఖీలు నిర్వహిస్తున్నారు.
- వెస్ట్‌జోన్ పరిధిలోని 8 ఠాణాల పరిధిలో ఈ ఐదు నెలల వ్యవధిలో నంబర్ ప్లేట్ లేకుండా అర్ధరాత్రి ఆవారాగా తిరుగుతున్న వెయ్యికి పైగా బైక్‌లను సీజ్ చేశారు.
- నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాన్ని సీజ్ చేస్తున్న పోలీసులు సంబంధిత వాహన యజమానిపై కేసు నమోదు చేస్తున్నారు.
- సదరు వాహన యజమాని కోర్టుకు వెళ్లి చలానా చెల్లించాల్సి ఉంటుంది.
- చెల్లించిన చలానా రశీదును తీసుకుని సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సి ఉంటుంది.
- ఆ వాహనదారుడి నంబర్‌ప్లేట్ తీసుకుని రావాల్సిందిగా పోలీసులు సూచిస్తున్నారు. నంబర్ ప్లేట్ తీసుకువచ్చిన తర్వాత బైక్‌కు బిగించి, పాత బకాయిలు ఉంటే అవి పూర్తిగా చెల్లించిన తర్వాతే వాహనాన్ని తిరిగి అప్పగిస్తున్నారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వెస్ట్‌జోన్ పరిధిలో తనిఖీలు పక్కాగా కొనసాగుతున్నాయి.
- నెల రోజులుగా రోజుకు ఒకటి రెండు మాత్రమే కేసులు నమోదవుతుండగా, 4 నెలల క్రితం రోజుకు ఒక్కో ఠాణా పరిధిలో 10 కేసులు నమోదై ఉండేవి. పోలీసుల స్పెషల్ డ్రైవ్ కారణంగా పోకిరీలు రోడ్లపైకి రావాలంటే జంకుతున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌ను నిరంతరం కొనసాగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పూ్యర్ అకాడమీలో గ్రాడ్యుయేషన్ డే



పూ్యర్ అకాడమీలో విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసిన క్లారానెట్ బృందం

బంజారాహిల్స్: పట్టణ బస్తీలు, గ్రామీణ పాఠశాలలు, గిరిజన ప్రాంతాల వెనుకబడిన పిల్లలు, యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి అందిస్తున్న పూ్యర్ అకాడమీలో 12వ బ్యాచ్ కంప్యూటర్ సైన్స్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుక సోమవారం జరిగింది. కార్యక్రమానికి క్లారానెట్ బృందం హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా క్లారానెట్ ప్రతినిధులు విద్యార్థులను అభినందిస్తూ, డిజిటల్ లెర్నింగ్, కెరీర్ అవకాశాల దిశగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. పూ్యర్ సీఈఓ డాక్టర్ శైలా తల్లూరి మాట్లాడుతూ పూ్యర్ అకాడమీ ద్వారా వెనుకబడిన వర్గాల మహిళలు, యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా గిరిజన పిల్లల కోసం అభ్యాస బ్రిడ్జ్ స్కూల్స్ ద్వారా విద్యా, పోషక సహాయం అందిస్తున్నామని అన్నారు. క్లారానెట్ సీఎస్ఆర్ మద్దతుతో ఈ కార్యక్రమాలు మరింత బలోపేతమయ్యాయని వివరించారు. అలాగే పూ్యర్ అకాడమీకి స్థలం కల్పించినందుకు జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మీకి కృతజ్ఞతలు తెలిపారు. పూ్యర్ అకాడమీ బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో స్కిల్ అప్ శనివారాలు కార్యక్రమం నిర్వహిస్తూ పట్టణ బస్తీల విద్యార్థులకు డిజిటల్ లిటరసీ, లైఫ్ స్కిల్స్ బోధిస్తోందన్నారు.



ప్రేమ్‌నగర్‌లో రోడ్డు పనులు ప్రారంభం

పంజగుట్ట: గుంతలమయంగా తయారైన రోడ్లకు మోక్షం లభించింది. ప్రేమ్‌నగర్ నుంచి ఆనంద్‌నగర్ కాలనీ వెళ్లే మార్గంలో ఎట్టకేలకు రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఎంతో కాలం క్రితమే ఇక్కడ రోడ్డు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగర మేయర్, స్థానిక కార్పొరేటర్ గద్వాల విజయలక్ష్మి రూ.38.5 లక్షలు కేటాయించడంతో సోమవారం పనులు ప్రారంభమయ్యాయి. జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజినీర్ నగేష్‌బాబు స్థానిక బస్తీ నాయకులు కె.భగవాన్ దాస్, దయానంద్ యాదవ్, ప్రవీణ్ కుమార్‌తో కలిసి రోడ్డు పనులను ప్రారంభించారు.

బసవతారకం ఆస్పత్రి రోడ్డులో
నిత్యం ట్రాఫిక్ చిక్కులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో ఇటీవల ఆంధ్రా బ్యాంక్‌ను ఆనుకుని మెడికల్ షాపు కోసం ఓ దుకాణాన్ని నిర్మించారు. అయితే ఈ దుకాణం మెట్లతో పాటు ముందు భాగం అంతా ఫుట్‌పాత్‌పై నిర్మించారు. ఈ మెడికల్ షాపునకు వచ్చే వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతుండటంతో అసలే ఇరుకైన ఈ రహదారి మరింత ఇరుగ్గా మారి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. బసవతారకం కేన్సర్ ఆస్పత్రి యాజమాన్యం ఇక్కడ ఆంధ్రా బ్యాంక్ భవనంతో పాటు పక్కనే మెడికల్ షాపు, ఆ పక్కనే ఓ హోటల్ నిర్మించారు. వీటికి ఎలాంటి పార్కింగ్ సౌకర్యం లేదు. ఇక్కడికి ఎవరైనా వస్తే తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయాల్సి ఉంటోంది. ఆస్పత్రికి చెందిన గజం స్థలం ఉన్నా అందులో ఏదో ఒక నిర్మాణం చేపట్టడం, అద్దెకు ఇవ్వడం తప్పితే పార్కింగ్ సౌకర్యం మాత్రం కల్పించడం లేదు. ఈ అంశంపై ప్రశ్నించేందుకు పోలీసులు జంకుతున్నారు. దీంతో ఆస్పత్రి నిర్వాహకుల తీరు మారడం లేదు. ట్రాఫిక్ పోలీసులు, సాధారణ వాహనదారులు, చిరువ్యాపారులపై కొరఢా ఝుళిపిస్తున్నారు తప్పితే ఈ ఆస్పత్రి జోలికి వెళ్లడం లేదు. ఇక్కడ కొనసాగుతున్న నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకుంటున్నారా? లేదా? అన్నది కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద స్తంభించిన ట్రాఫిక్

మిలాద్ ఉన్ నబీ సంబురాలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డలో ఫాతిమానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆసిఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ సంబురాల్లో మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మత పెద్దలు నశీర్ షఫీ, సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ మోసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణకుమార్, బాలరాజు, రాజశేఖర్, రజనీకాంత్, భిక్షపతి పాల్గొన్నారు.



పత్తికి మద్దతు ధర లేక రైతుల ఆత్మహత్య

పంజగుట్ట: మధ్యస్థాయి పత్తికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,710 నిర్ణయించారని, కానీ క్వింటాల్ పత్తి పండించేందుకు రైతుకు రూ.10 వేలకు పైనే ఖర్చవుతోందని, దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ నుమాన్ మొహమ్మద్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'మోడీ, ట్రంప్ జోడి.. పత్తి రైతుపై దాడి' అనే అంశంపై సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తికి మద్దతు ధర లేక, పెట్టుబడి కూడా రాకపోవడంతో దాదాపు 1300 మంది పత్తి రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, పన్నుల భారం మరింత పెరగడంతో ఆత్మహత్యలు పది రెట్లు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అమెరికన్ కాటన్ విపరీతంగా దిగుమతి చేస్తున్నారని, దీంతో దేశంలోని కాటన్ రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. స్వామినాథన్ కమిటీ నివేదిక ప్రకారం రైతులకు పెట్టిన పెట్టుబడికి మరో 50 శాతం కలిపి ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వాలని, కానీ రైతులకు నష్టం వాటిల్లేలా మద్దతు ధర ఇస్తే ఎలా అని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న నుమాన్ మొహమ్మద్



కాంగ్రెస్‌లోకి చేరికలు

వెంగళరావునగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులైన యువత కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఆ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ సీనియర్ నాయకులు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో సోమవారం సాయంత్రం బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఇందులో భాగంగా యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సీనియర్ నేతలు మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో నాగార్జునరెడ్డికి టికెట్ ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నేతలు చిలకల వెంకటేశ్వరరావు, హనుమంతరావు యాదవ్, సోమ పటేల్, కె.రాజశేఖర్, రేఖ, అశోక్ నాయుడు, రవి కుమార్, జయశ్రీ, మహబూబ్, బాబ్ జాన్, వెంకట్రామిరెడ్డి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

76 ఏళ్ల వృద్ధుడికి స్వదేశీ 'టీఈఆర్' శస్త్ర చికిత్స

బంజారాహిల్స్: బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి వైద్యులు 76 ఏళ్ల రోగికి స్వదేశీ మైక్లిప్ (మెరిల్) పరికరంతో ట్రాన్స్‌క్యాథెటర్ ఎడ్జ్–టు–ఎడ్జ్ రిపేర్ (టీఈఆర్) విధానాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. నగరంలో అరుదైన విజయవంతమైన టీఈఆర్ కేసుల్లో ఇది ఒకటిగా వైద్యులు పేర్కొన్నారు. వృద్ధ రోగి రంగారావు (పేరు మార్చబడింది)కు చాలా క్లిష్టమైన వైద్య చరిత్ర ఉంది. ఆయన డయాబెటిస్, బీపీ, ఊపిరితిత్తుల వ్యాధి(సీఓపీడీ), మూత్రపిండాల సమస్య, ప్రొస్టేట్ పెద్దవడం, గుండె రిదమ్ లోపంతో ఇబ్బందులు పడుతున్నారు. 1998లో ఆయన గుండెకు బేర్ మెటల్ స్టంట్ వేశారు. 2023లో ఆయన కుడి కరోనరీ ఆర్టరీ పూర్తిగా మూసుకుపోయింది. దీనికి పీసీఐ ద్వారా విజయవంతంగా చికిత్స అందించారు. 2025 ఆరంభంలో ఆయన మళ్లీ తీవ్రమైన గుండెపోటుతో బాధపడ్డారు. ఆ సమయంలో అబ్ట్యూస్ మార్జినల్ ఆర్టరీకి స్టంట్ అవసరమైంది. గుండె పనితీరు తగ్గిపోవడంతో పాటు తీవ్రమైన మిట్రల్ వాల్వ్ లీకేజ్ కూడా ఉన్నట్లు తేలింది. అనేకసార్లు ఆస్పత్రిలో చేరినా, ఆయన ఆరోగ్యం క్రమంగా క్షీణించింది. శస్త్ర చికిత్సలో మిట్రల్ వాల్వ్ భర్తీ చేయడం ఒక్కటే మార్గమని తెలిసినా, ఆయన బలహీనత, ఇతర అనారోగ్య సమస్యల కారణంగా అది చాలా ప్రమాదకరమని వైద్యులు భావించారు. ఈ క్రమంలో కేర్ హాస్పిటల్స్ క్లినికల్ డైరెక్టర్ అండ్ కార్డియాలజీ హెడ్ డాక్టర్ సూర్యప్రకాష్‌రావు నేతృత్వంలో వైద్య బృందం స్వదేశీ మైక్లిప్ సాంకేతికతతో శస్త్ర చికిత్స అవసరం లేకుండా ట్రాన్స్ కాథెటర్ ఎడ్జ్–టు–ఎడ్జ్ రిపేర్ విధానం విజయవంతంగా నిర్వహించింది. ఎకోకార్డియోగ్రాఫీ మార్గదర్శకత్వంలో మిట్రల్ వాల్వ్‌ను స్థిరంగా ఉంచేందుకు రెండు క్లిప్‌లను సక్రమంగా అమర్చారు. దీంతో మిట్రల్ రెగర్జిటేషన్ సమస్య తగ్గింది. ఈ సందర్భంగా కేర్ హాస్పిటల్స్ జోనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బిజునాయర్ మాట్లాడుతూ ఇంత క్లిష్టమైన పరిస్థితుల్లో స్వదేశీ మైక్లిప్ పరికరాన్ని విజయవంతంగా వినియోగించడం గర్వకారణమన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

సనత్‌నగర్: ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమ అన్నారు. బేగంపేట పాటిగడ్డలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం ఆమె అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తూ రోజురోజుకు ప్రజల విశ్వాసాన్ని మూటగట్టుకుంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఖైరతాబాద్‌లోని అవర్ లేడీ ఆఫ్ గుడ్‌హెల్త్ చర్చిలో మేరీస్ ఫెస్ట్ సందర్భంగా సోమవారం నిర్వహించిన ఊరేగింపులో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అనిమేస్టడీస్‌తో కియోటో సేకా వర్సిటీ పరస్పర ఒప్పందం

నాంపల్లి: మల్టీమీడియా గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లు భారతదేశంలో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఏఐసీజీ మల్టీ మీడియా కళాశాల, జపాన్‌లోని మంగ అండ్ అనిమేస్టడీస్‌లో ప్రపంచంలోనే మొదటి అగ్రగామి విశ్వవిద్యాలయమైన కియోటో సేకా యూనివర్సిటీతో పరస్పర అవగాహన ఒప్పందం చేసుకోబోతోంది. ఈ ఒప్పందం ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమయంలో హైదరాబాద్‌లోని టీహబ్‌లో ఈ నెల 10న జరుగుతుంది. ఒప్పందాన్ని ఐఏసీజీ వ్యవస్థాపకుడు రామకృష్ణ, కియోటో సేకా యూనివర్సిటీ సెంటర్ ఫర్ రీసెర్చ్ అన్ కాంటెంపరరీ ఆఫ్రికన్ అండ్ ఏషియన్ కల్చర్స్ డైరెక్టర్ షిన్ మత్సుమురా పరస్పరం మార్పిడి చేసుకుంటారు. ఈ విషయాన్ని ఐఏసీజీ సీఈఓ డాక్టర్ సురేష్ మదిరాజు, ఐఏసీజీ అకాడెమిక్స్ హెడ్ చైతన్య రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో వెల్లడించారు. ఒప్పందంతో భారత్–జపాన్ మధ్య విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

జోరుగా వ్యర్థాల తొలగింపు ప్రక్రియ

బంజారాహిల్స్: వినాయక నిమజ్జనాలు పూర్తయిన తర్వాత నెక్లెస్ రోడ్డుతో పాటు పీపుల్స్‌ప్లాజా, బేబిపాండ్, ఎన్టీఆర్ మార్గ్, సెక్రటేరియట్ పరిసర ప్రాంతాలు అస్తవ్యస్తంగా మారాయి. జీహెచ్ఎంసీతో పాటు మెక్లిన్, హెచ్ఎండీఏ స్వీపర్లు సోమవారం జోరుగా పనులు చేశారు. నెక్లెస్ రోడ్డులో 100 మంది స్వీపర్లు, ఎన్టీఆర్ మార్గ్‌లో 30 మంది స్వీపర్లు విధుల్లో పాల్గొంటున్నారు. వీటిని శుభ్రం చేయాలంటే మరో రెండు రోజుల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు బేబిపాండ్ వద్ద, పీపుల్స్ ప్లాజాలో, ఎన్టీఆర్ మార్గ్ వైపు నిమజ్జన వ్యర్థాలతో పాటు విగ్రహాల ఐరన్ రాడ్స్‌ను జేసీబీల సహాయంతో తొలగిస్తున్నారు.



పీపుల్స్ ప్లాజాలో వ్యర్థాలను వెలికితీస్తున్న జేసీబీ



ఎన్టీఆర్‌మార్గ్‌లో హుస్సేన్ సాగర్ నుంచి వ్యర్థాలు తొలగిస్తున్న హెచ్ఎండీఏ సిబ్బంది



విగ్రహాల నుంచి ఇనుమును వేరు చేస్తున్న సిబ్బంది



నెక్లెస్ రోడ్డులో వ్యర్థాలు ఊడ్చేస్తున్న స్వీపర్లు

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలి

– గ్రేటర్ కమిషనర్ కర్ణన్

లక్డీకాపూల్ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కమిషనర్ పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజల విన్నపాల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. మొత్తం 51 వినతిపత్రాలు వచ్చాయి. ఇక జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 89 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణు గోపాల్, రఘు ప్రసాద్, గీతా రాధిక, సుభద్రాదేవి, సీసీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

18న పలువురికి సారస్వత పరిషత్ పురస్కారాలు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సాహితీ ప్రముఖులకు తెలంగాణ సారస్వత పరిషత్తు 2025 సంవత్సరానికి ధర్మనిధి సాహిత్య పురస్కారాలు ప్రకటించింది. డాక్టర్ రాయారావు సూర్యప్రకాశరావుకు ఎర్రం రెడ్డి రంగనాయకమ్మ పురస్కారం, వేముగంటి మురళీకృష్ణకు ఆలూరి బైరాగి పురస్కారం, డాక్టర్ సంధ్య, విప్లవ్‌కు డాక్టర్ పాకాల యశోదారెడ్డి పురస్కారం, పింగళి సుదర్శన్‌రెడ్డికి డాక్టర్ వానమామలై వరదాచార్య పురస్కారం ప్రధానం చేస్తారు. డాక్టర్ పాణుగోటి సరస్వతికి డాక్టర్ చింతపల్లి వసుంధరారెడ్డి జానపద విజ్ఞాన పురస్కారం, డాక్టర్ తూర్పు మల్లారెడ్డికి డాక్టర్ బెజవాడ గోపాల్‌రెడ్డి పురస్కారం, డాక్టర్ సాగి కమలాకర శర్మకు డాక్టర్ దివాకర్ల వెంకటావధాని పురస్కారం, కందుకూరి అంజయ్యకు డాక్టర్ రావికంటి వసునందన్ పురస్కారం, మ్యాకం రవికుమార్‌కు విశాల సాహితీ బీఎస్ రాములు పురస్కారం అందజేయనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పరిషత్తులో అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే సభలో పురస్కారాలు అందజేయనున్నట్లు ప్రకటించారు. పురస్కారం కింద రూ.5 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం, శాలువాతో సత్కరించనున్నట్లు వెల్లడించారు.

కాళోజీ పురస్కారం ప్రదానం



కాళోజీ పురస్కారం అందుకుంటున్న తులసీ రమణాచార్యులు

మల్కాజిగిరి: సామాజిక, సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో కృషిచేస్తున్న అక్షర కౌముది సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్కాజిగిరికి చెందిన తులసీ రమణాచార్యులకు కాళోజీ పురస్కారం లభించింది. ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ ఆధ్వర్యంలో మహాకవుల జయంతోత్సవాల పేరున బిర్లా ప్లానిటోరియంలో పురస్కారం అందజేశారు. పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

'సామాజిక న్యాయ ఉద్యమాన్ని కొనసాగిస్తాం'



రాయదుర్గం: సామాజిక న్యాయ ఉద్యమాన్ని మరింత కృత నిశ్చయంతో కొనసాగిస్తామని ఏఐబీసీ ఎస్ఏ జాతీయ అధ్యక్షుడు జి కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఏఐబీసీఎస్ఏ హెచ్‌సీయూ శాఖ సమావేశాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆడిటోరియం లో సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాలపై పోరాడాలని నిర్ణయించామన్నారు. పేద వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అత్యంత అవసరమైన ఫెలోషిప్‌ల పెంపుకోసం పోరాటాన్ని కొనసాగించాలనే సంకల్పించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు వసుమతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంపన్నుల కాలనీకి ఉద్ధండుల పోటీ

- నేడు ఎంపీ ఎమ్మెల్యే కాలనీ సొసైటీ ఎన్నికలు
- పోటీ చేస్తున్న వారిలో మాజీ మంత్రి రెడ్యానాయక్, ఎంపీ మల్లు రవి
- ఓటు హక్కు వినియోగించుకోనున్న ప్రముఖులు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్–10 సీలోని విజయ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ (ఎంపీ ఎమ్మెల్యే కాలనీ) మేనేజింగ్ కమిటీ ఎన్నికలు మంగళవారం (నేడు) జరగనున్నాయి. ఎంపీ ఎమ్మెల్యే కాలనీలోని కల్చరల్ సెంటర్‌లో జరిగే ఈ ఎన్నికల్లో 304 మంది తమ ఓటు హక్కు



వినియోగించుకోనున్నారు. 1997లో ఏర్పడిన ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ సొసైటీకి 30 సంవత్సరాల తర్వాత ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తున్నారు. సొసైటీ మేనేజింగ్ కమిటీకి పోటీ పడుతున్న వారిలో మాజీ మంత్రి రెడ్యానాయక్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవితో పాటు పలువురు రాజకీయ నాయకులు ఉన్నారు. చేవెళ్ల మాజీ ఎంపీ జి.రంజిత్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి బలపరుస్తున్న ప్యానెల్‌లో మాజీ మంత్రి రెడ్యానాయక్ పోటీ చేస్తుండగా, కుత్బుల్లాపూర్ నాయకుడు కొలను హనుమంతరెడ్డి, మాజీ మంత్రి ఉమా మాధవరెడ్డి కుమారుడు సందీప్‌రెడ్డి బలపరుస్తున్న ప్యానెలలో మల్లు రవి పోటీపడుతున్నారు.

ఓటు వేసే ప్రముఖులు వీరే..

ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి బావ ఎస్.పద్మారెడ్డి, మాజీ గవర్నర్లు సీహెచ్.విద్యాసాగర్‌రావు, బండారు దత్తాత్రేయ, జస్టిస్ సుభాష్‌రెడ్డి, హైకోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి రెడ్యానాయక్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ మంత్రులు ఉమా మాధవరెడ్డి, పువ్వాడ అజయ్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు భూపాల్‌రెడ్డి, అరికెల నర్సారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, కొలను హనుమంతరెడ్డి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి, గల్లా అరుణకుమారి, సినీ హీరోలు చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ, కుమార్తె, హీరోలు రవితేజ, సాయిధరమ్ తేజ్, అల్లు శిరీష్, జలవిహార్ రామరాజు, దస్పల్లా శరత్, జీఎంఆర్ ప్రసన్న, హెటిరో శ్రీనివాస్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, సీఎం సెక్రటరీ మల్సూర్, మాజీ చీఫ్ విప్ వి.వెంకటేశ్వర్లు, చిరంజీవి తోడల్లుడు డాక్టర్ కే వెంకటేశ్వరరావు, జేసీ దివాకర్‌రెడ్డి కుమార్తె, మాజీ మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ప్రసాద్‌రాజు, మెఘా కృష్ణారెడ్డి, ఏఎంఆర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాల్లో పోషకాలు మెండు

ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఏజీవర్సిటీ: చిరుధాన్యాల్లో మంచి పోషకాహారం ఉంటుందని ఇది చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారం అని భారతీయ చిరు ధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని ఐఐఎంఆర్‌లో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐఐఎంఆర్ డైరెక్టర్ మాట్లాడుతూ... చిరుధ్యానాల ద్వారా ఎలాంటి ఆహారంతో పాటు టిఫిన్స్, బిస్కెట్స్‌తో పాటు చిప్స్‌లాంటి వాటిపై ఈ శిక్షణలో నేర్పించనున్నారు. విద్యార్థులు ముఖ్యంగా చిరుధాన్యాల జీవనోపాధి, వ్యవసాయంపై దృష్టి సారించాలని దీంతో పాటు ప్రాసెసింగ్ సాంకేతికతలు విలు ఆధారిత ఉత్పత్తుల తయారీ వ్యాపారావకాశాలు వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. భోపాల్ వృత్తి విద్యా విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రవిచంద్రన్ మాట్లాడుతూ... మిల్లెట్స్ ప్రాసెసింగ్, నైపుణ్యతను పాఠశాల స్థాయి వృత్తి విద్యలో భాగం చేయడం చాలా అవసరమని, దీని ద్వారా విద్యార్థులు భవిష్యత్‌లో భరోసా ఉంటుందని చిరుధ్యానాల వ్యవసాయం, ఆహార రంగ వ్యాపార అవకాశాలను అణ్వేషించగలని తెలిపారు. కార్యక్రమంలో ఐఐఎంఆర్ శాస్త్రవేత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐఐఎంఆర్ డైరెక్టర్ శ్యామ్‌ప్రసాద్

రైతుల కోసం హైకోర్టుకు వెళతాం



అమీర్‌పేట : రీజినల్ రింగ్ రోడ్‌ను వ్యతిరేకిస్తూ రైతులు చేపట్టిన ఆందోళనకు ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ మద్దతుగా నిలిచారు. అమీర్‌పేట స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయం వద్దకు వచ్చి రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. అలైన్‌మెంట్ మార్పులు ఇష్టానుసారంగా జరుగుతున్నాయని రైతులు పేర్కొన్నారు. తమ భూముల్లో రీజినల్ రింగ్ రోడ్ వేయరాదని డిమాండ్ చేశారు. కేఏ పాల్ మాట్లాడుతూ హైకోర్టుకు వెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు. రైతులతో కలిసి పనిచేసేందుకు తాను సిద్ధమన్నారు.

2050 నాటికి జీరో వేస్టేజ్ సాధించే దిశగా ప్రయత్నాలు

– రెరా చైర్మన్ డాక్టర్ సత్యనారాయణ

రాయదుర్గం: వికసిత్ భారత్ కింద 2050 నాటికి భారతదేశం జీరో వేస్టేజ్ సాధించే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయని తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చైర్మన్ డాక్టర్ ఎం.సత్యనారాయణ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో సోమవారం అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో రోజుకు లక్షా అరవైవేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి కాగా వీటిలో ఎక్కువ భాగం ఆహారపదార్థాలు ఉంటున్నాయన్నారు. నగరీకరణ పెరుగుతున్న కొద్దీ పరిశ్రమలు, ఆస్పత్రులు, వాణిజ్యస్థలాలు, ఇళ్ళ నుంచి వస్తున్న వ్యర్థాలను ప్రభుత్వం శుద్ధి చేస్తున్నప్పటికీ మనిషిలో మార్పు వచ్చినప్పుడే వ్యర్థాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. సీనియర్ ఇంజనీర్ రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండిపెండెంట్ డైరెక్టర్ డాక్టర్ పిజి శాస్త్రి మాట్లాడుతూ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై మరొక దశాబ్దం తర్వాత సమావేశాలు పెట్టుకుంటే లాభం లేదంటూ, ఈ లోపు మాత్రమే జీరో వేస్ట్ సాధించాలన్నారు. నేషనల్ బయోడైవర్సిటీ మాజీ చైర్మన్, అరుణాచల్ ప్రదేశ్ అటవీశాఖ మాజీ చీఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ అచలేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

సురవరం సుధాకర్‌రెడ్డి సేవలు మరువలేనివి



కార్యక్రమంలో పాల్గన్న నాయకులు

చందానగర్ : సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి కమ్యూనిస్టు పార్టీకి చేసిన సేవలు మరవలేనివని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్‌లో నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో సురవరం సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సురవరం సుధాకర్ రెడ్డి సతీమణి డాక్టర్ బివి విజయలక్ష్మిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి పేరుతో ఏర్పాటు చేసిన గ్రంథాలయం లోగోను తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆవుల మంజుల ఆవిష్కరించగా, గ్రంథాలయాన్ని డాక్టర్ రియాజ్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి గొప్ప నాయకుడి పేరుతో ఏర్పాటు చేసిన గ్రంథాలయం తన చేతుల మీదుగా ప్రారంభించే అదృష్టం రావడంతో తన జీవితంలో గొప్ప మైలురాయన్నారు. తాను చిన్నతనంలో విన్న సీపీఐ నాయకులు నల్లమల్ల గిరిప్రసాద్ ఉపన్యాసం తనపై చెరగని ముద్ర వేసిందన్నారు. డాక్టర్ నారాయణ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి ఆదర్శవంతమైన కమ్యూనిస్టు నేత అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖులు కల్పన, డాక్టర్ కె.ప్రతిభా, డాక్టర్ రజని పాల్గొన్నారు

కబ్జాలపై గళమెత్తుతున్న సామాన్యుడు



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో పార్కులు, రహదారులు, చెరువులతో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జా జోరుగా సాగుతోంది. దీనిపై సామాన్యులు సైతం గళం ఎత్తుతున్నారు. ఈ కబ్జాలను హైడ్రా దృష్టికి తీసుకువెళ్తున్నారు. హైడ్రా ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ద్వారా మొత్తం 36 ఫిర్యాదులు అందాయి. పార్కు స్థలాన్ని ఇష్టానుసారం వినియోగిస్తున్నారని, చెరువుల్లోకి మురుగు నీరు చేరడంతో తమ నివాసాలు ముంపునకు గురౌతున్నాయని పలువురు కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. రహదారులు, పార్కులు కబ్జా కాకుండా చూడాలని కోరారు. నాలాలపై అక్రమ కట్టడాలు ఉన్నాయని, చివరకు విద్యుత్ హై టెన్షన్ వైర్ల కింద కూడా నిర్మాణాలు జరుగుతున్నాయని హైడ్రా దృష్టికి తీసుకువెళ్లారు. పటాన్ చెరులోని ఏపీఆర్ ప్రవీణ్ లగ్జారియాలోని పార్కు స్థలంలో రాత్రికి రాత్రి గుడి కట్టేస్తున్నారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇదేమని అడిగితే దాడికి దిగారని వాపోయారు. దాదాపు 39 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న లే ఔట్‌లో 500 వరకూ విల్లాలు ఉన్నాయి. ఇందులోని పార్కుకు కేటాయించిన స్థలంలో గుడి కడుతున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. గాజులరామారంలోని చిన్న బంధం చెరువును ఇరువైపుల నుంచి కబ్జా చేస్తున్నారని, చెరువులోని నీళ్లన్నీ కిందకు వదిలేస్తున్నారని గాజుల రామారం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. చెరువు వాస్తవ విస్తీర్ణం ఎంతనేది నిర్ణయించి ఫెన్సింగ్ వేయాలని కోరారు. రాజేంద్రనగర్ మండలం బండ్లగూడ విలేజ్‌లోని పీ అండ్ టీ కాలనీలో అర ఎకరం పార్కు కబ్జాకు గురవుతోందని ఆ కాలనీ నివాసితులు ఫిర్యాదు చేశారు. గండిపేట మండలం గంధంగూడ గ్రామంలోని 3.28 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని పలువురు ఫిర్యాదు చేశారు. మచ్చబొల్లారం గ్రామంలోని ముతుకులకుంట నీటి విస్తీర్ణం రోజు రోజుకూ పెరుగుతోందని, 4.62 ఎకరాల చెరువు కాస్త 12 ఎకరాలు దాటిపోయిందని అక్కడి నివాసితులు వాపోయారు. తూములు బంద్ చేసి, అలుగును కూడా పెంచేశారంటూ ఫిర్యాదు చేశారు. దీంతో అనుమతి పొందిన లే ఔట్‌లు నీట మునుగుతున్నాయని, తమకు న్యాయం చేయాలని కోరారు.

బయో వేస్ట్.. డేంజర్ బెల్స్

- సాధారణ చెత్తలో బయోమెడికల్ వ్యర్థాలు
- పొంచి ఉన్న అంటు రోగాలు ముప్పు
- గాలి, నీరు, నేల కలుషితం
- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం అంటున్న వైద్యనిపుణులు



సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో ఆసుపత్రుల యాజమాన్యాలు బయోమెడికల్ వ్యర్థాలను సాధారణ చెత్తతో కలిపేస్తున్నాయి. దేశ, విదేశాల నుంచి వచ్చే రోగులకు స్థానికంగా వైద్య సేవలందిస్తున్నారు. ప్రపంచంలో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు, వివిధ రకాల వ్యాధులకు చికిత్సలు చేస్తున్నారు. ఈ సమయంలో వినియోగించే వ్యర్థాలను నిబంధనల ప్రకారం బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు తరలించాలని నిబంధనలు చెబుతున్నాయి. అయితే కొన్ని ఆసుపత్రులు మాత్రం బయో మెడికల్ వ్యర్థాలను సాధారణ చెత్త, ఇతర వ్యర్థాల్లో కలిపేస్తున్నారు. ఫలితంగా ప్రమాదకరమైన బ్యాక్టీరియా, వైరస్, పరాన్నజీవులతో ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోలేదని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఫలితంగా పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని హెచ్చరిస్తున్నారు.

❖ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, రిహ్యాబ్ సెంటర్లు, ఆరోగ్య పరిశోధనా కేంద్రాలు వేలసంఖ్యలో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ప్రపంచ దేశాల నుంచి వివిధ రోగాల చికిత్సల కోసం లక్షల సంఖ్యలో రోగులు నగర ఆసుపత్రులకు వస్తున్నారు. మరో వైపు ప్రపంచ దేశాలకు బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్ సరఫరాలో హైదరాబాద్ అగ్రగామిగా వెలుగొందుతోంది. ఈ క్రమంలో వెలువడిన మెడికల్ వ్యర్థాల నిర్వహణ చాలా ప్రాధాన్యత ఉంటుంది. రోజుకు సుమారుగా 26 వేల కేజీల బయో మెడికల్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని కాలుష్య నియంత్రణ మండలి అంచనా వేస్తోంది. రోజుకు 77 వేల కేజీల వ్యర్థాలను నిర్వహించేందుకు 11 కామన్ బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (సీబీఎండబ్ల్యూటీఎఫ్) ఉన్నాయని స్పష్టం చేస్తోంది. వీటి పనితీరును పర్యవేక్షించేందుకు ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే నగరంలోని పలు ఆసుపత్రులు మాత్రం బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణను చాలా తేలిగ్గా తీసుకుంటున్నాయి. ట్రీట్‌మెంట్ ప్లాంటకు ఇవ్వకుండా అనధికారికంగా వ్యర్థాలను బుట్టల్లో వేసి జీహెచ్ఎంసీ చెత్త సేకరణ వాహనాలకు ఇస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరమని, అంటు రోగాలు ప్రబలడానికి చిన్న వైరస్ చాలని వైద్యులు చెబుతున్నారు. చిన్నచిన్న క్లినిక్‌ల నుంచి పెద్దపెద్ద ఆసుపత్రుల వరకు చికిత్సలకు వినియోగించే ఇంజక్షన్, సెలైన్ ఇచ్చే సూదుల నుంచి, మందుల సీసాలు, శస్త్ర చికిత్సల్లో వినియోగించే వివిధ రకాల మందులు, రేడియో ధార్మిక పదార్థాలు, గడువు ముగిసిన మందులు, హానికరమైన రసాయనాల వరకు ఇలా అన్ని రకాల వ్యర్థాలను చెత్తలో కలిపేస్తున్నారు. ఇది తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది.

ప్రజారోగ్యానికి పొంచి ఉన్న ముప్పు

బయోమెడికల్ వ్యర్థాలు ప్రత్యేకమైన లక్షణాలు కలిగి ఉంటాయి. వీటి నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇందులో బ్యాక్టీరియా, వైరస్, పరాన్నజీవులు, వంటి ప్రమాదకర వ్యాధి కారకాలు ఉండే అవకాశం ఉంటుంది. అంటు వ్యాధులు ప్రబలుతాయి. వీటిని సరైన రీతిలో నిర్వహించకపోతే ప్రజారోగ్యానికి, పర్యావరణానికి రెండింటికి ప్రమాదం తప్పదని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

పర్యావరణానికి ప్రమాదం

బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ పద్ధతులను కాకుండా సాధారణ చెత్తలు కలిపి పారబోయడం వల్ల గాలి, నీరు, నేల కాలుష్యమవుతాయి. హానికరమైన రసాయనాలు భూగర్భ జలాలను కలుషితం చేస్తాయి. ఘాటైన వాసనలు ఊపిరితిత్తుల జబ్బులకు కారణమవుతాయని పీసీబీ అధికారులు హెచ్చరిస్తున్నారు.

హెచ్‌సీయూలో ఘనంగా టీచర్స్‌డే



రాయదుర్గం: భారతదేశం సుసంపన్నమైన విద్యా వారసత్వాన్ని కలిగి ఉందని హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్‌ను, పలువురు ప్రొఫెసర్లను ఘనంగా సత్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీన గురువులు, గురుకులాల జ్ఞానం, భారతీయ సంస్కృతి యొక్క ఆధ్యాత్మిక నీతిని ప్రేరేపిస్తూ బారతదేశ సుసంపన్నమైన విద్యా వారసత్వాన్ని ఆయన గుర్తు చేశారు. ఉపాధ్యాయు జ్ఞానం, వ్యక్తిత్వ నిర్మాణం సమాజ ఆత్మను రూపొందిస్తాయన్నారు. విద్య అనేది కేవలం సమాచారానికి సంబంధించినది కాదని, పరివర్తనకు సంబంధించినదన్నారు. విశ్రాంత ప్రొఫెసర్ రమేష్‌ఘంట మాట్లాడుతూబోధనా వృత్తిలో ఉండేవారికి నిబద్ధత, చిత్తశుద్ధి, నైతిక బాధ్యత ఉండాలన్నారు.

సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు పెట్టి వేధిస్తున్నారు.

పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నటి రంగ సుధ ఫిర్యాదు

పంజగుట్ట: తన వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెట్టి తన పరువుకు భంగం కలిగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నటి రంగ సుధ పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు వివరాల్లోకి వెళితే .. నటి రంగ సుధకు 2022లో చెరుకూరి రాధాకృష్ణ అనే వ్యక్తితో స్నేహం ఉండేది. అతనితో సన్నిహితంగా ఉన్న సమయంలో ఫొటోలు, వీడియోలు తీసి అప్పట్లోనే బెదిరించేవాడని ఫిర్యాదులో పేర్కొంది. తాను అతడితో దూరంగా కావడంతో అప్పట్లోనే తన ప్రైవేట్ ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెడతానని బ్లాక్ మెయిల్ చేసేవాడని తెలిపింది. ఈ నెల 1న ట్విట్టర్, ఇన్‌స్టా, తదితర సామాజిక మాధ్యమాల్లో తన వ్యక్తిగత ఫొటోలను గుర్తించిన ఆమె సైబర్ క్రైమ్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. వారు సమీపంలోని పంజగుట్ట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చెయాలని సూచించడంతో 2వ తేదీన పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో తనకు రాధాకృష్ణపైనే అనుమానం ఉన్నట్లు ఫిర్యాదు చేసింది. దీంతో కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆల్ న్యూ విక్టరీస్ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: మారుతి సుజుకి ఆధ్వర్యంలో సరికొత్త మోడల్ కార్ ఆల్ న్యూ 'విక్టరీస్'ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇందులో భాగంగా నగరంలోని బేగంపేట్ షోరూమ్ వేదికగా ప్రముఖ నటులు గామా అవార్డ్ విజేత హర్ష్ రోషన్, మారుతీ సుజుకీ కమర్షియల్ బిజినెస్ హెడ్ సురేష్ బాబు సోమవారం ఆల్ న్యూ విక్టరీస్‌ను (ఎస్‌యూవీ విభాగం) ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో వరుణ్ గ్రూప్ చైర్మెన్ వీ.ప్రభు కిషోర్, ఎండీ బీ.వరుణ్ దేవ్, వరుణ్ మోటార్స్ జీఎం కే.క్రిష్ణ కుమార్ పాల్గొన్నారు.

అక్టోబర్ 30న మార్వాడీ గో బ్యాక్ గర్జన

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రంలో కల్తీ వ్యాపారం కొనసాగిస్తూ ప్రభుత్వానికి పన్ను ఎగవేతదారులైన మార్వాడీలను రాష్ట్రం నుండి పంపించేందుకు అక్టోబర్ 30వ తేదీన మార్వాడీ గో బ్యాక్ గర్జన నిర్వహిస్తున్నట్లు మార్వాడీ గో బ్యాక్ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ .. తెలంగాణ రాష్ట్రాన్ని కల్తీ మాఫియా నుండి కాపాడుకోవాలని అందుకే మార్వాడీ గో బ్యాక్ ఉద్యమం రూపొందించినట్లు తెలిపారు. సామాజిక వేత్తలు, కవులు, కళాకారులు అందరూ ఈ ఉద్యమానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో కాచం సత్యనారాయణ, మాస్టార్‌జీ, కోటగిరి ఉషారాణి, జిలకర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆరు వారాల్లో కౌంటర్ దాఖలు చేయండి

– కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణంతో పర్యావరణంపై పడే ప్రభావాన్ని తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని చెబుతూ.. ఆరు వారాలు గడువిచ్చింది. హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం 2015లో ఆ మేరకు జీవోలు జారీ చేసింది. దీని కారణంగా పార్కు చుట్టూ ఎకో సెన్సిటివ్ జోన్ (ఈఎస్‌జెడ్) దెబ్బ తింటుందని, పెద్దఎత్తున చెట్లను తొలగించాల్సి వస్తుందంటూ పర్యావరణవేత్త కె.పురుషోత్తంరెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. అలాగే.. మరో పిల్స్ కూడా దాఖలయ్యాయి. వీటి నిర్మాణం కారణంగా దాదాపు 3 వేల చెట్లు నరికివేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. దీనిపై తాము ఇప్పటికే కౌంటర్ దాఖలు చేశామని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది పేర్కొన్నారు. కేంద్ర పర్యావరణ శాఖ కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని కోరడంతో విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది.

మృత్యువులోనూ వీడని స్నేహ బంధం

- బెంగళూరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం
- ఇద్దరు యువకుల దుర్మరణం

శంషాబాద్ రూరల్: ఇద్దరూ ఒకే స్కూల్‌లో చదివారు.. ఒకే చోట ఉద్యోగం చేస్తున్నారు.. మృత్యువులో సైతం వీరు స్నేహాన్ని వీడలేదు.. జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరు మృత్యువాతపడ్డారు.పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని గండిగూడకు చెందిన మంచర్ల అఖిల్(22), మదన్‌పల్లికి చెందిన కట్ట చింటూ(23) ఎయిర్‌పోర్టులో డ్రైవర్లు పని చేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఇంటి వద్ద



మంచర్ల అఖిల్ (ఫైల్)



కట్ట చింటూ (ఫైల్)

ఉన్న వారిద్దరూ రాత్రి బైక్‌పై పెద్దషాపూర్ వైపు నుంచి మదన్‌పల్లి వెళ్తున్నారు. మార్గ మధ్యలో బెంగళూరు జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఇనుప పలకలను ఢీకొట్టారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.

అతి వేగమే కారణం..


అతి వేగమే వారి మృతికి కారణమైంది. అఖిల్‌కు చిన్నతనంలోనే తండ్రి చనిపోగా.. ఇద్దరు కుమారులను తల్లి పోషించింది. డ్రైవర్ ఉద్యోగం చేస్తున్న అఖిల్ ఏడాది క్రితం యమహా ఆర్15 బైక్ కొనుగోలు చేశాడు. ఈ బైక్‌పై అతి వేగంగా వెళ్తూ ఇద్దరూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రమాద సమయంలో బైక్ వేగం సుమారు 100 కి.మీటర్లకు పైగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మరో వైపు ఇద్దరూ తలకు హెల్మెట్ ధరించకపోవడంతో తలకు తీవ్ర గాయాలై మృత్యువాత పడ్డారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మత్తు.. ఎత్తు చిత్తు..

నగరం మత్తెక్కుతోంది.. మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన కొందరు వాటిని తరలించేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. మత్తులో జోగుతూ వారి జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. ఫామ్ హౌస్‌లు, పబ్బులు దాటి పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ప్రస్తుతం మత్తు పదార్థాల అమ్మకాలకు అడ్డాలుగా మారుతున్నాయి.. ఇదేదో ఉత్తిగనే చెప్పే మాటలు కావు.. ఇటీవల జరిగిన ఘటనలే దీనికి బలమైన సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. పలు రకాల డ్రగ్స్‌తో పాటు మనిషి జీవితాన్ని సర్వనాశనం చేసే గంజాయి వ్యర్థాలు గుప్పుమంటున్నాయి.! వరుస ఘటనల్లో విద్యార్థులు కేసుల్లో ఇరుక్కుంటూ వెలుగు చూస్తున్న వాస్తవాలు తల్లిదండ్రులకు వణుకు పుట్టిస్తున్నాయి. ఇలాంటి డ్రగ్స్‌కు చెక్ పెట్టేదెలా..? విద్యార్థులకు డ్రగ్స్ దూరం చేసేదెలా..? అనే అంశాలపై తలలు పట్టుకుంటున్నారు అధికారులు. - సాక్షి, సిటీబ్యూరో

‘ఓపెన్ చేస్తే’.. నగరంలో డ్రగ్స్ సరఫరాపై పోలీసులు నిఘా పటిష్ఠం చేశారు. హైదరాబాద్‌కు చెందిన కొందరు విద్యార్థులు డ్రగ్స్ సరఫరాలో భాగస్వాములైనట్లు గుర్తించారు. ఏకంగా యూనివర్సిటీకి సరఫరా చేసే డిక్షనరీ మధ్యలో, మట్టిగాజుల మాటున డ్రగ్స్ సరఫరా చేయడం చూసి ఆశ్చర్యపోయారు. ఈ క్రమంలో నలుగురు విద్యార్థులను అరెస్టు చేశారు. అయితే కొన్ని కొరియర్ సంస్థల నుంచి రెండేళ్లలో సుమారు వంద కోట్లకుపైగా విలువైన డ్రగ్స్ తరలించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ విష సంస్కృతి విద్యార్థులను ఆకర్షించడం, భవిష్యత్తు తరాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.





- కొద్దిసేపు ఆనందం.. డిప్రెషన్ జీవితాంతం
- విద్యాలయాల్లో చాపకింద నీరులా పాకుతున్న డ్రగ్స్
- యాంటీ సోషల్ పర్సనాలిటీగా మారుతోన్న యువత
- మానసిక రుగ్మతలు పెరుగుతున్న వైనం
- డీ అడిక్షన్ కేంద్రాలకు బాధితులు, తల్లిదండ్రులు
- మెదడు పనితీరును దెబ్బతీస్తాయి : వైద్యులు



ఆందోళన కలిగించేలా..

నగర యువత గంజాయి, డ్రగ్స్ బాధితులుగా మారిపోతున్నారన్న అంశం ఆందోళన కలిగిస్తోంది. పబ్స్ మొదలు ఇంటర్, డిగ్రీ, వర్సిటీ హాస్టల్స్‌ను డ్రగ్స్ అడ్డాలుగా మార్చేస్తున్నారు. విద్యార్థి దశ నుంచి ఉద్యోగ, వ్యాపారాల్లో రాణిస్తున్న యువత వరకూ ఎంతో మంది మత్తుకు బానిసైపోతున్నారు. స్టైల్, ఫ్యాషన్ అంటూ మద్యం సేవించడం మొదలు డ్రగ్స్ వైపు అడుగులు వేసే విషసంస్కృతి వేళ్లూనుకుంటోంది. ఈ క్రమంలో పోలీసులకు పట్టుబడితే సమాజంలో తలెత్తుకోలేని విధంగా, నేరస్తులుగా ముద్ర వేసుకుంటున్నారు. పని ప్రదేశాల్లో, తరగతిగదుల్లో స్వేచ్ఛగా ఉండాల్సిన యువత కటకటాల వెనుక ఊచలు లెక్కబెడుతున్నారు. సమాజానికి, కుటుంబానికి శత్రువులుగా మారిపోతున్నారు. క్షణికానందం కోసం జీవితాంతం పలు మానసిక రుగ్మతలకు, రోగాలకు, మెదడు సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు.

నగరంలో పెరుగుతున్న డ్రగ్ అడిక్షన్స్

డీ-అడిక్షన్ సెంటర్లకు..

ఒక దఫా అలవాటుపడితే డ్రగ్స్ మహమ్మారి నుంచి తప్పించుకోవడం అంత సులువేంకాదని నిపుణులు చెబుతున్నారు. దీనిని నుండి బయట పడడానికి నానా తిప్పలు పడుతున్నారు. ఇటీవల కాలంలో ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలోని డీ-అడిక్షన్ సెంటర్‌కు భారీ సంఖ్యలో బాధితులు చేరుతున్నారు. ఒక్క ఆగస్టు నెలలోనే మద్యం, గంజాయి, మత్తు పదార్థాల భారి నుంచి విముక్తి కోసం 612 మంది డీ-అడిక్షన్ కేంద్రానికి వచ్చారని అధికారిక నివేదికలు చెబుతున్నాయంటే మహమ్మారి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.



యాంటీ సోషల్ పర్సన్‌గా మారతారు..

మద్యం తాగే వారితో పోల్చితే డ్రగ్స్, గంజాయి బాధితులు వేగంగా బానిసలైపోతారు. మానసిక ఆస్పత్రికి పాలీసబ్‌స్టెన్స్ కేసులు అధికంగా వస్తున్నాయి. సమయానికి డ్రగ్స్ దొరక్కపోతే పిచ్చివారిగా ప్రవర్తిస్తారు. విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటాయి. ఏమీ లేకున్నా ఎవరో వస్తున్నారని భయపడటం, ఆందోళన, అనుమానాలు, అపోహలు ఎక్కువగా ఉంటాయి. నిద్ర పట్టదు. ఇటువంటి వారి కుటుంబాల్లో గృహ హింస ఎక్కువగా ఉంటుంది. చిన్న విషయాలకే అబద్ధాలు చెప్పడం, దొంగతనాలు చేయడం, నిబంధనలు పాటించకపోవడం, రఫ్‌గా వ్యవహరించడం, వైలెంట్‌గా మారిపోవడం జరుగుతుంది. ఇటువంటి వారితో చాలా ప్రమాదం. సామాజిక వ్యతిరేక వక్తిత్వానికి అలవాటుపడతారు.



– డాక్టర్ ఆర్ అనిత, ఎర్రగడ్డమానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్

అవార్డింగ్ హార్మోన్స్‌తో ప్రమాదం..

గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు తీసుకున్నప్పుడు ఆ వ్యక్తిలో అవార్డింగ్ హార్మోన్స్ రిలీజ్ అవుతాయి. దీంతో వ్యక్తి నేను చాలా గొప్పవాడిననే ఫీలింగ్‌లో ఉంటాడు. నేను ఏం చేసినా, ఏం మాట్లాడినా నాకు ఎదురు లేదనే ఓవర్ కాన్ఫిడెన్స్‌లోకి వెళతాడు. ప్రవర్తనలోనూ విపరీత ధోరణి కనిపిస్తుంది. క్షణికానందం కోసం వెంపర్లాడతాడు. ఆ వెంటనే డిప్రెషన్‌లోకి వెళ్లిపోతాడు. డ్రగ్స్‌లో ఉండే కెమికల్స్ మెదడులోని న్యూరాన్స్‌పై తీవ్రప్రభావం చూపిస్తాయి. నెమ్మదిగా జ్ఞాపకశక్తి నశిస్తుంది. తీవ్ర ఒత్తిడి, భయం, ఆందోళనకు గురవుతాడు. హార్మోన్లు బ్యాలెన్స్ తప్పుతాయి. ఫిట్స్, బీపీ వంటివి వచ్చే అవకాశం ఉంది. స్నేహితులతో కలిసి తొలిసారి ఏదో సరదాగా రుచి చూద్దామనుకుంటే.. చివరికి మానుకోలేని వ్యసనంగా మారిపోతుంది. ఇటువంటి వాటిపట్ల జాగ్రత్తగా వ్యవహరించాలి. కుటుంబ సభ్యులు సైతం పిల్లల ప్రవర్తన, నడవడికపై దృష్టిసారించాలి. డ్రగ్ దొరక్కపోతే ఆత్మహత్య ఆలోచనలకు వెళ్లిపోతారు. ప్రతి ఒక్కరినీ అనుమానించడం, పరిస్థితులను సక్రమంగా అర్థం చేసుకోలేకపోవడం, ఎదుటివారి మాటలను అంచనా వేయలేకపోవడం, సెల్ఫ్ జడ్జిమెంట్ చేకపోవడం దీని ప్రధాన లక్షణాలు.



– డాక్టర్ టీ వెంకట నాని కుమార్, జనరల్ సర్జన్








స్టేకెడ్ స్టోరీస్ చిత్రప్రదర్శన

- అలరిస్తున్న 18 కలర్ పెన్సిల్ డ్రాయింగ్స్
- ఈ నెల 14 వరకూ అందుబాటులో ప్రదర్శన

మాదాపూర్ : చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ మాదాపూర్‌లో కళాకారుడు చైన్ని వెంకటేశ్ వేసిన కలర్ పెన్సిల్ డ్రాయింగ్స్ సందర్శకులను అలరిస్తున్నాయి. ‘స్టేకెడ్ స్టోరీస్’ పేరిట ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ సోమవారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు యంవి రమణ కళాకారులతో కలిసి సందర్శించారు. వెంకటేశ్ వేసిన పెన్సిల్ స్కెచ్చెస్ సందేశాత్మకంగా ఉన్నాయని, స్వచ్ఛమైన పల్లెటూరి వాతావరణాన్ని, జీవన విధానాన్ని తెలిపే విధంగా అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ప్రదర్శనలో 18 పెన్సిల్ డ్రాయింగ్స్ ఈ నెల 14 వరకూ అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రచయిత అంజుపొద్దార్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల కోసం.. ఇల్‌నెస్ టు వెల్‌నెస్..

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు పరిశుభ్రత, దాని ప్రాధాన్యతను తెలియజెప్పేందుకు ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు, ఇల్‌నెస్ టు వెల్‌నెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ విషయాన్ని ఫౌండేషన్ సలహా మండలి చైర్‌పర్సన్ అనిల్ రాజ్‌పుత్ తెలిపారు. ‘ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో, ‘స్వస్త్ హాత్, స్వస్త్ బచ్పన్’ (ఆరోగ్యకరమైన చేతులు, ఆరోగ్యవంతమైన బాల్యం) పేరిట ఓ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రముఖ బ్రాండ్ సావ్లాన్ మద్దతుతో కొనసాగే ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది 100కిపైగా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో 40,000 మంది విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించడం ఓ లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.



ఇండో వెస్ట్రన్ అంటే ఇష్టం..

‘ఫ్యాషన్ అంటే మనల్ని మనం అందంగా తీర్చిదిద్దుకోవడం.. సౌందర్యంగా కనిపిస్తూనే సౌకర్యంగా ఉండటం మరింత బ్యూటిఫుల్ అనిపిస్తుంది. ఈ మధ్యనే సరికొత్త కథాంశంతో విడుదలైన ‘పరదా’ సినిమాలో మగువల భావోద్వేగాలను, సామాజిక పరిస్థితులను తెరకెక్కించాం. ఇది ప్రభావవంతమైన కథాంశం, నటన పరంగానూ అందరి ప్రశంసలు పొందింది.’ అంటూ చెప్పుకొచ్చారు అందాల తార అనుపమ పరమేశ్వరన్. నగరంలోని బంజారాహిల్స్ వేదికగా స్వదేశీ ఫ్యాషన్ బ్రాండ్ ‘బిబా’ ఫ్లాగ్‌షిప్ స్టోర్‌లో సోమవారం సందడి చేశారు. ఈ వేదికపై నూతనంగా రూపొందించిన ఫెస్టివ్ కలెక్షన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనుపమ ‘సాక్షి’తో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఫ్యాషన్ ట్రెండ్స్, తదుపరి సినిమాల విశేషాలు ఆమె మాటల్లోనే..! - సాక్షి, సిటీబ్యూరో

- నగరంలో అందాల అనుపమ సందడి
- గ్రాండ్ లుకింగ్ కన్నా కంఫర్ట్ ముఖ్యం
- స్వదేశీ ఫ్యాషన్ బ్రాండ్ ‘బిబా’ ఫెస్టివ్ కలెక్షన్ ఆవిష్కరణ

హైదరాబాద్‌లో ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతున్న ఫ్యాషన్ హంగులను చూస్తే సంతోషంగా అనిపిస్తుంది. వ్యక్తిగతంగా ఇండో వెస్ట్రన్ ఫ్యాషన్ వేర్ అంటే నాకు చాలా ఇష్టం. ఇదే నా స్టైల్ స్టేట్మెంట్. ముఖ్యంగా కాటన్, స్మూత్‌కాటన్ ఇష్టపడతాను. గ్రాండ్ లుకింగ్ కన్నా కంఫర్ట్ ముఖ్యం. మన మూలాల్లోని ఫ్యాబ్రిక్, సంస్కృతి–అధునాతన డిజైనింగ్ సమ్మిళితం చేస్తే ఎక్కువగా ఆకర్షిస్తుంది. వాటిని ప్రోత్సహిండం ఇష్టం. బ్రీతబుల్ ఫ్యాబ్రిక్ అమ్మాయిలకు అనువుగా ఉంటుంది. సందర్భాన్ని బట్టి శారీస్, ఈవెంట్స్‌ను బట్టి డ్రెస్ వేసుకుంటా. మహిళల ఫ్యాషన్ వేర్ అంతర్గత శక్తిని, మానసిక స్థితిని తెలియజేస్తుందని నమ్ముతాను. నాకు రెడ్ కలర్, మస్టర్డ్ యెల్లో రంగుల దుస్తులే నచ్చుతాయి. రెడ్ అంటే పవర్‌ఫుల్.. నేను ఎక్కువ షాపింగ్ చేయను. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ వెళ్లినప్పుడు కచ్చితంగా షాపింగ్ చేస్తుంటాను. సౌకర్యవంతంగా ఉంటుంది కాబట్టి షూటింగ్స్ వెళ్లినప్పుడు ఎయిర్‌పోర్ట్‌లో, సందడి లేని ఇతర షాపింగ్ ప్రదేశాల్లో కొనుగోలు చేస్తాను. ‘డిఫరెంట్ బై డిజైన్’ అనే ఫిలాసఫీని ప్రతిబింబించేలా బిబా అందిస్తున్న దసరా కలెక్షన్ మన సాంస్కృతిక మూలాలను గుర్తు చేస్తుంది.



వరుస షూటింగ్స్‌తో బిజీ..

సినిమాల పరంగా తెలుగు ప్రేక్షకులు నన్ను ఆదరిస్తున్న తీరు చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. హైదరాబాద్ వాతావరణంలో సరికొత్త అనుభూతిని పొందుతాను. ఈ మధ్యే తెలుగులో నా ‘పరదా’ చిత్రం విడుదలైంది. ప్రస్తుతం బిజీ షెడ్యూల్ కొనసాగుతోంది. మరికొద్ది రోజుల్లో ‘కిష్కిందపురి’ సినిమా విడుదల కానుంది. కిష్కిందపురి తరువాత ‘బైసన్’ కూడా విడుదలకు సిద్ధమౌతోంది. ఈ రెంటితో పాటు ‘భోగీ’ అనే చిత్రంలో నటిస్తున్నాను. ఇది షూటింగ్ పూర్తి కానుంది. మరో తెలుగు సినిమాలోనూ నటిస్తున్నాను. ఇవి కాకుండా మలయాళంలో మరో రెండు సినిమాలు చేస్తున్నా.



సెమీస్ చేరిన తెలంగాణ జట్టు



మన్సూరాబాద్: గ్వాలియర్‌లో జరుగుతున్న 9వ జాతీయ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు సెమీస్‌కు చేరింది. ఢిల్లీతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు విజయం సాధించి సెమీస్‌కు చేరినట్లు జట్టు సభ్యుడు ధరావత్ సురేష్ తెలిపారు. ఈ మ్యాచ్‌లో అత్యుత్తమ ఆటను ప్రదర్శించినందుకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కిందని ఆయన పేర్కొన్నారు.

ఇటాలియన్ రుచుల్లో.. ఇంటర్నేషనల్ విన్నర్..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో భోజన ప్రియుల అభిమాన విదేశీ క్యుజిన్ ఇటాలియన్ రుచుల్ని అందించేందుకు మరో కొత్త రెస్టారెంట్ అందుబాటులోకి వచ్చింది. ఇటాలియన్ మెనూలో ఇంటర్నేషనల్ అవార్డ్ అందుకున్న ప్రఖ్యాత రెస్టారెంట్ బ్రాండ్ టోస్కానో గచ్చిబౌలిలోని వీఎస్‌డీ టెక్ పార్క్‌లో రెస్టారెంట్ ఏర్పాటు చేసింది. పిజ్జాలు, ఫ్రెష్ పాస్తాలు, వెరైటీ డెజర్ట్‌లతో పాటు మరెన్నో ఇటాలియన్ రుచులు అంతర్జాతీయ క్యుజిన్‌లకు పేరొందిన చెఫ్ జీన్–మిచెల్ జాస్పెరాండ్, చెఫ్ గౌతమ్ రూపొందించిన వంటకాల మెనూ నగరంలోని ఇటాలియన్ ఆహార ప్రియులను ఆకట్టుకుంటుందని బ్రాండ్ ప్రతినిధులు ఓ ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు.



క్లుప్తంగా...

కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకం: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: ధిక్కారమే జీవితంగా గడిపిన కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకం అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. పద్మ విభూషణ్, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్యం ఎంతో స్ఫూర్తిని నింపిందని వారితో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. కాళోజీ జన్మదినాన్ని తెలంగాణ భాషా దినోత్సవంగా అమలుచేసి, తెలంగాణ భాష, సాహిత్యంలో విశేషంగా కృషి చేసిన కవులు, రచయితలకు కాళోజీ పేరుతో పురస్కారాన్ని అందిస్తూ గౌరవించుకునే గొప్ప సంప్రదాయాన్ని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నెలకొల్పిందని వెల్లడించారు. రాష్ట్ర వైద్య విశ్వవిద్యాలయానికి కాళోజీ పేరు పెట్టుకున్నామని, వరంగల్‌లో కాళోజీ కళాకేంద్రంను ఏర్పాటు చేశామన్నారు.

తెలంగాణ భాషకు కాళోజీ కృషి ఎనలేనిది

కాళోజీ కథల పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రచురించిన పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు రచించిన కథల పుస్తకాన్ని సోమవారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్ పురావస్తు శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో కాళోజీ సాహిత్యానికి చేసిన కృషిని ఆయన కొనియాడారు. 'నా గొడవ'అనే పుస్తకంలో ఆయన రాసిన కవిత్వమే కాకుండా సాహిత్యంలోని అనేక అంశాలను కాళోజీ స్పృశించారని, తెలంగాణ భాషకు ఆయన చేసిన కృషి కూడా గొప్పదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం శుభ సూచకమని, ఇంతటి గొప్ప సాహిత్యవేత్త 111వ జన్మదినం సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో కాళోజీ కథల పుస్తకాన్ని తీసుకురావడాన్ని జూపల్లి అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, కవి యాకుబ్, ఈమని శివనాగిరెడ్డి, ముచ్చర్ల దినకర్ పాల్గొన్నారు.

బీసీలకు 42% రిజర్వేషన్లు సాధించే వరకు తగ్గేదిలేదు

ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు వెనక్కి తగ్గేదిలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తెలిపారు. సోమవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 70కిపైగా బీసీ కులాల నాయకులతో ఆమె భేటీ అయ్యారు. బీసీల రిజర్వేషన్ల సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని, బీసీలకిచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కాంగ్రెస్ మోసం చేస్తోందని ఆరోపించారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ ఇంత వరకు తెలంగాణ బీసీల రిజర్వేషన్ల అంశాన్ని ఎందుకు పార్లమెంట్‌లో ప్రస్తావించలేదో ప్రజలకు వివరణ ఇవ్వాలని నిలదీశారు. దీనిపై బీసీ సంఘాలను కలుపుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యమ కార్యాచరణ చేస్తామని తెలిపారు.

దసరా తర్వాత దండయాత్రే: జాజుల



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వం దసరా పండుగలోపు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై నిర్ణయం తీసుకోకుంటే దసరా తర్వాత భువనగిరిలో లక్షలాది మందితో 'బీసీ రాజకీయ యుద్ధభేరి మహాసభ'ను నిర్వహిస్తామన్నారు. సోమవారం సోమాజిగూడలో బీసీ కుల సంఘాల ప్రతినిధులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 22 నెలలుగా బీసీలు రిజర్వేషన్లు పెంచాలని పోరాటం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదని, బీసీ రిజర్వేషన్లు 9వ షెడ్యూల్‌లో చేర్చలేమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. మైనార్టీ రిజర్వేషన్లను బూచిగా చూపిస్తూ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారి, బీసీ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకుడు ప్రొ.మల్లేశ్వర్, పాల్గొన్నారు.

42% రిజర్వేషన్లు ఇచ్చాకే 'స్థానికం'

పార్టీ ఆలోచన ఇదే... 90 శాతం ప్రజలకు పథకాలు అందుతున్నాయి

- సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ సమన్వయంతో పనిచేస్తున్నారు
- కామారెడ్డి డిక్లరేషన్‌కు పార్టీ కట్టుబడి ఉంది... వచ్చే నెల నుంచి జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై దృష్టి
- టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్. చిత్రంలో మీనాక్షీ నటరాజన్, భట్టి, పొన్నం.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ స్పష్టం చేశారు. కామారెడ్డిలో చేసిన బీసీ డిక్లరేషన్‌కు పార్టీ కట్టుబడి ఉందన్నారు. స్థానిక ఎన్నికల విషయంలో రిజర్వేషన్ల కల్పనే ప్రధానమని పార్టీ యోచిస్తోందని చెప్పారు. సోమవారం గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన టీపీసీసీ విస్తత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ భేటీలో మీనాక్షి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సమన్వయంతో పనిచేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు 90 శాతం మంది ప్రజలకు అందుతున్నాయన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై వచ్చే నెల నుంచి పార్టీ దృష్టి సారిస్తుందని.. ఉపఎన్నికలో గెలుపే లక్ష్యంగా నేతలంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. వచ్చే వారంలో డీసీసీ కమిటీలు పూర్తవుతాయని.. గ్రామ శాఖ అధ్యక్షుల ఎంపికను 3 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. ఈ నెల 15న కామారెడ్డిలో బీసీల సమరభేరి సభను విజయవంతం చేయాలని మీనాక్షి పిలుపునిచ్చారు.

చేరికలను ఆహ్వానించాలి: భట్టి

రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అజేయంగా నిలపడం కోసం పీసీసీ చీఫ్ చేసే ప్రతి పనికీ సీఎం రేవంత్‌తోపాటు మంత్రివర్గమంతా అండగా ఉంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా నేతలంతా కలిసి పనిచేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరి సమాచారం తమ వద్ద ఉందని.. అందరికీ ఏదో ఒక రూపంలో న్యాయం జరుగుతుందని భట్టి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు నచ్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలపట్ల ఆకర్షితులై గ్రామ, మండల స్థాయి నుంచి వస్తున్న వివిధ పార్టీల నేతలను ఉద్యమంలాగా పార్టీలోకి ఆహ్వానించాలని కోరారు.

మళ్లీ మనమే గెలుస్తాం: టీపీసీసీ చీఫ్

ప్రభుత్వ పథకాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను పార్టీ నేతలు, కార్యకర్తలు తీసుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. 2029లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని.. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఖతమై రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తోపాటు టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ల చైర్మన్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఉమ్మడి జిల్లాల పార్టీ ఇన్‌చార్జీలు, జై బాపు–జై భీం కార్యక్రమాల కమిటీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బూత్‌స్థాయి వరకు నెట్‌వర్క్: మంత్రి పొన్నం

టీపీసీసీ సమావేశం అనంతరం విప్ ఆది శ్రీనివాస్, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులతో కలిసి బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో భాగంగా పలు అంశాలపై చర్చించామని చెప్పారు. పీసీసీ చీఫ్‌గా మహేశ్‌గౌడ్ ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు పార్టీ నాయకత్వం అభినందనలు తెలిపిందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రతిపక్షాల విమర్శలు తిప్పికొట్టడం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలు, 15న కామారెడ్డిలో బహిరంగ సభ, జనహిత పాదయాత్ర, ఓట్ చోరీ తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీపక్షాన హైదరాబాద్ నుంచి పోలింగ్ బూత్‌స్థాయి వరకు నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పొన్నం వెల్లడించారు. వివిధ కారణాలతో పార్టీ వీడిన నేతలను మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవాలని భట్టి చేసిన ప్రతిపాదనను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు.

కామారెడ్డిలో కాంగ్రెస్ నిర్వహించేది 'బీసీ ద్రోహ' సభ

- బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రంపై నెట్టడాన్ని ఖండిస్తున్నాం
- రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'విమోచన ఉత్సవాలు'నిర్వహించాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో నిర్వహించబోయేది బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ కాదని, అది బీసీలకు ద్రోహం చేసే సభ.. అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుగ్లక్ కంటే ఘోరమైన పరిపాలన చేస్తోందని అన్నారు. ఇప్పటికైనా బీసీలకు హామీ ఇచ్చిన మేరకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బీజేపీ కార్యాలయంలో సెప్టెంబర్ 17న 'హైదరాబాద్ లిబరేషన్ డే'ను పురస్కరించుకుని పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు అమలు చేయలేక బీజేపీ, కేంద్రంపై నెపం నెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీసీలకు ఏమీ చేయని కాంగ్రెస్ నాయకులు తమ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కార్‌కు బీసీ సామాజిక వర్గానికి 42% రిజర్వేషన్లు నిజంగా ఇవ్వాలని ఉంటే, అది న్యాయపరమైన ప్రక్రియ ద్వారానే సాధ్యమయ్యేదన్నారు. రిజర్వేషన్లను అమలు చేయడానికి 2018 పీఆర్ చట్టం (సెక్షన్ 285)ని సవరించకుండా, 22 నెలల ఆలస్యం తర్వాత మళ్లీ రెండోసారి బిల్లు తీసుకొచ్చిందన్నారు. మరోవైపు స్థానిక ఎన్నికల సమయం మించిపోతోందన్నారు. అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందాక రాష్ట్రపతికి పంపితే అక్కడ ఆమోదానికి నిర్ణీత సమయ వ్యవధి ఉండదని పేర్కొన్నారు. సమయానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించని ఫలితంగా కేంద్రం నుంచి రావాల్సిన సుమారు రూ. 1,600 కోట్లు నిలిచిపోయాయన్నారు. కాగా, ఈ నెల 17న పరేడ్ గ్రౌండ్స్‌లో హైదరాబాద్ లిబరేషన్‌డే ఉత్సవాలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు.

11న రజాకార్ సినిమా ప్రత్యేక షో

రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ నెల 11న ఏర్పాటు చేస్తున్న రజాకార్ సినిమా ప్రత్యేక షోలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఇతర నాయకులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ విమోచన దినోత్సవానికి సంబంధించిన చరిత్రను భావితరాలకు తెలియజేసేలా.. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే విమోచన ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

22 మందితో బీజేపీ రాష్ట్ర కార్యవర్గం

▶ మొదటి పేజీ తరువాయి

బండారి శాంతికుమార్, ఎం.జయశ్రీ,, కొల్లి మాధవి, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, డా.జె.గోపి(కల్యాణ్‌నాయక్), రఘునాథరావు

- కార్యదర్శులుగా డా.ఓ.శ్రీనివాస్‌రెడ్డి, కొప్పుబాషా, భరత్ ప్రసాద్, బండారు విజయలక్ష్మి స్రవంతిరెడ్డి, కరణం పరిణీత, బద్దం మహిపాల్‌రెడ్డి, డా.టి.రవికుమార్, కోశాధికారిగా దేవకీ వసుదేవ్
- సంయుక్త కోశాధికారిగా విజయ్ సురానా జైన్, ప్రధాన అధికార ప్రతినిధిగా ఎన్వీ.సుభాష్ నియమితులయ్యారు.

వివిధ మోర్చాలకు వీరే...

మహిళామోర్చా అధ్యక్షురాలిగా డా.మేకల శిల్పారెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా గంధమళ్ల ఆనంద్‌గౌడ్‌ను మళ్లీ కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

- యువమోర్చా అధ్యక్షుడిగా గణేశ్ కుందే, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా బి.లక్ష్మీనరసయ్య, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా కాంతి కిరణ్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా నేనావత్ రవి నాయక్, మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా సర్దార్ జగన్‌మోహన్‌సింగ్‌లను నియమించారు.

రాంచందర్‌రావు టీమ్‌లో ఐదుగురే పాతవారు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్.రాంచందర్‌రావు తన టీమ్‌ను ఏర్పాటు చేసుకోవడంలో భాగంగా అన్ని సామాజికవర్గాలకు తగిన ప్రాధాన్యం కల్పించే ప్రయత్నం చేశారు. కొత్త కార్యవర్గంలో కేవలం ఐదుగురు పాతవారికే అవకాశం దక్కింది. వారిలో డా.కాసం వెంకటేశ్వర్లుయాదవ్, బండారి శాంతికుమార్, ఎం.జయశ్రీ,, కొల్లి మాధవి, టి.వీరేందర్‌గౌడ్ ఉన్నారు. అయితే అందరూ ఊహించిన విధంగా కాకుండా కొత్తవారికి ఆఫీస్ బేరర్ల లిస్ట్‌లో చోటు దొరికింది. గత రెండుమూడు కమిటీల్లో కొనసాగుతూ వచ్చిన చాలామందికి ఈసారి అవకాశం లభించలేదు. అయితే మొత్తానికి మొత్తం ముగ్గురు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా కొత్తవారినే నియమించడంతో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, సమన్వయంపై ప్రభావం పడే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కేంద్రమంత్రులదే ముద్ర ?

రాష్ట్ర పదాధికారుల ఎంపికలో కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండిసంజయ్ కీలకపాత్ర పోషించా రని ఆ పార్టీ నేతలు గుసగుసలాడుతున్నారు. తమ అనుయాయులకు పెద్దపీట వేసేలా వారు పైచేయి సాధించారనే చర్చ పార్టీలో అంతర్గతంగా సాగుతోంది. అయితే రాష్ట్ర కమిటీ కూర్పు విషయంలో ఆరుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు, ముగ్గు రు ఎమ్మెల్సీల సిఫార్సులు పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో బలపడేందుకు తమ అనుచరులకు రాష్ట్ర కమిటీతోపాటు జిల్లా కార్యవర్గాల్లో తగిన ప్రాధా న్యం కల్పించాలనే విజ్ఞప్తులను జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు పట్టించుకోలేదనే వారు వాపోతున్నారు.

ఆహార పంపిణీలో అంతరాలుండొద్దు..!

అంగన్‌వాడీల్లో చిన్నారులకు త్వరలో బ్రేక్‌ఫాస్ట్: సీతక్క



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలకు ఆహార సరఫరాలో ఎలాంటి అంతరాలు ఉండొద్దని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఏమాత్రం జాప్యం జరిగినా.. అందుకు సంబంధించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని ఆమె తేల్చిచెప్పారు. సోమవారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అమలుచేస్తున్న కార్యక్రమాలకు సంబంధించి అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు అందుతున్న తీరును పరిశీలిస్తూ.. గుడ్లు, పాలు, పప్పు, మంచినూనె, స్నాక్స్, బాలామృతం సరఫరాపై మంత్రి సమీక్షించారు. పాల సరఫరా పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇతర సరుకులు దాదాపు 98 శాతం సకాలంలో పంపిణీ చేస్తున్నారని, కానీ పాలసరఫరా 58 శాతం కూడా లేదని, ఎక్కడ జాప్యం జరుగుతుందనే అంశంపై నివేదిక ఇవ్వాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు త్వరలో బ్రేక్‌ఫాస్ట్ స్కీం ప్రారంభిస్తామని, అదేవిధంగా ఈ ఏడాది 1,261 అంగన్‌వాడీ భవనాల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, ఇందులో 1,181 కేంద్రాలకు స్థలాల గుర్తింపు దాదాపు పూర్తయిందని తెలిపారు.

కాంట్రాక్టర్ల 'రింగ్'

- ఉచిత చేపపిల్లల పంపిణీ బిడ్స్‌కు ముందుకురాని కాంట్రాక్టర్లు

సాక్షి, హైదరాబాద్: ఉచిత చేప పిల్లల పంపిణీ కోసం మత్స్యశాఖ ఆహ్వానించిన టెండర్లకు కాంట్రాక్టర్లు ఆమడ దూరంలో ఉంటున్నారు. సకాలంలో మీనాలు వదలాలని భావిస్తున్న మత్స్యశాఖ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ.. ఆలస్యానికి కారణం అవుతున్నారని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టులో 33 జిల్లాల్లో మత్స్యశాఖ టెండర్లను ఆహ్వానించింది. అయితే 8 జిల్లాల్లో కాంట్రాక్టర్లు ఎవరూ బిడ్స్‌కు ముందుకు రాలేదు. దీంతో ఇప్పటికే మూడు సార్లు గడువు పొడిగించిన మత్స్యశాఖ.. మళ్లీ ఈనెల 12 వరకు బిడ్స్ దాఖలు చేసుకోవాలని కాంట్రాక్టర్లకు సూచించడం గమనార్హం.

ఒక్కో జిల్లాకు ఒక్కరే

8 జిల్లాల్లో ఎవరూ బిడ్స్ వేయకపోగా.. మిగతా 25 జిల్లాల్లో 46 నుంచి 50 వరకు బిడ్స్ వచ్చినట్లు తెలిసింది. అయితే 15 జిల్లాల్లో మాత్రం ఒకే బిడ్ చొప్పున దాఖలు అయింది. సింగిల్ బిడ్ దాఖలు అయిన జిల్లాల్లో కొన్ని ఇబ్బందులు ఉంటాయని చెపుతున్నారు. టెక్నికల్‌గా క్వాలిఫై కాకపోతే దానిని రద్దు చేస్తారు. దాంతో ఆ జిల్లాకు కొత్తవారు వచ్చేలా మళ్లీ తేదీ ప్రకటించాలి. వచ్చిన వాటిని క్వాలిఫై చేయాలి. అందుకే రెండుకంటే ఎక్కువ మొత్తంలో బిడ్స్ దాఖలయ్యేలా చూస్తారు. కానీ, ప్రస్తుతం ఒక్కో బిడ్ దాఖలు వెనక పాత కాంట్రాక్టర్ల పాత్ర ఉందని ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కటే బిడ్ వేస్తే రద్దు చేయడానికి అవకాశం ఉండదని, ధర పెంచుకోవచ్చునని, ఎలాంటి మీనాలు వదిలినా ఎవరూ పట్టించుకోరనే ధైర్యంతో ఇలా చేస్తున్నారని విమర్శలొస్తున్నాయి.

అంతటా అపరిశుభ్రత, దుర్గంధం

▶ మొదటి పేజీ తరువాయి

క్షేత్రస్థాయి అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. కరీంనగర్ ప్రాంతంలోని ఓ కేజీబీవీలో విద్యార్థులు దగ్గు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారు. సమీపంలోనే డంపింగ్ యార్డ్ ఉండటం, ఇటీవల వర్షాలకు ఇది దు ర్గంధం వెదజల్లడం కారణమని గుర్తించారు. కొన్ని నెలలుగా మహబూబాబాద్ జిల్లాల్లో 36 మంది, నిజామాబాద్ జిల్లాల్లో 90 మంది, వనపర్తిలో 50 మంది విషాహారంతో అస్వస్థతకు గురైన ఘటనలు నమోదయ్యాయి. పరిసరాల పరిశుభ్రత లోపించడం వల్లే ఈ ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తించారు. ఖమ్మం జిల్లా మారుమూల ప్రాంతంలోని కేజీబీవీల్లో వర్షపు నీరు చేరి ప్రాంగణమంతా బురదగా మారింది. భోజన సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దోమలు పెరిగాయి. వ్యాధుల బారిన పడుతున్నారు.



ములుగు జిల్లాలో కేజీబీవీ వద్ద మురుగు నీరు

అర్వపల్లిలో అరణ్య రోదన...

సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి కేజీబీవీ చినుకుపడితే జలమయమవుతోంది. ఇక్కడ 300 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం సమీపంలో చేపట్టిన కాల్వ నిర్మాణం వల్ల నీరు కేజీబీవీ వద్దే నిలిచిపోతోంది. కాస్త పెద్ద వర్షం పడితే విద్యాలయానికి సెలవు ప్రకటించాల్సిందే. వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలన్న మొర వినిపించుకొనే నాథుడే లేడని స్థానికులు అంటున్నారు.

మంగపేట మూగ వేదన..

ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని కేజీబీవీలో 170 మంది చదువుతున్నారు. ఇక్కడ కొత్త భవనమే ఉన్నా ప్రహరీ లేదు. పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. భోజన వేళల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. పందుల వల్ల దోమలు పెరుగుతున్నాయి. మురుగునీరు బయటకు వెళ్లలేక దుర్వాసన వస్తోంది. గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని కేజీబీవీ ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో దోమలు విపరీతంగా పెరిగాయి.

గండీడ్‌లో ఘోష

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లో కొత్తగా ఏర్పాటైన కేజీబీవీ అద్దె భవనంలో నడుస్తోంది. 188 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ఇటీవల వర్షాలకు నీరు నిలిచి ప్రాంగణమంతా బురదమయమైంది. దీంతో దోమలు వ్యాపించి సుమారు 40 మంది విద్యార్థులు జ్వరాల బారిన పడి ఇళ్లకు వెళ్లిపోయారు. అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

రాజన్నా... సమస్యలేంటన్నా!

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 కేజీబీవీలన్నీ పట్టణాలకు దూరంగా ఉన్నాయి. దీంతో రక్షణ కరువైందని విద్యార్థినులు అంటున్నారు. ఇల్లంతకుంట మండలంలోని కేజీబీవీకి వెళ్లే రోడ్డు సరిగ్గా లేక రాకపోకలకు వాగు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం కురిస్తే ట్రాక్టర్‌పై వెళ్లాల్సి వస్తోంది. అనారోగ్య సమస్యలు వస్తే తక్షణ వైద్య సదుపాయానికి నరకయాతన పడాల్సి వస్తోంది. అధికారులు తక్షణమే స్పందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

గుండె జబ్బులే.. ప్రాణాంతకం

- మొత్తం మరణాల్లో 31 శాతానికి కారణం ఇవే
- తర్వాతి స్థానంలో నిలిచిన శ్వాసకోశ సమస్యలు
- అజీర్ణ సమస్యలు, అకారణ జ్వరాలు, మధుమేహం
- 15–29 ఏళ్ల యువతలో 'ఆత్మహత్యల' మరణశాసనం
- 'రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా' తాజా నివేదిక

మనదేశంలో 2021-23 మధ్య సంభవించిన మరణాలకు గుండె జబ్బులే ప్రధాన కారణమని.. ఆ తర్వాతి స్థానంలో శ్వాసకోశ సమస్యలు ఉన్నట్లు 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' తన తాజా నివేదికలో వెల్లడించింది. మొత్తం మరణించిన వారిలో 40 శాతానికిపైగా.. 70 ఏళ్లకుపైబడిన వారే. భారతదేశ ప్రజారోగ్య వ్యూహాలను రూపొందించటానికి, పెరుగుతున్న అసాంక్రమిక వ్యాధుల భారాన్ని ఎదుర్కొనే ప్రణాళికల రూపకల్పనకు ఈ పరిశోధన ఫలితాలు కీలకమైనవని నివేదిక పేర్కొంది.

'మరణ కారణాలు: 2021–2023' పేరిట రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్జీఐ) సెప్టెంబర్ 3న విడుదల చేసిన శాంపిల్ రిజిస్ట్రేషన్ సర్వే తాజా నివేదిక ప్రకారం దేశంలోని అనారోగ్య సంబంధ మరణాలకు దాదాపు 31 శాతం వరకు గుండె జబ్బులే ప్రధాన కారణం. మొత్తం మరణాల్లో 56.7 శాతం వరకు అసాంక్రమిక వ్యాధులు (గుండె జబ్బులతో సహా) ఉన్నట్లు నివేదిక తెలిపింది. గుండెజబ్బుల తర్వాత శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, శ్వాసకోశ వ్యాధులు మరణాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఆ తర్వాతి స్థానంలో ప్రసూతికి సంబంధించిన మరణాలు, పౌష్టికాహార లోపాల మరణాలు 23.4 శాతం వరకు ఉన్నాయి.

గుండెపై జీవనశైలి ఒత్తిళ్లు.. అన్ని రకాల హృద్రోగాలు కలిపి మరణాలకు ప్రధాన కారణంగా నిలిచాయని, దాదాపు 31 శాతం మంది ప్రాణాలను అవి బలిగొన్నాయని నివేదిక తెలిపింది. యువతలో జీవనశైలి వల్ల తలెత్తుతున్న గుండె జబ్బుల తర్వాత, ఆత్మహత్యలు వారి మరణానికి రెండో ప్రధానం కారణంగా ఉన్నాయని నివేదిక తెలిపింది. 30 ఏళ్లు దాటిన వారిలో మరణాలకు గుండె జబ్బులు ప్రధాన కారణంగా ఉంటుండగా, 15–29 ఏళ్ల యువత పాలిట ఆత్మహత్యలు మరణ శాసనాలుగా మారుతున్నాయి.

ప్రాంతాల వారీగా సర్వే

ఉత్తర, ఈశాన్య, తూర్పు, మధ్య, పశ్చిమ, దక్షిణ.. ఇలా ప్రాంతాల వారీగా రిజిస్ట్రార్ ఆఫ్ ఇండియా 'మరణ కారణాలు: 2021-2023' సర్వేను నిర్వహించింది.

దక్షిణాదిన హృద్రోగ మరణాల శాతం 32.8 శాతం ఉండగా, ఉత్తరాదిన 34.5 శాతంగా ఉంది.

శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల వల్ల మరణాలు పశ్చిమ ప్రాంతంలో అత్యధికంగా 12.7 శాతం ఉన్నాయి. తరవాతి స్థానంలో (12.3 శాతం) మధ్య భారతం ఉంది. ఇవి అత్యల్పంగా (7.1 శాతం) సంభవించింది ఉత్తరాదిలో.

మధుమేహం వల్ల అత్యధికంగా 4.6 శాతం మరణాలతో దక్షిణాది అగ్రస్థానంలో నిలిచింది. తరువాతి స్థానంలో (4.1 శాతం) ఉత్తరాది ఉంది.

టాప్ - 10 ప్రధాన మరణ కారణాలు, మరణాలు (శాతాలలో)

హృద్రోగాలు	31
శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌లు	9.3
కణజాలంలో అసాధారణ వృద్ధి	6.4
శ్వాసకోశ వ్యాధులు	5.7
జీర్ణకోశ వ్యాధులు	5.3
అకారణ జ్వరాలు	4.9
అనుకోని గాయాలు	3.7
మధుమేహం	3.5
మూత్ర వ్యాధులు	3
ఇతర కారణాలు	27.1

యువతలో.. 15-29 ఏళ్ల వారిలో మరణాలకు కారణాలు (శాతాలలో)

ఆత్మహత్యలు	17.3
ఊహించని గాయాలు (రోడ్డు ప్రమాదాలు)	16.4
హృద్రోగాలు	9.7
ఊహించని గాయాలు (రోడ్డు ప్రమాదాలు కాకుండా)	8.4
జీర్ణకోశ వ్యాధులు	6.6
అస్పష్ట వ్యాధి లక్షణాలు	6
శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌లు	4.4
కణజాలంలో అసాధారణ వృద్ధి	4
అకారణ జ్వరాలు	3.8
క్షయ వ్యాధి	3.3
ఇతర కారణాలు	19.9

	మరణ కారణాలు	మొత్తం	స్త్రీలు	పురుషులు
		(శాతాల్లో)		
1	సాంక్రమిక వ్యాధులు, టీబీ, ఎయిడ్స్, మలేరియా, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, జ్వరాలు, పోషకాహార లోపాలు, ప్రసవ సంబంధం.. మొదలైనవి)	23.4	25.9	21.6
2	గాయాలు (అనుకోకుండా జరిగేవి, ఆత్మహత్యలు, వాహన ప్రమాదాలు, వాహనేతర ప్రమాదాలు తదితరాలు)	9.4	6.8	11.3
3	అసాంక్రమిక వ్యాధులు (హృద్రోగాలు, శ్వాసకోశ వ్యాధులు, న్యూరో సైకియాట్రిక్ వగైరా)	56.7	53.9	58.7
4	ఇతరత్రా	10.5	13.4	8.5

70 పైబడినవారే అధికం

దేశంలో 2021-23 మధ్య సంభవించిన మరణాల్లో 70ఏళ్లు, అంతకుపైబడిన వారే ఎక్కువ.

వయసుల వారీగా మొత్తం మరణాల్లో శాతం

0-14	10.6
15-29	5.1
30-44	9.6
45-54	10.2
55-69	28.8
70 ఏళ్లకు పైన	40.6

30-69 ఏళ్ల వారిలో...

మరణ కారణం	శాతం
హృద్రోగాలు	35.6
శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు	8.4
జీర్ణసంబంధ వ్యాధులు	7.8
శ్వాసకోశ వ్యాధులు	4.9
మూత్ర సంబంధ సమస్యలు	4
మధుమేహం	3.9
అకారణ జ్వరాలు	3.8

70 ఏళ్లకు పైబడిన వారిలో.. హృద్రోగాల కారణంగా 33.9 శాతం, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు - 9.5 శాతం, శ్వాసకోశ వ్యాధులు - 7.5 శాతం, అకారణ జ్వరాలు - 5.5 శాతం, మధుమేహం - 4.5 శాతం, వాహన ప్రమాదాల వల్ల 3.2 శాతం మరణించారు.

-సాక్షి, స్పెషల్ డెస్క్



మరణాన్ని ఓదార్పు అడగకు

నేడు ఆత్మహత్యా నివారణ దినోత్సవం

బతుకులో జ్వాలలు ఉన్నాయని
శరీరాన్ని అగ్నికి ఆహుతి ఇవ్వడం
పరిష్కారం ఎలా అవుతుంది అంటారు విజ్ఞులు.
'అన్ని కష్టాలకు విముక్తి చావే' అనే మాటకు
మించిన అవివేకం లేదంటారు కౌన్సెలర్లు.
బలవన్మరణం ఆ వ్యక్తిని
చనిపోయాక కూడా వెంటాడుతుంది.
ఒక అపప్రథగా...
కుటుంబాన్ని కష్టాల పాలు చేస్తుంది.
మనిషి లేని లోటు ఏం చేసినా తిరిగి రాదు.
అటువంటి సమయంలో మరణం ఎందుకు?
నిరాశ, నిస్పృహ పరిస్థితులు, సవాళ్లు
ఎవరికీ కొత్త కాదు.
బతకడమే చేయవలసింది.
నిపుణుల సలహాలతో కథనం.

అంకెలు దుర్మార్గమైనవి. అవి నిజమైన నష్టాన్ని చూపించవు. కావాలంటే ఈ అంకె– 1,80,000 చూడండి. దీనిని చూస్తే ఏమీ అనిపించదు. కాని మన దేశంలో ప్రతి ఏటా ఇంతమంది ఆత్మహత్యల ద్వారా చనిపోతున్నారు. వీరందరి ఫొటోలను సముద్రతీరం వెంబడి ప్రదర్శిస్తే ఎన్ని కిలో మీటర్ల తీరం కావాలి? అలా ప్రదర్శిస్తే తెలుస్తుంది తీవ్రత,,, ఇంత మంది చనిపోతున్నారా అని. వీరిలో కనీసం 1,20,000 మంది పురుషులు. ఇప్పుడు ఆలోచించండి. పితృస్వామ్య ఆధారితమైన మన సమాజంలో పురుషుడు చనిపోతే ఆ ఇంట్లోని ఎంతమంది సభ్యులు దిక్కులేనివారు అవుతారు. జీవితాలు తల్లకిందులు చేసుకుంటారు. మరెన్నో కష్టాల్లో కూరుకుపోతారు. కరోనా అనో మరోటనో మహమ్మారులను చూసి భయపడటం కాదు. ఈ భూగ్రహాన్ని పీడిస్తున్న అతి పెద్ద మహమ్మారి ఆత్మహత్యే. ప్రతి ఏటా అన్ని దేశాలలో కలిపి 8 లక్షల మంది ఆత్మహత్యల ద్వారా మరణిస్తున్నారు. ఇది ఒక రకంగా కాకిలెక్కే. అసలు లెక్క తెలియక పోవడమే మంచిది. మరో విషయం తెలుసా? ప్రతి మరణానికీ ఒకరు చనిపోవడమే కనిపిస్తుంది... కాని ఆ సమయానికి మరో ఇరవై మంది ఆత్మహత్యాయత్నం చేసి బతికి బయటపడ్డ వాళ్లు ఉంటారు.

ఆరుకు ఒకరు

ప్రస్తుతం మన దేశంలో 15 నుంచి 29 మధ్య వయసులో ఉన్న పురుషులు ఎక్కువ సంఖ్యలో ఆత్మహత్య చేసుకుంటున్నారు. అంటే దేశంలోని ప్రతి ఆరు ఆత్మహత్యల్లో ఒకటి ఈ ఏజ్ గ్రూప్ నుంచే ఉంది. బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన వయసులో ఆత్మహత్యల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. కారణం–

● చదువు ఒత్తిడి ● పని చోట పీడన ● బంధాలలో దగా ● ఆర్థిక సమస్యలు ● అన్ని జీవన పార్శ్వాలలో బెస్ట్‌గా ఉండమని కోరే సాంఘిక నియమం

చెప్పకునే మనిషీ కోరుకునే అండ

మనిషి తనకొచ్చే కష్టాల వల్ల ఆత్మహత్య చేసుకోడు. ఆ కష్టాలను వినే మనిషి లేకపోవడం వల్ల. నేనున్నాననే భరోసా దొరకకపోవడం వల్ల. నిస్సహాయత ఫీలయ్యి ఆత్మహత్య శరణ్యం అనుకుంటాడు. ఆత్మహత్య చేసుకోవడం ఒక నిమిషపు నిర్ణయం కాదు చాలామంది విషయంలో. కొందరు రోజుల తరబడి దీని గురించి ఆలోచిస్తారు. ఆలోచిస్తూ ఉంటారు. చివరకు ప్రయత్నిస్తారు.

అందుకు సంబంధించిన మార్పులు వ్యక్తులలో. కుటుంబ సభ్యులలో గుర్తించడం చాలామటుకు సాధ్యం. సమస్య ఏమిటో తెలుసుకుంటే. వారిని కదిలించి రాబట్టగలిగితే వారు ప్రమాదపు అంచుకు వెళ్లరు. దురదృష్టవశాత్తు కుటుంబ సభ్యులే ఒకరిని మరొకరు గమనించలేనంతగా బిజీగా ఉంటూ అంతా అయ్యాక కళ్లు తెరుస్తున్నారు.

ఇదొక జబ్బు

ఆత్మహత్యను జబ్బుగా ఎవరూ చూడరు. కాని ఇదొక జబ్బు. పట్టలేని ఉద్వేగం వల్ల, క్షణికావేశం వల్ల, నేను చస్తే అవతలివాళ్లు పశ్చాత్తాపంతో బాధ పడాలి అన్నట్టుగా, సమస్యలకు పరిష్కారమే ఉండదన్న నెగెటివ్ స్వభావం వల్ల, పరువు ప్రతిష్ఠలకు ఎక్కువ విలువివ్వాలనే భావన వల్ల, నోరు తెరిచి సమస్యను బయటపడేయని స్వభావం వల్ల ఆత్మహత్యలు జరుగుతుంటాయి. తరచి చూస్తే ఇవన్నీ మెదడు చేసే విన్యాసాలే. కెమికల్ రియాక్షన్సే. ఉద్వేగాలను, ఆవేశాలను దాటి వస్తే, మనం పోయి మరొకరిని సాధించడమనే భావన ఎంతటి హాస్యాస్పదమో ఎరుకలోకి వస్తే, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందనే నమ్మకం కలిగి ఉంటే, పరువు ప్రతిష్ఠలు తర్వాత ముందు ప్రాణం ముఖ్యం అనుకుంటే, ఆత్మాభిమానం కంటే సమస్య నుంచి బయటపడటం ముఖ్యం అనుకుంటే ఆత్మహత్యలు జరగవు. మరో విషయం ఏమిటంటే ఒకరికి ప్రపంచ సమస్యగా ఉండేది ఎదుటివారికి అసలు సమస్యే కాకపోవచ్చు. 'ఇంత చిన్న విషయానికి చనిపోయాడా?' అని ఆశ్చర్యపోతారు తప్ప జాలి కూడా చూపరు. మరి ఆత్మహత్య చేసుకోవడం ఎందుకు? ఆత్మహత్య ఆలోచనలు వస్తే జ్వరానికి మాత్ర మింగినట్టు ఆ ఆలోచనలు పోయే కౌన్సిలింగ్ తీసుకోవాలి. మిత్రుల సహకారం తీసుకోవాలి. అవసరమైతే వైద్యుల సలహాతో మందులు వాడాలి. అంతే చేయవలసింది. చనిపోవడం కాదు.

భళ్లున తెల్లారుతుంది

ఈ చీకటి రాత్రి విషమ పరీక్షలు ఎన్ని పెట్టినా ప్రాణాలు ఉగ్గబట్టుకుని ఉంటే మరునాడు భళ్లున తెల్లారుతుంది. ఆ వెలుతురు దారి చూపిస్తుంది. కొత్త ఊపిరి వస్తుంది. కాని రాత్రే శాశ్వతం అన్నట్టు ప్రాణాలు తీసుకుంటారు కొంత మంది. గత రాత్రి వ్యక్తి చనిపోయినా మరుసటి రోజు లోకం స్తంభించదు. అందరూ ఎవరి పనుల్లో వారుంటారు. సినిమాలు ఆడుతుంటాయి. కెఫేలు బిజీగా ఉంటాయి. బ్యాంకు లావాదేవీలు జరుగుతుంటాయి. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి నిర్జీవం కావడం తప్ప అంతా మామూలుగా ఉంటుంది. ఆ అంతా మామూలుగా ఉండే జగత్తులో ఉంటూ జీవితాన్ని మిస్ కాకుండా ఉండాలనే భావన కలిగించుకుంటూ ఉండాలి. అందరూ కష్టాలను ఎదుర్కొంటూనే ఉన్నారని ఎవరిని కదిపినా తెలుస్తుంది. మరి వారంతా చనిపోనప్పుడు మనం ఎందుకు చనిపోవాలి అనుకోవడంలోనే ఉంది విజ్ఞత. ఈ కమ్యూనికేషన్ రోజుల్లో 24 గంటలు ఎన్నో కౌన్సెలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కాల్ చేస్తే సాయం చేస్తారు. ఆ సాయం పొందాలి. వ్యక్తులు బలహీనంగా ఉన్నప్పుడు కుటుంబ బలాన్ని, బంధుబలాన్ని, స్నేహబలాన్ని, సమాజ బలాన్ని తోడు తీసుకోవాలి. సోషల్ మీడియాలో సమస్యను పంచుకుని బయటపడినవారు ఉన్నారు. పోలీసులు, న్యాయ వ్యవస్థ, పాలనా వ్యవస్థ, ప్రజాప్రతినిధులు వీరంతా పౌరులకు ఏదో ఒక మార్గం చూపాల్సినవారే. వారి సాయం పొందాలి. అన్నింటికి మించి జీవితాన్ని సరళంగా, సులభంగా నిర్మించుకుంటే, ఆరోగ్యకరమైన జీవన విధానాలు, అలవాట్లు, క్రమశిక్షణ, ఆహారం, స్నేహితులు.. తోడు చేసుకుంటే జీవించడంలో ఆనందం తెలుస్తుంది.

గ్రేట్ లెగసీ



తల్లిదండ్రులు, సోదరునితో పారుల్ ధడ్వాల్

అయిదు తరాల అద్భుతం

'మా ముత్తాత నాన్న... మిలిటరీ; మా ముత్తాత... మిలిటరీ. మా తాత... మిలిటరీ; మా నాన్న మిలిటరీ. మా అన్న మిలిటరీ.

కట్... చేస్తే... ఇప్పుడు నేను కూడా మిలిటరీ. మా వంశ వృక్షం... ట్రీ... మిలిటరీ'... ఇదేమీ సినిమా డైలాగ్ కాదు. లెఫ్టినెంట్ పారుల్ ధడ్వాల్ గురించి చెప్పే సగర్వ డైలాగ్.

చెన్నైలోని ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీలో జరిగిన పాసింగ్ ఔట్ పరేడ్ గర్వించిన దగిన సందర్భం. ఈ పరేడ్‌లో 155 మంది ఆఫీసర్ క్యాడెట్స్ పాల్గొన్నారు. ఇందులో 25 మంది మహిళలు ఉన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వీరు భారత సైన్యంలో విధులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అసలు సిసలు విశేషం... పారుల్ ధడ్వాల్, తమ సైనిక కుటుంబంలో అయిదవ తరానికి చెందిన తొలి మహిళా ఉమెన్ ఆఫీసర్ పారుల్. అద్భుత ప్రతిభ, అంకితా భావంతో రాష్ట్రపతి చేతుల మీదుగా సువర్ణపతకం అందుకుంది.

పంజాబ్‌లోని హోషియార్పూర్ జిల్లాలోని జనౌరీ గ్రామానికి చెందిన పారుల్ అయిదో తరం మిలిటరీ వారసత్వానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. పారుల్ ముత్తాత, తాతలు హర్నామ్‌సింగ్ (సుబేదార్), ఎల్.ఎస్.ధడ్వాల్ (మేజర్), దల్జిత్‌సింగ్ ధడ్వాల్ (కల్నల్), నాన్న బ్రిగేడియర్ జగత్ జమ్వాల్ (బ్రిగేడియర్) మిలిటరీలో పనిచేశారు. సోదరుడు ధనుంజయ్ ధడ్వాల్ కెప్టెన్ హోదాలో పనిచేస్తున్నాడు. మిలిటరీలో చేరిన అయిదవ తరానికి చెందిన తొలి మహిళగా తన ప్రత్యేకతను నిలుపుకుంది పారుల్.

'ఇన్ఫినిటీ ప్రైడ్–ఏ లెగసీ ఆఫ్ ఫైవ్ జనరేషన్' క్యాప్షన్‌తో 'ఎక్స్' వేదికగా పారుల్ ధడ్వాల్ కుటుంబానికి అభినందనలు తెలియజేసింది ఇండియన్ ఆర్మీ.

మూరెడు పూల మూల్యం లక్షకు పైగానే!

మీరు ఆస్ట్రేలియా వెళుతున్నారా? అయితే అక్కడి చట్టాలు, నియమ నిబంధనల గురించి కాస్తంత తెలుసుకుని ఆ తర్వాతే వెళ్లండి. ఎందుకంటే అక్కడ బ్యాగులో పూలు పెట్టుకోవడం కూడా తప్పే! మరీ ముఖ్యంగా బయటి నుంచి పూలు తీసుకువెళ్లామా... భారీ జరిమానా చెల్లించేందుకు సిద్ధపడాల్సిందే. ఇదెక్కడి చోద్యం... అంటారా? చోద్యం కాదు.. నిజం. ఎందుకంటే మలయాళ నటి నవ్యా నాయర్ విషయంలో అదే జరిగింది. ఓనమ్ పండుగ వేడుకలలో పాల్గొనేందుకు ఇటీవల ఆస్ట్రేలియా వెళ్లిన నవ్య నాయర్, తండ్రి ప్రేమతో ఇచ్చిన మల్లెచెండులో కొంత తలలో పెట్టుకుని మిగిలింది తర్వాత పెట్టుకుందాం లే అని బ్యాగ్‌లో పెట్టుకుందట. మెల్‌బోర్న్ విమానాశ్రయంలో 'కస్టమ్స్' అధికారులు ఆమె బ్యాగ్‌ను చెక్ చేసేటప్పుడు ఈ పూలమాల బయట పడిందట. అంతే! వారు ఆమె ఏదో ఘోర నేరం చేసినట్లు చూసింది చాలక, 1980 ఆస్ట్రేలియన్ డాలర్ల జరిమానా విధించారట. (మన రూపాయలలో అది దాదాపు లక్షా పద్నాలుగు వేలు) ఆస్ట్రేలియా చట్టాల ప్రకారం బయటి నుంచి పూలు, మొక్కలు, విత్తనాల వంటివి తీసుకు రావడం నేరమట. ఎందుకంటే బయటినుంచి వచ్చే ఇటువంటి వాటివల్ల అంటువ్యాధులు, వాతావరణ కాలుష్యం ప్రబలే ప్రమాదం ఉందట. అందుకే అలాంటి వాటి విషయంలో చాలా కఠినంగా ఉంటారట. ఈ విషయాన్ని నటి నవ్య సోషల్ మీడియా లో షేర్ చేస్తూ ''మా నాన్న ఇచ్చిన మూరెడు పూల చెండు మూల్యం అక్షరాలా లక్షా పద్నాలుగు వేల పైమాటే'' అని కామెంట్ చేసింది. ఆమె పోస్ట్ చేయడం మంచిదే అయింది.. లేకపోతే అది తెలియని మన వాళ్లు తలనిండా పూలు తురుముకుని బ్యాగులో మరికాసిని పెట్టుకుని ఆస్ట్రేలియా వెళితే మన కరెన్సీలో సంచెడు రూపాయలు చలానాగా కట్టాల్సి వస్తుంది!



మలయాళ నటి నవ్యా నాయర్

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 8న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,10,810	1,10,450	1,08,380	1,14,500	1,10,900	1,08,770
బంగారం (22 క్యారెట్లు)	1,02,357	99,350	99,350	1,02,330	1,02,030	99,700
వెండి	1,26,500	1,26,500	1,37,000	1,26,500	1,27,200	1,37,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి

పుబ్బ కార్తె: సెప్టెంబర్ 13 వరకు
ఉత్తరకార్తె: 14 నుంచి

● పెరెన్నియల్ రైస్

ఒక్కసారి నాట్లు... ఆరుసార్లు కోతలు!

ఒక్కసారి నాట్లేసి మూడేళ్లలో 6 సార్లు కోసుకునే వరిని అభివృద్ధి చేసిన చైనా

● తొలి పంట హెక్టారుకు 6.8-7.5 టన్నులు.. తర్వాత 5.4-6.3 టన్నుల ధాన్యం దిగుబడి
● మూడేళ్లకు గాను ఉత్పత్తి వ్యయం 29% తగ్గి, నికరాదాయం 235% పెరుగుతుందంటున్న అధ్యయనాలు
● 17 దేశాలతో పాటు తమిళనాడు, ఒడిశాలో ప్రయోగాత్మక సాగుకు శ్రీకారం

ఒక్కసారి నాట్లేసి మూడేళ్లలో వరుసగా ఆరు సార్లు పంట కోసుకునే రోజులు రానున్నాయి. ఇలాంటి వరిని 'పెరెన్నియల్ రైస్'(పీఆర్) అంటున్నారు. ఈ విలక్షణ వరి వంగడాలను రూపొందించుకున్న చైనా ఏడేళ్లుగా సాగు చేస్తోంది. ఉత్పత్తి ఖర్చులు 40% మేరకు తగ్గుతాయి. నికరలాభం పెరుగుతుంది. పనిలో పనిగా భూసారం, జీవవైవిధ్యం కూడా పెరుగుతుంది. చైనా తదితర దేశాల్లో ఏటేటా పీఆర్ వరి సాగు విస్తరిస్తోంది. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) కూడా దీనిపై తాజాగా దృష్టి సారించింది. 'ఫార్మింగ్ సిస్టం' జర్నల్ తాజా సంచికలో భారతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్) శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్ షణ్ముగం రాసిన అధ్యయన పత్రం ఆధారంగా 'సాక్షి సాగుబడి' ప్రత్యేక కథనం

ఖర్చులు పెరిగిపోవటం, ఆదాయం తగ్గిపోవటం, నీటి అవసరాలు పెరగటం, భూసారం క్షీణించటం, హరితగృహ వాయువులతో పర్యావరణానికి తీరని హాని జరగటం.. ఇవీ ప్రస్తుతం మన దేశంలో వరి వ్యవసాయాన్ని వేధిస్తున్న సవాళ్లు. దాదాపు ఈ సమస్యలన్నిటికీ ఏకకాలంలో చెక్ పెట్టే అద్భుతమైన 'పెరెన్నియల్ రైస్' వంగడాలను చైనా శాస్త్రవేత్తలు రూపొందించారు. ఈ వరి వంగడాలను చైనాలో రైతులు ఏడేళ్లుగా సాగు చేస్తున్నారు.

సాధారణంగా వరి పంటను ఒక్కసారి నాటితే ఒక్కసారే పంట చేతికి వస్తుంది. తర్వాత సీజన్‌లో మళ్లీ దున్ని, దమ్ము చేసి, నాట్లు వేసుకుంటున్నాం. ఈ వంగడం ఒక్కసారి నాటితే చాలు. మొత్తంగా చూస్తే పీఆర్ వరుసగా 6 సీజన్లలో తిరిగి పెరిగే వరి పంటను కోసుకోవచ్చు. పటిష్టంగా ఉండే కుదుళ్ల



పంట కోసిన తర్వాత మళ్లీ చిగురించి, పిలకలన్నీ మొదటి పంటలాగే ఏపుగా పెరగటం పీఆర్23 వంగడం ప్రత్యేకత. ఒక్కసారి నాట్లు వేస్తే చాలు.. ఇక తర్వాత ప్రతి పంట కాలంలోనూ మళ్లీ మళ్లీ పొలాన్ని దున్ని, నాట్లు వేయాల్సిన అవసరం ఉండదు. ఈ వరి మొక్కల వేర్లు సాధారణ రకాల (అడుగు) మొక్కల వేర్ల కన్నా బలంగా ఉండి రెట్టింపు (2 అడుగుల) లోతుకు చొచ్చుకెళ్తాయి.

● యున్నన్ యూనివర్సిటీ ఆవిష్కరణ


చైనాలోని యున్నన్ రాష్ట్రంలోని 'యున్నన్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ (వైఏఏఎస్)' పెరెన్నియల్ రైస్ వంగడాలను రూపొందించింది. ఒరిజా సటివ అనే సాధారణ వరి రకాన్ని ఒరిజా సాంగిస్తామినట అనే ఆఫ్రికా అటవీ జాతి వరి మొక్కతో ఎంబ్రియో రెస్క్యూ టెక్నిక్‌ను ఉపయోగించి సంకరం చేసి 'పెరెన్నియల్ రైస్–పీఆర్23' వంగడాన్ని రూపొదించింది. అధిక దిగుబడి, గింజ నాణ్యత గల పీఆర్24, పీఆర్25, పీఆర్101, పీఆర్107 వంగడాలను 2020లో విడుదల చేసింది.

● 17 దేశాల్లో ప్రయోగాత్మక సాగు

2018 నుంచి దక్షిణ చైనాలో 44,752 మంది చిన్న రైతులు 15,333 హెక్టార్లలో పీఆర్ వంగడాలను నీటిపారుదల సదుపాయంతో సాగు చేస్తున్నారు. వీరంతా ఆర్థికంగా, పర్యావరణ పరంగా ప్రయోజనాలు పొందుతున్నారని యున్నన్ యూనివర్సిటీ ప్రకటించింది. ఇంటర్నేషనల్ పెరెన్నియల్ రైస్ కొలాబరేషన్ తోడ్పాటుతో యున్నన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని 17 దేశాల్లో విభిన్న పర్యావరణ పరిస్థితుల్లో సాగవుతున్న పీఆర్ వంగడాలు స్థిరంగా మెరుగైన దిగుబడిని ఇస్తున్నట్లు యున్నన్ యూనివర్సిటీ తెలిపింది.

● వరి గడ్డితో ఆచ్ఛాదన

కోతల తర్వాత గడ్డిని సాళ్ల మధ్య ఆచ్ఛాదనగా వేస్తున్నారు. దీంతో పోషకాలు పునర్వినియోగమవుతూ భూసారం మెరుగవుతోంది. నేలలో సూక్ష్మజీవరాశి జీవవైవిధ్యం పెరుగుతోంది. కలుపు సమస్య తగ్గుతోంది. రసాయనిక పురుగుమందులు, కలుపుమందుల అవసరం తగ్గుతున్నది. అవసరం మేరకు ఏడాదంతా కొద్ది కొద్దిగా నీరు ఇచ్చినప్పటికీ, మొత్తంగా సాగు నీటి వాడకం తగ్గుతోందని శాస్త్రవేత్తలు గుర్తించారు.



పెరెన్నియల్ రైస్ Vs సాధారణ వరి

అంశం	పెరెన్నియల్ రైస్	సాధారణ వరి
గడ్డితో ఆచ్ఛాదన	ఉంటుంది	ఉండదు
పోషకాల పునర్వినియోగం	జరుగుతుంది	జరగదు
పోషకాల వినిమయం	తక్కువ	ఎక్కువ
ఎరువుల వృథా	తక్కువ	ఎక్కువ
మట్టి కోత	తక్కువ	ఎక్కువ
కర్బన స్థిరీకరణ	ఎక్కువ	తక్కువ
వేర్ల లోతు	ఎక్కువ	తక్కువ
సూక్ష్మజీవరాశి వైవిధ్యం	ఎక్కువ	తక్కువ
కలుపు పోటీ	ఎక్కువ	తక్కువ

● 29% తగ్గిన ఉత్పత్తి వ్యయం

ప్రతి ఏటా నాట్లు వేసే పద్ధతిలో కన్నా ఒక్కసారి నాట్లు వేసి మూడేళ్లలో మొత్తం ఆరు పంటలు కోసుకునే ఈ పద్ధతిలో అన్ని ఖర్చులూ కలిపి ఉత్పత్తి వ్యయం 29% తగ్గిందని నాలుగేళ్ల అధ్యయనంలో తేలింది. మొదటి సీజన్‌లో అన్ని ఖర్చులూ మామూలే. రెండో సీజన్ నుంచి 54% వరకు కూలి ఖర్చులు ఆదా అవుతాయి. మొత్తం మూడేళ్లలో ఆరు పంట సీజన్లకు గాను.. 5 పంట సీజన్లలో సీజన్‌కు 68–77 పనిదినాల అవసరం తగ్గుతుంది. వాతావరణాన్ని కలుషితం చేసే యంత్రాల వాడకమూ తగ్గుతుంది. పీఆర్23 ధాన్యం మిల్లింగ్ సామర్థ్యం 73% నమోదైంది.

ప్రతి ఏటా నాట్లు వేసే పద్ధతి కన్నా పీఆర్ పద్ధతిలో దిగుబడి 8.8% తక్కువైనప్పటికీ, రైతుకు నికరాదాయం 235% పెరిగిందని అధ్యయన పత్రం తెలిపింది.

● మన సగటు దిగుబడి కన్నా ఎక్కువే

ఒకసారి పంట కోసిన తర్వాత తిరిగి పెరగటంలో పీఆర్23 వంగడం పనితీరు మెరుగ్గా ఉందని గుర్తించారు. దీని పిలకలు 90–98% తిరిగి పెరిగాయి. అందువల్ల వాణిజ్యపరమైన సాగుకు ఈ వంగడాన్ని ఉపయోగిస్తున్నారు. 119 రోజుల్లో పీఆర్23 పంట కోతకు వస్తోంది. తొలి కోతలో హెక్టారుకు 6.8–7.5 టన్నుల ధాన్యం దిగుబడిని ఇస్తుండగా, తర్వాత కోతల్లో 5.4–6.3 టన్నుల వరకు దిగుబడి వస్తోందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. భారత్‌లో సగటు వరి ధాన్యం దిగుబడి హెక్టారుకు 4.2 టన్నులు మాత్రమే. కాబట్టి మన రైతులకు ఇది ఉపయోగకరమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

● ముందున్న సవాళ్లు

పీఆర్ వరి సాగులో ప్రయోజనాలతో పాటు సవాళ్లు కూడా ఉన్నాయి. మన దేశపు వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన పీఆర్ వరి వంగడాలను రూపొందించుకోవాలి. పంట కోసిన తర్వాత తిరిగి పంట చిగురించటం కోసం నీరు పెడతాం. మొలకలు రాకముందే మోళ్లు కుళ్లిపోయే అవకాశం ఉంది. మొలకల కన్నా కలుపు వేగంగా పెరిగే అవకాశం ఉంది. గడ్డిని ఆ పొలంలోనే ఆచ్ఛాదనగా వేయటం వల్ల కలుపు కొంత అదుపులో ఉన్నప్పటికీ, కలుపు మందులు వాడక తప్పదు. మోళ్లలో మిగిలిన రోగకారకాలు చీడపీడల బెడదను పెంచవచ్చు. వేసవి అత్యధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతల్లో పంటను రక్షించుకోవటం అంత తేలిక కాదు. సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వం నిధులను విరివిగా వెచ్చించి పరిశోధనలను వేగంగా కొనసాగించాలి. అన్నీ సజావుగా జరిగితే కొద్ది సంవత్సరాల్లో భారతీయ పెరెన్నియల్ రైస్ వంగడాలు మన రైతులకు అందుబాటులోకి రావచ్చు.

గడ్డికి నిప్పు పెడితే

ఏమవుతుందో తెలుసా?



పంట కోసిన తర్వాత గడ్డి లేదా కట్టెకు అక్కడే నిప్పు పెట్టేస్తుంటాం కదా.. పొగ వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని మనకు తెలుసు. అయితే, అంతకుమించి ఏమి నష్టం జరుగుతుందో మనకు తెలియదు.

'సైన్స్ ఆఫ్ టోటల్ ఎన్విరాన్‌మెంట్' జర్నల్‌లో ఇటీవల అచ్చయిన ఒక అధ్యయన పత్రం ఈ విషయాలను లోతుగా చర్చించింది. గడ్డిని కాల్చేస్తే ఆ భూమిలోని సూక్ష్మజీవరాశి జీవవైవిధ్యం నశించి, పొలం పర్యావరణ వ్యవస్థల సహజ క్రియలకు విఘాతం కలుగుతుందని ఈ అధ్యయనం వివరించింది. భారత్ సహా అనేక దేశాల్లోని పొలాల్లో గడ్డిని కాల్చటం వల్ల భూమికి, రైతుకు ఎలా నష్టం జరుగుతున్నదో తెలుసుకోవటానికి 250 అధ్యయన ఫలితాలను క్రోడీకరించి విశ్లేషించటం విశేషం.

గడ్డిని తగులబెట్టినప్పుడు 33.8–42.2 డిగ్రీల సెల్సియస్ వరకు మట్టి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఆ వేడికి మట్టిలోని నత్రజని నశిస్తుంది. సేంద్రియ పదార్థం తగ్గిపోతుంది. అంగుళం లోతు వరకూ ఉండే మట్టిలోని అపారమైన సూక్ష్మజీవులు చనిపోతాయి. అంతేకాదు, చీడపీడల బెడద పెరుగుతుంది. ఎరువు మరింత ఎక్కువ వేయాల్సి వస్తుంది.

పొలంలో కనిపించే పురుగులను ఏరుకు తినేసే సాలీళ్లు, ఆరుద్ర పురుగులు, కప్పల సంఖ్య గడ్డీ గాదాన్ని తగులబెట్టిన పొలాల్లో పెద్దగా కనిపించవు. మంటపెట్టినప్పుడు వెలువడే అధిక ఉష్ణోగ్రత మట్టి ఆరోగ్యం బాగా దెబ్బతింటుంది. మట్టిలో ఉండే పోషకాలను మొక్కల వేర్లు తీసుకోగలిగే రూపంలోకి మార్చి అందించే అద్భుతమైన సహజ పోషణ వ్యవస్థ దెబ్బతింటుంది. గడ్డీగాదాన్ని కాలబెట్టకుండా నేలపై కప్పి ఆచ్ఛాదన చేయటం ఎన్ని విధాలా మేలో ఈ అధ్యయనం తేటతెల్లం చేసింది.



సింగపూర్‌పై 12-0తో గెలిచి 'సూపర్-4' దశకు భారత్

హాంగ్జౌ (చైనా): ఆసియా కప్ మహిళల హాకీ టోర్నమెంట్ లీగ్ దశను భారత జట్టు అజేయంగా ముగించింది. సింగపూర్ జట్టుతో సోమవారం జరిగిన పూల్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 12-0 గోల్స్‌తో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నవనీత్ కౌర్ (14వ, 20వ, 28వ నిమిషాల్లో), ముంతాజ్ ఖాన్ (2వ, 32వ, 39వ నిమిషాల్లో) మూడు గోల్స్ చొప్పున చేశారు. నేహా (11వ, 38వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించింది. లాల్‌రెమ్‌సియామి (13వ నిమిషంలో), ఉదిత (29వ నిమిషంలో), షర్మిలా (45వ నిమిషంలో), రుతుజా (53వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. థాయ్‌లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 11-0తో నెగ్గిన భారత్... జపాన్‌తో రెండో మ్యాచ్‌ను 2-2తో 'డ్రా' చేసుకుంది. పూల్ 'బి'లో భారత్, జపాన్ జట్లు ఏడు పాయింట్లతో సమంగా నిలిచినా... ఎక్కువ గోల్స్ చేసిన భారత్‌కు అగ్రస్థానం ఖాయమైంది. జపాన్‌కు రెండో స్థానం దక్కింది. పూల్ 'బి' నుంచి భారత్, జపాన్... పూల్ 'ఎ' నుంచి చైనా, దక్షిణ కొరియా జట్లు 'సూపర్-4' దశకు అర్హత సాధించాయి. బుధవారం జరిగే 'సూపర్-4' మ్యాచ్‌ల్లో కొరియాతో భారత్; జపాన్‌తో చైనా తలపడతాయి. 'సూపర్-4' మ్యాచ్‌లు ముగిశాక తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత పొందుతాయి. విజేత జట్టు వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తుంది.

అల్‌కరాజ్ 'సిక్సర్'

కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన స్పెయిన్ స్టార్

- యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ హస్తగతం
- ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ సినెర్‌పై విజయం
- రూ. 44 కోట్ల 11 లక్షల ప్రైజ్‌మనీ సొంతం
- రెండేళ్ల తర్వాత మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌లోకి





న్యూయార్క్: మూడు నెలల వ్యవధిలో మూడోసారి చిరకాల ప్రత్యర్థులు కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్), యానిక్ సినెర్ (ఇటలీ) మధ్య 'గ్రాండ్‌స్లామ్ ఫైనల్' సమరం... ప్రతి పాయింట్‌కూ హోరాహోరీ తప్పదని... ఐదు సెట్‌ల పోరు ఖాయమని అభిమానులు భావించారు. కానీ అల్‌కరాజ్ అలాంటి అవకాశం ఇవ్వలేదు. 2 గంటల 42 నిమిషాల్లో డిఫెండింగ్ చాంపియన్ సినెర్‌ను 6-2, 3-6, 6-1, 6-4తో ఓడించి రెండోసారి యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. విజేత అల్‌కరాజ్‌కు 50 లక్షల డాలర్లు (రూ. 44 కోట్ల 11 లక్షలు), రన్నరప్ సినెర్‌కు 25 లక్షల డాలర్లు (రూ. 22 కోట్ల 5 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. తాజా విజయంతో అల్‌కరాజ్ రెండేళ్ల తర్వాత మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌నూ అందుకున్నాడు. ఇప్పటికే అల్‌కరాజ్ రెండుసార్లు చొప్పున ఫ్రెంచ్ ఓపెన్ (2024, 2025), వింబుల్డన్ (2023, 2024), యూఎస్ ఓపెన్ (2022, 2025) టైటిల్స్ నెగ్గాడు.

రెండు బ్రేక్ పాయింట్లతో...

ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఐదు సెట్‌లలో సినెర్‌ను ఓడించిన అల్‌కరాజ్... వింబుల్డన్ టోర్నీ ఫైనల్లో నాలుగు సెట్‌లలో సినెర్ చేతిలో ఓడిపోయాడు. ఈ నేపథ్యంలో యూఎస్ ఓపెన్ తుదిపోరుపై అందరికీ ఆసక్తి ఏర్పడింది. అయితే ఒక్క సెట్ కూడా కోల్పోకుండా ఫైనల్ చేరిన అల్‌కరాజ్ తొలి గేమ్ నుంచే తన జోరు కనబరిచాడు. రెండో గేమ్‌లో, ఏడో గేమ్‌లో సినెర్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ తొలి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో సినెర్ పుంజుకున్నాడు. నాలుగో గేమ్‌లో అల్‌కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి తన సర్వీస్‌లను నిలబెట్టుకొని సెట్‌ను గెల్చుకున్నాడు. ఇక మూడో సెట్‌లో అల్‌కరాజ్ అసాధారణ ప్రదర్శన ముందు సినెర్ తేలిపోయాడు. 5-0తో ఆధిక్యంలోకి వెళ్లిన అల్‌కరాజ్ ఆ తర్వాత ఒక గేమ్ కోల్పోయి సెట్‌ను దక్కించుకున్నాడు. నాలుగో సెట్ పోటాపోటీగా సాగినా ఐదో గేమ్‌లో సినెర్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ ఆ తర్వాత తన సర్వీస్‌లను కాపాడుకొని విజయాన్ని ఖాయం చేసుకున్నాడు.

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు

అల్‌కరాజ్		సినెర్
10	ఏస్‌లు	2
0	డబుల్ ఫాల్ట్‌లు	4
20/27	నెట్ పాయింట్లు	19/26
5/11	బ్రేక్ పాయింట్లు	1/1
42	విన్నర్స్	21
24	అనవసర తప్పిదాలు	28
112	మొత్తం పాయింట్లు	89

2 అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ర్యాంకింగ్స్ మొదలయ్యాక (1973లో) ఒకే సీజన్‌లో రెండు గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్స్‌లో వరల్డ్ నంబర్‌వన్‌ను ఓడించిన రెండో ప్లేయర్‌గా అల్‌కరాజ్ గుర్తింపు పొందాడు. ఇంతకుముందు రాఫెల్ నాదల్ మాత్రమే ఈ ఘనత సాధించాడు. 2008లో నాదల్ ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టోర్నీ ఫైనల్స్‌లో నాటి నంబర్‌వన్ ఫెడరర్ (స్విట్జర్లాండ్)పై గెలిచి విజేతగా నిలిచాడు.

2 జాన్ బోర్గ్ (స్వీడన్ -7 టైటిల్స్) తర్వాత 23 ఏళ్ల లోపే ఆరు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన రెండో ప్లేయర్‌గా అల్‌కరాజ్ (22 ఏళ్ల 111 రోజులు) నిలిచాడు.

1 మూడు వేర్వేరు కోర్టులపై (హార్డ్, క్లే, గ్రాస్) రెండుసార్లు చొప్పున గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన అతిపిన్న వయస్కుడిగా అల్‌కరాజ్ గుర్తింపు పొందాడు.

6 అల్‌కరాజ్ కెరీర్‌లో నెగ్గిన గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్. ఓపెన్ శకంలో (1968 నుంచి) కనీసం ఆరు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుల జాబితాలో స్టీఫెన్ ఎడ్బర్గ్ (స్వీడన్), బోరిస్ బెకర్ (జర్మనీ) సరసన అల్‌కరాజ్ చేరాడు. ఈ జాబితాలో జొకోవిచ్ (24), నాదల్ (22), ఫెడరర్ (20), సంప్రాస్ (14), జాన్ బోర్గ్ (11), జిమ్మీ కానర్స్, ఇవాన్ లెండిల్, అగస్సీ (8 చొప్పున), విలాండర్, జాన్ మెకన్రో (7 చొప్పున) ముందున్నారు.

భారత్‌ను ఆపతరమా!

అత్యంత పటిష్టంగా టీమిండియా

- నేటి నుంచి ఆసియా కప్ టి20 టోర్నీ
- సెప్టెంబర్ 28న ఫైనల్
- తొలి పోరులో అఫ్గానిస్తాన్‌తో హాంకాంగ్ 'ఢీ'
- రాత్రి 8 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



వన్డే, టి20 ఫార్మాట్‌లు కలిపి ఇప్పటి వరకు ఆసియా కప్ 16 సార్లు జరిగింది. వీటిలో 8 సార్లు విజేతగా నిలిచిన భారత్ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఫార్మాట్ ఏదైనా ఇప్పుడు టీమిండియా ఫామ్ చూస్తే ఎదురులేని జట్టుగా కనిపిస్తోంది. విధ్వంసకర బ్యాటర్లు, పదునైన బౌలర్లతో నిండిన సూర్యకుమార్ బృందం టైటిల్ గెలవకపోతేనే ఆశ్చర్యపోవచ్చు! ఎనిమిది దేశాల ఈ టోర్నీలో భారత్‌కు మిగతా జట్లు ఎంత వరకు పోటీ నిస్తాయనేది సందేహమే. ఈ నేపథ్యంలో కొంత విరామం తర్వాత క్రికెట్ అభిమానులకు కొత్త సీజన్‌లో మళ్లీ పూర్తి వినోదానికి ఆసియా కప్‌తో తెర లేస్తోంది.

దుబాయ్: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ముగిసిన సరిగ్గా ఆరు నెలల తర్వాత ఎడారి దేశంలో మరో పెద్ద టోర్నీకి రంగం సిద్ధమైంది. ఎనిమిది టీమ్‌లు పాల్గొంటున్న ఆసియా కప్ టి20 టోర్నీ నేడు మొదలవుతోంది. తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌తో హాంకాంగ్ 'ఢీ'కొంటుండగా... భారత్ తమ తొలి మ్యాచ్‌లో బుధవారం ఆతిథ్య యూఏఈతో తలపడుతుంది. నిజానికి ఈ టోర్నీ భారత్‌లోనే జరగాల్సింది. అయితే పాకిస్తాన్ మన దేశంలో ఆడే అవకాశం లేదని తేలడంతో తటస్థ వేదికకు మార్చారు. దుబాయ్, అబుదాబిలలో మ్యాచ్‌లు నిర్వహిస్తుండగా... ఆతిథ్య హక్కులు మాత్రం బీసీసీఐ చేతుల్లోనే ఉన్నాయి. 2023లో వన్డే ఫార్మాట్‌లో జరిగిన ఆసియా కప్‌లో భారత్ విజేతగా నిలిచింది. సిరాజ్ (6/51) ధాటికి శ్రీలంక 50 పరుగులకే కుప్పకూలగా, భారత్ 6.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. వచ్చే ఏడాది ఆరంభంలో టి20 వరల్డ్ కప్ ఉన్న నేపథ్యంలో ఈసారి ఫార్మాట్‌ను టి20కి మార్చారు. సెప్టెంబర్ 28న ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.



రెండు గ్రూపులుగా...

ఆసియా కప్‌లో ఎనిమిది జట్లు ఆడటం ఇదే మొదటిసారి. భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ నేరుగా అర్హత సాధించగా... ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ప్రీమియర్ కప్ పేరుతో నిర్వహించిన టోర్నీలో టాప్-3లో నిలిచిన యూఏఈ, ఒమన్, హాంకాంగ్ టోర్నీకి అర్హత పొందాయి. గ్రూప్ 'ఎ'లో భారత్‌తో పాటు పాకిస్తాన్, యూఏఈ, ఒమన్ ఉండగా... గ్రూప్ 'బి'లో అఫ్గానిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, హాంకాంగ్ తలపడుతున్నాయి. ప్రతీ జట్టు తమ గ్రూప్‌లోని మిగతా మూడు జట్లతో తలపడుతుంది. ప్రతీ గ్రూప్‌లోని టాప్-2 టీమ్‌లు సూపర్-4కు అర్హత సాధిస్తాయి. ఇక్కడా మిగతా మూడు జట్లతో ఆడిన తర్వాత టాప్-2 ఫైనల్ చేరతాయి.

అంతా ఆ మ్యాచ్ కోసమే...

పహల్గాం ఉగ్రదాడి తర్వాతి పరిణామాలను బట్టి చూస్తే భారత్, పాక్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లు జరగడం అసాధ్యంగా అనిపించింది. అయితే చివరకు భారత ప్రభుత్వం పాక్‌తో మ్యాచ్‌లు ఆడేందుకు టీమిండియాకు అనుమతి ఇచ్చింది. బలాబలాల పరంగా ఇరు జట్ల మధ్య ఆకాశమంత వ్యత్యాసం ఉన్నా...ఇటీవలి ఉద్రిక్తతల నేపథ్యంలో ఒక్కసారిగా ఈ పోరుపై ఆసక్తి పెరిగింది. భారత్, పాక్ గ్రూప్ దశలో ఈ నెల 14న (ఆదివారం) తలపడతాయి. సంచలన ఫలితాలు లేకపోతే ఇరు జట్ల మధ్య టోర్నీలో మరో రెండు మ్యాచ్‌లు (ఫైనల్ సహా) జరిగే అవకాశం కూడా ఉంది. దాయాది దేశాల మధ్య గతంలో ఎప్పుడూ ఆసియా కప్ ఫైనల్ జరగలేదు!

కొత్త కుర్రాళ్లతో...

భారత్‌తో పోలిస్తే బలహీనంగా ఉన్నా... ఇతర టీమ్‌లు కొన్ని అనూహ్య ఫలితాలను ఆశిస్తున్నాయి. పైగా కొందరు ఆటగాళ్ల వ్యక్తిగత ప్రదర్శన కూడా టోర్నీలో కీలకం కానుంది. బాబర్, రిజ్వాన్‌లను తప్పించిన పాకిస్తాన్ జట్టు సల్మాన్ ఆఘా సారథ్యంలో కొత్తగా కనిపిస్తోంది. ముక్కోణపు టోర్నీని గెలవడం జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. బంగ్లా ఇటీవలే లంకపై సిరీస్ విజయం సాధించింది. ఒమన్‌కు ముంబై మాజీ క్రికెటర్ సులక్షణ్ కులకర్ణి కోచ్‌గా వ్యవహరిస్తుండగా, హాంకాంగ్, యూఏఈ జట్లు తమ కెప్టెన్లు ముర్తజా, వసీమ్‌లపై ఆధారపడుతున్నాయి. పాక్ లెఫ్టార్మ్ పేసర్ సల్మాన్ మీర్జా, అఫ్గానిస్తాన్ స్పిన్నర్ ఘజన్‌ఫర్ కొత్తగా చూడదగ్గ ఆటగాళ్లు.

- గుకేశ్‌కు అభిమన్యు షాక్
- నేషన్స్‌కప్‌లో భారత్‌కు మూడో స్థానం
- ప్రపంచ బాక్సింగ్ టోర్నీ క్వార్టర్స్‌లో జైస్మీన్
- ప్రో కబడ్డీ లీగ్ ఫలితాలు


మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఆ నమ్మకంతోనే ఉన్నాం

- కౌశిక్ పెగల్లపాటి

''సాయి శ్రీనివాస్, అనుపమ కాంబినేషన్‌లో వచ్చిన 'రాక్షసుడు'(2019) సినిమా మంచి విజయం సాధించింది. వారి కలయికలో వస్తున్న రెండో చిత్రం 'కిష్కింధపురి'పై ప్రేక్షకుల్లో, ఇండస్ట్రీలో మంచి అంచనాలున్నాయి. మా సినిమా ఫైనల్ ఔట్‌పుట్ చూశాక ఆ అంచనాలను అందుకుంటుందనే నమ్మకంతో ఉన్నాం. ఒక సున్నితమైన కథతో, మంచి సినిమా చేశామనే సంతోషం ఉంది'' అని డైరెక్టర్ కౌశిక్ పెగల్లపాటి చెప్పారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జోడీగా నటించిన చిత్రం 'కిష్కింధపురి'. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో కౌశిక్ పెగల్లపాటి మాట్లాడుతూ– ''దర్శకుడిగా నా తొలి చిత్రం 'చావు కబురు చల్లగా'. ఆ తర్వాత కూడా గీతా ఆర్ట్స్ బ్యానర్‌లోనే మరో సినిమా చేయాల్సి ఉంది. అయితే కొన్ని కారణాల వల్ల ఆలస్యం అయింది. ఓ సందర్భంలో నిర్మాత సాహుగారికి 'కిష్కింధపురి' కథ చెప్పాను.. ఆయనకి చాలా నచ్చింది. ఆ తర్వాత శ్రీనివాస్‌గారు విని, బాగా ఎగ్జైట్ అయ్యారు. ఈ సినిమా చేయడానికి అల్లు అరవింద్, బన్నీవాస్‌గార్లు కూడా ఒప్పుకున్నారు. హారర్, మిస్టరీ నేపథ్యంలో రూపొందిన 'కిష్కింధపురి' ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించబోతోంది. ఈ కథకి స్ఫూర్తి రామాయణం. 1989లో కథ మొదలవుతుంది. కథ, విజువల్, టెక్నికల్‌గా ఆడియన్స్‌కి ఒక మంచి ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని శ్రీనివాస్‌గారు నన్ను చాలా సపోర్ట్ చేశారు. ఇప్పటి వరకు చేయని పాత్రలో అనుపమ కనిపిస్తారు. సాహు గారపాటిగారు ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. చేతన్ భరద్వాజ్ సంగీతం, నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటాయి. మా చిత్రంలో స్మోకింగ్, డ్రింకింగ్ సన్నివేశాలు ఉండవు. కుటుంబమంతా కలిసి చూడదగ్గ సినిమా ఇది. నా తొలి సినిమాకి ద్వితీయ చిత్రానికి ఎక్కువ గ్యాప్ వచ్చింది.. అయితే ఇకపై ఆ గ్యాప్ రాకూడదని కోరుకుంటున్నా. నా తర్వాతి సినిమాకి రెండు మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి'' అని చెప్పారు.



నాలుగు దశాబ్దాల తర్వాత...



● రజనీకాంత్, కమల్‌హాసన్

హీరోలు రజనీకాంత్, కమల్‌హాసన్ నాలుగు దశాబ్దాల తర్వాత ఒకే సినిమాలో స్క్రీన్ చేసుకోనున్నారు. ఇరవైకిపైగా సినిమాల్లో కలిసి నటించిన ఈ ఇద్దరు స్టార్స్ చివరిగా 'అల్లావుద్దీనుమ్ అద్భుత విళక్కుమ్' (1979) అనే చిత్రం చేశారు. మరోసారి వీరిద్దరి కాంబినేషన్‌తో ఓ మల్టీస్టారర్ మూవీ రూపుదిద్దుకునేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ''మేమిద్దరం(రజనీ, కమల్) కలిసి నటించాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తున్నా కుదరడం లేదు. త్వరలోనే మీ ముందుకు కలిసి రానున్నాం. అది మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది'' అని ఇటీవల దుబాయ్‌లో జరిగిన 'సైమా-2025' వేడుకలో పేర్కొన్నారు కమల్‌హాసన్. ఇక 46 సంవత్సరాల తర్వాత రజనీకాంత్-కమల్‌హాసన్ కలిసి నటించనున్న ఈ సినిమాకు లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తారట. రెడ్‌జెయింట్ మూవీస్ సంస్థతో కలిసి కమల్‌హాసన్ నిర్మిస్తారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఇదిలా ఉంటే... కమల్‌హాసన్‌తో 'విక్రమ్', రజనీకాంత్‌తో 'కూలీ' వంటి హిట్ సినిమాలను తెరకెక్కించారు లోకేష్ కనగరాజ్.

బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్

బాలీవుడ్ హీరో షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ దర్శకత్వం వహించిన తొలి వెబ్ సిరీస్ 'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్'. హిందీ చిత్రపరిశ్రమలో పనితీరు, సినిమాల మేకింగ్ వంటి అంశాల ఆధారంగా రూపొందిన ఈ సిరీస్‌లో లక్ష్య, బాబీ డియోల్, రాఘవ్ జుయల్, సహేర్ బాంబా, అన్య సింగ్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సిరీస్ ట్రైలర్‌ను షారుక్ ఖాన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ సిరీస్ ట్రైలర్‌లో దర్శకుడు రాజమౌళి, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్, దిశా పటానీ, కరణ్ జోహార్‌వంటి వారు కనిపించారు. వీరు ఈ సిరీస్‌లో అతిథి పాత్రలు చేశారా? లేక కీలక పాత్రల్లో నటించారా? అనే చర్చ బాలీవుడ్‌లో జరుగుతోంది. గౌరీఖాన్ నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 18నుంచి నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది.



● ఆమిర్‌ఖాన్, రాజమౌళి



● రామ్

తొందరేంటి అరె ఉండన్నా!

'ఈడి మొహమేంట్రా మాడిపోయింది...' అంటూ పాడేస్తున్నారు రామ్. ఆయన హీరోగా, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. పి.మహేష్ బాబు దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా వివేక్-మెర్విన్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'పప్పీ షేమ్...' అంటూ సాగే రెండో పాటని సోమవారం విడుదల చేశారు మేకర్స్. 'ఈడి మొహమేంట్రా మాడిపోయింది... పోతదన్నావ్ ఇప్పుడేంటన్నా... హిచ్ కొట్టావ్ సౌండ్ లేదనా... తొందరేంటి అరె ఉండన్నా... బెట్టు కట్టి జారిపోతుంటే ఊరుకుంటానా...' అంటూ ఈ పాట సాగుతుంది. ఈ పాటని రామ్ పాడటం విశేషం. ఈ సాంగ్‌కి భాస్కర భట్ల సాహిత్యం అందించారు. నవంబరు 28న ఈ సినిమా రిలీజ్ కానుంది..

క్రేజీ క్యారెక్టర్‌లో...



● స్నేహ, రాగ్‌మయూర్, మేఘ, కవిత

'డీజే టిల్లు' వంటి బ్లాక్ బస్టర్ సినిమా తర్వాత విమల్ కృష్ణ దర్శకత్వంలో కొత్త సినిమా ప్రారంభమైంది. రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్, ప్రిన్స్ సెసిల్, అనన్యయ, చరిత్ ప్రధాన పాత్రధారులు. చిలక ప్రొడక్షన్స్ పతాకంపై రాజీవ్ చిలక, రాజేష్ జగ్తియాని, హీరాచంద్ దండ్, నవీన్ చంద్ర నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం పూజా కార్యక్రమాలతో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి సునీల్ నామా కెమెరా స్విచ్చాన్ చేయగా, మేఘ చిలక, స్నేహ జగ్తియాని క్లాప్ ఇచ్చారు. ''ఓ క్రేజీ క్యారెక్టర్ కథను విమల్ కృష్ణ సిద్ధం చేశారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సహ నిర్మాత: భరత్ లక్ష్మీపతి, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

తెలుగు సినిమా ఖ్యాతిని పెంచుతుంది

- అరవింద్ కృష్ణ

''ఎ మాస్టర్ పీస్' మూవీ షూటింగ్‌లో నాకు కొన్నిసార్లు గాయాలవడంతో చిత్రీకరణ పోస్ట్‌పోన్ చేయాల్సి వచ్చింది. 'ఎ మాస్టర్ పీస్' తెలుగు సినిమా ఖ్యాతిని పెంచేలా రూపొందుతోంది'' అని హీరో అరవింద్ కృష్ణ తెలిపారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఎ మాస్టర్ పీస్'. అరవింద్ కృష్ణ, జ్యోతి పూర్వాజ్, మనీష్ గిలాడ, ఆషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ, ప్రజయ్ కామత్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. పూర్వాజ్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో అరవింద్ కృష్ణ సూపర్ హీరోగా కనిపిస్తారు. ఈ కథలో శివుడి నేపథ్యం ఉంటుంది కాబట్టి శివ రాత్రికి రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని చెప్పారు. ''నాలోని సూపర్ విలన్‌ను ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్న పూర్వాజ్‌కి థ్యాంక్స్'' అన్నారు మనీష్ గిలాడ. ''తెలుగులో వచ్చిన కొన్ని గొప్ప చిత్రాల సరసన మా సినిమా చేరుతుంది'' అని జ్యోతి పూర్వాజ్ తెలిపారు. ''మిన్నల్ మురళి' అనే మలయాళ సినిమా స్ఫూర్తితో 'ఎ మాస్టర్ పీస్' తీస్తున్నాం'' అన్నారు శ్రీకాంత్ కండ్రేగుల. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ యోగి పోసాని మాట్లాడారు.



● అరవింద్ కృష్ణ, జ్యోతి పూర్వాజ్

భద్రకాళి కొత్త అనుభూతినిస్తుంది

- తృప్తి రవీంద్ర, రియా జిత్తు



● తృప్తి, రియా

''తెలుగు ప్రేక్షకులు సినిమాలను గొప్పగా సెలబ్రేట్ చేసుకుంటారు. అన్ని రకాల చిత్రాలను గొప్పగా ఆదరిస్తారు. వైవిధ్యమైన కథతో రూపొందిన మా 'భద్రకాళి' సినిమా ప్రేక్షకులకు మంచి అనుభూతి ఇస్తుంది'' అని హీరోయిన్లు తృప్తీ రవీంద్ర, రియా జిత్తు పేర్కొన్నారు. విజయ్ ఆంటోని నటించిన 25వ చిత్రం 'భద్రకాళి'. అరుణ్ ప్రభు దర్శకత్వం వహించారు. మీరా విజయ్ ఆంటోని సమర్పణలో విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా తృప్తి రవీంద్ర మాట్లాడుతూ– ''మాది మహారాష్ట్ర. సినిమాలపై ఆసక్తితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేశాను. నా తొలి ఫీచర్ ఫిలిం 'భద్రకాళి'. విజయ్‌గారితో నటించడం మంచి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. మీరా, రామాంజనేయులుగార్లు చాలా సపోర్ట్ చేశారు'' అన్నారు. రియా జిత్తు మాట్లాడుతూ– ''మలయాళీ అయిన నేను మలయాళ, తమిళ సినిమాలు చూస్తూ పెరిగాను. దాదాపు 15 సినిమాల్లో బాలనటిగా చేశాను. కొంచెం బ్రేక్ తీసుకుని, చదువు పూర్తయిన తర్వాత మళ్లీ సినిమాల్లోకి వచ్చాను. 'భద్రకాళి' లాంటి కథ సమాజానికి చాలా అవసరం. ఈ సినిమా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది'' అన్నారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్

అజయ్ ధీషన్, ధనుష జోడీగా నటిస్తున్న చిత్రం 'బూకి'. లక్ష్మీ మంచు, సునీల్, పాండియరాజన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకుడు-సినిమాటోగ్రాఫర్ గణేష్ చంద్ర తెరకెక్కిస్తున్న ఈ సినిమాను శరవంత్ రామ్ క్రియేషన్స్, విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ పతాకాలపై రామంజనేయులు జవ్వాజీ నిర్మిస్తున్నారు. ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ సినిమా ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. నిర్మాత సి.కల్యాణ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో సత్యదేవ్ క్లాప్ ఇచ్చారు. నటి-నిర్మాత మంచు లక్ష్మి మేకర్స్‌కు స్క్రిప్ట్‌ను అందించారు. తొలి సన్నివేశానికి విజయ్ ఆంటోని, రామాంజనేయులు గౌరవ దర్శకత్వం వహించారు. విజయ్ ఆంటోని మాట్లాడుతూ– ''ఈ సినిమాని ఫిబ్రవరిలో రిలీజ్ చేయనున్నాం'' అని తెలిపారు. ''మార్గన్' సక్సెస్ ఈ సినిమాకి నమ్మకం ఇచ్చింది'' అన్నారు అజయ్ ధీషన్. ''దర్శకుడిగా ఇది నా తొలి చిత్రం ''అన్నారు గణేష్ చంద్ర. ఈ సినిమాకి సంగీతం: విజయ్ ఆంటోని.



● అజయ్, ధనుష

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 77	80,787
నిఫ్టీ ▲ 32	24,773

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	21,792	▼	92
డోజోన్స్	45,356	▲	45
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,233	▲	24
డాక్స్	23,825	▲	228
షాంఘై	3,825	▲	14
నికాయ్	43,644	▲	625

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధామస్‌కుక్	86.43	89.42
£	బ్రిటన్ పౌండ్	ధామస్‌కుక్	117.16	121.55
€	యూరో	ధామస్‌కుక్	101.53	105.46
¥	జపాన్ యెన్ (100)	ధామస్‌కుక్	48.00	70.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధామస్‌కుక్	55.82	59.67
S$	సింగపూర్ డాలర్	ధామస్‌కుక్	66.46	70.18
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	22.65	24.15
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	23.14	24.40
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	11.50	13.33

స్వల్ప లాభాలతో గట్టెక్కిన సూచీలు



ముంబై: దేశీయ స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. సెన్సెక్స్ 77 పాయింట్లు పెరిగి 80,787 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 32 పాయింట్లు లాభపడి 24,773 వద్ద నిలిచింది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఇంట్రాడేలో ప్రైవేటు బ్యాంకులు, ఆటో, చమురు షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 460 పాయింట్లు బలపడి 81,171 వద్ద, నిఫ్టీ 145 పాయింట్లు ఎగసి 24,886 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. అమెరికాలో ఆగస్టు ఉద్యోగ గణాంకాలు అంచనాలకు కంటే తక్కువగా నమోదుతో ఈ సెప్టెంబర్‌లో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలు పెరిగాయి. ఆసియాలో కొరియా, నికాయ్, షాంఘై, హాంగ్‌సెంగ్ సూచీలు ఒకటిన్నర శాతం ర్యాలీ చేశాయి. యూరప్ మార్కెట్లు అరశాతం పెరిగాయి. అమెరికా సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

➤ బీఎస్‌ఈలో రంగాల వారీగా ఇండెక్సుల్లో కన్జూమర్ డిస్క్రేషనరీ 1.13%, సర్వీసెస్ 0.85%, టెలీ కమ్యూనికేషన్ 0.71%, రియల్టీ 0.44%, క్యాపిటల్ గూడ్స్ 0.37%, కమోడిటీస్ 0.33% పెరిగాయి.

➤ కేంద్రం జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రకటనతో డిమాండ్ పుంజుకుంటుందనే ఆశావహ అంచనాలతో ఆటో, ఆటో ఉపకరణ కంపెనీల షేర్లకు డిమాండ్ కొనసాగింది. భారత్ ఫోర్జ్ 6%, అశోక్ లేలాండ్ 5%, సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్, టాటా మోటార్స్, బజాజ్ ఆటో, ఎంఅండ్‌ఎం 4% రాణించాయి. ఎక్సైడ్ ఇండస్ట్రీస్ 3.50%, ఐషర్ మోటార్స్, టీవీఎస్ మోటార్, సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రిసెషిన్ ఫోర్జింగ్ 3% లాభపడ్డాయి. మారుతీ, భాష్, హీరో మోటో, హ్యుందాయ్ 2 నుంచి అర శాతం పెరిగాయి.

పాత స్టాక్ పైనా డిస్కౌంట్!

- కంపెనీలు, డీలర్లు, రిటైలర్ల వద్ద పెద్ద ఎత్తున నిల్వలు
- రేట్లు తగ్గించి విక్రయించే యోచనలో ఎఫ్‌ఎంసీజీ సంస్థలు
- కొత్త రేట్లతో ఉత్పత్తులు రాక వచ్చే నెలలోనే



న్యూఢిల్లీ: తగ్గిన ధరలపై ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తులు మార్కెట్లోకి రావడానికి కొంత సమయం పట్టేట్టు ఉంది. వచ్చే నెల ఆరంభం లేదా మధ్య నాటికి ఈ ఉత్పత్తులు మార్కెట్‌కు చేరుకుంటాయని గోద్రేజ్ కన్జ్యూమర్ సహా పలు ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు అంచనా వేస్తున్నాయి. కానీ, ఇప్పటికే కంపెనీలు, డీలర్లు, రిటైల్ స్టోర్లలో పెద్ద ఎత్తున ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయి. ఈ నెల 22 నుంచి కొత్త రేట్లు అమల్లోకి రానున్న నేపథ్యంలో.. పాత స్టాక్‌ను ఎలా విక్రయించాలా? అన్న ఆలోచనలో పడ్డాయి. పాత ఎంఆర్‌పీ (గరిష్ట చిల్లర విక్రయ ధర)పై తగ్గింపు రేట్లతో ఈ నెల 22 తర్వాత కూడా వాటిని విక్రయించేందుకు ప్రభుత్వం అనుమతిస్తుందన్న ఆశతో ఉన్నాయి. పాత స్టాక్ ఖాళీ అయి, కొత్త స్టాక్ మార్కెట్లోకి వచ్చే వరకు కొన్ని అవాంతరాలు ఎదుర్కోక తప్పేట్టు లేదని భావిస్తున్నాయి. ఏ విధంగా ముందుకు వెళ్లాలన్నది ప్రతి సంస్థ ఆలోచిస్తోందని ఇమామీ వైస్ చైర్మన్, ఎండీ హర్ష వర్ధన్ అగర్వాల్ తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టత కోరుతున్నట్టు చెప్పారు. అయినప్పటికీ సాధ్యమైనంత త్వరగా ఎంఆర్‌పీలను మార్చడం దిశగా పనిచేస్తున్నట్టు తెలిపారు. దీన్ని ఎదుర్కోవడంపై ఒక ప్రణాళికతో ముందుకు వస్తామని ప్రకటించారు. జీఎస్‌టీలో 12, 28 శాతం రేట్లను ఎత్తివేసి, ఇందులోని వస్తువులను 5, 18% శ్లాబుల్లోకి మార్చడం తెలిసిందే. ఈ రేట్లు ఈ నెల 22 నుంచి అమల్లోకి రానున్నాయి.

స్వల్పకాలంలో ఇబ్బందులు తప్పవు..

అధిక టారిఫ్‌ల్లోని ఉత్పత్తులను 5 శాతం కిందకు తీసుకురాడం వల్ల స్వల్పకాలంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయని గోద్రేజ్ కన్జ్యూమర్ ఎండీ, సీఈవో సుధీర్ సీతాపతి చెప్పారు. డీలర్లు, కంపెనీల వద్ద అధిక ఎంఆర్‌పీలతో ఉత్పత్తుల నిల్వలు ఉన్నట్టు చెప్పారు. కనుక కొత్త ఎంఆర్‌పీలతో కూడిన ఉత్పత్తులు వినియోగదారులను చేరుకోవడానికి కొంత సమయం పడుతుందన్నారు. పాత స్టాక్‌పై తగ్గింపు ఇస్తే అది నేరుగా వినియోగదారులకు బదిలీ అవుతుందన్న గ్యారంటీ లేదన్నారు.

ముందే తగ్గిస్తాం..

తమ స్టోర్లలో ఉన్న ఉత్పత్తుల ధరల లేబుళ్లను మార్చబోమని, దీనికి బదులు తుది బిల్లు మొత్తంపై తగ్గింపు ఇస్తామని వీ-మార్ట్ రిటైల్ చైర్మన్, ఎండీ లలిత్ అగర్వాల్ ప్రకటించారు. ప్రభుత్వం జీఎస్‌టీలో కల్పించిన ఉపశమనం మేర బిల్లులో తగ్గింపు ఉంటుందన్నారు. కంపెనీ స్టోర్లలో కస్టమర్లకు తెలిసేలా బోర్డులు పెట్టినట్టు చెప్పారు. ఏసీలు, ఇతర కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీలోని బ్లూస్టార్ సైతం సెప్టెంబర్ 22 తర్వాత కస్టమర్లకు తగ్గింపులు ఇవ్వనున్నట్టు ప్రకటించింది.

స్పష్టత కోసం చూస్తున్నాం..

కొత్త జీఎస్‌టీ రేట్ల అమలు మార్గదర్శకాల కోసం పరిశ్రమ వేచి చూస్తున్నట్టు పార్లే ప్రొడక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ మయాంక్ షా తెలిపారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వాన్ని సంప్రదించామని, వెంటనే కొత్త రేట్లకు మారిపోవాలా లేక కొత్త సమయం ఇస్తారా? అన్నది తెలుసుకుంటున్నట్టు చెప్పారు. ఇప్పటికే పాత ధరలతో ఉన్న నిల్వల విషయంలో ఒక్కో కంపెనీ భిన్నమైన సవాళ్లను ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులతో పోల్చినప్పుడు ఆహారోత్పత్తుల మన్నిక (షెల్ఫ్ లైఫ్/నిల్వ కాలం) తక్కువగా ఉంటుందన్నారు. ఏం చేయాలన్నది అంతా ప్రభుత్వ మార్గదర్శకాలపైనే ఆధారపడి ఉంటుందంటూ, ఇవి త్వరలో వస్తాయని ఆశిస్తున్నట్టు చెప్పారు.

రీట్స్, ఇన్విట్‌లకు చక్కని ఆదరణ

9 ఏళ్లలో రూ.9 లక్షల కోట్లు

- 2030 నాటికి రూ.25 లక్షల కోట్లకు
- ఐఆర్‌ఏ, బీఐఏ అంచనా



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్) సాధనాల్లో పెట్టుబడులకు ఆదరణ క్రమంగా పెరుగుతోంది. వీటి నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో రూ.9 లక్షల కోట్లకు చేరినట్టు ఇండియన్ రీట్స్ అసోసియేషన్ (ఐఆర్‌ఏ), భారత్ ఇన్విట్స్ అసోసియేషన్ (బీఐఏ) ప్రకటించాయి. రీట్‌లు, ఇన్విట్‌ల నిర్వహణలోని ఉమ్మడి ఆస్తుల విలువ 2030 నాటికి రూ.25 లక్షల కోట్లకు చేరుకోవచ్చని ప్రకటించాయి. ప్రస్తుతం ఐదు రీట్‌లు.. బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, నెక్సస్ సెలక్ట్ ట్రస్ట్, నాలెడ్జ్ రియల్టీ ట్రస్ట్‌లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ అయి ఉన్నాయి. ఇక సెబీ నమోదిత 27 ఇన్విట్‌లు ఉండగా, వీటిల్లో ఐదు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ అయ్యాయి. రీట్‌లు, ఇన్విట్‌లపై మొదటిసారి అవగాహన కార్యక్రమాన్ని ఐఆర్‌ఏ, బీఐఏ ఢిల్లీలో నిర్వహించాయి. ఇన్విట్స్ నిర్వహణలోని ఏయూఎం విలువ రూ.7 లక్షల కోట్లుగా ఉంటే, రీట్‌ల నిర్వహణ ఆస్తుల విలువ రూ.2.25 లక్షల కోట్లుగా ఉన్నట్టు ప్రకటించాయి.

ఇన్వెస్టర్లలో పెరుగుతున్న విశ్వాసం

''నేడు క్యాపిటల్ మార్కెట్స్ పరిధిలో రీట్‌లు ప్రధాన పెట్టుబడి సాధనంగా అవతరించాయి. ఆర్థిక మార్కెట్ల పరిధిలో భౌతిక ఆస్తులను పారదర్శకంగా, నియంత్రణల మధ్య అంతర్జాతీయంగా పోటీతత్వంతో నిర్వహిస్తున్నట్టు'' ఐఆర్‌ఏ చైర్మన్ అలోక్ అగర్వాల్ ప్రకటించారు. ఐదు లిస్టెడ్ రీట్‌ల మార్కెట్ విలువ రూ.1.5 లక్షల కోట్లుగా ఉంటుందని బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్ ఎండీ, సీఈవో అయిన అగర్వాల్ తెలిపారు. ఈ సాధనాల పట్ల ఇన్వెస్టర్లలో విశ్వాసం పెరుగుతున్నట్టు చెప్పారు. ఇన్వెస్టర్లకు స్థిరమైన ఆదాయానికి (నగదు ప్రవాహం) వీలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ''ఇన్విట్‌లు పారదర్శకమైన ప్లాట్‌ఫామ్‌లుగా మారాయి. పెరుగుతున్న భారత మౌలిక రంగ నిధుల అవసరాలకు ఇవి సరిగ్గా సరిపోతాయి''అని బీఐఏ సీఈవో ఎస్ఎస్ వెంకటేశ్ పేర్కొన్నారు. మౌలిక రంగంలో పెద్ద ఎత్తున వృద్ధి, పెట్టుబడుల దృష్ట్యా 2030 నాటికి ఇన్విట్‌ల నిర్వహణ ఆస్తుల విలువ రూ.21 లక్షల కోట్లకు చేరుకుంటుందన్నారు. రీట్‌ల నిర్వహణ ఆస్తుల విలువ 2030 నాటికి రూ.4 లక్షల కోట్లకు చేరుకోవచ్చని ఐఆర్‌ఏ అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ1 నాటికి నాలుగు రీట్‌లు మొత్తం మీద రూ.24,300 కోట్లను వాటాదారులకు పంపిణీ చేశాయి. ఇక ఇన్విట్‌లు 2025 మార్చి నాటికి తమ వాటాదారులకు పంపిణీ చేసిన మొత్తం రూ.68,000 కోట్లుగా ఉంది.

స్థిరమైన ఆదాయానికి మార్గం..

రీట్‌లు అన్నవి ఆదాయాన్నిచ్చే వాణిజ్య, రిటైల్ ఆస్తులను నిర్వహిస్తుంటాయి. వీటిల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా వాటాదారులు ప్రతీ త్రైమాసికానికి స్థిరమైన ఆదాయాన్ని డివిడెండ్, అసలు, వడ్డీ రూపంలో పంపిణీ చేస్తుంటాయి. నికర మిగులు నుంచి 90 శాతాన్ని వాటాదారులకు పంచాల్సి ఉంటుంది. ఇన్విట్‌లు ఆదాయాన్నిచ్చే మౌలిక రంగ ప్రాజెక్టులను (రహదారులు, విద్యుత్ ప్రసార, పంపిణీ ప్రాజెక్టులు, పైప్‌లైన్లు, గోదాములు తదితర) నిర్వహిస్తుంటాయి.

టీవీఎస్ నుంచి 'ఎన్‌టార్క్ 150'



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టీవీఎస్ మోటార్స్ తాజాగా ఎన్‌టార్క్ 150 హైపర్ స్పోర్ట్ స్కూటర్‌ను ప్రవేశపెట్టింది. దీని ప్రారంభ ధర రూ. 1,19,000గా (ఎక్స్ షోరూం) ఉంటుంది. 6.3 సెకన్లలోనే గంటకు 0-60 కి.మీ. వేగాన్ని అందుకోవడం, ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్, సెగ్మెంట్లోనే తొలిసారిగా అలెక్సా..స్మార్ట్ వాచ్‌తో అనుసంధానం, లైవ్ ట్రాకింగ్, మొదలైన ఫీచర్లు ఇందులో ఉన్నాయి. దేశీయంగా స్కూటర్స్ మార్కెట్లో తమకు ప్రస్తుతం సుమారు 26 శాతం వాటా ఉన్నట్లు టీవీఎస్ ఎన్‌టార్క్ గ్రూప్ బ్రాండ్ మేనేజర్ రాజ్ బిశ్వాస్ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తమకు 300 పైగా టచ్‌పాయింట్స్ (సేల్స్, సర్వీస్ మొదలైనవి) ఉన్నట్లు సంస్థ ఏపీ, తెలంగాణ సేల్స్ జీఎం కేంద్రజ్ జోషి తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టూ వీలర్స్.. రయ్! | జీఎస్‌టీ సంస్కరణలు.. గేమ్ చేంజర్

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-తెలంగాణ జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-సైన్స్ అండ్ టెక్నాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- కంప్యూటర్ అవేర్‌నెస్

విద్య, ఉద్యోగ సమాచారం

రైల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలాలో 23 పోస్టులు

రైల్ కోచ్ ఫ్యాక్టరీ(ఆర్‌సీఎఫ్)కపుర్తలాలో స్పోర్ట్స్ కోటాలో 2025-26 సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23.
» **పోస్టుల వివరాలు:** హాకీ(మెన్)-02, హాకీ(ఉమెన్)-04, వెయిట్ లిఫ్టింగ్(ఉమెన్)-02, ఫుట్‌బాల్(మెన్)-03, బాస్కెట్ బాల్(మెన్)-03, అథ్లెటిక్స్(మెన్)-02, అథ్లెటిక్స్(ఉమెన్)-02, స్విమ్మింగ్ (ఉమెన్ ఫ్రీ స్టైల్)-02, రెజ్లింగ్(మెన్) గ్రీకో రోమన్ స్టైల్-02, రెజ్లింగ్(మెన్) ఫ్రీ స్టైల్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2026 నాటికి 18 నుంచి 25 ఏళ్లు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.09.2025.
» **వెబ్‌సైట్:** https://rcf.indianrailways.gov.in

ఎస్‌జేవీఎన్ లిమిటెడ్‌లో 87 వర్క్‌మెన్ ట్రైనీ పోస్టులు

హిమాచల్ ప్రదేశ్‌లోని ఎస్‌జేవీఎన్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో వర్క్‌మెన్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 87.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్(అకౌంట్స్)-10, అసిస్టెంట్-15, డ్రైవర్-15, ఎలక్ట్రీషియన్(ఐటీఐ ఎలక్ట్రీషియన్)-20, ఫిట్టర్(ఐటీఐ టర్నర్)-05, టర్నర్(ఐటీఐ టర్నర్)-02, వెల్డర్(ఐటీఐ వెల్డర్)-05, స్టోర్ కీపర్-10, సర్వేయర్(ఐటీఐ సర్వేయర్)-05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎనిమిదో తరగతి, ఐటీఐ, డిగ్రీ, డిగ్రీ(బీకాం) లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.21,500.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 22.09.2025.



» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.10.2025.
» **వెబ్‌సైట్:** https://sjvn.nic.in

ఏపీ కుటుంబ వైద్య ఆరోగ్య శాఖలో 28 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా బాపట్ల, నరసరావుపేట ఏరియా హాస్పిటల్స్(డీఎస్‌హెచ్)లో.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 28.
» **పోస్టుల వివరాలు:** డాక్టర్-02, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కమ్ ఒకేషనల్ కౌన్సిలర్-02, నర్స్-04, వార్డ్ బాయ్-04, కౌన్సిలర్/సోషల్ వర్కర్/సైకాలజిస్ట్-04, అకౌంటెంట్ కమ్ క్లర్క్-02, పీర్ ఎడ్యుకేటర్-02, చౌకీదార్-04, హౌస్‌కీపింగ్ వర్క్-02, యోగా థెరపిస్ట్/డాన్స్/మ్యూజిక్/ఆర్ట్ టీచర్(పార్ట్ టైమ్)-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐదు,ఎనిమిదో తరగతి,ఎంబీబీఎస్, డిగ్రీ,ఏఎన్ఎం ఉత్తీర్ణతతో పాటు సైకిల్ తొక్కడం, తెలుగులో చదవడం, రాయడం వచ్చి ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్ల లోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు డాక్టర్‌కు రూ.60,000, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కమ్ ఒకేషనల్ కౌన్సిలర్‌కు రూ.25,000, నర్స్‌కు రూ.15,000, వార్డ్ బాయ్‌కు రూ.13,000, కౌన్సిలర్/సోషల్ వర్కర్/సైకాలజిస్ట్, అకౌంటెంట్ కమ్ క్లర్క్‌కు రూ.12,000, ప్రీ ఎడ్యుకేటర్‌కు రూ.10,000, చౌకీదార్‌కు రూ.9000, హౌస్ కీపింగ్ వర్క్‌కు రూ.9000, యోగా థెరపిస్ట్/ డాన్స్/మ్యూజిక్/ఆర్ట్ టీచర్‌కు రూ.5000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.09.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.09.2025.
» **వెబ్‌సైట్:** https://guntur.ap.gov.in

ఐఐటీ హైదరాబాద్‌లో మల్టీమీడియా కంటెంట్ క్రియేటర్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన మల్టీమీడియా కంటెంట్ క్రియేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి లేదా మల్టీమీడియా ప్రొడక్షన్‌లో సర్టిఫికేట్, పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 40 ఏళ్ల లోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.60,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.iith.ac.in

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ 2025-26

కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేస్తోంది. ఈ పథకం తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే పేద విద్యార్థులకు ప్రతీ సంవత్సరం స్కాలర్‌షిప్ అందిస్తోంది. ఈ పథకం ముఖ్యమైన లక్ష్యం ఎనిమిదో తరగతి విద్యార్థులు డ్రాప్‌ఔట్ కాకుండా వారిని ప్రోత్సహించడం, ప్రాథమిక విద్యను కొనసాగించడం. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** ఏడో తరగతిలో 55% మార్కులు పొందిన విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులు. ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో చదువుతూ ఉండాలి. విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు.
» **స్కాలర్‌షిప్:** ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి మొత్తం రూ.12,000 స్కాలర్‌షిప్ అందిస్తారు.
» **పరీక్ష ఫీజు:** బీసీ, ఓసీ విద్యార్థులకు రూ.100. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50. (ఎస్‌బీఐ చలానా రూపంలో జత చేయాలి)
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ద్వారా విద్యార్థులను స్కాలర్‌షిప్‌కు ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తులను ఆయా స్కూళ్లు సమర్పించాలి. తర్వాత ఆ దరఖాస్తుల ప్రింటవుట్లను, సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలను డీఈవోలకు పంపాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 04.09.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.09.2025
» **పరీక్ష ఫీజు చెల్లించడానికి ప్రారంభతేది:** 10.09.2025.
» **పరీక్ష ఫీజు చెల్లించడానికి చివరితేది:** 10.10.2025.
» **పరీక్ష తేది:** 07.12.2025.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.bse.ap.gov.in

ఐఐటీ హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసిస్టెంట్(సీసీఈ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 65% మార్కులతో డి గ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.25,000 నుంచి రూ.30,000
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.iith.ac.in

ఎన్‌ఎస్‌ఐసీలో లీడ్ ట్రేడ్స్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎస్ఐసీ) వివిధ విభాగాల్లో లీడ్ ట్రేడ్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, సీఏ, సీఎంఏ(బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్/స్టాటిస్టిక్స్)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** hrm@nsic.co.in
» **దరఖాస్తులకు చివరితేది:** 15.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.nsic.co.in

ఐబీలో ఆఫీసర్ కొలువు

» 394 జూనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ (జేఐఓ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల
» ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు

దేశ భద్రతలో పాలు పంచుకోవాలనే ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతకు చక్కని అవకాశం. కేంద్ర హోం శాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) 394 జూనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ (గ్రేడ్-11/టెక్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. జాతీయ భద్రతకు టెక్నాలజీ సాయంతో నిఘా పెట్టడం ఎంపికైన వారి ప్రధాన విధి. ఈ నేపథ్యంలో.. ఐబీలో ఆఫీసర్ ఉద్యోగాలు, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..



జాబ్స్ ఇన్ఫో

- **పోస్టు పేరు:** జూనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ (గ్రేడ్-11/టెక్)
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 394
- మొత్తం 394 ఖాళీలలో అన్‌రిజర్వ్‌డ్ (యూఆర్) కేటగిరీ కింద 157, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) 32, ఓబీసీలకు 117, ఎస్సీలకు 60, ఎస్టీలకు 28 పోస్టులను రిజర్వ్ చేశారు.

అర్హతలు

- దేశంలోని గుర్తింపు పొందిన ఏదైనా ఇన్‌స్టిట్యూట్ /యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్ డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీని ఈ కింది విభాగాల్లో పూర్తి చేసి ఉండాలి.
- ఇంజనీరింగ్ డిప్లొమా: ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ ఇంజనీరింగ్/ కంప్యూటర్ అప్లికేషన్స్.
- **ఇంజనీరింగ్ డిగ్రీ:** ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ అప్లికేషన్.
- ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ ఫిజిక్స్/ మేథమేటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్.

వయసు

14.09.2025 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 40 ఏళ్ల వరకు మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం

పరీక్ష మొత్తం 150 మార్కులకు ఉంటుంది. ఇది మూడు విధాలుగా ఉంటుంది. టైర్-1లో 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో రెండు గంటల పాటు పరీక్ష ఉంటుంది. ఇందులో 25 శాతం జనరల్, మెంటల్ ఎబిలిటీ విభాగ ం ప్రశ్నలు ఉంటాయి. 75 శాతం ప్రశ్నలు అభ్యర్థి విద్యార్హత కోర్సులో చదివిన సబ్జెక్టుల నుంచి ఇస్తారు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 శాతం (పావు) మార్కును తగ్గిస్తారు.

టైర్ 2 స్కిల్ టెస్ట్

టైర్1 పరీక్షలో అర్హత సాధించిన వారిని టైర్-2 (స్కిల్ టెస్టు)కు పిలుస్తారు. ఇందులో ప్రాక్టికల్, టెక్నికల్ అంశాలపై 30 మార్కులకు పరీక్ష ఉంటుంది. చివరగా టైర్-3 ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్టుకు 20 మార్కులు కేటాయించారు.

వేతనం

ఆన్‌లైన్ పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూలో విజేతలుగా నిలిచి ఉద్యోగం సాధించిన వారికి నెలకు రూ.25,500 నుంచి 81,100 మధ్య వేతనం లభిస్తుంది. దీంతోపాటు ప్రభుత్వ అలవెన్సులు , ఇతర అలవెన్సులు లభిస్తాయి.

కెరీర్

జేఐఓ-2 సవాలుతో కూడుకున్న జాబ్. ఉద్యోగి జాతీయ భద్రతకు సాంకేతిక నిఘా ద్వారా సేవలందించవలసి ఉంటుంది. ఎంపికైన అభ్యర్థికి రెండేళ్ల పాటు ప్రొబేషనరీ పీరియడ్ ఉంటుంది. పనితీరు ఆధారంగా జేఐఓ-2 నుంచి కాలక్రమేణా డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ వంటి ఉన్నత స్థాయి దాకా ప్రమోషన్‌తో చేరుకోవచ్చు.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు

హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్, అనంతపురం, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో చేసుకోవాలి
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** 23.08.2025
- **దరఖాస్తు చివరి తేది:** 14.09.2025
- **ఆన్‌లైన్ పరీక్ష తేది:** ఈమెయిల్ ద్వారా తెలియజేస్తారు
- **వెబ్‌సైట్:** www.mha.gov.in లేదా www.ncs.gov.in.


క్లుప్తంగా...

అంపశయ్య నవీన్, అంతడుప్పల రమాదేవికి 'పొన్నం సత్తయ్య' పురస్కారాలు

● ఈనెల 13న ప్రదానం చేయనున్న ట్రస్టు ఛైర్మన్, మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: పొన్నం సత్తయ్య జీవితసాఫల్య పురస్కారాలకు ఈ ఏడాది సాహిత్య విభాగంలో ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, కళారంగంలో అంతడుప్పల రమాదేవి ఎంపికయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఏటా రచయితలు, కళాకారులకు జీవిత సాఫల్య పురస్కారాలు అందిస్తున్నారు. పొన్నం సత్తయ్య 15వ వర్ధంతి సందర్భంగా ఈనెల 13న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. అవార్డు గ్రహీతలకు రూ.51 వేల నగదుతోపాటు ప్రశంసపత్రం అందించనున్నారు. ఎంపిక కమిటీ కన్వీనర్ పొన్నం రవిచంద్ర సారథ్యంలో జ్యూరీ కమిటీలో సీనియర్ పాత్రికేయులు మాడభూషి శ్రీధర్, దిలీప్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మీ సభ్యులుగా ఉన్నారు. అయితే ఈ కమిటీ వార్డులను ఎంపిక చేసి సోమవారం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్.. మంత్రి పొన్నంకు ఎంపిక పత్రాన్ని అందజేశారు.

'గ్రూప్‌-1' తీర్పు నేడు



సాక్షి, హైదరాబాద్: గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లలో హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించనుంది. రెండు నెలలుగా లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూస్తున్న విషయం విదితమే. 2024, అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు.. లక్షలాది మంది భవిష్యత్‌కు సంబంధించిన అంశం కావడంతో మూడు నెలల పాటు అన్ని పక్షాల నుంచి సుదీర్ఘ వాదనలు నమోదు చేసుకుంది. అందరి వాదనలు ముగిసిన తర్వాత జూలై 7న తీర్పు రిజర్వు చేసింది. నేడు తీర్పు వెల్లడించేందుకు పిటిషన్లను లిస్ట్ చేసింది. జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు మంగళవారం ఉదయం 10.30 గంటలకు తీర్పు వెలువరించనున్నారు.

చెట్ల నరికివేతపై రూ.20 లక్షల జరిమానా

సాక్షి, మేడ్చల్ జిల్లా: కూకట్‌పల్లి పరిధిలోని గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ ఆవరణలో ఉన్న చెట్ల నరికివేతపై అటవీ శాఖ అధికారులు భారీ ఎత్తున జరిమానా విధించారు. గత వారంలో ఆ కంపెనీ పరిధిలో ఉన్న చెట్ల నరికివేతపై స్థానికులు అటవీ శాఖ జిల్లా అధికారులకు సమాచారం అందించారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు అనుమతులు లేకుండా చెట్ల నరికివేతపై యాజమాన్యానికి రూ.20 లక్షల జరిమానాను విధించారు. దీంతో ఆయిల్ కంపెనీ యాజమాన్యం సోమవారం అటవీ శాఖకు రూ.20 లక్షలు చలాన్ రూపంలో చెల్లించిందని జిల్లా అటవీ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు.

మద్దూరులో పునుగు పిల్లి




మద్దూరు: తిరుపతి శేషాచలం అడవుల్లో సంచరించే పునుగు పిల్లి మద్దూరులో కనిపించింది. నారాయణపేట జిల్లా మద్దూరులోని కేకే కాలనీలో ఉంటున్న రాములు ఇంట్లోకి శనివారం ఓ పునుగు పిల్లి వచ్చింది. ఈ ఇంటి వెనుకభాగంలో ఉన్న పొలాల నుంచి ఇంటి ఆవరణలోకి వచ్చి అక్కడక్కడే తిరిగింది. ఆదివారం ఆయన కార్లోకి ప్రవేశించడంతో దాన్ని పట్టుకొని సంచిలో వేసి పట్టణ శివారులో వదిలేశారు. ఈ పిల్లి విశేషాలను గూగుల్‌లో సెర్చ్ చేయడంతో విషయం తెలుసుకున్న వారు.. మళ్లీ ఆ పిల్లిని ఇంటికి తీసుకొచ్చి బోను ఏర్పాటు చేసి ఆహారం అందించారు. దీన్ని సంరక్షించాలనే ఉద్దేశంతో అటవీశాఖ అధికారులకు సోమవారం సమాచారం అందించారు. అటవీ అధికారి లక్ష్మణ్‌నాయక్ పునుగుపిల్లిని తీసుకొని మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రికి తరలించే ఏర్పాటు చేశారు.

సమాజంలో ఏకాకిగా..

దేశ ప్రజలను వెంటాడుతున్న ఒంటరితనం

- ప్రతి ఆరుగురు భారతీయుల్లో ఒకరిని వేధిస్తున్న సమస్య
- 43 శాతం పట్టణ ప్రాంతవాసుల్లో ఇదే భావన
- దీర్ఘకాలిక ఒంటరితనంతో ఒత్తిడి, గుండెజబ్బులు, స్ట్రోక్ ముప్పు
- 'ఇప్సోస్'తాజా అధ్యయనంలో విస్మయకర అంశాలు

నిత్యం బంధువులు, స్నేహితుల నుంచి వాట్సాప్‌ను ముంచెత్తుతూ గుడ్‌మార్నింగ్ సందేశాలు.. ఆఫీసుకెళ్లగానే హాయ్, హలో పలకరింపులు.. వారాంతాల్లో స్నేహితులతో పార్టీలు.. ఏడాదంతా పండుగలు, పబ్బాలు, కుటుంబ వేడుకలు.. ఇలా సంఘజీవులుగా దైనందిక జీవితాన్ని గడుపుతున్నప్పటికీ మనోళ్లను ఒంటరితనం వేధిస్తోంది! ప్రపంచంలోకెల్లా అత్యధిక జనాభాగల దేశంగానే కాకుండా.. సాంఘిక, సామాజిక స్థాయిల్లో వివిధ బంధాలతో పెనవేసుకుపోయిన భారతీయుల్లో ఈ సమస్య రోజురోజుకూ పెరుగుతుండటం దేనికి సంకేతం?



సాక్షి, హైదరాబాద్

దేశంలోని పట్టణవాసుల్లో ప్రతి ఆరుగురిలో ఒకరు తరచూ ఒంటరితనంతో బాధపడుతున్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. వేగవంతమైన సామాజిక-ఆర్థిక మార్పులు, పాతుకుపోయిన సాంస్కృతిక అంశాల సంక్లిష్ట మిశ్రమం కారణంగా పట్టణ ప్రాంతాల వారు ఎక్కువగా ఒంటరితనంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపింది. ఉపాధి లేక గ్రామాల నుంచి వలసల పెరుగుదల, పట్టణాల్లో అధికమవుతున్న వృత్తిపరమైన పోటీతత్వం, సుదీర్ఘ పనిగంటలు, సుదూర ప్రయాణాల వంటి అంశాలు ప్రజల్లో భావోద్వేగ అలసటకు దారితీస్తున్నట్లు పేర్కొంది.

సంబంధాలన్నీ పైపైనే..

ప్రముఖ గ్లోబల్ మార్కెట్ రీసెర్చ్, పబ్లిక్ ఒపీనియన్ స్పెషలిస్ట్ కంపెనీ 'ఇప్సోస్' ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం పట్టణవాసులు పరస్పరం సత్సంబంధాలు కలిగి ఉన్నట్లు పైకి కనిపిస్తున్నా భావోద్వేగపరంగా ఒకరికొకరు కలవలేకపోతున్నారు. స్త్రీ, పురుష తేడాలు, పేద, ధనిక అంతరాలు, ప్రాంతాలు, పట్టణీకరణ వంటివి ఈ భావోద్వేగాలను ప్రభావితం చేస్తున్నాయి. అయితే సోషల్ మీడియా ఈ భావాలను కప్పిపుచ్చేందుకు.. బాధ, ఇబ్బందులను పక్కకునెట్టేందుకు దోహదపడుతున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తమలోని భయాలను కప్పిపుచ్చుకోవడంతోపాటు వాటిని బయటకు వెల్లడిస్తే ఇతరుల దృష్టిలో చులకన అవుతామనే ఫియర్ ఆఫ్ మిస్సింగ్ ఔట్ (ఫోమో) భావన కూడా దీనికి తోడ్పడుతోంది.

సర్వేలోని ముఖ్యాంశాలు..

- పట్టణ ప్రాంతాల్లోని 43% మంది భారతీయులు ఎక్కువ సమయం ఒంటరితనం ఫీలవుతున్నారు. పెద్ద నగరాల్లో ఇది 45 శాతంగా ఉంటోంది.
- ప్రతి ఆరుగురిలో ఒకరు తరచూ ఒంటరిననే భావనతో కాలం నెట్టుకొస్తున్నారు.
- 45 ఏళ్లకు పైబడిన వారిలో 20 శాతం ఓ మోస్తరుగా, 13 శాతం తీవ్రమైన ఏకాకి జీవితాన్ని అనుభవిస్తున్నారు.
- పురుషుల్లో ఒంటరితనమనే భావన క్రమక్రమంగా పెరుగుతోంది.
- ప్రతి నలుగురు టీనేజర్లలో ఒకరు ఒంటరితనంతో బాధపడుతున్నారు.
- పెద్ద వయసు వారిలో ప్రతి ముగ్గురిలో ఒకరు సామాజికంగా దూరంగా ఉన్నామనే భావనతో ఉన్నారు.

శారీరక, మానసిక సమస్యలు

దీర్ఘకాలిక ఒంటరితనం తీవ్ర శారీరక, మానసిక సమస్యలకు దారితీస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల రోగనిరోధక శక్తి బలహీనపడటం, గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. కేన్సర్ వంటి వ్యాధులకు గురయ్యే చాన్స్ ఎక్కువగా ఉంటుందన్నారు. మానసిక సమస్యలను ఎదుర్కొనే విషయంలో భారత్‌లో తగినంత మంది మానసిక ఆరోగ్య నిపుణులు లేకపోవడం అడ్డంకిగా మారుతోందని అభిప్రాయ పడుతున్నారు.

పరిష్కారం ఏమిటి?

- కుంగుబాటుకు గురైనప్పుడు బాధితులు ఫోన్, చాట్ లేదా యాప్‌ల రూపంలో 'లిజనింగ్ సర్వీసెస్'ద్వారా సాంత్వన పొందొచ్చు. కష్టాలను విని నిపుణులు తగిన మద్దతు అందిస్తారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ కిరణ్ హెల్ప్‌లైన్ (1800-599-0019) 13 భాషల్లో 24/7 మానసిక ఆరోగ్య మద్దతు అందిస్తోంది.
- అభిరుచిగల సమూహాలు, క్లబ్‌లు లేదా ఆన్‌లైన్ ఫోరమ్‌లలో చేరడం ద్వారా స్వచ్ఛంద సేవ, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఒంటరితనంతో ముడిపడిన ప్రవర్తనలను అధిగమించడంలో దోహదపడుతుంది.
- ధ్యానం, యోగా, మైండ్‌ఫుల్‌నెస్ వంటి అభ్యాసాలు బాధితులను ప్రశాంతపరిచి ఆందోళనలు తగ్గిస్తాయి. ఈ అభ్యాసాలు నాడీ వ్యవస్థను ప్రశాంతపరచడంలో సహాయపడతాయి. కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్ల విడుదలను తగ్గిస్తాయి.

స్టేట్ కోటా కౌన్సెలింగ్

15 నుంచి ఎంబీబీఎస్, బీడీఎస్

- 33 జీవోకు సవరణలు చేస్తూ జీవో నంబర్ 150 విడుదల చేసిన ప్రభుత్వం
- నాలుగు కేటగిరీల్లోని కేంద్ర, రాష్ట్ర సర్వీసుల్లోని వారి పిల్లలకు అవకాశం
- నేటి నుంచి 11వ తేదీవరకు ఆయా కేటగిరీల్లోని ఉద్యోగుల పిల్లలకు వర్సిటీలో రిజిస్ట్రేషన్ అవకాశం
- మెడికల్ కౌన్సెలింగ్‌కు తొలగిన అడ్డంకులు...త్వరలో సీట్ల కేటాయింపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లకు సంబంధించి గత కొన్ని నెలలుగా కొనసాగిన అనిశ్చితికి తెర పడింది. ఆల్ ఇండియా కోటా అడ్మిషన్ల ప్రక్రియ ఆగస్టు రెండోవారం నుంచే ప్రారంభం కాగా, తెలంగాణ స్థానికత అంశంపై సుప్రీంకోర్టులో ఉన్న కేసు కారణంగా రాష్ట్రంలో స్టేట్ కోటా కౌన్సెలింగ్ మొదలు కాలేదు. అయితే స్థానిక అభ్యర్థుల నిర్వచనంపై సుప్రీంకోర్టు ఈ నెల 1న ఇచ్చిన తీర్పు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన 33 జీవోకు సవరణలతో జీవో(నంబరు:15)ను సోమవారం విడుదల చేసింది. ఈ ప్రభుత్వ ఉత్తర్వులతో స్టేట్ కోటా అడ్మిషన్లకు అడ్డంకులు తొలగి, కౌన్సెలింగ్‌కు మార్గం సుగమమైంది. ఈ మేరకు వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం 9 నుంచి 12వ తరగతి వరకు వరుసగా తెలంగాణలో చదవలేకపోయిన నాలుగు కేటగిరీల ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు సంబంధించి మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభించనుంది. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఎంబీబీఎస్ స్థానిక కోటా అడ్మిషన్లకు అర్హులైన వారు ఈ నెల 11వ తేదీ వరకు యూనివర్సిటీకి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అనంతరం ర్యాంకర్ల జాబితాను విడుదల చేసి, ఈ నెల 15వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో స్టేట్ కోటా కౌన్సెలింగ్ ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని వర్సిటీ వీసీ డాక్టర్ నందకుమార్‌రెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ ధ్రువీకరించారు.

సుప్రీంకోర్టు తీర్పుతో ఊరట

రాష్ట్ర విభజన జరిగి పదేళ్ల పూర్తయిన అనంతరం ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని సీట్లతోపాటు ప్రైవేటు కళాశాలల్లోని కన్వీనర్ కోటా సీట్లను స్థానికులతోనే భర్తీ చేసే విధంగా గత సంవత్సరం జీవో 33ను తీసుకొచ్చింది. ఈ జీవో ప్రకారం 9,10 తరగతులతో పాటు ఇంటర్ (11,12) వరుసగా నాలుగేళ్లు ఇక్కడ చదివితేనే స్థానికులుగా పరిగణించబడతారు. వారికే స్టేట్ కోటా కింద ప్రభుత్వ కళాశాలల్లోని 85 శాతం సీట్లు, ప్రైవేట్ కళాశాలల్లోని కన్వీనర్ కోటాలోని 50 శాతం సీట్లు కేటాయిస్తారు. అయితే ఈ జీవోపై 2024లో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టును ఆశ్రయించిన వారికి స్థానిక కోటా కింద సీట్లు కేటాయించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఈనెల 1న తీర్పు చెబుతూ, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది. అదే సమయంలో తెలంగాణ స్థానికత గల నాలుగు కేటగిరీల్లోని ప్రభుత్వ ఉద్యోగుల సంతానానికి సంబంధించి ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది.

కొత్త జీవో ప్రకారం...

- 4 కేటగిరీల్లోని ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు కనీసం నాలుగు సంవత్సరాలు తెలంగాణలోని విద్యా సంస్థల్లో చదివి ఉండాలి. ఒకవేళ చదవకపోయినా నాలుగు సంవత్సరాలు తెలంగాణలో నివసించి, రాష్ట్రంలోనే క్వాలిఫైయింగ్ పరీక్ష రాసి ఉండాలి.
- కొత్త సవరణలు ఈ విద్యాసంవత్సరం నుంచే అమలులోకి వస్తాయి. స్థానిక అభ్యర్థి అర్హత నిరూపణకు తల్లిదండ్రుల ఉద్యోగ ధ్రువీకరణ పత్రాలు సమర్పించడం తప్పనిసరి.

వీరి పిల్లలకే ఈ అవకాశం

- తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు : ఇతర రాష్ట్రాలలో విధులు నిర్వర్తించిన కాలంలో.
- ఆల్ ఇండియా సర్వీసెస్ (ఐఏఎస్/ ఐపీఎస్/ ఐఎఫ్ఎస్ మొదలైన) తెలంగాణ కేడర్ అధికారుల పిల్లలు.
- తెలంగాణను స్వస్థలంగా ప్రకటించిన రక్షణ దళాలు, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ సిబ్బంది పిల్లలు.
- తెలంగాణ ప్రభుత్వ అధీనంలోని కార్పొరేషన్లు, ఏజెన్సీలు, సంస్థల్లో పని చేసే ఉద్యోగుల పిల్లలు

టీజీ సీపీగెట్‌లో 93 శాతం మందికి అర్హత

ఫలితాలను విడుదల చేసిన ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి.. రేపట్నుంచి సీట్ల భర్తీకి వెబ్ కౌన్సెలింగ్



ఫలితాలు విడుదల చేస్తున్న బాలకిష్టారెడ్డి. చిత్రంలో వీసీలు కుమార్, పురుషోత్తం, ప్రతాప్‌రెడ్డి, పాండురంగారెడ్డి, మహమూద్

సాక్షి హైదరాబాద్: రాష్ట్రంలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన టీజీ సీపీగెట్-25 ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వుడిత్యాల బాలకిష్టారెడ్డి సోమవారం విడుదల చేశారు. ఫలితాల్లో యువతులు సత్తా చాటారు. 35 వేల మందికిపైగా యువతులు పరీక్షలకు హాజరైతే వారిలో 32 వేల మంది అర్హత సాధించారు. యువకుల్లో 19 వేల మంది పరీక్ష రాయగా వారిలో 18 వేల మంది అర్హులుగా తేలారు. మొత్తంగా 51,316 మంది అర్హత సాధించారు. సీపీగెట్ వెబ్ కౌన్సెలింగ్ ఈ నెల 10 నుంచి ప్రారంభం కానుంది. మొత్తం మూడు విడతల్లో సీట్లను భర్తీ చేయనున్నారు. ఈ నెల 10 నుంచి 15 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, 18న సర్టిఫికెట్ వెరిఫికేషన్, 18 నుంచి 20 వరకు వెబ్ ఆప్షన్లు, 20న వెబ్ ఆప్షన్ల ఎడిటింగ్, 24న తొలి విడత సీట్ల కేటాయింపు ఉండనుంది. సీట్లు పొందిన వారు ఈ నెల 27లోగా కాలేజీల్లో రిపోర్ట్ చేయాలి. 29 నుంచి రెండో విడత కౌన్సెలింగ్ మొదలవుతుంది

సీట్లు ఎక్కువ.. అర్హులు తక్కువ: పీజీ కోర్సుల్లో చేరే వారి సంఖ్య ఏటా తగ్గుతోంది. దీంతో సీపీగెట్‌కు దరఖాస్తులు పడిపోతున్నాయి. అత్యధిక డిమాండ్ ఉండే ఎంకాంలో 6,562 సీట్లుంటే 3,858 మందే అర్హత సాధించారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 3,607 సీట్లకు 3,291 మంది క్వాలిఫై అవగా ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లో 2,950 సీట్లకు 1,936 మంది, ఎమ్మెస్సీ గణితంలో 3,648 సీట్లకు 2,070 మంది, ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో 1,767 సీట్లకు 1,122 మందే క్వాలిఫై అయ్యారు. అర్హులంతా కోర్సుల్లో చేరడమూ అనుమానంగానే ఉంటోంది. దీంతో ఈ కోర్సుల్లో భారీగా సీట్లు ఖాళీగా ఉండనున్నాయి. సీట్ల సంఖ్య ఎక్కువగా ఉండి, దరఖాస్తులు తక్కువగా వచ్చిన ఎంఏ అరబిక్, కన్నడ, మరాఠీ, పర్షియన్, థియేటర్ ఆర్ట్, ఎలక్ట్రానిక్స్, సెరికల్చర్ కోర్సులకు పరీక్ష నిర్వహించకపోవడం గమనార్హం. పరీక్ష లేకుండా ఈ కోర్సుల్లో వచ్చిన వారికి వచ్చినట్లు సీట్లు కేటాయించనున్నారు.

ఫలించిన మహిళా అభ్యర్థి న్యాయపోరాటం

పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అభ్యంతరాన్ని తోసిపుచ్చిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: 'స్థానికత'పై దళిత మహిళ ఎనిమిదేళ్లుగా చేస్తున్న న్యాయ పోరాటం ఫలించింది. హైదరాబాద్‌కు చెందిన సంగీత అభ్యర్థిత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డునుహైకోర్టు ఆదేశించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ద్విసభ్య ధర్మాసనం సమర్థించింది. 8 నుంచి 10వ తరగతి వరకు హైదరాబాద్‌లోనే సంగీత చదివారని, 4 నుంచి 7వ తరగతి వరకు బోనఫైడ్ సమర్పించనంత మాత్రాన నాన్ లోకల్‌గా పరిగణించడం సరికాదని పేర్కొంది. ఈ విషయంలో బోర్డు దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు.. 2015లో ఏఆర్ కానిస్టేబుల్ నియామకాల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. స్థానిక కేటగిరీ కింద తనను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన సంగీత హైకోర్టులో 2017లో పిటిషన్ దాఖలు చేశారు. తన కంటే తక్కువ మార్కులు వచ్చిన వారిని ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. పిటిషనర్‌ను హైదరాబాద్ జిల్లాకు స్థానిక అభ్యర్థిగా పరిగణించి, ఎస్సీ కేటగిరీలో కానిస్టేబుల్ పోస్టుకు ఎంపిక అంశాన్ని పరిశీలించాలని రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ బోర్డు అప్పీల్ దాఖలు చేసింది. అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. రిక్రూట్‌మెంట్ బోర్డు అప్పీల్‌ను కొట్టివేసింది.

రాష్ట్రంలో 'ఏఐ' సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

మంత్రి శ్రీధర్‌బాబు

- ఆస్ట్రేలియా 'డికిన్ యూనివర్సిటీ'తో భాగస్వామ్యం
- మంత్రి సమక్షంలో 'ఎల్ఓఐ'పై సంతకాలు



మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఎల్ఓఐ కుదుర్చుకుంటున్న ఇయాన్ మార్టిన్, భవేశ్ మిశ్రా

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా ఏఐ రంగంలో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఏఐలో నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో 'ఏఐ'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విద్యాసంస్థ 'డికిన్'విశ్వవిద్యాలయం 'ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ)పై సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో 'డికిన్ యూనివర్సిటీ'వీసీ ప్రొఫెసర్ ఇయాన్ మార్టిన్, రాష్ట్ర ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటయ్యే ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సమాజానికి ఉపయోగపడే అత్యాధునిక ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేస్తుందన్నారు. దీంతో పాటు పరిశోధనలు, వ్యవస్థాపకతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందన్నారు. ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ రంగాల్లో అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులను తెలంగాణ నుంచే అందించా లని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కలిసి ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఏఐ కోర్సులకు రూపకల్పన చేస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గవర్నెన్స్ తదితర రంగాల్లో ఏఐ వినియోగాన్ని పెంచి పౌర సేవలను మరింత సమర్థవంతంగా అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు.

'టీ చిప్' చరిత్రాత్మక ముందడుగు

భారత్ సెమీకండక్టర్ విప్లవానికి తెలంగాణను వేదికగా నిలబెట్టే దిశగా టీ-చిప్ (టెక్నాలజీ చిప్ ఇన్నోవేషన్ ప్రోగ్రాం)పై రూపొందించిన సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సంస్థ చైర్మన్, ఎండీ సందీప్ కుమార్ మక్తాల సోమవారం మంత్రి శ్రీధర్‌బాబుకు సమర్పించారు. తెలంగాణను సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంలో ఇది ఒక చరిత్రాత్మక ముందడుగు అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశంసించారు. టీ చిప్ బృందం ఇటీవల తైవాన్, హాంకాంగ్ పర్యటనలో సేకరించిన కీలక వివరాలతో ఈ డీపీఆర్‌ను సిద్ధంచేసినట్లు సందీప్ వెల్లడించారు. అనేక ప్రపంచస్థాయి సంస్థలను సందర్శించి చిప్ డిజైన్, సెక్యూర్ ఆర్కిటెక్చర్స్, మాన్యుఫాక్చరింగ్ మోడల్స్, పారిశ్రామిక వినియోగాలపై విలువైన అవగాహన ఏర్పరచుకున్నట్లు తెలిపారు. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 1.5 మిలియన్ మంది సెమీకండక్టర్ నిపుణుల కొరత ఏర్పడుతుందని దానిని దృష్టిలో పెట్టుకుని 85 వేల మంది నిపుణులు, వేయి మంది ప్రొఫెసర్లు, 10వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈవీ బ్యాటరీలు, ట్రాన్స్‌పరెంట్ డిస్‌ప్లేలు, ఏఐ రెడీ సర్వర్లు, అధునాతన రోబోటిక్స్ రంగాల్లో సెమీకండక్టర్ అప్లికేషన్లు వాడాలని ఆయన సూచించారు. డీపీఆర్‌లోని వివరాలను సందీప్ మక్తాలా మంత్రి శ్రీధర్‌బాబుకు వివరించారు.

'స్పై కెమెరా'లపై ఏం చర్యలు చేపట్టారు?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు..
- కౌంటర్ వేయాలని పోలీసులకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా షాపింగ్ మాల్స్, కాలేజీలు, స్కూళ్లు, లాడ్జిలు, హోటళ్లు, ఇతర ప్రదేశాల్లో స్పై కెమెరాల ఏర్పాటుపై ఏం చర్యలు చేపట్టారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఇది అత్యంత సున్నితమైన సమస్య అని, మహిళా భద్రతకు సంబంధించిన అంశమని అభిప్రాయపడింది. ఏం చర్యలు తీసుకున్నారో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించింది. రెండు వారాలు సమయమిస్తూ.. తదుపరి విచారణ 22కు వాయిదా వేసింది. స్పై కెమెరా డీలర్లు, విక్రయ దుకాణాలను గుర్తించి.. వినియోగదారులకు తెలిసేలా హెచ్చరిక స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని మహిళా భద్రతా విభాగం డైరెక్టర్ జనరల్ మార్చి 29న సర్క్యులర్ జారీ చేశారు. ఆ మేరకు చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారంటూ హైదరాబాద్ యూసుఫ్‌గూడ హెవెన్ హోం సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు వరలక్ష్మి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టారు.

ఆర్నెల్లకోసారి తనిఖీ చేయాలి: పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సమాచార సాంకేతిక చట్టం-2000లోని సెక్షన్ 66ఈ ప్రకారం అనుమతి లేకుండా, ఉద్దేశపూర్వకంగా ఒక వ్యక్తి ఫొటో 'తప్పు'గా తీయడం నేరం, చట్టవిరుద్ధమన్నారు. దీనికి మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.2 లక్షల వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశముందని చెప్పారు. లాడ్జిలు, మాల్స్, షాపింగ్ కాంప్లెక్స్, ప్రజా టాయిలెట్లు.. వంటి వాటిలో ప్రతి ఆర్నెల్లకోసారి తనిఖీలు నిర్వహించి స్పై కెమెరాలు లేవని ధ్రువీకరించాల్సి ఉందన్నారు. నిరంతరం ఈ చర్యలు చేపట్టాలని మహిళా భద్రతా విభాగం డీజీ ఆదేశాలు జారీ చేసినా అమలుకావడం లేదని నివేదించారు. మేడ్చల్‌లోని సీఎంఆర్ కాలేజీ బాలికల హాస్టల్, మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ మహిళా కాలేజీలో బాత్‌రూమ్‌లో కెమెరాలపై విద్యార్థులు ఆందోళన చేసిన ఉదంతాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో మార్చిలో జారీ చేసిన మెమో ప్రకారం చర్యలు చేపట్టాలని జూలై 10న పిటిషనర్ అధికారులకు వినతిపత్రం సమర్పించారని.. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ ఇచ్చిన వినతి పత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, ఏం చర్యలు తీసుకుంటున్నారో కౌంటర్ దాఖలు చేయాలని చెబుతూ, విచారణ వాయిదా వేశారు.

'ఆపరేషన్ సిందూర్'పై డ్రాయింగ్ పోటీలు

సాక్షి, హైదరాబాద్ : ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్రంలో చేపడుతున్న 'సేవా పక్వాడా'లో భాగంగా.. ఈ నెల 18,19 తేదీల్లో అసెంబ్లీ నియోజకవర్గాల్లోని స్కూళ్లు, కాలేజీల్లో 'ఆపరేషన్ సిందూర్'పై డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.మేకల శిల్పారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ వంటి అంశాలపై పోటీలు ఉంటాయని తెలియజేశారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ కార్యక్రమాలకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించినట్లు ఆమె తెలియజేశారు. ఈ భేటీలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, పార్టీనేతలు చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు తెలుగు వర్సిటీ పురస్కారాలు

23, 24వ తేదీల్లో అవార్డు గ్రహీతలకు సత్కారాలు

నాంపల్లి (హైదరాబాద్): వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసిన 48 మంది ప్రముఖులను తెలుగు యూనివర్సిటీ 'కీర్తి పురస్కారాలు-2024'తో సత్కరిస్తోంది. విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల సంఘం ఆయా రంగాలకు చెందిన ప్రముఖులను పురస్కార గ్రహీతలుగా ఎంపిక చేసింది. వీరిలో కేతరాజు వరలక్ష్మి, కేతరాజు కామేశ్వరరావు (ఆధ్యాత్మిక సాహిత్యం), ఎం.వి.లోకనాథం (ప్రాచీన సాహిత్యం), ఉదారి నారాయణ (సృజనాత్మక సాహిత్యం), వరిగొండ కాంతారావు (కాల్పనిక సాహిత్యం), మరింగంటి లక్ష్మణాచార్యులు (అనువాద సాహిత్యం), రమేశ్ నారాయణ(అనువాదం), డాక్టర్ అమరవాది నీరజ (బాలసాహిత్యం), కె.వీణారెడ్డి (ఉత్తమ రచయిత్రి), డాక్టర్ కె.లావణ్య (ఉత్తమ రచయిత్రి), బైరెడ్డి కృష్ణారెడ్డి (వచన కవిత), కోటం చంద్రశేఖర్ (వచన కవిత), పాలపర్తి హవీల (పద్యరచన), కర్నాటి రఘురాములు గౌడ్(పద్య రచన), వేంపల్లి షరీఫ్ (కథ), చింతకింది శ్రీనివాస్(నవల), తోలేటి అరుణ (హాస్య రచన), డాక్టర్ యం.దేవేంద్ర (వివిధ ప్రక్రియలు), జలదంకి సుధాకర్ (ఉత్తమ నాటక రచయిత), మేకా రామకృష్ణ (ఉత్తమ నటుడు), డాక్టర్ బి.హెచ్.పద్మప్రియ(ఉత్తమ నటి), డాక్టర్ వెంకట్ గోవాడ (నాటకరంగంలో కృషి), చాగంటి కృష్ణకుమారి (జనరంజక విజ్ఞానం), తుమ్మల దేవ్‌రావు(పరిశోధన), ఆలేటి మోహన్ రెడ్డి (భాషాచందస్సు), డాక్టర్ ఎస్.రఘు (సాహిత్య విమర్శ), ఆవుసుల భాను ప్రకాష్(అవధానం), డాక్టర్ సత్యలక్ష్మి(మహిళాభ్యుదయం), పద్మ మధునాపంతుల (లలిత సంగీతం), బి.వి.దుర్గా భవాని(శాస్త్రీయ సంగీత విద్వాంసులు), గిద్దె రామనర్సయ్య(జానపద గాయకులు), ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి (జానపద కళలు), కంపల్లె రవిచంద్రన్ (జీవిత చరిత్ర), గోవిందరాజు చక్రధర్ (పత్రికా రచన), ఉమా మహేశ్వర పాత్రుడు (ఆంధ్ర నాట్యం), ఆర్.రత్నశ్రీ(కూచిపూడి నృత్యం), డి.శోభనాద్రి (వ్యక్తిత్వ వికాసం), బి.సాంబశివరావు(హేతువాద ప్రచారంలో కృషి), డాక్టర్ యాదగిరి (గ్రంథాలయ సమాచార విజ్ఞానం), సుభాషిణి (గ్రంథాలయకర్త), కమలాకర భారతీదేవి(సాంస్కృతిక సంస్థా నిర్వహణ), రమ్యశ్రీ (ఇంద్రజాలం), నెల్లుట్ల వెంకటరమణ(కార్టూనిస్ట్), డాక్టర్ పి.కల్పవల్లి(జ్యోతిషం), పురిమళ్ల సునంద (ఉత్తమ ఉపాధ్యాయులు), డాక్టర్ కె.శ్రీనివాసాచారి(చిత్రలేఖనం), దేవనపల్లి వీణావాణి (వచన కవిత), కుంట సదయ్య (జానపద కళలు), గడ్డం శ్యామల (గజల్)కు విశ్వవిద్యాలయంలో ఈ నెల 23, 24వ తేదీల్లో జరిగే ప్రత్యేక ఉత్సవంలో ఒక్కొక్కరికి రూ.5,116 నగదుతో సత్కరిస్తామని రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

చౌసింగా పిల్లలు



కృష్ణ జింక పిల్ల



బ్లూ గోల్డ్ మెకావ్ పిల్ల



జూలో కూనల కనువిందు

విశాఖలోని ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో వన్యప్రాణుల సంతానోత్పత్తి కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. మూడు నెలల కిందట పలు జంతువులు, పక్షులు పిల్లలకు జన్మనివ్వగా, తాజాగా మరికొన్ని వన్యప్రాణులకు పిల్లలు పుట్టాయి. ఇటీవల జూలో రెండు చౌసింగాలు (ఒక మగ, ఒక ఆడ), ఒక మగ కృష్ణ జింక పిల్ల, రెండు బ్లూ గోల్డ్ మకావ్ పక్షులు జన్మించాయని జూ క్యూరేటర్ జి. మంగమ్మ తెలిపారు. తల్లీపిల్లలు అన్నీ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం చౌసింగా, కృష్ణ జింక పిల్లలు వాటి ఎన్‌క్లోజర్‌లలో తల్లుల చెంత ఉత్సాహంగా ఆడుకుంటూ సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. - ఆరిలోవ



ఆకులు తింటున్న తల్లి జింక, తల్లి పాలు తాగుతున్న చౌసింగా జింక

బీచ్ శాండ్‌పై కూటమి కన్ను



- బీచ్ శాండ్ మైనింగ్‌కు తలుపులు తెరిచిన ప్రభుత్వం
- భీమిలిలో 90.15 హెక్టార్లను మైనింగ్ లీజుకి ఇచ్చేందుకు యత్నాలు
- ప్రైవేట్ సంస్థలతో కలిసి సముద్రపు ఇసుక పేరుతో ఖనిజాల దోపిడీకి కుట్ర
- మోనజైట్ అక్రమ రవాణా జరిగే అవకాశం
- భీమిలి పరిసరాల్లో అత్యంత విలువైన ఖనిజాలు
- దేశ ప్రయోజనాలకు ముప్పు కలిగించే మైనింగ్ ఆపాలంటున్న పర్యావరణవేత్తలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత నదీ ఇసుక, నీటి వనరులను దోచుకున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు సాగర తీరంపై దృష్టి సారించింది. బీచ్ శాండ్ మైనింగ్ పేరుతో భీమిలి తీరంలో భారీగా ఖనిజాల అక్రమ రవాణాకు పాల్పడేందుకు కుట్ర పన్నుతోంది. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ఆధ్వర్యంలో విశాఖ జిల్లాలోని భీమిలి ప్రాంతంలో 90.15 హెక్టార్ల సముద్ర తీరాన్ని ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీని ద్వారా విలువైన ఖనిజాలు దోపిడీకి గురవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ జేబులు నింపుకోవడానికి ఇలాంటి విధ్వంసకర కార్యకలాపాలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే మైనింగ్ కార్యకలాపాలకు టెండర్లు ఆహ్వానిస్తోంది.

మద్రాస్‌లో మైనింగ్ పేరుతో విధ్వంసం

గతంలో మద్రాసులో బీచ్ శాండ్ మైనింగ్ పేరుతో ప్రైవేటు సంస్థలు సముద్ర తీరాన్ని ధ్వంసం చేసి, దేశ భద్రతకు అవసరమైన ఖనిజాలను అక్రమంగా తరలించాయి. ఆ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చినప్పుడు, మద్రాసు హైకోర్టు తక్షణమే మైనింగ్‌ను నిలిపివేయాలని ఆదేశించి, ప్రభుత్వాలకు పర్యావరణ పరిరక్షణపై హెచ్చరికలు జారీ చేసింది. ఈ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా, ఏపీ ప్రభుత్వం తమ స్వలాభం కోసం పర్యావరణాన్ని పణంగా పెడుతోంది.



భీమిలి..ఖనిజాల నిక్షేపం

రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో భీమిలిలోనే అరుదైన, అత్యంత విలువైన ఖనిజాలు ఉన్నాయని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సర్వేలు వెల్లడించాయి. భీమునిపట్నం, పూడిమడక ప్రాంతాల్లో గార్నెట్, జిర్కోనియం, ఇలిమినెట్, సిలిమినైట్, రూటిల్, లికాక్సీన్, మోనజైట్ వంటి భారలోహాలు ఉన్నట్లు జీఎస్ఐ గుర్తించింది. భీమిలిలోని నిక్షేపాల విలువ దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ ఖనిజాలను ఏరోస్పేస్, వైద్య పరికరాలు, అణు రియాక్టర్ల వంటి వ్యూహాత్మక రంగాలలో ఉపయోగిస్తారు.



భీమిలిలో దొరికే ఖనిజాలు

మోనజైట్ పేరుతో దోపిడీకి కుట్ర

ఈ ఖనిజాల్లో అణుధార్మిక శక్తి కలిగిన మోనజైట్ ముఖ్యమైనది. దీనిని అణు విద్యుత్ అభివృద్ధికి ఇంధన వనరుగా వినియోగిస్తారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన చట్ట సవరణల మేరకు, అణుధార్మికత పరిమితంగా ఉన్న ఖనిజాలను విక్రయించుకోవచ్చని గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీన్ని అడ్డం పెట్టుకొని మోనజైట్ పేరుతో భారలోహాలను పెద్ద ఎత్తున అక్రమంగా తరలించేందుకు కుట్ర జరుగుతోందని, దీనికి ప్రభుత్వం సహకరిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మైనింగ్ వల్ల పర్యావరణానికి, దేశ భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్‌కు బీచ్ మైనింగ్ కట్టబెట్టడం దారుణం



శ్రీకాకుళం, విశాఖపట్నం సహా రాష్ట్రంలోని 19 ప్రాంతాల్లో బీచ్ శాండ్ మైనింగ్ కోసం ప్రైవేట్ సంస్థలకు లీజుకివ్వడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇది దేశ ప్రయోజనాలకు అత్యంత ప్రమాదకరం. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించాలి. తమిళనాడులో బీచ్ శాండ్ మైనింగ్ పేరుతో ప్రైవేట్ సంస్థలు మోనజైట్ వంటి విలువైన ఖనిజాలను అక్రమంగా తరలించిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. అణు అభివృద్ధిలో మూడో దశకు ఇంధన వనరుగా ఉపయోగపడే అత్యంత కీలకమైన మోనజైట్‌ను కోల్పోవడం దేశ భద్రతకు పెను ముప్పుగా పరిణమిస్తుంది. అటమిక్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ (డీఏఈ) ఇప్పటికే ఈ అంశంపై ఏపీ ప్రభుత్వానికి బీచ్ శాండ్ మైనింగ్‌కు అనుమతులు ఇవ్వవద్దని లేఖ కూడా రాసింది. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ విషయంపై దృష్టి సారించాలి.

– ఈఏఎస్ శర్మ, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి

అత్యవసర వైద్యానికి 'డ్రోన్' హారన్!

కర్నూలు ట్రిపుల్ఐటీడీఎం రూపొందించిన సరికొత్త వ్యవస్థ

- డ్రోన్ ఆధారిత హెల్త్ కేర్ మానిటరింగ్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టం తయారు
- దేశంలోనే మొదటిసారి వినూత్న వ్యవస్థను ఆవిష్కరించిన ట్రిపుల్ఐటీ ప్రొఫెసర్లు
- అత్యవసరమైన సమయంలో ఉపయోగంగా సరికొత్త వ్యవస్థ

కర్నూలు (సిటీ): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్(ట్రిపుల్ ఐటీ డీఎం) సాంకేతిక విద్య, పరిశోధనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. దేశంలో ప్రముఖ ట్రిబుల్ ఐటీగా గుర్తింపు పొందింది. సరికొత్త ఆవిష్కరణలతో దూసుకెళ్తోంది. డ్రోన్ టెక్నాలజీతో దేశంలో ఎక్కడా లేని విధంగా కర్నూలు ట్రిపుల్ఐటీడీఎంలో నూతన ఆవిష్కరణచేశారు. ఇన్క్యుబేట్ అయిన ట్రిగుణ్ రోటోటిక్స్ సిస్టమ్ ప్రైవేటు లిమిటెడ్ స్టార్టప్ కింద డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ అనే సరికొత్త వ్యవస్థను రూపొందించారు. ఈ వ్యవస్థ రూపకల్పనలో ట్రిపుల్ఐటీ ఈసీఈ ఆచార్యులు డాక్టర్ కృష్ణ నాయక్, డాక్టర్ ఎం. రవికుమార్(మెకానికల్ ఇంజినీరింగ్), రాయలసీమ యూనివర్సిటీకి చెందిన ఖాసిఫా అంజుమ్ కీలక పాత్ర పోషించారు. అనువుకాని స్థలంలో అత్యవసరమైన సమయంలో ఈ విధానంతో సులువుగా వైద్య సేవలు అందించవచ్చు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగిన సమయంలో క్షతగాత్రులను చికిత్స కోసం తరలించే సమయంలో రోడ్లలో డ్రోన్ ద్వారా హారన్ కొడుతూ ట్రాఫిక్ క్లియర్ చేయవచ్చు. డ్రోన్లను ఉపయోగించి రోగుల ఆరోగ్యాన్ని డాక్టర్ పర్యవేక్షించేందుకు చక్కగా ఉపయోపడుతుంది ఈ వ్యవస్థ. ఇది మందులు, వైద్య పరికరాలను సుదూర ప్రాంతాలకు సరఫరా చేయడానికి ఉపయోగపడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించడానికి, కొండల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు మందులు, అత్యవసరమైన సమయంలో రక్తం వంటివి పంపించడానికి ఉపయోగించబడుతుంది. ఈ వ్యవస్థలను భారతదేశంలోనే మొట్టమొదటిసారి కర్నూలు ట్రిపుల్ ఐటీడీఎం ఆచార్యులు రూపొందించారు. ఈ వ్యవస్థ సుదూర గ్రామీణ ప్రాంతాలకు ఆరోగ్య సేవలను అందించడంలో కీలకపాత్ర పోషించనున్నాయి. దీని పని తీరుపై ప్రస్తుతం డెమో ఇచ్చారు.



ట్రిపుల్ఐటీడీఎం వారు తయారు చేసిన డ్రోన్

ఉపయోగాలు ఇవీ..

- డ్రోన్‌ను పూర్తిగా ఆటో మేటిక్, మాన్యువల్ క్యాంట్రోల్ మోడ్‌లో నడపవచ్చు.
- డాక్టర్ ఆసుపత్రి నుంచే అంబులెన్స్‌లోని రోగి స్థితిని పర్యవేక్షణ చేసి, సూచనలతో అంబులెన్స్ ఆపరేటర్ రోగికి ఫస్ట్ ఎయిడ్ అందించగలరు.
- రోగిని సరైన ఆసుపత్రికి తక్షణ తరలింపుకు ఈ వ్యవస్థ సాయం చేస్తుంది.
- సుదూర ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాలకు మందులు, రక్తం వంటి ముఖ్యమైన వైద్య సామాగ్రిని డ్రోన్ల ద్వారా వేగంగా చేర్చవచ్చు.
- అత్యవసర పరిస్థితుల్లో, ప్రజల ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి, సహాయాన్ని అందించడానికి డ్రోన్లను ఉపయోగించవచ్చు.
- వైద్య లాజిస్టిక్‌ను సమర్థవంతంగా నిర్వహించడానికి డ్రోన్ ఆధారిత ఆరోగ్య సంరక్షణ అవసరం.
- డ్రోన్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసరమైన సేవలు అందించేందుకు, అంతరాయం కలుగుతుందని ప్రజలకు తెలియజేసేందుకు డప్పు కొట్టేందుకు సైతం చక్కగా ఉపయోగపడుతుంది.

వామ్మో.. పాము!


వాతావరణ మార్పులతో పెరుగుతున్న పాముల ముప్పు

- గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కూలీలకు అతిపెద్ద ముప్పు
- నీటి వనరులు మారిపోతుండటమే కారణం
- ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాలకు విస్తరిస్తున్న పాముల ఆవాస ప్రాంతాలు
- పాము కాట్లతో దేశంలో ఏటా 60 వేల మంది మృత్యువాత
- 'బిగ్ ఫోర్' స్నేక్స్‌తోనే తీవ్ర ప్రమాదం



వాతావరణ మార్పులతో విషపూరిత పాముల హాట్‌స్పాట్లు కూడా మారే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పుడున్న పాముల హాట్‌స్పాట్లు త్వరలో ఉత్తర, ఈశాన్య రాష్ట్రాలకు వ్యాపించే అవకాశాలు పెరుగుతున్నట్టు తాజా అధ్యయనంలో తేలింది. ప్రస్తుతం ఏపీ, ఉత్తరప్రదేశ్, కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, మహారాష్ట్ర పాముకాటు మరణాలకు హాట్‌స్పాట్లుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో పాముకాట్ల తీవ్రత చాలా ఎక్కువ. దేశంలో పాముకాటు వల్ల ఏటా 60 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇది ప్రపంచంలోనే అత్యధికం. ఇప్పుడు వాతావరణ మార్పులతో ఈ ముప్పు ఉత్తర, ఈశాన్య రాష్ట్రాలకు వ్యాపిస్తోందని పీఎల్ఓస్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనంలో వెల్లడైంది. - సాక్షి, అమరావతి

సాధారణంగా వానాకాలంలో పాముకాటు మరణాలు ఎక్కువగా నమోదవుతుంటాయి. వర్షాకాలం అయిపోగానే ఇలాంటి కేసులు తగ్గిపోతాయి. అయితే, రానున్న కాలంలో వాతావరణ మార్పుల కారణంగా భారత్‌లో పాముకాటు మరణాలు మరింత పెరిగే అవకాశం ఉందని తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, ఈశాన్య భారతాన్ని పాముల బెడద వణికించనుందని 'పీఎల్ఓ'స్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం హెచ్చరిస్తోంది.



రక్త పింజరి

భూమి వేడెక్కుతుండటంతో..

వేడెక్కుతున్న భూమి, అస్థిర వర్షాలు, వాతావరణ మార్పులతో భూమి మరింతగా వేడెక్కుతోంది. వర్షాలు అస్థిరంగా కురుస్తున్నాయి. దీంతో పాముల జీవన విధానం గందరగోళంగా మారుతోంది. పాములు చల్లని లేదా వెచ్చని ప్రాంతాల్లో జీవించడానికి ఇష్టపడతాయి. భూమి వేడెక్కడంతో ఇప్పటివరకు చల్లగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలైన హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ తదితర ప్రాంతాలు పాములకు కొత్త ఆవాసాలుగా మారుతున్నాయి. వర్షాలు ఎక్కువైనా, తక్కువైనా పాములు తమకు ఆహారంగా దొరికే ఎలుకలు, చిన్న జంతువులు ఉన్న చోటికి వెళ్తాయి. అస్థిర వర్షాల వల్ల పొలాలు, అడవులు, నీటి వనరులు మారిపోయి అవి గ్రామాలు, పట్టణాలకు వస్తున్నాయి. అడవులు నరికివేత, నగరాలు విస్తరించడం, భూమి ఉపయోగంలో మార్పుల వల్ల పాములు తమ సహజ ఆవాసాలను వదిలి మనుషులు ఉండే ప్రాంతాలకు వస్తున్నాయి. దీనివల్ల పాముకాట్ల బెడద పెరుగుతోంది.



కట్లపాము

'బిగ్ ఫోర్' స్నేక్స్‌తోనే బెడద

దేశంలో నాలుగు విషపూరిత పాముల వల్ల మరణాలు ఎక్కువగా ఉంటున్నాయి. వీటిని 'బిగ్ ఫోర్' స్నేక్స్‌గా పిలిచే ఇండియన్ కోబ్రా (నాగుపాము), కామన్ క్రైట్ (కట్లపాము), రస్సెల్స్ వైపర్ (రక్త పింజరి), సా–స్కేల్డ్ వైపర్ (చిన్న పింజరి) వల్లే మన దేశంలో అత్యధిక పాముకాటు మరణాలు సంభవిస్తున్నాయి. వీటి కాటువల్ల విషం వేగంగా శరీరంలో వ్యాపిస్తుంది. సకాలంలో చికిత్స అందకపోతే మరణానికి దారి తీస్తుంది. మన రాష్ట్రంలోని కోస్తా ప్రాంతాల్లోని పొలాల్లో నాగు పాములు, రక్త పింజరి, కట్ల పాములు ఎక్కువ. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కింగ్ కోబ్రాలు కనిపిస్తాయి. అయితే.. కోస్తా జిల్లాల్లోనే పాముకాట్ల బెడద తీవ్రంగా ఉంటోంది.

కొత్త ఆవాసాలకు పాములు

వాతావరణం మార్పులతో పాముల ఆవాసాలు చెదిరిపోయి అవి ఇతర ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. రాబోయే 50 ఏళ్లలో ఈ పాములు ఉత్తర, ఈశాన్య రాష్ట్రాలకు మరింతగా విస్తరించే అవకాశాలున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. వేడెక్కుతున్న అక్కడి వాతావరణం ఆ ప్రాంతాలను పాములకు అనుకూలంగా మారుస్తోంది. వాతావరణ మార్పులతో పొలాలు, నీటి వనరులు మారుతుండటంతో అక్కడ ఉండే ఎలుకలు, చిన్న పాములను ఆహారంగా తీసుకునేందుకు విషపూరిత పాములు ఇళ్లు, పొలాల సమీపంలోకి వస్తున్నాయి. అందువల్లే పాముకాట్లు పెరుగుతున్నాయి. ఫలితంగా వ్యవసాయ భూముల వద్ద రైతులు, కూలీలు, పిల్లలు పాముకాట్ల బారినపడుతున్నారు.



చిన్న పింజరి


ఆస్పత్రులపై ఒత్తిడి

పాముకాటు చికిత్సకు అవసరమైన యాంటీ వీనం ఔషధాలు గ్రామీణ ఆస్పత్రుల్లో తక్కువగా ఉంటున్నాయి. దీంతో ఆస్పత్రులకు వచ్చినా పాముకాటుకు గురైన వారు చనిపోతున్నారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో యాంటీ వీనం ఇంజెక్షన్లు, శిక్షణ పొందిన వైద్యుల అవసరం ఎక్కువవుతోంది. పాముకాటు గురించి గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు మెరుగైన ఆరోగ్య సౌకర్యాలతో ఈ పరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుందని పీఎల్ఓస్ అధ్యయనం స్పష్టం చేస్తోంది.

నోరు బోసి పోదు

వయసు పెరిగినా...

వృద్ధులకు వయసు పరంగా వచ్చే అనేక సమస్యలతో పాటు పళ్ల సమస్యలూ తప్పవు. వృద్ధుల పళ్లకు సంబంధించిన వైద్యశాస్త్రాన్ని 'జీరియాట్రిక్ డెంటిస్ట్రీ' లేదా 'జీరియోడాంటిక్స్' అంటారు. ఇందులో వృద్ధుల పళ్లకు వచ్చే వైద్య, ఆరోగ్య సమస్యలు, వాటి నిర్ధారణ, చికిత్స వంటి అంశాలు ఉంటాయి. పళ్లు కోల్పోకుండా కేవలం వాటికి వచ్చే సమస్యలను మాత్రమే పోగొట్టుకోవడం ఎలాగో చెప్పే కథనమిది.





డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి
సీనియర్ డెంటల్ స్పెషలిస్ట్

నిర్వహణ: యాసీన్

ఇటీవలి వైద్యవిజ్ఞానం బాగా పురోగతమించింది. దాంతో గతం సగటుతో పోలిస్తే ప్రజల సగటు ఆయుర్దాయమూ బాగా పెరిగింది. ప్రజలు చాలాకాలం జీవిస్తున్నారు. దాంతో సమాజంలో వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఒకనాడు ముసలితనానికి బోసినోరు ఒక ప్రతీక. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. జీవితంలో కష్టపడాల్సినంత పడి... తమ వృద్ధాప్యాన్ని ఒక సంతోషకరమైన మజిలీగా చేసుకుంటూ ఇకపై జీవితాన్ని అనుభవించాల్సిందంతా ఈ వయసునుంచే అనే భావన పెరగడంతో ఆ వయసునూ ఆనందమయం చేసుకుంటున్నారు. ఫలితంగా ఒకనాడు పళ్లూడిపోయే వృద్ధులకు బదులు మంచి పలువరస ఉన్నవారే ఎక్కువగా కనబడుతున్నారు. ఎందుకంటే... ఎంతగా వయసు పైబడినప్పటికీ పళ్లు, చిగుర్ల సమస్యలు రాకుండా చూసుకుంటే పళ్లు ఎన్నాళ్లైనా గట్టిగానే ఉంటాయి. ఇందుకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో చూద్దాం.

వృద్ధాప్యంలో వచ్చే పంటి సమస్యలు/కారణాలు

- సాధారణంగా వయసు పెరుగుతున్నకొద్దీ పళ్లు కూడా వదులైపోతాయన్నది చాలామందిలో ఉండే ఓ అపోహ. ఆ వయసులో బీపీ, షుగర్ లాంటి సమస్యలుంటే పళ్లు వాటంతట అవే ఊడిపోతాయని అనుకుంటారు. ఆ పరిస్థితి కోసం మానసికంగా సిద్ధపడుతుంటారు. కానీ ఇది వాస్తవం కాదు. పళ్లకు లేదా చిగుర్లకు సంబంధించన జబ్బులు వస్తేనే పళ్లు ఊడిపోవడమో లేదా వదులైపోవడమో లేదా తీసేయాల్సిన పరిస్థితి ఎదురుకావడమో జరుగుతుంది. నోటి జబ్బులు రానంతవరకు పళ్లు జీవితకాలం దృఢంగానే ఉంటాయి.

- **వృద్ధాప్యంలో దంతాలకు వచ్చే సమస్యలు...**
సాధారణంగా వృద్ధాప్యంలో వచ్చే కొన్ని దంత సమస్యలు పంటి మూలంలో వచ్చే పిప్పిపళ్లు (రూట్‌కేరిస్), పళ్లు అరిగిపోవడం (అట్రిషన్), చిగుర్లవ్యాధులు (పెరియోడాంటల్ డిసీజ్), పళ్ల మధ్య అక్కడోపన్ను, ఇక్కడోపన్ను కోల్పోవడం కారణంగా వచ్చే సందులు (ఎడెంట్యులిజమ్), పైవరస పళ్లు, కిందివరస పళ్ల గట్టిదనంలో నాణ్యత లేకపోవడం (పూర్ క్వాలిటీ ఆఫ్ అల్వియొలార్ రిడ్జ్), కట్టుడుపళ్లు సరిగా అమర్చకపోవడం, దవడల పక్కన ఉండే మృదువైన మ్యూకోజాలో పుండ్లు, నోటిలో పుండ్లు, నోటిలో తడి తక్కువ కావడం (గ్జీరోస్టోమియా), నోటి క్యాన్సర్లు వంటివి.

- **చేజేతులారా తెచ్చిపెట్టుకునే సమస్యలు...**
ఇక మరికొన్ని యౌవనంలో ఉన్నప్పుడు మనలో కొందరు వారంతట వారే చేజేతులారా తెచ్చిపెట్టుకునేవే ఎక్కువ. ఉదాహరణకు వయసులో ఉన్నప్పుడు పొగతాగడం, పొగాకు నమలడం, పాన్‌పరాగ్, గుట్కా, వక్కపొడి నమలడం వంటి పంటికి చేటు చేసే అలవాట్లు. ఈ అలవాట్లను మానకపోవడం, అలా నిర్లక్ష్యం చేస్తూపోవడం వల్ల వృద్ధాప్యంలో పళ్లు తీవ్రంగా దెబ్బతింటాయి.

- **వృద్ధాప్యంలో వ్యాధినిరోధక శక్తి తగ్గడంతో...**
యౌవనంతో పోలిస్తే వృద్ధాప్యదశలో వ్యాధినిరోధకశక్తి ఎంతోకొంత తగ్గుతుంది. కాబట్టి అప్పటివరకూ నిద్రాణంగా ఉన్న కొన్ని సమస్యలు పళ్లపై ప్రభావం చూపుతాయి.

- **వృద్ధాప్యంలో వాడుతూ ఉండే మందుల కారణంగా...**
పెద్దవయసు వచ్చేనాటికి చాలామందిలో హై-బీపీ, షుగర్ సమస్యలు కనిపిస్తాయి కాబట్టి వాటికోసం మందులు వాడుతుంటారు. ఇలా... బీపీ, షుగర్‌లను అదుపులో పెట్టేందుకు వాడే మందులు, మానసిక సమస్యలకోసం వాడే యాంటీ సైకోటిక్, యాంగ్జైటీని తగ్గించడం కోసం వాడే యాంగ్జియొలైటిక్స్... ఇలాంటి మందుల కారణంగా నోటిలో లాలాజల స్రావాలు తగ్గుతాయి. దాంతో అవి నోటిని పొడిబారిపోయేలా చేస్తాయి. ఈ అంశం కూడా దంతసమస్యలకు కారణమవుతుంది.

- **వృద్ధాప్యంలో సంపాదన లేమితో :**
వృద్ధాప్యంలో చాలామందికి మునుపు ఉన్నంత సంపాదన ఉండదు. ఇలా తమకు ఉండే ఆదాయవనరులు తగ్గిపోవడం, దానికి తోడు కుటుంబసభ్యుల నుంచి అందాల్సినంత ప్రోత్సాహం ఉండకపోవడమనే అంశం కూడా దంత సమస్యలకు ఓ పరోక్ష కారణమవుతుంది.
పైన పేర్కొన్న అనేక సమస్యల కారణంగా పళ్లు వదులైపోవడంతో వృద్ధాప్యంలో ఆహారం తీసుకోవడంలో తీవ్రమైన ఇబ్బందులు తలెత్తుతాయి. అంతేకాదు.. పళ్ల వల్లనే మానవుల్లో ఉచ్చారణ స్పష్టంగా ఉంటుంది. పళ్లలో సమస్యల కారణంగా భాషలో స్పష్టతా లోపించి కమ్యూనికేషన్‌కూ ఇబ్బందులు కలుగుతాయి.

వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలూ - పళ్లపై వాటి ప్రభావాలు



- **డయాబెటిస్... పళ్ల సమస్యలు :** ఈ రెండు అంశాలూ ఒకదాని కారణంగా మరొకటి కనిపిస్తూ ఉంటాయి. అంటే డయాబెటిస్ ఉన్నవారిలో పళ్లూ, చిగుళ్ల సమస్యలు ఎక్కువ. అలాగే పళ్లూ చిగుళ్ల సమస్యలు ఉన్నవారిలో... ఆ అంశాలు రక్తంలోని గ్లూకోజ్ పెరిగేలా చేసి, డయాబెటిస్‌కు కారణమవుతాయి. అందుకే డయాబెటిస్ ఉన్నవారూ పంటి జబ్బుల విషయంలో జాగ్రత్తపడాలి. లేనివారూ పళ్లను శుభ్రంగా ఉంచుకుని డయాబెటిస్‌ను రాకుండా నివారించుకోవాలి. డయాబెటిస్ ఉన్నవారికి సీరియస్ చిగుర్ల సమస్యలు, దంతక్షయం, లాలాజల గ్రంధులు సరిగా పనిచేయకపోవడం, ఫంగల్ ఇన్ఫెక్షన్స్, లైకెన్‌ప్లానస్, లైకెనాయిడ్ రియాక్షన్, నోటి ఇన్ఫెక్షన్లు అంత తేలిగ్గా తగ్గకపోవడం వంటి సమస్యలు వస్తుంటాయి.

నివారణకు సూచనలివి : పళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి ఆర్నెల్లకోమారు దంతవైద్యుడిని కలిసి క్లీనింగ్ చేయించుకోవాలి. డయాబెటిస్ ఉన్నవారు రక్తంలో గ్లూకోజ్ పాళ్లను సమర్థంగా నియంత్రించుకుంటూ ఉండేలా తగిన మందులు తీసుకోవాలి. ఒత్తిడి లేకుండా చూసుకోవలి. డయాబెటిస్ ఉన్నవారు డాక్టర్లు సూచించినవిధంగా తాము తీసుకోవాల్సిన ఆహారాన్ని తీసుకోవాలి.

గుండెజబ్బులూ... చిగుర్ల వ్యాధులు...



ఇటీవలి కొత్త పరిశోధనల వల్ల నోటి ఆరోగ్యానికీ, గుండెజబ్బులకూ దగ్గరి సంబంధం ఉందని తేలింది. సాధారణంగా చిగుర్ల వ్యాధి ఉన్నవాళ్లలో... తమకు పెద్దగా నొప్పి తెలియకుండానే పంటికింద ఉండే గులాబిరంగు చిగురుభాగం నెమ్మదిగా కిందికి కిందికి తగ్గుతూ పోతుంది. కానీ పంటి కింది ఎముక భాగం కూడా నాశనమయ్యే దశకు చేరినప్పుడు, అక్కడ చేరిన బ్యాక్టీరియా రక్తప్రవాహంలో కలుస్తుంది. దాంతో అది గుండె కండరాన్ని దెబ్బతీసి, గుండెజబ్బులకూ దారితీసే ప్రమాదం ఉందని ఇటీవలి అనేక పరిశోధనల వల్ల తేలింది.

ఇక పంటి మీద ఉండే పాచి/గారలో ఉండే సూక్ష్మక్రిములు రక్తనాళాలల్లోకి చేరడం వల్ల రక్తనాళాలు సన్నబడి కూడా రక్తప్రవాహ సంబంధమైన (వాస్క్యులార్ డిసీజెస్) రావచ్చు. పెద్దవయసు వారంతా తెలుసుకోవాల్సిన మరో అంశం ఏమిటంటే దీర్ఘకాలంగా ఉండే చిగుర్ల వ్యాధుల వల్ల అకస్మాత్తుగా వచ్చే గుండెపోటు ముప్పు కూడా ఉంటుంది.

నివారణకు సూచనలివి : ఈ సమస్య నివారణకు చేయాల్సిందల్లా సరైన రీతిలో బ్రషింగ్, మన ఆహారాన్ని బాగా నమిలి మింగడం. ఈ రెండూ శ్రద్ధగా చేస్తూ ఉంటే... పెద్దవయసు వారిలో చాలావరకు గుండెజబ్బులనూ, గుండెపోటునూ నివారించవచ్చు.



- **పక్షవాతం - పంటి జబ్బులు:** పక్షవాతానికి, పంటిజబ్బులకూ నేరుగా సంబంధం లేకపోయినా... గుండెజబ్బులకు ఉన్న సంబంధమే ఇక్కడా పనిచేస్తుంటుంది. ఉదాహరణకు పంటికి పట్టే గార/పాచి (ప్లాక్) వంటివి, పంటి జబ్బుల వల్ల రక్తప్రవాహంలో పేరుకుపోయే సూక్ష్మక్రిముల వల్ల రక్తనాళాలు సన్నబడటం, రక్తనాళాల్లో ప్లాక్ పేరుకుని అది రక్తం సాఫీగా ప్రవహించకుండా అడ్డుపడటం జరుగుతాయన్న విషయం తెలిసిందే. ఇదే ప్రమాదం గుండెకు సంబంధించిన ధమనుల విషయంలో జరిగితే అది గుండెపోటుకు దారితీస్తుంది. ఒకవేళ అదే మెదడుకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల (ధమనుల) విషయంలో జరిగితే అది పక్షవాతానికి దారితీసే ప్రమాదముంటుంది.

నివారణకు సూచనలివి : పంటి జబ్బులను నివారించుకోవడం లేదా నిరోధించుకోవడం; పంటి సమస్యలను దూరం చేసుకోవడం; పంటి శుభ్రతను పాటించడం (డెంటల్ హైజీన్) వల్ల ఒకవైపు గుండెజబ్బులనూ మరోవైపున పక్షవాతాన్నీ నివారించుకోగలమని గుర్తుంచుకోవాలి.

చివరగా... ఒకవేళ నివారణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోకపోయినవారు, దురదృష్టవశాత్తూ తమ పళ్లు కోల్పోయినప్పటికీ... వాళ్ల దవడ ఎముక ఎంత సన్నగా ఉన్నప్పటికీ, కృత్రిమ దంతాలు అమర్చడానికి ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఉన్నా మనకు అందుబాటులో ఉన్న నేటి డెంటిస్ట్రీలో అందుబాటులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కృత్రిమ దంతాలను అమర్చడం, ఎలాంటి దంతసమస్యలకైనా పరిష్కారాలను అందించడమూ పూర్తిగా సాధ్యమయ్యే విషయమే.



ఆర్థరైటిస్... పంటి సమస్యలు


దాదాపుగా 65 ఏళ్లుదాటిన 50 శాతం మందిలో ఎముకలకు సంబంధించిన జబ్బు అయిన ఆర్థరైటిస్ కనపడుతుంది. దీనివల్ల ఎముకల మధ్య రాపిడి, ఎముకల సాంద్రత తగ్గి, పెళుసుగా మారడం, ఫలితంగా అవి తేలిగ్గా విరిగిపోవడంలాంటివి తరచూ జరుగుతుంటాయి. ఈ జబ్బులో కూడా ఎముకలు, కీళ్ల మధ్య నొప్పిని నివారించడానికి నాన్ స్టెరాయిడల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ (ఎన్ఎస్ఏఐడీ మందులు) వాడటం సాధారణం. ఈ ఆర్థరైటిస్ సమస్య ఉన్నవారికి సాధారణంగా మెథోట్రెక్సేట్ అనే మందులను ఉపయోగిస్తారు. ఇవన్నీ నోటి ఆరోగ్యాన్ని ప్రభావితం చేసేవే. ఉదాహరణకు మెథోట్రెక్సేట్ మందులు వాడే వాళ్ల నోళ్లలో పుండ్లు (అల్సర్స్) వస్తుంటాయి.

ఇక రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు వాడే గోల్డ్ సోడియమ్ థయోమెలనేట్ అనే మందు వల్ల జింజివైటిస్ అనే చిగుర్లకు వచ్చే ఇన్ఫెక్షన్, గ్లాసైటిస్ అనే నాలుక ఇన్ఫెక్షన్, స్టొమటైటిస్ అనే నోటి ఇన్ఫెక్షన్‌లు వస్తాయి. ఇక పై మందుల వాడకం వల్ల రక్తంలోని తెల్లరక్తకణాలు తగ్గడం, ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గడం వంటి దుష్పరిణామాలూ ఉంటాయి. కాబట్టి వాటి వల్ల రోగనిరోధకశక్తి తగ్గడం, పంటి చిగుర్ల నుంచి రక్తస్రావం వంటి పరిణామాలూ కనిపిస్తుంటాయి.

లాలాజల గ్రంథులు... నోటి సమస్యలు

నోటిలో ఊరుతూ ఉండే లాలాజలం (సలైవా) వల్ల నోరు ఎప్పుడూ తడిగా ఉంటుంది. ఇది నిత్యం నోటిలో ఉండే ఆహారపదార్థాలను కడిగేస్తూ ఉంటుంది. నోరు పొడిబారిపోవడం అనే లక్షణం డయాబెటిస్ బాధితులతోబాటు, కొన్ని వ్యాధుల్లో మందులు తీసుకునేవారికి, తల, గొంతు క్యాన్సర్ కారణంగా రేడియేషన్ చికిత్స తీసుకున్నవారికి లాలాజలం తగ్గుతుంది. నోటిలో తగినంత లాలాజలం లేకపోవడం వల్ల బ్యాక్టీరియా పెరిగిపోతుంది. నోరు పొడిబారిపోవడం దీర్ఘకాలంపాటు సాగితే నోటిలోని మృదుకణజాలం దెబ్బతిని, నొప్పి వస్తుంది. దాంతో దంతక్షయం (టూత్ డికే), చిగుర్ల వ్యాధులకు అవకాశాలు పెరుగుతాయి.





హైబీపీ - పంటిసమస్యలు

ఈ రెండు అంశాలకూ మధ్య సంబంధం ఉంది. హై-బీపీతో బాధపడే వారిలో వాళ్ల అధిక రక్తపోటు అనే అంశం గుండె జబ్బులకూ, గుండెపోటుకు దారితీయకుండా కొన్ని మందులు ఇస్తుంటారన్న విషయం తెలిసిందే. పంటి సమస్యలు ఉన్నవారికి ఇచ్చే నాన్‌స్టెరాయిడల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ (ఎన్ఎస్ఏఐడి మందుల) వల్ల... హై-బీపీ ఉన్నవారు తాము తీసుకునే మందుల ప్రభావం తగ్గుతుంది. దీంతోపాటు మరో ప్రమాదమూ ఉంది. హై-బీపీ ఉన్నవారికి ఇచ్చే మందుల వల్ల నోటిలో తడి తగ్గి అది జీరోస్టోమియా అన్న కండిషన్‌కు దారితీస్తుంది. ఈ జీరోస్టోమియా కూడా పంటి సమస్యలను పెంచడమే కాకుండా... పలువరసలో అమర్చిన కృత్రిమ దంతాలకూ, స్క్రూల వంటి అనుబంధ అంశాలకూ నోటిలోని మృదుకండరాలకూ మధ్య ఘర్షణ (ఫ్రిక్షన్)ను పెంచి మరిన్ని పంటి సమస్యలకు దారితీసేలా చేస్తుంది.

క్యాల్షియమ్ బీటా బ్లాకర్స్ అనే మందులు వాడే పది శాతం మందిలో దాని తాలూకు సైడ్‌ఎఫెక్ట్‌గా జింజివల్ హైపర్‌ప్లేసియా అనే చిగుర్ల వ్యాధి కనిపిస్తుంది. ఈ వ్యాధి మందులు మొదలుపెట్టిన కొన్ని నెలల్లోనే ఇది కనిపిస్తుందని అనేక పరిశీలనల్లో తేలింది.

నివారణకు సూచనలివి...
హైబీపీకి మందులు వాడేవారు తమకు ఎదురైన అనుభవాన్ని తమ ఫిజీషియన్‌ను వివరించి, తరచూ తమ దంతవైద్యులను కూడా కలిసి తమ మందులను వారిచేత కూడా సమీక్షింపజేసుకుంటూ ఉండాలి. సరైన నోటి శుభ్రత పాటిస్తూ డయాబెటిస్‌ను సాధ్యమైనంతవరకు నివారించుకుంటూ ఉండటం మేలు.

కొన్ని సూచనలూ - మరికొన్ని చికిత్సలు...

లాలాజల స్రావాలు తగ్గి తరచూ నోరు పొడిబారుతుంటే తక్షణం దంతవైద్యులను కలవాలి. వారు కొన్ని పుక్కిలించే ద్రావణాలు, పైపూత (టాపికల్)గా వాడదగ్గ ఫ్లోరైడ్ ద్రావణాలను సూచిస్తారు. కొన్ని చక్కెర లేని గమ్స్, మింట్స్ వంటివి నోటిలో తగినంత లాలాజలం ఊరేలా చేస్తాయి. దాంతోపాటు తరచూ కొద్దికొద్దిగా నీళ్లు తీసుకుని గుటక వేస్తుండటం, కరిగే ఐస్‌ను చప్పరించడం కూడా నోరు పొడిబారడాన్ని తగ్గిస్తాయి. ఇలా నోరు పొడిబారే వాళ్లు కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీలాంటి డ్రింక్స్‌ను చాలా తక్కువగా తీసుకోవడం, ఆల్కహాల్‌ను మానివేయడం మేలు.

ఇజ్రాయెలీ ఇన్వెస్టర్లకు నిబంధనల సడలింపు

ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం



న్యూఢిల్లీ: ఇజ్రాయెలీ ఇన్వెస్టర్లకు సంబంధించి 'లోకల్ రెమెడీస్ ఎగ్జాషన్' నిబంధన వ్యవధిని అయిదేళ్ల నుంచి ప్రస్తుతం మూడేళ్లకు కుదిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇజ్రాయెల్‌తో సోమవారం ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం (బీఐఏ) కుదుర్చుకుంది. ఈ నిబంధన ప్రకారం, వివాదాలేవైనా తలెత్తితే విదేశీ ఇన్వెస్టర్లు ముందుగా ఆతిథ్య దేశంలోని న్యాయ వ్యవస్థ ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలి. ఆ తర్వాతే అంతర్జాతీయ ఆర్బిట్రేషన్‌కి వెళ్లాలి. సాధారణంగా భారత్ ఇందుకోసం అయిదేళ్ళ వ్యవధిని నిర్దేశిస్తోంది. తాజాగా కుదుర్చుకున్న బీఐఏలో గతానికి భిన్నంగా పోర్ట్‌ఫోలియో పెట్టుబడులను కూడా చేర్చారు. యూఏఈతో భారత్ కుదుర్చుకున్న బీఐఏ తరహాలోనే ఇజ్రాయెల్ బీఏఐ కూడా ఉన్నట్లు ఒక అధికారి తెలిపారు. భారత్ ఈ డీల్ కుదుర్చుకున్న తొలి ఓఈసీడీ (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కో–ఆపరేషన్, డెవలప్‌మెంట్) కూటమి దేశం ఇజ్రాయెల్ కావడం గమనార్హం. ఇటు భారత సార్వభౌమాధికారానికి భంగం వాటిల్లకుండా అటు ఇన్వెస్టర్ల ప్రయోజనాలను పరిరక్షించే విధంగా ఈ ఒప్పందం ఉంటుంది. 2000 ఏప్రిల్ నుంచి 2025 జూన్ వరకు ఇజ్రాయెల్ నుంచి భారత్‌కి 337.77 మిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయి.

టూ వీలర్స్.. రయ్!

విక్రయాలు 5-6% పెరుగుతాయ్

- ప్యాసింజర్ వాహన అమ్మకాల్లో 2–3% వృద్ధి
- జీఎస్‌టీ తగ్గింపుతో వాహనాలకు భారీ డిమాండ్
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి క్రిసిల్ రేటింగ్స్ అంచనా



ముంబై: జీఎస్‌టీ క్రమబద్ధీకరణ కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26)లో ద్విచక్ర వాహన విక్రయాల్లో 5–6%, ప్యాసింజర్ వాహన అమ్మకాల్లో 2–3% వృద్ధి నమోదు కావొచ్చని క్రిసిల్ రేటింగ్స్ నివేదికలో తెలిపింది. ఈ సెప్టెంబర్ 22 నుంచి 5%, 18% పన్ను శ్లాబులు మాత్రమే అమల్లో ఉంటాయంటూ జీఎస్‌టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయంతో ఆటోమొబైల్ రంగంలో డిమాండ్ మరింత పుంజుకుంటుందని క్రిసిల్ అంచనా వేసింది. జీఎస్‌టీ కోతతో దేశీయ ఆటోమొబైల్ ఇండస్ట్రీస్‌లో 90% వాల్యూమ్స్ కలిగిన టూ–వీలర్స్, ప్యాసింజర్ వాహనాలకు వరుసగా 2%, 1% డిమాండ్ పెరగనుందని వివరించింది. క్రిసిల్ రేటింగ్స్‌లో మరిన్ని విశేషాలు.....

- కోవిడ్ సంక్షోభం, ఆన్‌బోర్డ్ డయాగ్నస్టిక్ టూల్స్ II(ఓబీడీ2) తప్పనిసరి అమలు, ఎంట్రీ లెవెల్ కమ్యూటర్ బైక్‌లకు తగ్గిన డిమాండ్, ప్యాసింజర్ వాహన ధరలు భారీగా పెరగడం తదితర కారణాలతో ఆటో పరిశ్రమ ఇబ్బందులకు లోనవుతోంది. తాజాగా జీఎస్‌టీ కౌన్సిల్ తాజా నిర్ణయంతో వాహనాలకు డిమాండ్ ఊపందుకోవచ్చు.
- గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయాలు పెరగడం, సాధారణ వర్షపాత నమోదుతో పాటు ఈ ఏడాదిలో 15కి పైగా కొత్త కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడల్స్ మార్కెట్లోకి విడుదల పరిణామాలు డిమాండ్ పునరుద్ధరణకు మరింత తోడ్పడవచ్చు. అయితే పండుగ సీజన్‌లో డీలర్ల వద్ద వాడని పన్ను క్రెడిట్ల కారణంగా ఆర్థిక ఒత్తిడి ఏర్పడవచ్చు.
- అధిక అమ్మకాలు కంపెనీల సామర్థ్య వినియోగం, ఆపరేటింగ్ లీవరేజీల మెరుగుపరిచే అవకాశం కలిగిస్తుంది. దీని ఫలితంగా ఆటోమొబైల్ కంపెనీలకు బలమైన నగదు ప్రవాహాలు, మెరుగైన లాభాల మార్జిన్లు లభిస్తాయి. అదేవిధంగా, జీఎస్టీ తగ్గింపు తర్వాత 50–55 రోజుల ప్యాసింజర్ వాహనాల నిల్వలు తగ్గే అవకాశం ఉంది. ఇది వర్కింగ్ క్యాపిటల్ ఒత్తిడిని తగ్గించి, డీలర్ల నగదు ప్రవాహానికి మద్దతిస్తుంది.

''జీఎస్‌టీ తగ్గింపు లాభాల బదలాయింపుతో వాహన ధరలు 5–10% (చిన్న స్థాయి పీవీలపై రూ.30–60 వేలు, టూ వీలర్స్‌పై రూ.3,000 –7,000 తగ్గింపు) దిగివచ్చే వీలుంది. దీనికి తోడు పండుగ సీజన్, ఆటో కంపెనీలు కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలు, తక్కువ వడ్డీ రేట్లు, మెరుగైన కొనుగోలు సామర్థ్యం తదితర అంశాలు కలిసొచ్చి ఈ ద్వితీయార్ధంలో ఆటో పరిశ్రమ దూసుకెళ్తుంది'' అని క్రిసిల్ రేటింగ్ సీనియర్ డైరెక్టర్ అనుజ్ సేత్ తెలిపారు.

ఆటో పరిశ్రమపై జీఎస్‌టీ తగ్గింపు: కొత్త జీఎస్‌టీ ప్రకారం చిన్న కార్లు, 350 సీసీలోపు మోటార్‌సైకిళ్లపై 18 శాతం జీఎస్ పడనుంది. మధ్య, భారీ ప్యాసింజర్ వాహనాలపై పన్ను 3–7 శాతం వరకు తగ్గనుంది. ట్రాక్టర్లను సైతం 5 శాతం పరిధిలోకి తీసుకొచ్చారు. సంక్షిప్తంగా చిన్న కార్లు, బైకులు(350 సీసీ) ధరలు భారీగా తగ్గనున్నాయి. పెద్ద కార్లు, ఎస్‌యూవీలు కొద్ది మేర చవకగా మారాయి. అయితే పెద్ద (హై ఎండ్)బైకులు ధరలు భారీగా పెరిగాయి.

జీఎస్‌టీ తగ్గింపు తర్వాత వాహన ధరలు: జీఎస్‌టీ తగ్గింపు లాభాలు పూర్తి స్థాయి ప్రయోజనాన్ని కస్టమర్లకు బదలీ చేస్తే ధరలు 5 నుంచి 10% తగ్గుతాయి. చిన్న కార్లు రూ.60వేల వరకు, త్రీ వీలర్స్ రూ.15,000 నుంచి రూ.20వేల వరకు తగ్గొచ్చు. మీడియం, హెవీ వాణిజ్య వాహన ధరలు రూ.1 లక్ష నుంచి రూ.2.5 లక్షల తగ్గొచ్చు. యథావిధిగా 5% జీఎస్‌టీ కొనసాగింపుతో ఎలక్ట్రిక్ ప్యాసింజర్, త్రీ వీలర్స్ వాహన ధరలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపకపోవచ్చు.

ఆగస్టులో 3% పెరిగిన వాహన విక్రయాలు

ఆటో డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయ వాహన రిటైల్ విక్రయాలు ఆగస్టులో స్వల్పంగా 3% పెరిగాయని వాహన డీలర్ల సమాఖ్య (ఫాడా) గణాంకాలు వెల్లడించింది. మొత్తం ఆగస్టులో 19,64,547 వాహన రిజిస్ట్రేషన్లు కాగా, 2024 ఆగస్టులో ఇవి 19,10,312గా ఉన్నాయని ఫాడా తెలిపింది. జీఎస్‌టీ అమల్లోకి వస్తే ధరలు దిగి వస్తాయని కస్టమర్లు కొనుగోళ్లను వాయిదా వేసుకోవడంతో అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని పేర్కొంది. ''వేచి చూసే ధోరణి కారణంగా సెప్టెంబర్ ప్రథమార్థమంతా అమ్మకాలు అంతంత మాత్రమే ఉండొచ్చు. జీఎస్‌టీ విధానంపై స్పష్టత, పండుగ సెంటిమెంట్‌తో ఈ నెల అమ్మకాల్లో గణనీయమైన వృద్ధి ఉండొచ్చు'' అని ఫాడా అంచనా వేసింది.

- ప్యాసింజర్ విక్రయాలు గతేడాది ఆగస్టుతో పోలిస్తే 3,20,291 యూనిట్ల నుంచి స్వల్పంగా 0.93% పెరిగి 3,23,256 కు చేరాయి. మెరుగైన ఎంక్వైరీలు, పండుగ బుకింగ్స్‌తో ఆగస్టు ప్రథమార్థమంతా సానుకూల ధోరణి కన్పించింది. అయితే ఆగస్టు 15న ప్రధాని జీఎస్‌టీ సంస్కరణ ప్రకటనతో కస్టమర్లు కొనుగోళ్లు వాయిదా వేసుకున్నారని ఫాడా తెలిపింది.
- ద్వి చక్ర వాహనాల రిజిస్ట్రేషన్లు 2.17% పెరిగాయి. ఈ ఆగస్టులో మొత్తం 13,73,675 అమ్మకాలు జరిగాయి. గతడాది ఇదే నెలలో విక్రయాలు 13,44,380 యూనిట్లుగా ఉన్నాయి. ఈ విభాగపు ఎంక్వైరీలు ఇప్పటికీ బలంగా ఉన్నాయి. ఓనమ్, గణేశ్ చతుర్థి పండుగ ప్రారంభంతో చాలా మంది కస్టమర్లు డెలివరీల కోసం ఆసక్తి చూపుతున్నారు. అయితే, ఉత్తర భారతదేశంలో అధిక వర్షాలు, వరదలు గ్రామీణ రాకపోకలకు అంతరాయంతో అమ్మకాలపై ప్రభావాన్ని చూపాయి.
- వాణిజ్య వాహన రిటైల్ విక్రయాలు ఆగస్టులో 69,635 యూనిట్ల నుంచి 8.55% పెరిగి 75,592 యూనిట్లకు చేరుకున్నాయి. త్రీవీలర్ రిటైల్ అమ్మకాలు 1,05,493 యూనిట్ల నుంచి 2% తగ్గి 1,03,105కు దిగివచ్చాయి.

సంఘటిత రంగం వైపు ఉద్యోగుల అడుగులు

- ఈపీఎఫ్‌వోలో పెరుగుతున్న సభ్యులు
- 2024–25లో రికార్డు స్థాయి నమోదు



ముంబై: దేశంలో ఉద్యోగ మార్కెట్‌లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అసంఘటిత రంగం నుంచి క్రమంగా సంఘటిత రంగంలో ఉపాధి వైపు కార్మికులు అడుగులు వేస్తున్నారు. దీంతో ఉద్యోగుల భవిష్యనిధి సంస్థలో సభ్యుల చేరిక ఎప్పటికప్పుడు కొత్త రికార్డులను తాకుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయి సభ్యుల చేరిక దీన్నే సూచిస్తున్నట్టు క్వెస్ కార్ప్ నివేదిక తెలిపింది. సుమారు 1.4 కోట్ల మంది గత ఆర్థిక సంవత్సరంలో ఈపీఎఫ్‌లో నికరంగా చేరారు. 2018–19 సంవత్సరంలో నికర సభ్యుల నమోదు 61 లక్షలతో పోల్చి చూస్తే రెట్టింపునకు పైగా పెరిగింది. క్వెస్ కార్ప్ విడుదల చేసిన 'ఇండియా వర్క్‌ఫోర్స్ ట్రెండ్స్' నివేదిక ప్రకారం.. దేశంలో 57 కోట్ల మంది కార్మికుల్లో ఇప్పటికీ 80 శాతం మంది అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్నారు. 2024–25లో కొత్తగా చేరిన ఈపీఎఫ్‌వో సభ్యుల్లో 61 శాతం మంది వయసు 29 ఏళ్లలోపే ఉంది. ఇందులోనూ సగం మంది వయసు 18–25 ఏళ్ల మధ్య ఉండడాన్ని గమనించొచ్చు. యువ భారతీయుల మొదటి ఎంపిక సంఘటిత రంగంలోని ఉద్యోగమేనని క్వెస్‌కార్ప్ నివేదిక తెలిపింది.

పెరిగిన మహిళా భాగస్వామ్యం..

2025 మార్చి నాటికి సంఘటిత రంగంలోని మహిళా కార్మికుల భాగస్వామ్యం 41.7 శాతానికి చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో కొత్త సభ్యులు ప్రతి ముగ్గురిలో ఒకరు మహిళ కావడం గమనార్హం. ఉపాధి కల్పన పరంగా రిటైల్, బీఎఫ్ఎస్ఐ, తయారీ, టెలికం అగ్రగామి రంగాలుగా ఉన్నాయి. మానవ వనరుల సేవలు అందించే క్వెస్ కార్ప్.. 2024–25లో అత్యధికంగా 1.03 లక్షల మందికి టెలికంలో ఉపాధి చూపించింది. ఇందులో 43,000 మంది కొత్త సభ్యులు ఉన్నారు. తయారీ రంగంలో ఉద్యోగాలు గత నాలుగేళ్లలో ఏటా 32 శాతం చొప్పున పెరుగుతూ వచ్చాయి. నియామకాల పరంగా అధిక వృద్ధి ఈ రంగంలో నమోదైంది. ఇక సగటున రూ.28,500 వేతనంతో బీఎఫ్ఎస్ఐ టాప్‌లో నిలిచింది. ఆ తర్వాత రిటైల్‌లో రూ.23,000 వేతనం ఉంది. ''ఉద్యోగుల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచేందుకు వీలుగా సామాజిక వసతుల ఏర్పాటుపై ఎక్కువగా దృష్టి సారించాలి. సురక్షితమైన వసతి, రవాణా సదుపాయాలను కల్పించడం ద్వారా ఇందుకు సంబంధించి ఆందోళలను పరిష్కరించొచ్చు''అని క్వెస్ కార్ప్ ప్రెసిడెంట్ లోహిత్ భాటియా తెలిపారు.

ఎయిర్‌బీఎన్‌బీతో భారత్‌లో 1.11 లక్షల కొలువులకు దన్ను

- రూ. 2,400 కోట్లు వేతనాల చెల్లింపు
- ఆక్స్‌ఫర్డ్ ఎకనమిక్స్ నివేదికలో వెల్లడి



ముంబై: గతేడాది భారత్‌లో 1.11 లక్షల ఉద్యోగాల కల్పనకు చేయూతనిచ్చినట్లు, వేతనాల కింద దాదాపు రూ. 2,400 కోట్ల మేర చెల్లింపునకు దోహదపడినట్లు హోమ్–షేరింగ్ ప్లాట్‌ఫాం ఎయిర్‌బీఎన్‌బీ వెల్లడించింది. దేశీయంగా టూరిజం, ఆతిథ్య రంగంలో సంస్థ ప్రాధాన్యత పెరుగుతుండటాన్ని ఇది సూచిస్తోందని వివరించింది. ఎయిర్‌బీఎన్‌బీ తరఫున ఆక్స్‌ఫర్డ్ ఎకనమిక్స్ రూపొందించిన నివేదికలో ఈ గణాంకాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం భారత్‌లో బస, బసయేతర అవసరాల కోసం ఎయిర్‌బీఎన్‌బీ అతిథులు 2024లో రూ. 11,200 కోట్లు వెచ్చించారు. దేశీయంగా ప్రయాణాలు చేసే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మొత్తం గెస్టుల్లో దేశీ పర్యాటకుల వాటా 2019లో 79 శాతంగా ఉండగా గతేడాది నాటికి 91 శాతానికి పెరిగింది. అటు విదేశీ గెస్టుల విషయం తీసుకుంటే అమెరికా, యునైటెడ్ కింగ్‌డం, కెనడా, ఆస్ట్రేలియా నుంచి అత్యధిక శాతం మంది ఉన్నారు. నివేదిక ప్రకారం.. గెస్టులు సగటున రెండు రాత్రుళ్లు బస చేయగా, డైనింగ్, రిటైల్ స్టోర్స్, రవాణాలాంటి బసయేతర అవసరాలపై రోజూ రూ. 11,000 మేర ఖర్చు చేశారు. ప్రతి రూ. 10,000 వ్యయంలో రెస్టారెంట్లలో రూ. 3,800, రవాణాపై రూ. 2,400, షాపింగ్‌పై రూ. 2,100, కళలు.. వినోదంపై రూ. 900, నిత్యావసరాలపై రూ. 800 ఖర్చు చేశారు.

నివేదికలోని మరిన్ని విశేషాలు..

- పర్యాటకం ఆధారిత కొలువుల్లో 0.2 శాతం (ప్రతి 417 ఉద్యోగాల్లో ఒకదానికి సమానం) ఉద్యోగాలకు ఎయిర్‌బీఎన్‌బీ దోహదపడింది.
- టూరిజంకే పరిమితం కాకుండా విస్తృత ఎకానమీకి కూడా సంస్థ కార్యకలాపాలు ఉపయోగపడ్డాయి. రవాణా.. స్టోరేజీ విభాగానికి రూ. 3,100 కోట్లు, వ్యవసాయానికి రూ. 1,500 కోట్లు, రియల్ ఎస్టేట్‌కి రూ. 1,300 కోట్ల మేర విలువ చేకూర్చాయి. రవాణా..స్టోరేజీలో 38,000 ఉద్యోగాలు, ఫుడ్..బెవరేజెస్ విభాగంలో 19,600, హోల్‌సేల్..రిటైల్ ట్రేడ్‌లో 16,800, తయారీలో 10,700 ఉద్యోగాల కల్పనకు తోడ్పడ్డాయి. దీనితో వేతనాలపరమైన ప్రయోజనాలు కూడా ఒనగూరాయి. రవాణా .. స్టోరేజ్‌లో రూ. 810 కోట్లు, తయారీలో రూ. 290 కోట్లు, రియల్ ఎస్టేట్ రంగంలో రూ. 260 కోట్ల మేర వేతనాలకు చెల్లింపునకు తోడ్పడ్డాయి.

మార్కెట్ బ్రీఫ్స్...

- ఐటీ సేవల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ తాజాగా అమితాబ్ కాంత్‌ను స్వతంత్ర డైరెక్టర్‌గా ఎంపిక చేసుకుంది. సోమవారం(8) నుంచి ఐదేళ్లపాటు పదవిలో కొనసాగనున్నట్లు వెల్లడించింది. నామినేషన్, రెమ్యునరేషన్ కమిటీ సలహామేరకు బోర్డు.. అమితాబ్ కాంత్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలియజేసింది. కాంత్ ప్రభుత్వ విధానాలలో భాగంకావడంతోపాటు.. ఇటీవల భారత్ తరఫున జీ20 షెర్పాగా వ్యవహరించారు.
- ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ లిమిటెడ్ సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలుకి(బైబ్యాక్) ప్రతిపాదించింది. ఈ నెల 11న నిర్వహించనున్న సమావేశంలో బోర్డు తాజా ప్రతిపాదనను పరిశీలించనున్నట్లు తెలియజేసింది. కంపెనీ ఇంతక్రితం 2022లో రూ. 9,300 కోట్లతో షేరుకి రూ. 1,850 ధరలో బైబ్యాక్‌కు తెరతీసిన విషయం విదితమే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-9-2025

విశాఖ	555–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545–00
విజయవాడ	545–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535–00
వరంగల్	537–00
రిటైల్ ధర	5.95

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	721.1	4.25
BAJAJ-AUTO	9,455.00	4.08
M&M	3,704.20	4.01
EICHERMOT	6,798.00	3.31
SBILIFE	1,515.35	2.89

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	5,308.00	-3.99
ASIANPAINT	2,535.00	-1.74
DRREDDY	1,251.00	-1.35
COALINDIA	387.35	-1.35
NESTLEIND	1,193.00	-1.28

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,388
ఎన్ఎస్ఈ	80,859
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,33,776
ఎఫ్ఐఐ	- 2,170
డీఐఐ	+ 3,014

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.29 (రాత్రి 11.30కు)	$ 61.87 (క్రితం ముగింపు)
బ్రెంట్	67.76 (రాత్రి 11.30కు)	$ 65.05 (క్రితం ముగింపు)

రామ్‌కో సిమెంట్స్‌కు సీఐఐ నుంచి ప్రతిష్టాత్మక అవార్డు



చెన్నై: రామ్‌కో సిమెంట్స్ ప్రతిష్టాత్మక అవార్డు దక్కించుకుంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ప్రకటించిన 'ఏఐ అవార్డ్స్ 2025' ఇన్నోవేటివ్ విభాగంలో 'ఎక్సలెన్స్ ఇన్ బెస్ట్ ఏఐ సొల్యూషన్ షోకేస్' అవార్డు గెలుచుకుంది. కృత్రిమ మేధ ఆధారిత సొల్యూషన్స్ అమలు చేయడం ద్వారా పరిశ్రమలో డిజిటల్ పరివర్తన(సొల్యూషన్స్)ను మరింత ముందుకు తీసుకెళ్లడంలో రామ్‌కో సిమెంట్స్ విశేష ప్రతిభ కనబర్చిందని అవార్డుల జ్యూరీ అభిప్రాయపడింది. రామ్‌కో ప్రతినిధులు మాట్లాడుతూ... ''అవార్డు సొంతం చేసుకోవడం గర్వకారణం. సాంకేతికతను వినియోగించి కస్టమర్లకు ఉత్తమ పరిష్కారాలు అందించేందుకు, షేర్ హోల్డర్లకు విలువ సృష్టించేందుకు కట్టుబడి ఉన్నాం'' అని తెలిపారు.

ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ రూ. 2,000 కోట్ల క్విప్

రెండేళ్లలో సమీకరణ లక్ష్యం

ముంబై: ప్రయివేట్ రంగ సంస్థ ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ రూ. 2,000 కోట్లు సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు వీలుగా 18–24 నెలల్లో అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) చేపట్టాలని భావిస్తుంది. అలాగే 2029–30కల్లా లోన్‌బుక్‌ను ప్రస్తుత రూ. 32,122 కోట్ల నుంచి రూ. లక్ష కోట్లకు పెంచుకునే లక్ష్యంతో ఉన్నటు బ్యాంక్ ఎండీ, సీఈవో సంజీవ్ ఎన్. తెలిపారు. ఇదేకాలంలో డిపాజిట్లు 3 రెట్లు ఎగసి రూ. 1.2 లక్షల కోట్లకు చేరనున్నట్లు అంచనా వేశారు. బ్యాంక్ లోన్‌బుక్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్న మైక్రో రుణాలు కొంతకాలంగా ఒత్తిడిలో ఉండటంతో వృద్ధి మందగించినట్లు పేర్కొన్నారు. అయితే ఇటీవల సాధారణ స్థితికి చేరుతున్నట్లు తెలియజేశారు. 2025 జూన్30కల్లా కనీస మూలధన నిష్పత్తి పటిష్టస్థాయిలో 22.77 శాతానికి చేరిందన్నారు.

నిధుల సమీకరణ వార్తల నేపథ్యంలో ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ షేరు బీఎస్ఈలో 3.7 శాతం జంప్‌చేసి రూ. 44 వద్ద ముగిసింది.

నిరుద్యోగ రేటు భారత్‌లోనే తక్కువ..

కేంద్ర మంత్రి మాండవీయ వెల్లడి



న్యూఢిల్లీ: వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రకారం జీ20 కూటమి దేశాల్లో చూస్తే భారత్‌లోనే నిరుద్యోగ రేటు అత్యంత కనిష్ఠంగా 2 శాతం స్థాయిలో ఉందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. వేగవంతమైన ఆర్థిక వృద్ధికి అనుగుణంగా వివిధ రంగాల్లో గణనీయంగా ఉద్యోగాల కల్పన జరిగిందని ఆయన వివరించారు. ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనలాంటి స్కీములు కూడా ఇందుకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. నేషనల్ కెరియర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) పోర్టల్ ద్వారా యువతలో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించేందుకు, ఉద్యోగావకాశాలను మెరుగుపర్చేందుకు క్లాసిఫైడ్స్ ఆన్‌లైన్ సైట్ 'క్వికర్, డిజిటల్ మెంటార్‌షిప్ ప్లాట్‌ఫాం' మెంటార్ టుగెదర్‌'తో కార్మిక శాఖ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. ఉద్యోగార్థులకు తగిన ఉద్యోగావకాశాలు దక్కేందుకు ఈ భాగస్వామ్యాలు తోడ్పడగలవని ఆయన పేర్కొన్నారు. మెంటార్ టుగెదర్ భాగస్వామ్యంతో తొలి ఏడాదిలో 2 లక్షల మంది యువతకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజె తెలిపారు. మరోవైపు క్వికర్ జాబ్స్‌ని ఎన్‌సీఎస్‌కి అనుసంధానించడం వల్ల పోర్టల్‌కి ప్రతి రోజూ 1,200 జాబ్ లిస్టింగ్‌లు జతవుతాయని పేర్కొన్నారు. ఎన్‌సీఎస్ ప్లాట్‌ఫాంలో 52 లక్షల పైగా సంస్థలు, 5.79 కోట్ల ఉద్యోగార్థులు రిజిస్టర్ చేసుకున్నారు. ప్రస్తుతం పోర్టల్‌లో 44 లక్షల పైచిలుకు వేకెన్సీలు అందుబాటులో ఉన్నాయి.

జీఎస్‌టీ సంస్కరణలు.. గేమ్ చేంజర్


అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సౌరభ్ శ్రీవాస్తవ



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్నుల (జీఎస్‌టీ) విధానంలో మార్పులను పురోగామి సంస్కరణలుగా ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సౌరభ్ శ్రీవాస్తవ అభివర్ణించారు. చిన్న విక్రేతలకు ఇది గేమ్ చేంజర్‌గా ఉంటుందని, కస్టమర్లు.. విక్రేతల వ్యవస్థపై గణనీయంగా సానుకూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కొత్త జీఎస్‌టీ విధానంతో ద్వితీయ, తృతీయ శ్రేణి విక్రేతలకు డిజిటల్ కామర్స్‌ను మరింత అందుబాటులోకి వస్తుందని శ్రీవాస్తవ వివరించారు. రేట్ల తగ్గింపు వల్ల విక్రేతలు, బ్రాండ్లు మరింత మెరుగైన డీల్స్‌ను ఆఫర్ చేసేందుకు వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. సవరించిన జీఎస్‌టీ రేట్లను పొందుపర్చేందుకు అమెజాన్ ఇప్పటికే అంతర్గత సిస్టమ్స్‌లో మార్పులు, చేర్పులు చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు శ్రీవాస్తవ చెప్పారు.

జీఎస్‌టీ సంస్కరణల వల్ల సెప్టెంబర్ 23న ప్రారంభమయ్యే వార్షిక ఫ్లాగ్‌షిప్ సేల్ 'గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్'లో ఒక లక్షకు పైగా ఉత్పత్తులను కస్టమర్లు తక్కువ ధరల్లోనే పొందవచ్చని వివరించారు. భారీ డిమాండ్ అంచనాల నడుమ కొత్త డెలివరీ కేంద్రాలు, టెక్నాలజీ మొదలైన వాటిపై ఈ ఏడాది అమెజాన్ ఇండియా దాదాపు రూ. 2,000 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. అమెరికా టారిఫ్‌లపై నెలకొన్న ఆందోళనపై స్పందిస్తూ.. తమ కార్యకలాపాలపై పెద్దగా ప్రభావమేమీ లేదని, గ్లోబల్ సెల్లింగ్ ప్రోగ్రాం కింద 2030 నాటికి భారత్ నుంచి 80 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎగుమతులకు దోహదపడాలనే లక్ష్యానికి తాము కట్టుబడి ఉన్నట్లు శ్రీవాస్తవ చెప్పారు.

రేటు తగ్గింపు వినియోగదారుకు బదలాయించాల్సిందే: గోయల్



న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని వినియోగదారులకు తప్పకుండా అందించాలని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సూచించారు. దీనివల్ల దేశీ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి, ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ''జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతోపాటు, పన్నుల నిర్మాణాన్ని సులభతరం చేయడం వల్ల దేశీ డిమాండ్‌కు ఊతం లభిస్తుంది. చిన్న, పెద్ద స్థాయి కంపెనీలకు మరిన్ని అవకాశాలు వస్తాయి. ఉపాధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయి. ఆదాయాలు పెరుగుతాయి. ఇది అధిక వ్యయాలకు దారితీస్తుంది'' అని మంత్రి వివరించారు. మౌలిక వసతుల కల్పనకుతోడు, బలమైన వినియోగ డిమాండ్ కలిగిన భారత్ ఎదుగుదలను ఏ శక్తి అడ్డుకోలేదని.. ఈఈపీసీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. 4 లక్షల ట్రిలియన్ డాలర్ల భారత ఆర్థిక వ్యవస్థ వచ్చే 2–2.5 ఏళ్లలో ప్రపంచంలో మూడో స్థానానికి చేరుకుంటుందన్నారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటుందని అంచనా వేశారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో దేశీ డిమాండ్‌కు ప్రధాని ఊతమిచ్చినట్టు చెప్పారు. సంక్షోభం నుంచి బలపడే శక్తి భారత్‌కు ఉందంటూ, దేశీ ఉత్పత్తులపై వ్యాపారాలు దృష్టి సారించాలని కోరారు. ఇది దేశ వృద్ధికి సాయపడుతుందని, దేశ ఆర్థిక భద్రతను బలోపేతం చేస్తుందన్నారు.

జోరు కొనసాగించాలని...

టైటిల్ లక్ష్యంగా సాత్విక్-చిరాగ్ జోడీ • నేటి నుంచి హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తాజా కాంస్య పతకంతో జోరు మీదున్న భారత అగ్రశ్రేణి డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. పురుషుల డబుల్స్‌లో ప్రపంచ మూడో ర్యాంకు ద్వయం ఇటీవల పారిస్‌లో జరిగిన ఈవెంట్‌లో సత్తా చాటుకుంది. భారత బ్యాడ్మింటన్‌లోనే అత్యంత నిలకడైన షట్లర్లుగా ఖ్యాతి గాంచిన వీరిద్దరు ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) టూర్ ఈవెంట్లలో సెమీఫైనల్, ఫైనల్స్ చేరారు. ఇండియా ఓపెన్ సహా మలేసియా, చైనా, సింగపూర్ టోర్నీల్లో రాణించిన సాత్విక్-చిరాగ్ జంటకు హాంకాంగ్ టోర్నీలో ఎనిమిదో సీడ్ కేటాయించారు. పురుషుల డబుల్స్ తొలి మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ భారత జోడీ తొలి రౌండ్లో చైనీస్ తైపీకి చెందిన చియు హియాంగ్-వాంగ్ చి లిన్ జంటతో తలపడనుంది.

సింధు సత్తా చాటేనా!

రెండు వరుస ఒలింపిక్ పతకాల విజేత, భారత స్టార్ పీవీ సింధు ఇటీవల జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్ చేరింది. ఈ పయనంలో ఆమె తనకన్నా ర్యాంకింగ్‌లో మెరుగైనా చైనా సూపర్‌స్టార్ వాంగ్ జి యిని కంగు తినిపించి తన పూర్వ వైభవాన్ని చాటుకుంది. ఇప్పుడు ఇదే ఉత్సాహంతో హాంకాంగ్ టోర్నీపై కన్నేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఈ ఆంధ్రప్రదేశ్ షట్లర్ డెన్మార్క్ ప్లేయర్ లినె క్రిస్టోఫెర్సన్‌తో తలపడుతుంది. ఆమెతో పాటు మహిళల సింగిల్స్‌లో అనుపమ, రక్షిత శ్రీలు బరిలో ఉన్నారు. పురుషుల సింగిల్స్‌లో భారత మేటి ఆటగాడు లక్ష్యసేన్ తన ఫామ్‌ను అందిపుచ్చుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ టోర్నీని సానుకూలంగా మలచుకోవాలని ఆశిస్తున్నాడు. తొలి రౌండ్లో అతను వాంగ్ జు వీ (చైనీస్ తైపీ)ను ఎదుర్కోనున్నాడు. యూఎస్ ఓపెన్ చాంపియన్ ఆయుశ్ షెట్టి... లూ గ్వాంగ్ జు (చైనా)తో, ప్రణయ్... ఐదో సీడ్ కొడాయ్ నరొకా (జపాన్)తో పోటీపడనున్నారు. ప్రపంచ మాజీ నంబర్‌వన్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్, తరుణ్ మన్నేపల్లి క్వాలిఫయర్స్‌లో తలపడనున్నారు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్-రూబన్ కుమార్, మహిళల డబుల్స్‌లో రుతపర్ణ-శ్వేతపర్ణ జోడీలు బరిలోకి దిగుతున్నాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో హైదరాబాద్‌కు చెందిన గద్దె రుత్విక శివాని... రోహన్ కపూర్‌తో జోడీ కట్టింది.



బెంగళూరు బుల్స్‌కు రెండో విజయం

విశాఖ స్పోర్ట్స్: ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో మాజీ చాంపియన్ బెంగళూరు బుల్స్ ఖాతాలో రెండో విజయం చేరింది. హరియాణా స్టీలర్స్‌తో సోమవారం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 40-33 పాయింట్ల తేడాతో గెలుపొందింది. బెంగళూరు తరఫున అలీ రెజా 12 పాయింట్లు సాధించగా, యోగేశ్ 6 పాయింట్లు సాధించాడు. హరియాణా ఆటగాళ్లలో శివమ్ పటారే 7, మయాంక్ సైనీ 6 పాయింట్లతో రాణించారు. మరోవైపు మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్ ఎట్టకేలకు గెలుపు బోణీ చేసింది. మూడు పరాజయాల తర్వాత ఆ జట్టు తొలి విజయాన్ని అందుకుంది. పుణేరి పల్టన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 48-37 పాయింట్ల తేడాతో నెగ్గింది. పైరేట్స్ రెయిడర్ అయాన్ లోచబ్ ఒంటి చేత్తో జట్టును గెలిపించాడు. అయాన్ ఒక్కడే 21 పాయింట్లు సాధించడం విశేషం. తొలి అర్ధ భాగంలోనే అయాన్ 'సూపర్ 10' సహా ప్రత్యర్థిని రెండు సార్లు ఆలౌట్ చేసిన పట్నా 27-10 తేడాతో ముందంజలో నిలిచింది. రెండో అర్ధభాగంలో సమష్టితత్వంతో కోలుకున్న పుణేరి పదునైన ఆటతో చెలరేగినా భారీ వ్యత్యాసాన్ని తగ్గించలేకపోయింది. పైరేట్స్‌ను రెండుసార్లు ఆలౌట్ చేసి రెండో అర్ధభాగంలో 27-21తో పైచేయి సాధించినా తుది ఫలితంలో మాత్రం 11 పాయింట్ల తేడాతో నిరాశ తప్పలేదు. పుణేరి తరఫున సచిన్ 6, అభిషేక్ గున్‌గే 5 పాయింట్లు నమోదు చేశారు. నేడు జరిగే మ్యాచ్‌లలో దబంగ్ ఢిల్లీతో బెంగాల్ వారియర్స్...గుజరాత్ జెయింట్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్ తలపడతాయి.

గుకేశ్‌కు అభిమన్యు షాక్



సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) గ్రాండ్ స్విస్ టోర్నీలో సోమవారం సంచలనం చోటు చేసుకుంది. ఐదో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. భారత సంతతికి చెందిన అమెరికా గ్రాండ్‌మాస్టర్, 16 ఏళ్ల అభిమన్యు మిశ్రా 61 ఎత్తుల్లో గుకేశ్‌ను ఓడించాడు. మరో గేమ్‌లో టాప్ సీడ్, భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద 55 ఎత్తుల్లో మథియాస్ బ్లూబామ్ (జర్మనీ) చేతిలో ఓటమి పాలయ్యాడు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 37 ఎత్తుల్లో నికిత వితియుగోవ్ (ఇంగ్లండ్)పై గెలుపొందాడు. ఈ టోర్నీలో మూడు గేముల్లో నెగ్గి, రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకున్న అర్జున్ మరో ముగ్గురితో కలిసి ఉమ్మడిగా రెండో స్థానంలో ఉన్నాడు.

పతకానికి చేరువగా...

క్వార్టర్ ఫైనల్లో జైస్మీన్ • ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్



లివర్‌పూల్ (ఇంగ్లండ్): కామన్వెల్త్ క్రీడల స్వర్ణపతక విజేత జైస్మీన్ లంబోరియా ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి పతకానికి మరింత చేరువైంది. ఈ టోర్నీలో జైస్మీన్ క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. మరో బౌట్ గెలిస్తే ఆమెకు కనీసం కాంస్య పతకం ఖాయమవుతుంది. ఆదివారం అర్ధరాత్రి జరిగిన 57 కేజీల ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో జైస్మీన్ 5-0తో జూసీలెన్ రోమియూ (బ్రెజిల్)పై ఘన విజయం సాధించింది. ఇటీవలే అస్తానా టోర్నీ ఫైనల్లో ఇదే ప్రత్యర్థిపై గెలిచి స్వర్ణం సాధించిన జైస్మీన్ ఈసారి కూడా అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. మూడు రౌండ్లలోనూ భారత బాక్సర్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శిస్తూ ప్రత్యర్థిని కోలుకోనీయకుండా చేసింది. క్వార్టర్ ఫైనల్లో ఆమె ఆసియా అండర్-22 చాంపియన్ ఖుమారొబొను మమజొనొవా (ఉజ్బెకిస్తాన్)తో తలపడుతుంది. అయితే మహిళల విభాగంలో మరో ఇద్దరు భారత బాక్సర్లు సనమచ చాను (70 కేజీలు), సాక్షి చౌదరి (54 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓటమిపాలై నిష్క్రమించారు. నటాల్యా బొగ్దనొవా (కజకిస్తాన్) 5-0తో చానుపై...పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత హటీసె అక్బాస్ (తుర్కియే) 5-0తో సాక్షిపై గెలుపొందారు. మరోవైపు పురుషుల విభాగంలో అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు) రెండో రౌండ్‌లో 5-0తో హ్యూగో బ్యారస్ (మెక్సికో)ను ఓడించి ప్రిక్వార్టర్స్‌కు చేరాడు. మహిళల 65 కేజీల విభాగంలో మరో బాక్సర్ నీరజ్ ఫొగాట్ కూడా ఓటమిపాలైంది. హోరాహోరీగా సాగిన బౌట్‌లో స్థానిక ప్లేయర్ సాషా హికీ (ఇంగ్లండ్) 3-2తో నీరజ్‌పై గెలుపొందింది.

భారత్‌కు మూడో స్థానం

- 'షూటౌట్'లో ఒమన్‌పై విజయం
- టీమిండియాను గెలిపించిన గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్



హిసోర్ (తజికిస్తాన్): సెంట్రల్ ఏషియన్ ఫుట్‌బాల్ అసోసియేషన్స్ (సీఏఎఫ్ఏ) నేషన్స్ కప్ టోర్నీలో భారత జట్టుకు మూడో స్థానం లభించింది. ఒమన్ జట్టుతో సోమవారం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో భారత్ 'షూటౌట్'లో 3-2తో విజయం సాధించింది. అంతర్జాతీయ స్థాయిలో ఒమన్ జట్టుపై భారత్‌కిదే తొలి గెలుపు కావడం విశేషం. నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఒమన్ తరఫున జమీల్ (55వ నిమిషంలో) గోల్ చేయగా... 80వ నిమిషంలో ఉదాంత సింగ్ గోల్‌తో భారత్ స్కోరును సమం చేసింది. 'షూటౌట్'లో ఒమన్ ఆటగాళ్లు తొలి రెండు షాట్‌లను వృథా చేయగా... చివరిదైన ఐదో షాట్‌ను భారత గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధూ నిలువరించి జట్టును గెలిపించాడు. భారత్ తరఫున లాలియన్‌జువాలా, రాహుల్ భెకె, జితిన్ గోల్స్ చేయగా... అన్వర్ అలీ, ఉదాంత సింగ్ గురి తప్పారు.

ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' రేసులో సిరాజ్



దుబాయ్: భారత పేసర్, హైదరాబాద్ స్పీడ్‌స్టర్ మొహమ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు రేసులో నిలిచాడు. ఆగస్టు నెలకు సంబంధించి రాణించిన ఆటగాళ్లను అవార్డును నామినేట్ చేశారు. వీరిలో సిరాజ్‌తో పాటు న్యూజిలాండ్ సీమర్ మ్యాట్ హెన్రీ, వెస్టిండీస్ పేసర్ జేడెన్ సీల్స్ ఐసీసీ అవార్డు రేసులో ఉన్నారు. గత నెలలో ముగిసిన ఇంగ్లండ్ పర్యటనలో సిరాజ్ ఆఖరి టెస్టులో సిరీస్ ఫలితాన్నే మార్చే ప్రదర్శనతో అదరగొట్టాడు. ఓవల్ వేదికపై జరిగిన ఐదో టెస్టులో సిరాజ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 (4/86; 5/104) వికెట్లు తీసి భారత్‌ను గెలిపించాడు. అతని 'పేస్ షో'తో ఐదు టెస్టుల సిరీస్‌ను భారత్ 2-2తో సమం చేయగలిగింది. ప్రీమియర్ సీమర్ బుమ్రా మూడు టెస్టులకే పరిమితమైన ఈ పర్యటనలో కీలకపాత్ర పోషించిన సిరాజ్ మొత్తం 23 వికెట్లు పడగొట్టాడు. 'సిరాజ్ ఆగస్టులో కేవలం ఒకే మ్యాచ్ ఆడినప్పటికీ అసాధారణ ప్రదర్శన కనబరిచాడు. అందువల్లే అతన్ని నామినేట్ చేశాం. టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీలో కీలకమైన ఐదో టెస్టులో భారత రైటార్మ్ సీమర్ ఆతిథ్య బ్యాటర్లను బెంబేలెత్తించాడు. 21.11 సగటుతో 9 వికెట్లు తీశాడు' అని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. జింబాబ్వే పర్యటనలో కివీస్ పేసర్ హెన్రీ 16 వికెట్లు పడగొట్టాడు. పాక్‌పై 34 ఏళ్ల తర్వాత కరీబియన్ జట్టు వన్డే సిరీస్ గెలుపొందడంలో సీలెస్ (విండీస్) కీలకపాత్ర పోషించాడు. దీంతో వీరిద్దరిని కూడా ఐసీసీ నామినేట్ చేసింది.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో యూకీ బాంబ్రీ



న్యూఢిల్లీ: తన కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించిన యూకీ బాంబ్రీ... సోమవారం విడుదల చేసిన అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లోనూ పురోగతి సాధించాడు. మైకేల్ వీనస్ (న్యూజిలాండ్)తో జతకట్టి యూఎస్ ఓపెన్‌లో బరిలోకి దిగిన యూకీ బాంబ్రీ అద్భుత ఆటతీరుతో సెమీఫైనల్ వరకు చేరుకున్నాడు. ఫలితంగా ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో యూకీ 10 స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 22వ ర్యాంక్‌ను అందుకున్నాడు. సీనియర్ స్టార్ రోహన్ బోపన్న తొమ్మిది స్థానాలు పడిపోయి 63వ ర్యాంక్‌లో నిలిచాడు. ఈ ఏడాది నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో డబుల్స్ విభాగంలో పోటీపడ్డ హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ రెండు స్థానాలు పురోగతి సాధించి 71వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. హైదరాబాద్‌కే చెందిన మరో ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ 98వ స్థానంలో ఉండగా... శ్రీరామ్ బాలాజీ 75వ ర్యాంక్‌లో, విజయ్ సుందర్ ప్రశాంత్ 84వ ర్యాంక్‌లో నిలిచారు. ఓవరాల్‌గా టాప్-100లో భారత్ నుంచి ఆరుగురు క్రీడాకారులుండటం విశేషం. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్ నుంచి సుమిత్ నాగల్ 290వ స్థానంలో నిలిచాడు. డబ్ల్యూటీఏ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత నంబర్‌వన్ ర్యాంకర్‌గా రష్మిక (327వ స్థానం), భారత రెండో ర్యాంకర్‌గా సహజ యామలపల్లి (338వ స్థానం) నిలిచారు.

హైదరాబాద్‌కు ఆధిక్యం

- టీఎన్‌సీఏ 353 ఆలౌట్
- నితిన్, రోహిత్‌లకు చెరో 3 వికెట్లు
- బుచ్చిబాబు క్రికెట్ టోర్నీ ఫైనల్


నితిన్

చెన్నై: ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. హైదరాబాద్ స్పిన్నర్లు నితిన్ సాయి యాదవ్ (3/55), రోహిత్ రాయుడు (3/96), అనికేత్ రెడ్డి (2/76) సమష్టిగా తమిళనాడు బ్యాటర్లను దెబ్బకొట్టారు. దీంతో మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 142/1తో సోమవారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన టీఎన్‌సీఏ ప్రెసిడెంట్స్ ఎలెవన్ జట్టు 138.2 ఓవర్లలో 353 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ రాధాకృష్ణన్ (238 బంతుల్లో 98; 5 ఫోర్లు) 2 పరుగుల తేడాతో సెంచరీకి దూరమయ్యాడు. కెప్టెన్ ప్రదోశ్ రంజన్ పాల్ (26; 1 ఫోర్) పెద్దగా రాణించలేదు. అయితే మిడిలార్డర్ బ్యాటర్లు ఇంద్రజిత్ (72 బంతుల్లో 50; 5 ఫోర్లు), అజితేశ్ (90 బంతుల్లో 57; 7 ఫోర్లు) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. మొదట ఇంద్రజిత్... సిద్ధార్థ్ (74 బంతుల్లో 30; 2 ఫోర్లు)తో కలిసి నాలుగో వికెట్‌కు 52 పరుగులు, అనంతరం అజితేశ్‌తో కలిసి ఐదో వికెట్‌కు 46 పరుగులు జోడించాడు. ఈ భాగస్వామ్యాలతో టీఎన్‌సీఏ 350 పైచిలుకు స్కోరు చేయగలిగింది. లోయర్ ఆర్డర్ సహా టెయిలెండర్లను హైదరాబాద్ బౌలర్లు క్రీజులో నిలువనీయలేదు. దీంతో హైదరాబాద్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 23 పరుగుల ఆధిక్యం లభించింది. వరుణ్ గౌడ్, నిశాంత్ చెరో వికెట్ తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టానికి 14 పరుగులు చేసింది. ఓపెనర్ నితీశ్ రెడ్డి (0)ని విద్యుత్ 'డకౌట్' చేశాడు. మరో ఓపెనర్ అమన్ రావు (8 బ్యాటింగ్), వన్‌డౌన్ బ్యాటర్ రవితేజ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ 37 పరుగుల ఆధిక్యంలో ఉంది.



నవాజ్ హ్యాట్రిక్

- పాకిస్తాన్ జట్టుదే ముక్కోణపు ట్రోఫీ
- ఫైనల్లో 75 పరుగులతో అఫ్గానిస్తాన్‌పై గెలుపు

షార్జా: లెఫ్టార్మ్ స్పిన్నర్ మొహమ్మద్ నవాజ్ (5/19) 'హ్యాట్రిక్'తో పాకిస్తాన్ ముక్కోణపు టి20 సిరీస్‌ను చేజిక్కించుకుంది. దీంతో నేటి నుంచి జరిగే ఆసియా కప్‌కు కావాల్సినంత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన టైటిల్ పోరులో పాక్ 75 పరుగుల తేడాతో అఫ్గానిస్తాన్‌పై ఘనవిజయం సాధించింది. టాస్ నెగ్గిన పాకిస్తాన్ ముందుగా బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. అనంతరం అఫ్గానిస్తాన్ 15.5 ఓవర్లలో 66 పరుగులకే కుప్పకూలింది. పాక్ స్పిన్నర్లు నవాజ్ (4-1-19-5), సుఫియాన్ ముఖీమ్ (2/9), అబ్రార్ అహ్మద్ (2/17) మూకుమ్మడిగా అఫ్గాన్ మెడకు స్పిన్ ఉచ్చు బిగించారు. నవాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'సిరీస్' అవార్డులు దక్కాయి. ఈ ముక్కోణపు సిరీస్‌లో ఓవరాల్‌గా అతను 120 పరుగులు చేయడంతో పాటు 10 వికెట్లు తీశాడు.

బ్యాటింగ్‌లో ఆదుకొని... బౌలింగ్‌తో తిప్పేసి...

నవాజ్ స్పిన్నే కాదు... బ్యాటింగ్ కూడా పాకిస్తాన్ ఇన్నింగ్స్‌కు దోహదపడింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఒక దశలో పాకిస్తాన్ 72 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. టాపార్డర్‌లో ఫఖర్ జమన్ (26 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే కాస్త మెరుగనిపించాడు. ఇలాంటి పరిస్థితుల్లో సల్మాన్ ఆఘా (27 బంతుల్లో 24; 2 సిక్స్‌లు)కు జతయిన నవాజ్ (21 బంతుల్లో 25; 2 సిక్స్‌లు) ఆరో వికెట్‌కు 40 పరుగులు జోడించి పాక్ ఇన్నింగ్స్ కుదుటపరిచాడు. ప్రత్యర్థి బౌలర్లలో కెప్టెన్ రషీద్ ఖాన్ 3, ఫజల్‌హక్ ఫరూఖీ, నూర్ అహ్మద్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం ఏమంత కష్టమైన లక్ష్యం కాకపోయినా అఫ్గానిస్తాన్ బ్యాటర్ల నిర్లక్ష్యంతో ముక్కోణపు ట్రోఫీని కోల్పోయింది. కోటా ఓవర్లను కూడా పూర్తిగా ఆడలేకపోయింది. వందో టి20 ఆడుతున్న రషీద్ బ్యాటింగ్‌లో 17 పరుగులు చేయగా... ఇవే ఇన్నింగ్స్ టాప్‌స్కోర్ కావడం గమనార్హం! పాక్ స్పిన్ ఉచ్చులో పడిన అఫ్గాన్ పొట్టి ఫార్మాట్ చరిత్రలో రెండో అత్యల్ప స్కోరు నమోదు చేసింది. టి20ల్లో పాకిస్తాన్ తరఫున హ్యాట్రిక్ వికెట్లు తీసిన మూడో బౌలర్ నవాజ్. గతంలో పేస్ బౌలర్లు ఫహీమ్ అష్రఫ్ (2017లో), మొహమ్మద్ హస్నయిన్ (2018లో) హ్యాట్రిక్ నమోదు చేశారు. ఇద్దరు కూడా శ్రీలంకపైనే ఈ ఘనత సాధించారు.

సాక్షి ప్లస్
మంగళవారం। 9-9-2025



భారీ వర్షాలతో పట్టాలపైకి వరద చేరడంతో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. స్వీడన్‌లోని ఓర్నెస్కోల్డ్స్విక్‌లో సోమవారం జరిగిన ఈ ఘటనలో బోగీలు చెల్లాచెదురుగా పడిపోయాయి



అమెరికాలోని కాలిఫోర్నియాలో ఇటీవల కుక్కలకు సర్ఫింగ్ పోటీలను నిర్వహించారు. ఇందులో రస్టీ అనే ఈ శునకం సముద్ర అలలపై సునాయాసంగా దూసుకెళ్లింది

సరికొత్త ఆయుధ రేసులో ప్రపంచం!

అత్యాధునిక ఆయుధ కొనుగోళ్లపై అగ్రదేశాల దృష్టి

- దాయాదుల నిలువరింపు, సైనిక మార్కెట్ల విస్తరణే లక్ష్యం
- 2019 తర్వాత తొలిసారి అతిపెద్ద సైనిక కవాతు చేపట్టిన చైనా
- పెంటగాన్ పేరును డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌గా మార్చిన అగ్రరాజ్యం
- రక్షణ బడ్జెట్‌ను అమాంతం పెంచేసిన నాటో దేశాలు

న్యూఢిల్లీ: ప్రపంచంపై ఆధిపత్యం నిలుపుకొనేందుకు అగ్రదేశాలు సరికొత్త పోటీకి తెరతీశాయి. అత్యాధునిక ఆయుధ సంపత్తిని సమకూర్చుకోవడంపై దృష్టిపెట్టాయి. అత్యంత శక్తివంతమైన దేశాలైన అమెరికా, చైనా ఇప్పటికే ఈ దిశగా కసరత్తు ముమ్మరం చేయగా యూరోప్ నుంచి ఆసియా దాకా ఇతర దేశాలు సైతం తామేమీ వెనకబడలేదన్నట్లుగా రక్షణ బడ్జెట్లను అమాంతం పెంచేశాయి. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను మించి ఆయుధ కొనుగోళ్ల అంశానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. దాయాది దేశాలను నిలువరించాలన్న లక్ష్యంతోపాటు కొత్త ఆయుధ మార్కెట్లను సృష్టించుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చుకొనేందుకు ద్విముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. దీంతో గత కొన్ని దశాబ్దాల్లోకెల్లా ఎప్పుడూ లేనంత స్థాయికి ప్రపంచ దేశాల రక్షణ బడ్జెట్లు పెరిగిపోతున్నాయి. వెరసి ప్రపంచమంతా ప్రపంచ యుద్ధాల కాలంనాటి పరిస్థితుల వైపు తిరిగి మళ్లుతోంది.

చైనా దూకుడు..

డ్రాగన్ దేశం చైనా 2019 తర్వాత తొలిసారి అతిపెద్ద సైనిక పరేడ్‌ను టియాన్‌మెన్ స్క్వేర్‌లో అట్టహాసంగా నిర్వహించింది. ఉక్రెయిన్ అంశంతోపాటు దక్షిణ చైనా సముద్రంపై ఆధిపత్యం విషయంలో అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో తన సైనిక పాటవాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరించింది. ప్రపంచవ్యాప్తంగా ఎంత దూరంలో ఉన్న లక్ష్యాలనైనా ఛేదించగల అత్యాధునిక ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులతోపాటు జలాంతర్గాములు, డ్రోన్లతో పరేడ్ నిర్వహించింది.

అగ్రరాజ్యం ప్రతిస్పందన..

చైనా సైనిక కవాతు జరిగిన రోజుల వ్యవధిలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. డ్రాగన్ దూకుడుకు ప్రతిస్పందనగా తమ దేశ రక్షణశాఖ కేంద్ర కార్యాలయమైన పెంటగాన్ పేరును తిరిగి 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్'గా మార్చాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో పాత పేరును పునరుద్ధరించడమే సరైన చర్య అంటూ ఆయన చెప్పుకొచ్చారు. తద్వారా యావత్ ప్రపంచానికి తమ యుద్ధకాంక్ష, సన్నద్ధతను మరోసారి చాటిచెప్పారు. 1789 నుంచి రెండో ప్రపంచ యుద్ధం ముగిసే వరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్ పేరిటే అమెరికా సైన్యం పోరాడింది.

అదే బాటలో నాటో దేశాలు

యూరోప్ సైతం తమ ఆయుధ సంపత్తిని పెంచుకోవడంపై దృష్టిపెట్టింది. ఈ ఏడాది రక్షణ బడ్జెట్‌ను జీడీపీలో 5 శాతానికి పెంచాలని నాటో సభ్య దేశాలు నిర్ణయించాయి. మౌలిక రక్షణ సర్వీసులు, కీలక రక్షణ వ్యవస్థల బలోపేతానికి ఈ నిధులను ఖర్చు చేయాలని తీర్మానించాయి. సభ్య దేశాలన్నీ ప్రచ్ఛన్న యుద్ధ కాలంనాటి సైనిక సన్నద్ధతను 2030 నాటికల్లా సంతరించుకోవాలని నాటో నూతన సెక్రటరీ జనరల్ మార్క్ వ్యాఖ్యానించడం ప్రస్తుత పరిణామాలకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఇతర దేశాలూ రేసులోనే..

ఇతర దేశాలు సైతం తామేమీ తక్కువ కాదన్నట్లుగా ఆయుధ సంపత్తి పెంచుకొనే రేసులోకి వచ్చాయి. ఉత్తర కొరియా నుంచి ముప్పు ఎదుర్కొంటున్న దక్షిణ కొరియా.. పోలాండ్‌తో కోట్లాది డాలర్ల ఆయుధ కొనుగోళ్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మరోవైపు బ్రిటన్ సైతం 10 బిలియన్ డాలర్ల విలువైన యుద్ధనౌకలను నార్వేకు విక్రయించింది. అలాగే టర్కీ కూడా తమ డ్రోన్లను ప్రపంచవ్యాప్తంగా యుద్ధ జోన్ల ప్రాంతాలకు ఎగుమతి చేస్తోంది.

సైనిక ఖర్చు అంకెల్లో..

2.718 ట్రిలియన్ డాలర్లు: 2024లో ప్రపంచ దేశాలు చేపట్టిన సైనిక వ్యయం. ఇది భారత్, దక్షిణాఫ్రికా, కెనడా, బ్రెజిల్ దేశాల వార్షిక బడ్జెట్లకన్నా అధికం కావడం గమనార్హం. ప్రచ్ఛన్న యుద్ధకాలంనాటి స్థాయిలను సైతం ఈ వ్యయం దాటేసింది. స్టాక్‌హోం అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ (ఎస్ఐపీఆర్ఐ) అంచనా ప్రకారం 2023తో పోలిస్తే 2024లో ప్రపంచ దేశాల సైనిక ఖర్చు 9.4% పెరిగింది.

60%: ప్రపంచ దేశాల సైనిక వ్యయంలో అమెరికా, యూరోపియన్ యూనియన్, బ్రిటన్, రష్యా, చైనా, జర్మనీ వాటా.

343 బిలియన్ డాలర్లు: 2024లో రక్షణ రంగంపై యూరోపియన్ యూనియన్ చేసిన ఖర్చు.

జీడీపీలో 5%: నాటో సభ్య దేశాల నూతన రక్షణరంగ వ్యయ లక్ష్యం.

10 బిలియన్ డాలర్లు: నార్వేతో బ్రిటన్ కుదుర్చుకున్న యుద్ధనౌకల విక్రయ ఒప్పందం. ఇది బ్రిటన్ అతిపెద్ద ఎగుమతిగా నిలిచింది.



ప్రపంచ దేశాల సైనిక వ్యయంలో ఎవరి వాటా ఎంత?

అమెరికా	37%
ఈయూ, బ్రిటన్	17%
చైనా	12%
రష్యా	6%
భారత్	3%
ఇతర దేశాలన్నీ	25%

కలశం దొరికింది

యూపీలో ముగ్గురి అరెస్టు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని 'ఆగస్టు 15 పార్కు'లో సెప్టెంబర్ 3వ తేదీన జరిగిన జైన ఉత్సవం సమయంలో రూ.కోటిన్నర విలువైన బంగారు కలశం మాయం కావడం తెల్సిందే. సంచలనం సృష్టించిన ఈ ఘటనపై ముమ్మరంగా దర్యాప్తు చేపట్టిన ఢిల్లీ పోలీసులు ప్రధాన నిందితుడు భూషణ్ వర్మ సహా ముగ్గురిని అరెస్ట్ చేశారు. చోరీకి గురైన బంగారు కలశం సహా సుమారు రూ.కోటిన్నర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుడు హాపూర్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లిన ప్రత్యేక పోలీసు బృందం భూషణ్ వర్మను, అంకిత్, గౌరవ్ అనే వారిని వీరి నుంచి బంగారు కలశంతోపాటు, 150 గ్రాముల కరిగించిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సివిల్ లైన్స్‌కు చెందిన సుధీర్ జైన్ అనే భక్తుడి వద్ద రూ.కోటి విలువైన వజ్రాలు, ఇతర విలువైన రాళ్ల పొదిగిన బంగారు కలశ పాత్ర ఉంది. ఈ కలశాన్ని ఆయన ఆగస్టు 28వ తేదీ నుంచి ఉత్సవాలకు తీసుకు వస్తున్నారు. అప్పటి నుంచి దానిపై కన్నేసిన భూషణ్ వర్మ రోజూ పూజా ప్రాంతంలోకి సాధారణ భక్తుడి వేషధారణలో వచ్చి రెక్కీ నిర్వహిస్తున్నాడు. సెప్టెంబర్ 3వ తేదీన స్టేజీపై ఉన్న వారంతా బిజీలో ఉండగా కలశం మాయం చేశాడు. అంతకుముందు కూడా అతడు అక్కడున్న పలు విలువైన వస్తువులను ఎత్తుకెళ్లాడు. వీటి మొత్తం విలువ రూ. కోటిన్నర పైమాటే. తాజాగా, వీటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బస్సును ఢీకొట్టిన రైలు.. 8 మంది మృతి

మెక్సికో సిటీ: డబుల్ డెక్కర్ ప్రయాణికుల బస్సును రైలు ఢీకొట్టిన ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. కనీసం మరో 45 మంది గాయాలపాలయ్యారు. సోమవారం ఉదయం మెక్సికోలోని అట్లాకొముల్కో మున్సిపాలిటీలోని హైవేపై ఘటన చోటుచేసుకుంది. ప్రమాద తీవ్రతకు బస్సు మొత్తం నుజ్జయిన ఫొటోలు, బస్సులో చిక్కుకుపోయిన ప్రయాణికులను కాపాడేందుకు కొందరు ప్రయత్నిస్తున్న ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యాయి. భారీ గిడ్డంగులు, ఫ్యాక్టరీలున్న పారిశ్రామిక వాడలో జరిగిన ఈ ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

పాలస్తీనా ఖైదీలకిచ్చే ఆహార నాణ్యత పెంచండి

ఇజ్రాయెల్ సుప్రీంకోర్టు అరుదైన తీర్పు

- ఎక్కడి నుంచి వచ్చారంటూ జడ్జీలపై రక్షణ మంత్రి మండిపాటు

టెల్అవీవ్: ఇజ్రాయెల్ బలగాలు గాజాలోని పాలస్తీనియన్ల పట్ల అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తున్న వేళ ఆ దేశ సుప్రీంకోర్టు స్పందించింది. దేశంలోని జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీలకు సరిపోను ఆహారం సైతం అందివ్వకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. వారికిచ్చే ఆహార పరిమాణాన్ని, ఆహార నాణ్యతను కూడా పెంచాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ విధానాలపై సుప్రీంకోర్టు జోక్యం కేవలం సలహాలకు మాత్రమే పరిమితం. అయినప్పటికీ, ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరిగే యుద్ధంపై తొలిసారిగా సుప్రీంకోర్టు స్పందించడం విశేషం. పాలస్తీనా ఖైదీలకు కనీసం ఆహారం కూడా అందివ్వకపోవడాన్ని ఒక విధానంగా అధికారులు అమలు చేస్తున్నారంటూ ఇజ్రాయెల్‌కు చెందిన మానవ హక్కుల సంస్థలు ఇచ్చిన ఫిర్యాదుపై సుప్రీంకోర్టు పైవిధంగా స్పందించింది. ఖైదీల ప్రాథమిక మనుగడకు రోజులో మూడు భోజనాలు అందించడం ప్రభుత్వ చట్టపరమైన విధి అని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు వెలువరించింది. అధికారులు అమలు చేయాలని ఆదేశించింది. అదేవిధంగా, అసోసియేషన్ ఫర్ సివిల్ రైట్స్ ఇన్ ఇజ్రాయెల్(అక్రి), ఇజ్రాయెలీ రైట్స్ గ్రూప్ గిషాలు గతేడాది వేసిన పిటిషన్‌పై విచారణకు సైతం తాజాగా అంగీకరించింది. దీనిని అనూహ్య పరిణామంగా పేర్కొంటున్నారు. ఇజ్రాయెల్ జైళ్లలోని ఖైదీలకు అందించే ఆహారంపై ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆంక్షలు పెడుతోందని, వారిని ఆకలి చావులకు గురి చేస్తోందని పిటిషనర్లు ఆరోపించారు. దీనిపై సుప్రీంకోర్టు...'మేం సుఖవంతమైన లేదా విలాసవంతమైన జీవనం గురించి మాట్లాడటం లేదు. చట్ట ప్రకారం మనిషి మనుగడకు అవసరమైన ప్రాథమిక పరిస్థితుల కల్పనపైనే మాట్లాడుతున్నాం'అని పేర్కొంది. అత్యంత దుర్మార్గులైన మన శత్రువుల మాదిరిగా మనం వ్యవహరించరాదని వ్యాఖ్యానించింది. 2023 అక్టోబర్ 7వ తేదీ నుంచి గాజాలోని హమాస్ శ్రేణులు లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు మొదలయ్యాక.. ఇజ్రాయెల్‌లోని జైళ్లలో కనీసం 61 మంది పాలస్తీనియన్లు చనిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మార్చిలో 17 ఏళ్ల పాలస్తీనా వాసి చనిపోయాడు. ఆకలి బాధతోనే ఇతడు తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇలా ఉండగా, సుప్రీంకోర్టు రూలింగ్‌పై ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇటమర్ బెన్ గ్విర్ తీవ్రంగా స్పందించారు. జడ్జీలు అసలు ఇజ్రాయెలీయులేనా? అని ప్రశ్నించారు. ఒకవైపు గాజాలోని ఇజ్రాయెల్ బందీలకు సాయం చేసే వారే లేకపోగా, హమాస్‌కు సుప్రీంకోర్టు మద్దతు పలకడం సిగ్గు చేటన్నారు. చట్ట ప్రకారమే జైళ్లలో కనీస పరిస్థితులను కల్పిస్తున్నామని, ఇందులో ఎటు వంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. అయితే, సుప్రీంకోర్టు తీర్పు మేరకు అధికా రులు తక్షణమే చర్యలు తీసుకోవాలని అక్రి డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ జైళ్లు టార్చర్ క్యాంపుల్లాగా మారరాదని పేర్కొంది. 'ప్రభుత్వం ప్రజలను ఆకలిబాధకు గురి చేయరాదు. ప్రజలు ప్రజలనే చంపుకుంటారా? వాళ్లు ఎలాంటి నేరానికి పాల్పడ్డారనేది తర్వాతి విషయం'అని స్పష్టం చేసింది.

యువ శ్వాసపై హెచ్చరిక

వేగంగా క్షీణిస్తున్న ఊపిరితిత్తుల ఆరోగ్యంపై నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ: దేశంలో యువత ఊపిరితిత్తుల ఆరోగ్యం వేగంగా క్షీణిస్తోందని నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. ఏడాదికి 81,700 చొప్పున కొత్త కేసులు నమోదవుతున్నట్లు చెబుతున్నారు. పరిస్థితి తీవ్రతకు అద్దం పెట్టే గణాంకాలివి. ఎప్పుడో వృద్ధాప్యంలో రావాల్సిన ఈ సమస్య ఇప్పుడే మొదలుకావడమన్నదే ఆందోళన కలిగించే విషయం. ట్రాఫిక్ రద్దీలో ఎక్కువ దూరం వెళ్లే నిపుణులు, కాలుష్య వాతావరణమున్న క్లాస్ రూముల్లో ఎక్కువ సేపు కూర్చునే విద్యార్థులు విష పూరిత వాయువులను నిత్యం పీలుస్తూ తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నట్లు నిపుణులు తేల్చారు. అయితే, ఈ సమస్య వారు ఎక్కువగా పనిచేసి, సమాజానికి ఉత్పాదకతను అందించే సమయానికి బయటపడుతోందని చెబుతున్నారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన రెస్పికాన్ సదస్సులో ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ వత్సలా అగర్వాల్ ఈ వివరాలను వెల్లడించారు. శ్వాసకోశ ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతో ఉందని ఆమె పేర్కొన్నారు.

'స్వచ్ఛమైన గాలి నేడు విలాస వస్తువు కాదు. ఇదో ప్రాథమిక హక్కు. దీనినే మనం ప్రధాన అజెండాగా తీసుకోవాలి. యువత ఊపిరితిత్తులను రక్షించుకోవడమంటే దేశ ఆర్థిక, సామాజిక నిర్మాణాన్ని కాపాడుకోవడమే. దేశ వర్తమాన, భవిష్యత్తును ఈ కాలుష్యం చిదిమేకుండా చూసుకోవాలి'అని డాక్టర్ వత్సల పేర్కొన్నారు. 'గతంలో ఊపిరితిత్తుల కేన్సర్, సీఓపీడీ, టీబీ వంటి వ్యాధులు వృద్ధుల్లోనే కనిపిస్తాయనే అనుకునేవాళ్లం. ప్రస్తుతం యువతలో ఇవి వేగంగా పెరుగుతున్నాయి'అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రాణనష్టంతోపాటు ఆర్థిక విపత్తు భయాలను పెంచుతోందన్నారు.

- ఉదయాన్నే పొగలో పరుగెత్తే యువత, ట్రాఫిక్‌లో అత్యధిక సమయం ప్రయాణించే ఉద్యోగులు, కలుషిత తరగతి గదుల్లో కూర్చునే విద్యార్థుల ఊపిరితిత్తుల ఆరోగ్యం నిత్యం క్షీణిస్తోంది. కంటికి కనిపించని ఉత్పాతం దీర్ఘకాలంలో వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది.
- వంటగదిలో వచ్చే పొగ కూడా మహిళల్లో క్యాన్సర్ ముప్పును పెంచుతోంది. చిన్నారులపైనా కాలుష్య ప్రభావం అధికంగా ఉంటోంది. ప్రపంచవ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారుల్లో న్యుమోనియా కేసుల సంఖ్య 14 శాతంగా ఉంది.
- భారత్‌లో క్షయ తీవ్రత ఎక్కువగానే ఉంది. ప్రతి లక్ష మందికి 195 కేసులు నమోదు అవుతున్నాయి. ఇది ప్రపంచంలోనే అత్యధికం.
- సూక్ష్మ రేణువులు, కాలుష్యం బారినపడకుండా తగ్గించడంతోపాటు సీఓపీడీ, ఆస్తమా, క్షయ వంటి కేసుల్లో నిబంధనలు పాటించినట్లయితే ఏటా వేల మంది ఆస్పత్రి చేరికలను తగ్గించుకోవచ్చని రెస్పికాన్ 2025 ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ కె.చావ్లా వెల్లడించారు.
- నేటి యువత స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోలేకపోతే.. దేశ భవిష్యత్తు ఇబ్బందికంగా మారుతుందని రెస్పికాన్ 2025 నిర్వహణ కార్యదర్శి ఆదిత్య కె. చావ్లా పేర్కొన్నారు. శ్వాసకోశ ఆరోగ్య రక్షణపై ఏర్పాటు చేసిన ఈ సదస్సులో సీనియర్ శ్వాసకోశ నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులు, అంతర్జాతీయ నిపుణులు సహా దాదాపు 1,200 మంది పాలు పంచుకున్నారు.
- స్వచ్ఛమైన గాలి అందించడం, టీబీ బాధితుల సంరక్షణ, వ్యాక్సినేషన్‌ను పెంచడం, ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం వంటి చర్యలపై నిపుణులు ఈ సమావేశంలో చర్చించారు. విషపూరిత గాలి సగటు భారతీయుల ఆయుర్దాయాన్ని వెయ్యి రోజుల మేర తగ్గిస్తోందని, చదీవప్పుడూ కాకుండా నష్టాన్ని కలిగిస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు.

టారిఫ్‌లు సబబే: జెలెన్‌స్కీ

వాషింగ్టన్: రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తోందనే సాకుతో భారత్‌పై 50 శాతం టారిఫ్‌లు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమర్థించారు. అది సరైన ఆలోచన అంటూ వెనకేసుకొచ్చారు. అయితే, భారత్ పేరును నేరుగా ఆయన ప్రస్తావించకపోవడం గమనార్హం. 'రష్యాతో ఒప్పందాలు చేసుకునే దేశాలపై టారిఫ్‌లు విధించాలనే ఆలోచన నాకు బాగా నచ్చిందిం. ఇది సరైందేనని భావిస్తున్నా'అని ఆదివారం ఏబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో జెలెన్‌స్కీ అన్నారు. ఇటీవల చైనాలో జరిగిన ఎస్‌సీవో శిఖరాగ్ర సందర్భంగా భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లు కలిసి ఉన్న ఫొటోలను చూస్తుంటే ఆంక్షలు వికటించాయని భావిస్తున్నారా అని అడిగిన ప్రశ్నకు జెలెన్‌స్కీ పైవిధంగా స్పందించారు. ప్రధాని మోదీ ఎస్‌సీవో భేటీకి బయలుదేరే ముందు ఆగస్టు 30వ తేదీన జెలెన్‌స్కీ ఫోన్ చేసి మాట్లాడారు. ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారం కనుగొనే ప్రయత్నాలకు భారత్ సంపూర్ణ మద్దతునిస్తుందని ప్రధాని మోదీ చెప్పారు.

కాంగ్రెస్ ఆరోపణలను ఖండించిన ట్రాయ్

న్యూఢిల్లీ: 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు చోరీపై తమ పార్టీ కేడర్‌కు ఎస్ఎంఎస్‌లు పంపేందుకు అనుమతి కోరుతూ పెట్టుకున్న దరఖాస్తును ట్రాయ్ తిరస్కరించిందంటూ కాంగ్రెస్ ఆరోపించింది. నిరసనకు సంబంధించిన కంటెంట్ అంటూ ట్రాయ్ అభ్యంతరం తెలిపిందని పేర్కొంది. మహారాష్ట్ర ఎన్నికల్లో మోసం జరిగిందనేందుకు పక్కా ఆధారాలున్నా కేంద్ర హోం శాఖ, ఎన్నికల కమిషన్, టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ పకడ్బందీగా వ్యవహరిస్తూ సమాచారాన్ని తొక్కిపట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్‌కు చెందిన డేటా అనలైటిక్స్ విభాగం చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలపై ట్రాయ్ స్పందించింది. మహారాష్ట్రలోని రాజకీయ పార్టీ కేడర్‌కు ఎస్ఎంఎస్‌లు పంపేందుకు సంబంధించి తమకు ఎలాంటి దరఖాస్తు అందలేదని ట్రాయ్ స్పష్టం చేసింది. వ్యక్తిగత ఎస్ఎంఎస్‌లకు సైతం అనుమతులిచ్చేది తాము కాదని కుండబద్దలు కొట్టింది. ఈ ప్రక్రియతో తమకు ఎటువంటి సంబంధం ఉందని పేర్కొంది. అయితే, ఆ పార్టీ ఎస్‌టీపీఎల్ అనే సర్వీస్ ప్రొవైడర్‌కు దరఖాస్తు పంపగా తిరస్కరణకు గురైందని వివరించింది. ఇందుకు సంబంధించిన ఫొటోను ఎక్స్‌లో షేర్ చేసింది.

ఆర్మీ కమాండోలకు సిక్కింలో శిక్షణ

కోల్‌కతా: భారత సైన్యంలోని పారా స్పెషల్ బలగాలు, నేవీలోని మెరైన్ కమాండోలు మార్కోస్‌కు సిక్కింలోని పర్వత ప్రాంతాల్లో వారంపాటు ప్రత్యేక శిక్షణ కొనసాగింది. రాష్ట్రంలోని 17 వేల అడుగుల ఎత్తయిన పర్వత ప్రాంతాల్లో గడ్డకట్టే చలిలో వీరు స్కూబా, కంబాట్ డైవింగ్ సాధన చేశారని రక్షణ శాఖ అధికారి ఒకరు సోమవారం వెల్లడించారు. ఓపెన్ సర్క్యూట్ ఎయిర్ డైవింగ్, క్లోజ్డ్ సర్క్యూట్ ప్యూర్ ఆక్సిజన్ డైవింగ్‌తోపాటు అత్యంత చల్లని నీటిలో 17 మీటర్ల లోతు వరకు డైవ్ చేయడం వంటివి ఇందులో ఉన్నాయన్నారు. హిమాలయ శిఖరాల నుంచి సముద్ర గర్భం వరకు వేర్వేరు ప్రాంతాల్లో అత్యంత కఠినమైన పరిస్థితులకు సైతం తట్టుకునేలా ప్రత్యేక బలగాలను సర్వసన్నద్ధంగా ఉంచడమే ఆగస్టు 30–సెప్టెంబర్ 5వ తేదీల మధ్య సాగిన ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.

ఆర్ఎస్ఎస్ అగ్రనేత హొసబలెకు అస్వస్థత

జోధ్‌పూర్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధాన కార్యదర్శి(సర్‌కార్యవాహ్) దత్తాత్రేయ హొసబళె(70) సోమవారం అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌లో మూడు రోజులపాటు జరిగిన ఆర్ఎస్ఎస్, అనుబంధ సంస్థల భేటీ ఆదివారంతో ముగిసింది. ఈ సమావేశాల్లో హొసబళె పాల్గొన్నారు. సోమవారం ఆయన హై బీపీతో అస్వస్థతకు గురికావడంతో జోధ్‌పూర్‌లోని ఎయిమ్స్‌లో చేర్చారు. వైద్యుల బృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగయ్యిందని పేర్కొన్నాయి. ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నట్లు వైద్యులు తెలిపారని ఆర్ఎస్ఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్ఎస్ఎస్‌లో చీఫ్ మోహన్ భగవత్ తర్వాతి స్థానం హొసబళెదే.

జీన్ కరోల్ పరువు నష్టం కేసులో ట్రంప్‌కు షాక్

న్యూఢిల్లీ: కాలమిస్టు ఈ. జీన్ కరోల్ వేసిన పరువు నష్టం కేసులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ 8.33 కోట్ల డాలర్ల(సుమారు రూ.733 కోట్లు) చెల్లించాలంటూ సివిల్ జ్యూరీ ఇచ్చిన తీర్పును న్యూయార్క్‌లోని ఫెడరల్ అప్పీల్స్ కోర్టు సమర్థించింది. ట్రంప్ చేసిన అప్పీల్‌ను తోసిపుచ్చింది. జ్యూరీ పేర్కొన్న పరిహారం సహేతుకంగానే ఉందని సోమవారం రూలింగ్ వెలువరించింది. అధ్యక్షుడిగా తనకు మినహాయింపు ఉంటుందని సుప్రీంకోర్టు తెలిపిందని, పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదంటూ ట్రంప్ చేసిన వాదనను తిరస్కరించింది. 1996లో మన్‌హట్టన్ డిపార్టుమెంట్ స్టోర్‌లో జీన్ కరోల్‌పై ట్రంప్ లైంగిక దాడికి పాల్పడ్డారు. దీనిపై కోర్టు ఆయనకు 5 మిలియన్ డాలర్ల(రూ.400 కోట్ల) జరిమానా విధించింది. గత డిసెంబర్‌లో అప్పీల్స్ కోర్టు ఈ తీర్పును సమర్థించింది కూడా. అయితే, సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పదేపదే జీన్ కరోల్ లక్ష్యంగా ఆరోపణలు, వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దీనిపై ఆమె పరువు నష్టం కేసు వేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం రూ.733 కోట్లు పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది.

గాజాలో బహుళ అంతస్తుల భవనం నేలమట్టం

జెరూసలేం: గాజా నగరంలో ఇజ్రాయెల్ ఆర్మీ విధ్వంస చర్యలు కొనసాగుతున్నాయి. గత కొన్ని రోజులుగా నగరంలోని బహుళ అంతస్తుల భవనాల కూల్చివేతలను కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ సోమవారం మరో 12 అంతస్తుల భవనాన్ని నేలమట్టం చేసింది. దక్షిణ ప్రాంతంలోని మానవతా జోన్‌లోకి వెళ్లిపోవాలని అంతకు గంటన్నరముందు ఆ భవనంలోని వారికి హెచ్చరికలు చేసింది. వారంతా ఖాళీ చేశాక బాంబులతో శిథిలాల దిబ్బగా మార్చేసింది. హమాస్ శ్రేణులు ఇటువంటి భవనాలను తమపై నిఘా వేసేందుకు వాడుకుంటున్నాయన్నది ఇజ్రాయెల్ వాదన. ఇలా ఉండగా, 24 గంటల వ్యవధిలో ఇజ్రాయెల్ జరిపిన కాల్పుల్లో కనీసం 65 మంది చనిపోగా, 320 మంది గాయపడినట్లు గాజా ఆరోగ్య విభాగం తెలిపింది.

ఆ ప్రతిపాదన మాకు ఓకే: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన కాల్పుల విరమణ ప్రతిపాదనకు అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయెల్ తెలిపింది. దీనిని అంగీకరించకుంటే తీవ్ర పరిణామాలుంటాయంటూ అంతకుముందు ఆయన హమాస్‌కు చివరి హెచ్చరిక చేశారు. ముందుగా తాత్కాలిక కాల్పుల విరమణ పాటించడం, ఆ వెంటనే బందీలందరినీ హమాస్ విడుదల చేయడం, జైళ్లలో ఉన్న 3 వేల మంది ఖైదీలను ఇజ్రాయెల్ విడిచిపెట్టడం ఈ ప్రతిపాదనలోని ముఖ్యాంశాలు. గాజాలో ఇజ్రాయెల్ అంగీకరించిన మేరకు ప్రభుత్వం ఏర్పాటయ్యాక బలగాల పూర్తి ఉపసంహరణ కూడా ఉంది. అయితే, ట్రంప్ ప్రతిపాదనను అంగీకరించడమంటే అవమానపూర్వక లొంగుబాటును ప్రకటించడమేనని హమాస్ అభివర్ణించింది. చర్చలు కొనసాగించేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నామని తెలిపింది. అమెరికా నుంచి అందిన ఈ కొత్త ప్రతిపాదన గతంలో వాటికంటే కాస్త విస్తృతంగానే ఉంది. హమాస్‌ను నిరాయుధురాలిగా మార్చడం, ఇజ్రాయెల్ బలగాను ఉపసంహరించడం, యుద్ధాన్ని ముగించడం వంటి వాటిపై మరింత విస్తృతంగా చర్చలు జరపాల్సిన అవసరం ఉంది'అని ఈజిప్టు అధికారి ఒకరు తెలిపారు.

మరొకరి వీపుపై కూర్చుని.. వరద ప్రాంతాల్లో ఎంపీ పర్యటన

న్యూఢిల్లీ: ఇద్దరు వ్యక్తులు మోసుకెళ్తుండగా, వరద ప్రభావిత ప్రాంతాలను తిలకిస్తున్నట్లుగా ఉన్న ఎంపీ తారిఖ్ అన్వర్‌కు సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో తెగ వైరలవుతోంది. కాంగ్రెస్ నేత, బిహార్‌లోని కటిహార్ ఎంపీ అయిన తారిఖ్ అన్వర్ తన నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటనకు సోమవారం బయలుదేరారు. వరద ప్రభావిత ప్రాంతాలను స్వయంగా పరిశీలించాలనుకున్నారు. అయితే, ఓ వ్యక్తి మోస్తుండగా ఆయన పర్యటన కొనసాగించారు. ఎంపీ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఓ వ్యక్తి వీపుపై మోసుకెళ్తుండగా వరదలతో నష్టపోయిన ప్రాంతాలకు వెళ్లి బాధితులతో మాట్లాడారని అధికారులు తెలిపారు. ఆయనకు ఆరోగ్యం సరిగా లేకున్నా మారుమూల ప్రాంతాలకు వెళ్లారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ యాదవ్ పేర్కొన్నారు. ఎంపీ తారిఖ్ అన్వర్ తీరును బీజేపీ తప్పుబట్టింది. వరద ప్రభావిత ప్రాంతాలకెళ్లినా కాంగ్రెస్ నేతలకు వీవీఐపీ ప్రొటోకాల్ కావాల్సి వచ్చిందా? అని ఆ పార్టీ నేత పూనావాలా పేర్కొన్నారు. 'కాంగ్రెస్ ఎంపీ వీవీఐపీ మోడ్. రాహుల్ గాంధీ వెకేషన్ మోడ్. ఆమ్‌ఆద్మీ పార్టీ హైడింగ్ మోడ్. ప్రధాని మోదీ మాత్రమే వర్క్ మోడ్'అని వ్యాఖ్యానించారు.

కలెక్టర్ వ్యవస్థను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్

రాజ్యాంగం పనితీరును సమీక్షించడానికి ఎన్డీఏ ప్రభుత్వం 2000 ఫిబ్రవరి 22న జస్టిస్ ఎం.ఎన్.వెంకటాచలయ్య అధ్యక్షతన 10 మంది సభ్యులతో భారత రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

ఈ కమిషన్ సభ్యుడు పి.ఎ. సంగ్మా కమిషన్ నివేదిక సమర్పించక ముందే రాజీనామా చేశారు. ఈ కమిషన్‌కు కార్యదర్శిగా డా.రఘువీర్‌సింగ్ వ్యవహరించారు. ఈ కమిషన్ రచనా సంఘం 2001 సెప్టెంబర్‌లో డా.సుభాష్ సి.కశ్యప్ అధ్యక్షతన ఇద్దరు సభ్యులతో ఏర్పడింది. రచనా సంఘంలో కె.పరాశరన్, డా. అబిద్ హుస్సేన్‌లను సభ్యులుగా నియమించారు. ఈ రాజ్యాంగ సమీక్ష సంఘం 18 పర్యాయాలు సమావేశమై 46 రోజులు సంప్రదింపులు జరిపింది. రాజ్యాంగ సమీక్ష కమిషన్ 2002 మార్చి 11న తన అధ్యయన నివేదికను ఆమోదించింది. 2002 మార్చి 31న అధ్యయన నివేదికను నాటి ప్రధానమంత్రి వాజ్‌పేయికి సమర్పించింది. ఈ కమిషన్ 249 సిఫారసులతో 11 శీర్షికలుగా నివేదికను రూపొందించింది.

సూచనలు:

- ఏడాదిలో కనీసం 80 రోజులు వేతనం అందేలా గ్రామాల్లో ఉపాధి పొందే హక్కును కల్పించడం.
- భారత రాజ్యాంగంలోని 4వ భాగం శీర్షిక-రాజ్యాంగ విధాన 'ఆదేశిక సూత్రాలు' అనే చర్యగా సవరించాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గురించి, ప్రాథమిక విధులకు సంబంధించి పౌరులకు తగిన అవగాహన, పరిజ్ఞానం కల్పించే చర్యలు చేపట్టాలి.
- ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల వ్యయాన్ని ప్రభుత్వమే భరించేలా సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాలి.
- రాజకీయ పార్టీలన్నీ మహిళలకు 30 శాతం స్థానాలు కేటాయించాలి.
- పార్లమెంటు ఏడాదికి 120 రోజులు సమావేశం కావాలి. రాజ్యసభ 100 రోజులు సమావేశం కావాలి. రాష్ట్రాల శాసన సభలు కూడా ఏడాదికి 90 రోజులు సమావేశం కావాలి.
- కార్యనిర్వహణ శాఖ, ప్రభుత్వ పాలన, అధికారుల్లో బాధ్యత, జవాబుదారీతనం పెంపొందించడానికి సామాజిక తనిఖీ వ్యవస్థను ప్రవేశపెట్టాలి.
- కేంద్ర, రాష్ట్ర సంబంధాలు బలంగా ఉండాలి, అంతర్రాష్ట్ర మండలి ద్వారా కేంద్ర ప్రభుత్వం వైయుక్తికంగా, సమష్టిగా రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలి.
- న్యాయశాఖలో మార్పులు చేపడుతూ, జాతీయ న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.
- అధికార వికేంద్రీకరణ,స్వావలంబన, గ్రామ పంచాయతీలను స్వయం పాలనా సంస్థలుగా ప్రకటించి వాటికి ప్రత్యేక అధికారాలు కేటాయించాలి.
- వ్యవస్థీకృతమైన మార్పులు జరగాలి. సాంఘిక, ఆర్థిక మార్పులతో పాటు అభివృద్ధి క్రమం విస్తరించాలి. మైనారిటీ వర్గాల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి చర్యలు చేపట్టాలి.

లక్ష్యాలు

- దేశంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సమర్థవంతమైన, జవాబుదారీతనం, పారదర్శకత, నీతివంతమైన పాలన కోసం ఏ మేరకు రాజ్యాంగపరమైన అంశాలు దోహదపడతాయనే అంశాలను సునిశితంగా పరిశీలించి సూచనలు చేయడం.
- రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భంగం కలగకుండా రాజ్యాంగపరమైన అంశాల్లో అవసరమైన క్రమానుగత మార్పులను సూచించడం.
- పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంవిధానం మేరకు ఆధునిక భారతదేశ ఆర్థిక, సాంఘిక, రాజకీయ అభివృద్ధి సాధనకు సవివరమైన సూచనలు చేయడం.

జిల్లా కలెక్టర్

దేశంలో జిల్లా కలెక్టర్ పదవిని 1772లో వారన్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా ఉన్నప్పుడు ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యానంతరం ఐఏఎస్‌కు చెందిన అధికారి జిల్లా కలెక్టర్‌గా నియమితులవుతున్నారు. జిల్లా కలెక్టర్ హోదాను ఫ్రాన్స్ లోని ప్రిఫెక్ట్ అనే పదవితో పోల్చుతారు.

అధికారాలు-విధులు

1) రెవెన్యూ విధులు
2) న్యాయపరమైన విధులు
3) ఎన్నికల నిర్వహణ
4) ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయినవారిని ఆదుకోవడం
5) అభివృద్ధి కార్యక్రమాల అమలు
6) జనాభా లెక్కల సేకరణ
7) స్థానిక సంస్థలపై పర్యవేక్షణ.

నోట్: జిల్లా కలెక్టర్‌కు అనేక అంశాలతో జిల్లా పరిషత్‌లకు సంబంధం ఉంటుంది. జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలకు శాశ్వత ఆహ్వానితుడి హోదాలో కలెక్టర్ హాజరవుతాడు. జిల్లా పరిషత్ పనితీరు గురించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను పంపిస్తాడు. జిల్లా పరిషత్‌లోని వివిధ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తాడు.



జాతీయ న్యాయ మండలి

న్యాయమూర్తులను జవాబుదారీ చట్రంలోకి తెచ్చే దిశగా న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. న్యాయమూర్తులపై వచ్చే ఆరోపణలపై విచారణ చేయడానికి, దోషులుగా తేలిన న్యాయమూర్తులను తొలగించడానికి వీలుగా ఉండే 'The Judges Bill - 2006ను తీసుకురావాలని అప్పట్లో కేంద్ర మంత్రి మండలి నిర్ణయించింది. 2006 నవంబర్ 9న నాటి ప్రధాని అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఒక విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత, జడ్జీలను జవాబుదారీ చేయడం ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. న్యాయమూర్తులపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులను విచారించడానికి జాతీయ న్యాయ మండలి (ఎన్‌జేసీ) ఏర్పాటు చేయాలని ఈ బిల్లు పేర్కొంటుంది. దీనికోసం 1968 జడ్జీల చట్టానికి సవరణ తీసుకొస్తారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మినహా ఇతర జడ్జీల్లో ఎవరిపై ఆరోపణలు వచ్చినా ఎన్‌జేసీ విచారిస్తుంది. జాతీయ న్యాయ మండలిలో భారత ప్రధాన న్యాయమూర్తితో పాటు సుప్రీం కోర్టులోని ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు, మరో ఇద్దరు సీనియర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు. ఒకవేళ సుప్రీం కోర్టులోని జడ్జిపై ఫిర్యాదును విచారించాల్సివస్తే హైకోర్టు న్యాయమూర్తుల స్థానంలో మరో ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేస్తారు. జడ్జీలపై తప్పుడు ఆరోపణలు చేస్తే అతడికి ఏడాది జైలు, రూ. 25 వేల వరకు జరిమానా విధిస్తారు. ఈ న్యాయ మండలి నేరుగా లేదా లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్‌పర్సన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తుంది. ఫిర్యాదుదారు, జడ్జి ఎవరనేది రహస్యంగా ఉంచేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా నెల పాటు శిక్ష, రూ. 500 జరిమానా లేదా రెండూ అమలు చేయవచ్చు. ఫిర్యాదులను ఎన్‌జేసీ రహస్యంగా విచారిస్తుంది. జడ్జి దుష్ప్రవర్తన, అసమర్థతతో వ్యవహరించినట్లు రుజువైతే.. అతడ్ని తొలగించాల్సిన అవసరం లేదని న్యాయ మండలి భావిస్తే, ఈ కింది చర్యలు తీసుకోవచ్చు.

- సలహాలు ఇవ్వడం.
- హెచ్చరికలు చేయడం
- స్వచ్ఛంద పదవీ విరమణ చేయాలని కోరడం.
- బహిరంగంగా లేదా రహస్యంగా మందలించడం లేదా అభిశంసించడం చేస్తుంది.

ఒకవేళ న్యాయమూర్తి తొలగింపు తప్పదని భావిస్తే, ఆ మేరకు రాష్ట్రపతికి న్యాయ మండలి సిఫారసు చేస్తుంది. దీన్ని స్వీకరించిన రాష్ట్రపతి మండలి గుర్తించిన అంశాలు, సంబంధిత నివేదికలను, సిఫారసులను పార్లమెంటు ఉభయసభల్లో ప్రవేశపెట్టాలని కోరతాడు. అప్పుడు జడ్జి తొలగింపు కోసం రాష్ట్రపతికి అభ్యర్థన చేస్తూ సభలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశ పెడుతుంది. ఆ తీర్మానం ఆమోదం ద్వారా తొలగింపునకు గురైన న్యాయమూర్తి వివిధ రకాల విధులకు అనర్హుడవుతారు. లా కమిషన్ 195వ నివేదికలో చేసిన సిఫారసుల ప్రాతిపదికన ఈ నూతన బిల్లును రూపొందించారు. జస్టిస్ వెంకటాచలయ్య కమిటీ, జాతీయ లా కమిషన్‌లు న్యాయమూర్తులను జవాబుదారీ చట్రంలోకి తీసుకురావాలని సిఫారసు చేశాయి.

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం

పదవి, డబ్బులకోసం సభ్యులు పార్టీలు మారడం 1967 తర్వాత ఎక్కువగా జరిగాయి. దీన్నే ఫ్లోర్ క్రాసింగ్ అంటారు. పార్టీ ఫిరాయింపులను నివారించడానికి 1985లో 52వ రాజ్యాంగ సవరణ చేశారు. పార్టీ ఫిరాయింపు చట్టం ప్రకారం ఈ కింది కారణాలతో సభ్యులను తొలగించవచ్చు.

- పార్టీ సభ్యుడు తాను ఎన్నికైన పార్టీకి స్వచ్ఛందంగా రాజీనామా చేసినప్పుడు.
- పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా సభలో తన ఓటు హక్కును వినియోగించినప్పుడు, ముందుగా అనుమతి తీసుకోకుండా ఓటింగ్‌కు గైర్హాజరైనప్పుడు.

అయితే అత్యవసర కారణాల వల్ల సభకు రాలేకపోయాడని గైర్హాజరైన 15 రోజుల లోపు పార్టీ గుర్తిస్తే పార్టీ ఫిరాయింపు చట్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉంది. 1942లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పార్టీలు జారీ చేసే విప్.. విశ్వాస, అవిశ్వాస తీర్మానాలకు మాత్రమే వర్తిస్తుంది. దీని ప్రకారం ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. స్వతంత్రంగా ఎన్నికైన సభ్యుడు ఏదైనా పార్టీలో చేరితే సభ్యత్వం కోల్పోతాడు. నామినేటెడ్ సభ్యుడు ఆరు నెలల తర్వాత ఏదైనా పార్టీలో చేరితే సభ్యత్వం కోల్పోతాడు.

ముఖ్యాంశాలు:

- భారత రాజ్యాంగంలో రాజకీయ పార్టీ అనే పదం 10వ షెడ్యూల్‌లో మాత్రమే ఉంది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హయాంలో 52వ రాజ్యాంగ సవరణ చేసి ఫిరాయింపుల చట్టానికి సంబంధించి 102(2), 191(2) అధికరణలను చేర్చారు.
- దేశంలో రాజకీయ పార్టీలు రాజ్యాంగ బద్ధమైనవి కావు. అవి కేవలం చట్టబద్ధంగా ఎన్నికల కమిషన్ ద్వారా గుర్తింపు పొంది ఏర్పాటయ్యాయి.

వర్తించని సందర్భాలు:

- పార్టీలలో చీలిక ఏర్పడి మూడో వంతు సభ్యులు గ్రూప్‌గా ఏర్పడితే ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలోకి రాదు.
- పార్టీ సభ్యుల్లో 2/3వ వంతు సభ్యులు వేరే పార్టీలో చేరినప్పుడు కూడా ఈ చట్టం పరిధిలోకి రాదు.
- లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌లు తమ పదవులు వదిలి వారి పార్టీల్లో చేరినప్పుడు వారికి ఈ చట్టం వర్తించదు. రాష్ట్రాల్లో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.
- పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అమలు విషయంలో చైర్మన్, స్పీకర్‌దే అంతిమ నిర్ణయం.
- రాజకీయ పార్టీల్లో చీలికలను నిరోధించడానికి, రాష్ట్రాల్లో మంత్రివర్గ పరిమాణాన్ని నియంత్రించడానికి ఉద్దేశించిన 97వ రాజ్యాంగ సవరణ బిల్లు, 91వ రాజ్యాంగ సవరణ చట్టం 2003గా అమల్లోకి వచ్చింది. ఈ బిల్లు ప్రకారం పార్టీ నుంచి ఎంతమంది ఫిరాయించినా వారు అనర్హులవుతారు. తిరిగి పోటీ చేసి గెలిచే వరకూ వారు ప్రతిఫలాన్నిచ్చే ఏ పదవీ చేపట్టడానికి వీలులేదు.
- పార్టీ అధ్యక్షుడి ఫిర్యాదు మేరకు స్పీకర్ వారి సభ్యత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉంటుంది.

సభ్యత్వం రద్దు-సుప్రీంకోర్టు తీర్పు

1993లో కిహోటో ఉలాహన్ వర్సెస్ జాచి లు కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ.. సభ్యుడి సభ్యత్వం రద్దుపై స్పీకర్(సభాధ్యక్షుడు)ది తుది నిర్ణయం కాదని వారి నిర్ణయం న్యాయసమీక్షకు లోబడి ఉంటుందని పేర్కొంది.

ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ

క్రిమినల్ కేసుల్లో కోర్టు దోషులుగా నిర్ధారించిన వ్యక్తులు శిక్ష అనుభవిస్తున్న కాలం తర్వాత మరో ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసే వీలు లేకుండా ప్రజాప్రాతినిధ్యం చట్టం (సవరణ) బిల్లును లోక్‌సభ ఆమోదించింది. నేర చరితులను చట్ట సభలకు దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణ చేస్తున్నారు. గతంలో దీర్ఘకాలం శిక్షపడిన వ్యక్తులు తొలి ఆరేళ్లలో పోటీ చేయలేకపోయినా తర్వాత జైలులో ఉండి పోటీ చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు అలాంటి అవకాశం లేకుండా చేశారు. అవినీతి నిరోధక చట్టం, తీవ్రవాద నిరోధక చట్టం కింద శిక్షపడిన వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు. అవినీతి నిరోధక చట్టం కింద కనీసం రెండు సంవత్సరాలు శిక్షపడినా అనర్హత వర్తిస్తుంది.

రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్	ఎం.ఎన్. వెంకటాచలయ్య (అధ్యక్షుడు)
సభ్యులు..	
జస్టిస్ బి.పి.జీవన్‌రెడ్డి (ఛైర్మన్ లా కమిషన్ ఆఫ్ ఇండియా)	కె.పరాశరన్ (మాజీ అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా)
జస్టిస్ ఆర్.ఎస్.సర్కారియా (సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి)	డాక్టర్. సుభాష్ సి.కశ్యప్ (లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్)
జస్టిస్ కె.పున్నయ్య (ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి)	సి.ఆర్.ఇరానీ (ది స్టేట్స్‌మన్ పత్రిక చీఫ్ ఎడిటర్)
పి.ఎ.సంగ్మా (లోక్‌సభ మాజీ స్పీకర్)	అబిద్ హుస్సేన్ (యూఎస్‌ఏలో భారత మాజీ రాయబారి)
సోలీ జె.సొరాబ్జి (అటార్నీ జనరల్)	శ్రీమతి సుమిత్ర జి.కులకర్ణి (మాజీ ఎంపీ)

మాదిరి ప్రశ్నలు

1. రాజ్యాంగ సమీక్ష కోసం ఏర్పాటైన జాతీయ కమిషన్‌కు అధ్యక్షత వహించిన వారు?
   ఎ) పి.ఏ సంగ్మా బి) జస్టిస్ బి.పి జీవన్‌రెడ్డి
   సి) జస్టిస్ ఎంఎన్. వెంకటాచలయ్య
   డి) సీఆర్ ఇరానీ
2. జిల్లా కలెక్టర్ వ్యవస్థను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   ఎ) 1771 బి) 1772 సి) 1773 డి) 1774
3. ఎన్నికల ప్రక్రియలో వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలని సిఫారసు చేసిన కమిషన్?
   ఎ) వీరప్ప మొయిలీ కమిటీ
   బి) రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్
   సి) సర్కారియా కమిషన్ డి) పైవేవీ కావు

సమాధానాలు

1) సి; 2) బి; 3) బి.

తెలంగాణలో అతి పొడవైన జాతీయ రహదారి ఏది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలంగాణ జాగ్రఫీ



రవాణా సౌకర్యాలు

ఒక దేశంలోని ప్రజల ఆర్థిక, సాంఘిక, రాజకీయ, జీవన స్థితిగతులు ఆ దేశంలోని రవాణా సౌకర్యాల అభివృద్ధిపై ఆధారపడి ఉంటాయి. వస్తువులను, ప్రయాణికులను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి చేర్చడాన్ని 'రవాణా' అంటారు. ప్రాథమిక, పారిశ్రామిక, సేవా రంగాల అభివృద్ధిలో రవాణా సౌకర్యాల పాత్ర అత్యంత కీలకం.

రాష్ట్రంలో ప్రధానంగా మూడు రకాల రవాణా సౌకర్యాలు ఉన్నాయి.

అవి:

1. రోడ్డు రవాణా
2. రైల్వే రవాణా
3. వాయు రవాణా

తెలంగాణకు సముద్ర తీర ప్రాంతం లేదు కాబట్టి రాష్ట్రంలో జల రవాణాకు తగిన ప్రాధాన్యం లేదు.

రోడ్డు రవాణా

తెలంగాణ రాష్ట్రంలో 'నిజాం స్టేట్ రైల్వే'లో భాగంగా 1932లో భారతదేశంలోనే మొట్టమొదటి రోడ్డు రవాణా సంస్థను ఏర్పాటు చేశారు. దీని పేరు 'నిజాం రాష్ట్ర రైల్ అండ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్' (ఎన్ఎస్ఆర్-ఆర్‌టీడీ).

- రాష్ట్రంలోని మొదటి రోడ్డు రవాణా సంస్థ 27 బస్సులు, 166 మంది కార్మికులతో ప్రారంభమైంది.
- నిజాం రాజ్య ప్రధానమంత్రి సాలార్జంగ్ చొరవతో హైదరాబాద్- షోలాపూర్ రహదారిని నిర్మించారు.
- 1932లో రహదారులను జాతీయం చేసి ప్రభుత్వమే బస్సులను నడిపింది.
- 1936 నాటికే హైదరాబాద్ నుంచి తెలంగాణలోని అన్ని జిల్లాలకు బస్సులు నడపటం ప్రారంభమైంది.
- ఎన్ఎస్ఆర్-ఆర్‌టీడీ సంస్థను హైదరాబాద్ రాష్ట్రంలో విలీనం చేసిన తేదీ 1951 నవంబర్ 1.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 1965లో 'రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ)'ను ఏర్పాటు చేశారు.
- ప్రస్తుతం రాష్ట్రంలోని రోడ్లు 'తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ' పరిధిలో ఉన్నాయి.
- రాష్ట్రంలో 80 శాతానికి పైగా సరకులు, ప్రయాణికుల రవాణా రోడ్డు మార్గాలపైనే ఆధారపడి ఉంది.

రోడ్లు - రకాలు

రాష్ట్రంలోని రోడ్లను 'ఆర్ అండ్ బీ నెట్ వర్క్' కింద ఉన్న రోడ్లు, 'పంచాయతీ రాజ్' రోడ్లు అని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

ఆర్ అండ్ బీ నెట్‌వర్క్ కింద ఉన్న రోడ్లను తిరిగి జాతీయ రహదారులు (ఎన్‌హెచ్), రాష్ట్ర రహదారులు (ఎస్‌హెచ్), ప్రధాన జిల్లా రహదారులు, గ్రామీణ రోడ్లుగా విభజించవచ్చు.

రాష్ట్రంలో రహదారుల నెట్‌వర్క్:

- రాష్ట్రంలోని మొత్తం జాతీయ రహదారుల విస్తీర్ణం 2,592 కి.మీ.
- రాష్ట్ర రహదారుల పొడవు 3,152 కి.మీ.
- ప్రధాన జిల్లా రహదారుల పొడవు 12,079 కి.మీ.
- గ్రామీణ రహదారుల పొడవు 9,014 కి.మీ.
- జాతీయ రహదారులు మినహాయించి రాష్ట్ర రహదారుల మొత్తం పొడవు 24,245 కి.మీ.

జాతీయ రహదారులు

ఇవి సెంట్రల్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉంటాయి.

- తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదార్లు అధికంగా (266 కి.మీ.) ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉన్నాయి. అతి తక్కువగా హైదరాబాద్‌లో (36 కి.మీ.) ఉన్నాయి.
- రాష్ట్రంలో జాతీయ రహదారుల సాంద్రత100 చ.కి.మీ. ప్రాంతానికి 2.25 కి.మీ.గా ఉంది.
- దేశంలో జాతీయ రహదారుల సాంద్రత 100 చ.కి.మీ. ప్రాంతానికి 2.82 కి.మీ.
- రాష్ట్రంలో అతి పొడవైన జాతీయ రహదారి 'ఎన్‌హెచ్-44', అతి చిన్న జాతీయ రహదారి 'ఎన్‌హెచ్-61'.
- రాష్ట్రంలోని మొత్తం జాతీయ రహదారుల పొడవు 2,592 కి.మీ. ఇందులో..
  - నాలుగు లేన్ల జాతీయ రహదారుల పొడవు 964 కి.మీ.
  - రెండు లైన్ల జాతీయ రహదారుల పొడవు 1264 కి.మీ.
  - మధ్య తరహా (ఇంటర్మీడియెట్) లైన్ జాతీయ రహదారుల పొడవు 153 కి.మీ.
  - సింగిల్ లైన్ జాతీయ రహదారుల పొడవు 211 కి.మీ.

రాష్ట్రంలోని జాతీయ రహదారులు

1. **జాతీయ రహదారి నంబర్ - 44**
   ఇది వారణాసి నుంచి కన్యాకుమారి వరకు ఉంది. దీని పాత నంబర్ - 7. ఇది మహారాష్ట్ర సరిహద్దు నుంచి ఆదిలాబాద్, నిర్మల్, రామాయంపేట, హైదరాబాద్, మహబూబ్‌నగర్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. తెలంగాణలో ఈ రహదారి పొడవు 519.64 కి.మీ.
2. **జాతీయ రహదారి నంబర్ - 65**
   దీని పాత నంబర్ -9. ఇది కర్ణాటక సరిహద్దు నుంచి జహీరాబాద్, హైదరాబాద్, సూర్యాపేట్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 291.74 కి.మీ.
3. **జాతీయ రహదారి నంబర్ - 63**
   దీని పాత నంబర్ -16. ఇది నిజామాబాద్ నుంచి ఆర్మూర్, జగిత్యాల, లక్సెట్టిపేట, చెన్నూర్ మీదుగా మహారాష్ట్రలోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 235.15 కి.మీ.
4. **జాతీయ రహదారి నంబర్ - 167**
   ఇది నూతన రహదారి. ఇది కర్ణాటక సరిహద్దు నుంచి జడ్చర్ల (మహబూబ్‌నగర్) మీదుగా ఎన్‌హెచ్-44ను కలుస్తుంది.
5. **జాతీయ రహదారి నంబర్ - 163**
   దీని పాత నంబర్-202. ఇది హైదరాబాద్ నుంచి జనగాం, వరంగల్, వెంకటాపురం మీదుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. తెలంగాణలో దీని పొడవు 306 కి.మీ.
6. **జాతీయ రహదారి నంబర్ - 30**
   దీని పాత నంబర్-221. ఇది ఆంధ్రప్రదేశ్ సరిహద్దు నుంచి పెనుబలి,కొత్తగూడెం,పాల్వంచ, భద్రాచలం మీదుగా ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 100 కి.మీ.
7. **జాతీయ రహదారి నంబర్ - 61**
   దీని పాత నంబర్ - 222. ఇది రాష్ట్రంలో మహారాష్ట్ర సరిహద్దు నుంచి నర్సాపూర్ మీదుగా నిర్మల్ వరకు ఉంది. తెలంగాణ రాష్ట్రంలో దీని పొడవు 53.6 కి.మీ.
8. **జాతీయ రహదారి నంబర్ - 161**
   ఇది నూతన జాతీయ రహదారి. ఇది సంగారెడ్డి మీదుగా మహారాష్ట్రలోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 140.5 కి.మీ.
9. **జాతీయ రహదారి నంబర్ - 363**
   ఇది నూతన జాతీయ రహదారి. ఇది మహారాష్ట్ర సరిహద్దు నుంచి మహాదేవ్‌పూర్, పరకాల, ఆత్మకూరు ద్వారా ఎన్‌హెచ్-163తో కలుస్తుంది.
10. **జాతీయ రహదారి నంబర్ -365**
    ఇది నూతన జాతీయ రహదారి. ఇది నకిరేకల్ నుంచి తుంగతుర్తి, మహబూబాబాద్, నర్సంపేట మీదుగా మల్లంపల్లి వద్ద ఎన్‌హెచ్-163తో కలుస్తుంది.
11. **జాతీయ రహదారి నంబర్ - 565**
    ఇది కూడా నూతన జాతీయ రహదారి. ఇది నకిరేకల్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది.

- 363, 365, 565 నంబర్ జాతీయ రహదార్ల మొత్తం ఉమ్మడి పొడవు 330 కి.మీ.

12. **జాతీయ రహదారి నంబర్ - 563**
    ఇది నూతన జాతీయ రహదారి. ఎన్‌హెచ్-63పై ఉన్న మంచిర్యాల మీదుగా కరీంనగర్-వరంగల్ ద్వారా ఎన్‌హెచ్-163తో కలుస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 136 కి.మీ.
13. **జాతీయ రహదారి నంబర్ - 365ఎ**
    ఇది కూడా నూతన జాతీయ రహదారి. ఇది ఎన్‌హెచ్-65పై ఉన్న కోదాడ మీదుగా ఖమ్మం - మహబూబాబాద్ ద్వారా ఎన్‌హెచ్ -365తో కలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో దీని పొడవు 75 కి.మీ.
14. **జాతీయ రహదారి నంబర్ - 765**
    ఇది నూతన జాతీయ రహదారి. హైదరాబాద్ నుంచి అమన్‌గల్, వెల్దండ,కల్వకుర్తి,వంగూర్, అచ్చంపేట మీదుగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 196 కి.మీ.

- నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో 768 కి.మీ. పొడవైన జాతీయ రహదారులను 'నేషనల్ హైవేస్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు' కింద నాలుగు లైన్ల రహదారులు గా అభివృద్ధి చేస్తోంది.

రాష్ట్ర రహదారులు

రాష్ట్ర రహదారులు ప్రధానంగా జిల్లాల ప్రధాన కేంద్రాలను రాష్ట్ర రాజధానితో అనుసంధానం చేస్తాయి.

- రాష్ట్ర రహదారులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా ఉన్నాయి.

జిల్లా రహదారులు

తాలూకా కేంద్రాలతో; జిల్లా కేంద్రాలతో; ప్రధాన ఉత్పత్తి ప్రాంతాలు, మార్కెట్ కేంద్రాలను రాష్ట్రీయ రహదారులతో; రైల్వేస్టేషన్‌లతో కలిపే రహదారులను 'జిల్లా రహదారులు' అంటారు.

పంచాయతీరాజ్ రహదారులు

పంచాయతీరాజ్ రహదారుల నిర్మాణం, నిర్వహణను రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షిస్తుంది. ఈ శాఖ గ్రామీణ ప్రాంత రోడ్లు, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, బిల్డింగ్‌లు, కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తుంది.

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)

ఇది హైదరాబాద్ చుట్టూ విస్తరించి ఉంది. ఈ రింగ్ రోడ్డు పొడవు 158 కి.మీ. దీన్ని హైదరాబాద్ మెట్రోపాలిటన్ అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నిర్మించింది. ఈ రింగ్ రోడ్డుకు మరో పేరు 'నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు'.

- పంచాయతీ రాజ్ రోడ్లు అధికంగా ఉన్న జిల్లా - ఉమ్మడి మహబూబ్ నగర్
- పంచాయతీ రాజ్ రోడ్లు అత్యల్పంగా ఉన్న జిల్లా ఉమ్మడి రంగారెడ్డి (హైదరాబాద్ కాకుండా).
- అన్ని రకాల రోడ్లను కలిపి చూసినప్పుడు.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రోడ్ల విస్తీర్ణం అధికంగా, హైదరాబాద్ జిల్లాలో అత్యల్పంగా ఉన్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం రోడ్లను అధికంగా కలిగి ఉన్న ఉమ్మడి జిల్లా ఏది?
   1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
   3) రంగారెడ్డి 4) మహబూబ్ నగర్
2. రాష్ట్ర రహదారులు అధికంగా ఏ జిల్లాలో ఉన్నాయి?
   1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
   3) వరంగల్ 4) నల్లగొండ
3. తెలంగాణలో అతి పొడవైన జాతీయ రహదారి ఏది?
   1) NH - 65 2) NH - 63
   3) NH - 44 4) NH - 163
4. 16వ నంబర్ జాతీయ రహదారి కొత్త నంబర్ ఏది?
   1) 63 2) 163
   3) 61 4) 65
5. తెలంగాణలో మొట్టమొదటి రోడ్డు రవాణా సంస్థను ఏ సంవత్సరంలో స్థాపించారు?
   1) 1936 2) 1932
   3) 1951 4) 1956
6. నెహ్రూ రింగ్ రోడ్డు మొత్తం పొడవెంత?
   1) 168 కి.మీ. 2) 196 కి.మీ.
   3) 158 కి.మీ. 4) 3152 కి.మీ.

సమాధానాలు

1) 4; 2) 2; 3) 3; 4) 1;
5) 2; 6) 3;

- హైదరాబాద్ - కర్నూలు, హైదరాబాద్ - మచిలీపట్నం రహదారులను నిజాం కాలంలోనే నిర్మించారు.
- 1936 నాటికే తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో బస్ డిపోలను ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాలకు బస్సులు నడిపారు.
- తెలంగాణ రాష్ట్రం మీదుగా 14 జాతీయ రహదార్లు వెళుతున్నాయి.
- తెలంగాణలో అతి పొడవైన జాతీయ రహదారి ఎన్‌హెచ్-44.

విద్య, ఉద్యోగ సమాచారం

గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 30 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్(జీఎస్ఎల్) వివిధ విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30.
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, నావల్ ఆర్కిటెక్చర్, ఫైనాన్స్, రోబోటిక్స్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, సీఏ, ఐసీఎం ఏలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 31 ఏళ్లు, జనరల్ అభ్యర్థులకు 28 ఏళ్లు.
» **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు ఫీజు లేదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.09.2025
» **వెబ్‌సైట్:** https://recruitment.goashipyard.in

సాక్షి ప్లస్
మంగళవారం । 9-9-2025

టాటా స్కై, డిష్ టీవీ ప్రసారాలు ఏ శాటిలైట్ నుంచి లభిస్తాయి?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

మాదిరి ప్రశ్నలు

1. భూమిపై నుంచి ఒక పౌనఃపున్యం ఉన్న సమాచారాన్ని స్వీకరించి మరొక పౌనఃపున్యం ఉన్న సమాచారాన్ని భూమికి పంపడాన్ని ఏమంటారు?
   ఎ) ట్రాన్స్‌మిషన్ బి) ట్రాన్స్‌పాండర్
   సి) డౌన్‌లింకింగ్
   డి) రిసీవింగ్ పౌనఃపున్యం
2. తిరుపతి సమీపంలోని ఎంఎస్‌టీ -రాడార్ కింది ఏ ఆవరణంపై పరిశోధన చేయదు?
   ఎ) మీసో స్ఫియర్
   బి) స్ట్రాటోస్ఫియర్
   సి) ట్రోపోస్ఫియర్
   డి) ఎక్సోస్ఫియర్
3. టాటా స్కై, డిష్ టీవీ ప్రసారాలు కింది ఏ శాటిలైట్ నుంచి లభిస్తాయి?
   ఎ) ఇన్‌శాట్ - 4 సీఆర్
   బి) ఇన్‌శాట్ - 6 ఆర్
   సి) జీశాట్ - 6
   డి) ఇన్‌శాట్ - 1 ఎ
4. టెలీ మెడిసిన్ - వైద్యయోజన్‌ను మొదట ఏ రాష్ట్రంలో ప్రారంభించారు?
   ఎ) తెలంగాణ బి) కర్ణాటక
   సి) ఒడిశా డి) తమిళనాడు
5. దేశంలోనే మొదటి ఎలక్ట్రానిక్ నాలెడ్జ్ ఆధారిత పంచాయతీ?
   ఎ) మెదక్‌లోని రామచంద్రాపురం
   బి) విజయవాడలోని మొఘల్రాజపురం
   సి) రంగారెడ్డిలోని మియాపూర్
   డి) కడపలోని ఓబులవారి పల్లి
6. అంతరిక్ష కార్యక్రమాల్లో వివిధ భాగాల్లో అవసరమైన పరికరాలు తయారీ ఎక్కడ జరుగుతోంది?
   ఎ) ముంబయి బి) హైదరాబాద్
   సి) పింప్రీ డి) కోయంబత్తూర్
7. మనదేశంలోని ఎత్తయిన రాకెట్?
   ఎ) సింథటిక్ అపర్చర్ రాడార్
   బి) ఎస్‌ఏఆర్‌ఏఎల్
   సి) పీఎస్‌ఎల్‌వీ చాప్టర్-2
   డి) కేబిటీ శాట్
8. ఇస్రో చరిత్రలో 'సువర్ణ సంవత్సరం'గా పేర్కొనదగిన ఏడాది?
   ఎ) 1969 బి) 2008
   సి) 2014 డి) 2003
9. కిందివాటిలో చంద్రయాన్ లక్ష్యం కానిది?
   ఎ) చంద్రుడి ఉపరితలాన్ని 3-డిలో ఫొటోలు తీసి మ్యాపింగ్ చేయడం
   బి) ఖనిజాలు, రసాయనిక పరిశోధనలు
   సి) నీటి ఉనికి గుర్తింపు
   డి) మానవ జాడ అన్వేషణ
10. ప్రధానంగా స్టాక్ ఎక్ఛ్సేంజ్‌లు ఉపయోగించుకునే సమాచార ప్రసార సాంకేతికత?
    ఎ) ఇ-మెయిల్
    బి) వి-శాట్ నెట్‌వర్క్
    సి) కార్టోశాట్
    డి) మొబైల్‌ఫోన్ - వాట్సప్
11. 1995లో మనదేశంలో ఏ సంస్థను ప్రారంభించడం ద్వారా ఇంటర్నెట్ సేవలు ప్రారంభమయ్యాయి?
    ఎ) ఐఎస్‌డీఎన్ బి) వీఎస్‌ఎన్‌ఎల్
    సి) బీఎస్‌ఎన్‌ఎల్ డి) ఫ్లిప్‌కార్ట్
12. మనదేశంలో ఏర్పాటు చేసిన మొదటి జల విద్యుత్ ప్రాజెక్ట్?
    ఎ) శివ సముద్రం
    బి) కృష్ణ రాజసాగర్
    సి) నాగార్జునసాగర్ డి) జంఝావతి
13. జతపర్చండి.
    1. కల్పాకం ఎ) కర్ణాటక
    2. కాక్రపారా బి) తమిళనాడు
    3. కైగా సి) గుజరాత్
    ఎ) 1-ఎ, 2-బి, 3-సి
    బి) 1-సి, 2-బి, 3-ఎ
    సి) 1-బి, 2-సి, 3-ఎ
    డి) 1-ఎ, 2-సి, 3-బి
14. కల్పకం రియాక్టర్‌ను 'ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్' అంటారు. ఇందులో వాడే ఇంధనం?
    ఎ) ప్లుటోనియం
    బి) యురేనియం
    సి) సీసం కలిసిన పెట్రోలు
    డి) ద్రవ హైడ్రోజన్
15. తారాపూర్ అణు విద్యుత్ కేంద్రంలో వాడే ఇంధనం?
    ఎ) ప్లుటోనియం
    బి) యురేనియం
    సి) కార్బన్‌డై ఆక్సైడ్
    డి) మిక్స్‌డ్ ఆక్సైడ్
16. రావత్ భట్టా అణు రియాక్టర్ ఎక్కడ ఉంది?
    ఎ) మహారాష్ట్ర బి) రాజస్థాన్
    సి) తమిళనాడు డి) తెలంగాణ
17. మణుగూరు(ఖమ్మం)లో ఏ ప్లాంటు ఉంది?
    ఎ) అణువిద్యుత్ కేంద్రం
    బి) భార జల ప్లాంట్
    సి) యురేనియం శుద్ధి
    డి) అణుబాంబు తయారీ
18. ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ 1962లో వేటిపై అవగాహన కల్పించింది?
    ఎ) బయోగ్యాస్ బి) ఖాదీ దుస్తులు
    సి) సిమెంట్ వాడకం
    డి) కాలుష్య నియంత్రణ
19. దేశంలో పవనశక్తి ఉత్పత్తిలో మొదటిస్థానంలో ఉన్న రాష్ట్రం?
    ఎ) తెలంగాణ బి) తమిళనాడు
    సి) కేరళ డి) హిమాచల్‌ప్రదేశ్
20. ప్రపంచంలో అత్యంత సామర్థ్యం ఉన్న గాలిమర ఎక్కడ ఉంది?
    ఎ) పెరంబూర్ బి) పనాజీ
    సి) మంగుళూరు డి) పెరంబుడి
21. గాలి మరలను రూపొందించే సంస్థ?
    ఎ) బీహెచ్‌ఈఎల్ బి) ఈసీఐఎల్
    సి) హెచ్ఏఎల్ డి) మిథాని
22. సుజ్లాన్ కంపెనీకి సంబంధమున్న అంశం?
    ఎ) పవనశక్తి
    బి) సముద్ర అలల శక్తి
    సి) జీవ ఇంధనం
    డి) ఉదజని ఇంధనం
23. టైడల్ ఎనర్జీ ఉత్పత్తికి కావలసిన అలల ఎత్తు?
    ఎ) 5 - 12 మీటర్లు
    బి) 10 -15 మీటర్లు
    సి) 2 - 3 మీటర్లు
    డి) 12 - 16 మీటరు
24. భూగర్భోష్ణశక్తి కేంద్రం ఎక్కడ ఉంది?
    ఎ) గంగాలోయ
    బి) సబర్మతి లోయ
    సి) తాతావని డి) మణికారన్
25. భారతదేశంలో పెట్రోల్‌ను మొదట కనుగొన్న ప్రాంతం?
    ఎ) మఖుమ్ - అసోం
    బి) డిగ్బాయ్ - అసోం
    సి) బాంబే హై - మహారాష్ట్ర
    డి) కృష్ణపట్నం- ఆంధ్రప్రదేశ్
26. ద్రవరూప సోడియంను మితకారిగా ఏ రియాక్టర్లలో వాడతారు?
    ఎ) లైట్ వాటర్ రియాక్టర్
    బి) ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్
    సి) హెవీ వాటర్ రియాక్టర్
    డి) ఎలక్ట్రిక్ రియాక్టర్
27. మిశ్రమ ఆక్సైడ్‌లో ఉండే పదార్థాలు?
    ఎ) సీసం, యురేనియం
    బి) సీసం, సెలీనియం
    సి) యురేనియం, ప్లుటోనియం
    డి) యురేనియం, ప్లుటోనియం ఆక్సైడ్‌లు
28. కెనడా సహకారంతో స్థాపించిన అణు రియాక్టర్ ఏది?
    ఎ) సిరస్ బి) అప్సర
    సి) జెర్లీనా డి) ధ్రువ
29. కల్పకంలోని మినీ రియాక్టర్?
    ఎ) పూర్ణిమ బి) ధ్రువ
    సి) కామిని డి) టోక్‌మాక్
30. భారజలం రసాయనిక నామం?
    ఎ) డ్యుటీరియం ఆక్సైడ్
    బి) డ్యుటీరియం హైడ్రాక్సైడ్
    సి) కార్బన్ డై ఆక్సైడ్
    డి) సల్ఫ్యూరస్ ఆమ్లం
31. ప్లాస్మా స్థితిని ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే పరికరం ఏది?
    ఎ) టోక్‌మాక్ బి) ప్లాస్మోడ్రోమ్
    సి) టోరోడియల్ డి) ట్యూరమ్ ఫీ
32. 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసెర్చ్' ఎక్కడ ఉంది?
    ఎ) అలహాబాద్ బి) కోల్‌కతా
    సి) గాంధీనగర్ డి) భువనేశ్వర్
33. మనదేశంలో ఎనర్జీ స్టేట్‌గా పిలిచే రాష్ట్రం?
    ఎ) మేఘాలయ బి) హిమాచల్‌ప్రదేశ్
    సి) న్యూఢిల్లీ డి) కేరళ
34. సెంట్రల్ షీప్ బ్రీడింగ్ ఫార్మ్ ఎక్కడ ఉంది?
    ఎ) సింగూరు - పశ్చిమబెంగాల్
    బి) అనంతపురం - ఆంధ్రప్రదేశ్
    సి) నిర్మల్ - తెలంగాణ
    డి) హిస్సార్ - హర్యానా
35. 'అమ్రపాలి' ఏ మొక్కల్లోని ఒక రకం?
    ఎ) అరటి బి) మామిడి
    సి) పెసర డి) వరి
36. కిందివాటిలో అధిక దిగుబడిని ఇచ్చే జాతులు?
    ఎ) కాకి కాంబెల్
    బి) ఇండియన్ రన్నర్
    సి) బకర్‌వాల్
    డి) గొడ్డి
37. జీవ ఎరువుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన జాతీయ సంస్థ ఎక్కడ ఉంది?
    ఎ) భువనేశ్వర్ బి) హిస్సార్
    సి) ఘజియాబాద్ డి) నాగపూర్

సమాధానాలు

1) బి;	2) డి;	3) ఎ;	4) సి;
5) ఎ;	6) బి;	7) సి;	8) బి;
9) డి;	10) బి;	11) బి;	12) ఎ;
13) సి;	14) ఎ;	15) డి;	16) బి;
17) బి;	18) ఎ;	19) బి;	20) డి;
21) ఎ;	22) ఎ;	23) ఎ;	24) ఎ;
25) ఎ;	26) బి;	27) డి;	28) ఎ;
29) సి;	30) ఎ;	31) ఎ;	32) సి;
33) బి;	34) డి;	35) బి;	36) ఎ;
37) సి.			

First electronic computer in the world?

COMPUTER GENERATIONS

Generation in computer terminology is a change in technology a computer is/was being used. Initially, the generation term was used to distinguish between varying hardware technologies. But nowadays, generation includes both hardware and software, which together make up an entire computer system. There are totally five computer generations known till date.

FIRST GENERATION

» The period of first generation was 1942-1954.
» First generation of computer started with using vacuum tubes as the basic components for memory and circuitry for CPU (Central Processing Unit).
» In this generation mainly batch processing operating system were used.
» In this generation Punched cards, Paper tape, Magnetic tape Input & Output device were used.

The main features of First Generation are:

» Supported Machine language only.
» Very costly.
» Generate lot of heat.
» Slow Input/output device.
» Huge size.
» Need of A.C.
» Non portable.
» Consumed lot of electricity.

Some computers of this generation were:

» ENIAC, EDVAC, UNIVAC, IBM-701, IBM-650

SECOND GENERATION

» The period of second generation was 1952-1964.
» This generation using the transistor was cheaper, consumed less power, more compact in size, more reliable and faster than the first generation machines made of vacuum tubes.
» In this generation, magnetic cores were used as primary memory and magnetic tape and magnetic disks as secondary storage devices.
» In this generation assembly language and high level programming language were used.
» There was Batch processing and Multiprogramming Operating system used.



The main features of Second Generation are:

» Reliable as compared to First generation computers.
» Smaller size as compared to First generation computers.
» Generate less heat as compared to First generation computers.
» Consumed less electricity as compared to First generation computers.
» Faster than first generation computers.
» Still very costly.
» A.C. needed.

Some computers of this generation were:

» IBM 1620, IBM 7094, CDC 1604, CDC 3600, UNIVAC 1108

THIRD GENERATION

» The period of third generation was 1964-1972.
» The third generation of computer is marked by the use of Integrated Circuits (IC's).
» This development made computers smaller in size, reliable and efficient.
» In this generation Remote processing, Time-sharing, Real-time, Multi-programming Operating System were used.
» High level languages were used during this generation.

The main features of Third Generation are:

» More reliable.
» Smaller size.
» Generate less heat.
» Faster.
» Lesser maintenance.
» Still costly.
» A.C needed.
» Consumed lesser electricity.
» Support high level language.

Some computers of this generation were:

» IBM-360 series, Honeywell-6000 series, PDP (Personal Data Processor), IBM-370/168, TDC-316

FOURTH GENERATION

» The period of Fourth Generation was 1972-1990.
» The fourth generation is made of Very Large Scale Integrated (VLSI) circuits.

BANK EXAMS
COMPUTER AWARENESS

» Fourth Generation computers became more powerful, compact, reliable, and affordable. As a result, it gave rise to personal computer (PC) revolution.
» In this generation Time sharing, Real time, Networks, Distributed Operating System were used.
» All the Higher level languages like C and C++, DBASE etc. were used in this generation.

The main features of Fourth Generation are:

» VLSI technology used.
» Very cheap.
» Portable and reliable.
» Use of PC's.
» Very small size.
» Pipeline processing.
» No A.C. needed.
» Concept of internet was introduced.
» Great developments in the fields of networks.
» Computers became easily available

Some computers of this generation were:

» DEC 10, STAR 1000, PDP 11, CRAY-1(Super Computer), CRAY-X-MP (Super Computer)

FIFTH GENERATION

» The period of Fifth Generation is 1990-till date.
» In the fifth generation, the VLSI technology became ULSI (Ultra Large Scale Integration) technology.
» This generation is based on parallel processing hardware and AI (Artificial Intelligence) software.
» All the Higher level languages like C and C++, Java, .Net etc. are used in this generation.

The main features of Fifth Generation are:

» ULSI technology.
» Development of true artificial intelligence.
» Development of Natural language processing.
» Advancement in Parallel Processing.
» Advancement in Superconductor technology.
» More user friendly interfaces with multimedia features.
» Availability of very powerful and compact computers at cheaper rates.

MODEL QUESTIONS

1. The first microprocessor built by the Intel Corporation was called_____
   1) 8008 2) 8080 3) 4004
   4) 8800 5) None of these
2. Daisy wheel printer is a type of_______
   1) Matrix primer
   2) Impact printer
   3) Laser printer
   4) Manual printer
   5) None of these
3. The first electronic computer in the world was_______
   1) UNIVAC 2) EDVAC
   3) ENIAC 4) All of above
   5) None of these
4. Before a disk can be used to store data it must be _____
   1) Formatted 2) Reformatted
   3) Addressed 4) Readdressed
   5) None of the above
5. _____is network operating system
   1) DOS 2) Win-95 3) Win-98
   4) WIN-2000 server 5) None
6. Orkut was officially launched ______
   1) 20-jan-2004 2)15- jan-2004
   3) 26-jan-2006 4)24-jan -2004
   5) None
7. Malicious Hacker known as_______
   1) White hat hacker
   2) Hacker 3) Cracker
   4) Ethical 5) None
8. AltaVista, Google and Bing are the example of_____
   1) Search engine
   2) Brand name 3) Virus name
   4) Antivirus program 5) None
9. What is the Transmission rate of fiber optics cable?
   1) 10 mbps 2) 1000 mbps
   3) 100 mbps 4) 1000 bps
   5) None
10. ______ is a search engine introduced by MICROSOFT?
    1) Google 2) Khoj.com
    3) Bing 4) Yahoo 5) None
11. Tally is _______
    1) Open S/W 2) System S/W
    3) Application S/W
    4) Closed S/W 5) None
12. Keyboard Converts typed in character to __________code
    1) Binary 2) ASCII
    3) Decimal 4) EBCIDIC
    5) None
13. Which of the following sequence is correct?
    1) Source code -linker - object code- compiler - executable code
    2) Source code - compiler - object code - linker - executable code
    3) Object code - compiler - source code - linker - executable code
    4) Object code -linker - source code - compiler - executable code
    5) None
14. Who developed the language C#?
    1) Dennis Ritchie
    2) Brian Kernighan
    3) Anders Hejlsberg
    4) John McCarthy 5) None
15. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ____
    1) ISDN 2) Cable modem
    3) Microwave 4) DSL
    5) DSN
16. Codes consisting of lines of varying widths or lengths that are computer readable are known as____
    1) an ASCII code
    2) a magnetic tape
    3) a bar code
    4) an OCR scanner
    5) None of these
17. Time required by a sector to reach below the head is known as_____
    1) Seek time 2) Latency time
    3) Access time 4) Disk time
    5) None of these
18. IP-Address 192.5.48.3 belong to_______
    1) Class A 2) Class B
    3) Class C 4) Class D
    5) None of these
19. Internet-like networks within an enterprise known as______
    1) Intranet 2) Internet
    3) Extranet 4) Network
    5) None of these
20. What is standard Layout of keyboard?
    1) QWERTY 2) DVORAK
    3) AZERTY 4) 1 and 2
    5) None
21. Most powerful computer in a typical network is________
    1) Desktop 2) Network client
    3) Network server
    4) Network 5) None
22. _______Viruses are often transmitted by a floppy disk left in the floppy drive
    1) Trojan horse 2) Boot sector
    3) Script 4) Logic bomb
    5) None of these
23. _______is a combination of black hat and white hat hacker.
    1) White hat 2) Grey hat
    3) Blue hat 4) Red hat
    5) None
24. The ability to recover and read deleted or damaged files from a criminal's computer is an example of a law enforcement specialty called_____
    1) Robotics. 2) Simulation
    3) Computer forensics.
    4) Animation. 5) None of these
25. How many types of database objects are there in MS Access?
    1) 5 2) 6 3) 7
    4) 8 5) None of these
26. Which of the following is required to communicate between two computers?
    1) Communications software
    2) Protocol
    3) Communications hardware
    4) Access to transmission medium
    5) All of the above
27. Devices is used to connect two similar LAN with same protocols
    1) Bridges 2) Router
    3) Gateway 4) Switch
    5) None of these
28. DSL is an example of a (n) ______ connection.
    1) Network 2) Wireless
    3) Slow 4) Broadband
    5) None of these
29. FTP is______
    1) used to send email
    2) used to browse the Web
    3) is part of Netscape
    4) Is a protocol for the transfer of files between computers
    5) None of these
30. Telnet is-
    1) Used to send email
    2) Uses telephone lines
    3) Is part of Netscape
    4) Is a protocol that allows for remote login
    5) None of these
31. = sum(Bl:B8) is an example of a-
    1) Function 2) formula
    3) Cell address 4) value
    5) None of these
32. A___ is a named location on a disk where files are stored.
    1) folder 2) Pod
    3) Version 4) Bag
    5) None of the above
33. The _____ allows you to choose where to go and is located below the Standards Buttons toolbar.
    1) System menu
    2) Address bar
    3) Menu bar
    4) tool bar
    5) None of the above

KEY

1) 3	2) 2	3) 3	4) 1
5) 4	6) 4	7) 3	8) 1
9) 2	10) 3	11) 3	12) 2
13) 2	14) 3	15) 4	16) 3
17) 2	18) 3	19) 1	20) 1
21) 3	22) 2	23) 3	24) 3
25) 3	26) 5	27) 1	28) 4
29) 4	30) 4	31) 2	32) 1
33) 2			